అక్టోబరు 2012 వెల: ₹ 20

తెలుగు వెలుగు

BIS
916

ఆనంద ఆశ్చర్యాలను కలిగించే
ప్రాచీన స్వర్ణ వైభవం.

Lalitha®
చెన్నై • మదురై

సమగ్రమైన కలెక్షన్ నుంచి మనసుని దోచే వనితనం
మరియు సాటిలేని డిజైన్లు. లలితా జ్యువెలరీలో
మిమ్మల్ని ఆనందపరచే అనేక అద్భుతాలు మీ కోసం
సిద్ధంగావున్నాయి. ఇవన్నీ మార్కెట్‌లో అతి తక్కువ
తరుగుకి లభిస్తాయి, మీరు అదా చేసుకుంటూనే
ఆ అందానికి పరవశిస్తారు.

1 నుంచి 8% మాత్రమే.

మజూరీ లేదు.

అతి తక్కువ వస్తువులు 9% తరుగుకి.
ఏ నగకు తరుగు 9% దాటదు

మిమ్మల్ని ఆకర్షించి ఆనందింపచేయడానికి
వేలాది అందమైన డిజైన్లు.

Lalitha Jewellery
Free Gold
Jewellery Savings Scheme

బంగారం - పూర్తిగా ఉచితం ! +
నిలకడలేని బంగారు ధరల నుంచి 'విముక్తి'!

నేడే చేరండి! 95000 98236 freegold@lalithajewellery.net

లలితా జ్యువెలరీ మార్ట్ ప్రై. లిమిటెడ్ 123, ఉస్మాన్ రోడ్, పనగల్ పార్క్, టి.నగర్, చెన్నై-17. ఫోన్: 28141155 / 77 / 88
180-182, సౌత్ మాసి స్ట్రీట్, మదురై - 01. ఫోన్ 2330222 / 444 / 555 | www.lalithajewellery.net వేలెట్ కార్ పార్కింగ్ ఉంది

*30% డబ్బు చెల్లించి, తక్కినది సులభ వాయిదా పద్ధతిలో చెల్లించవచ్చు.
* in association with Shriram City MONEY WHEN YOU NEED IT MOST

విజయదశమి
శుభాకాంక్షలతో...
ప్రముఖ యూరాలజిస్ట్
డా॥ కోనేరు విజయకుమార్ గారి
సారథ్యంలో....
శ్రీ చరితశ్రీ హాస్పటల్స్
Address for
UROLOGY,
NEPHROLOGY
Critical Care &
Emergency Care
In Coastal A.P.
నక్కలరోడ్, సూర్యారావు పేట, విజయవాడ
ఫోన్ : 0866-2432350, 2432360, 6615550
రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన
సూపర్ స్పెషాలిటీ హాస్పటల్
150 Bedded
Multi Speciality Hospital
in the Heart of Vijayawada City
World Class Equipment
& Facilities in
UROLOGY, NEPHROLOGY
24 Hours Expert Team of Doctors,
Nurses & Critical Care Personnel to
deal with all sorts of Complicated Cases
Abhinandana
ఆరోగ్యశ్రీ విభాగం కలదు
కిడ్నీ వైద్యంలో అత్యాధునిక
DORNIER LITHOTRIPTER,
Holmium Laser Flexible URS
అందుబాటులో గల
ఏకైక హాస్పటల్
✦ ఎమర్జెన్సీ ఏక్సిడెంట్ డయాలసిస్, పాయిజనింగ్ కేసులకు
అత్యుత్తమ చికిత్సలు
✦ అంకిత భావంతో పనిచేసే సిబ్బంది

మన నిఘంటువులకు మంగళారతి ఆంధ్రభారతి	10
అంతా తెలుగుమయం అయితేనే జయం - ఎర్రాప్రగడ రామకృష్ణ	14
ముక్కుతిమ్మన ముద్దుపలుకులు - డా॥ ఎన్. శాంతమ్మ	30
వైద్యులూ భాషను బతికించండి - డా॥ పి. హెచ్. బి. యస్. శర్మ	38
విభక్తులున్నాయి జాగ్రత్త!! - రంగనాయకమ్మ	40
తెలుగుదనానికి రక్ష... పెద్ద బాలశిక్ష	46
జయీభవ... విజయీభవ - పి. స్నేహలతా మురళి	50
అత్తా కోడళ్లు సూర్యకాంతాలూ, చంద్రకాంతాలు - జెన్నీ, సన్నిధానం	54
'అడుగు'జాడ శకుంతలది - డా॥ పి. నాగమల్లీశ్వరరావు	64
ఏ దేశమేగినా - మద్దిపాటి కృష్ణారావు	68
గురుభ్యోన్నమః	74

26

తెలుగు వీర లేవరా!

60



సంస్కరణ 'ధర్మా'నికి కాగడా

86

తెలుగుతల్లి ముద్దుబిడ్డలు

కథలు

దేశవ్రత - ఎలక్ట్రాన్	34
నందుగాడి రంగుల కళ - గుర్రం ఆనంద్	56
జ్ఞాననేత్రం - చక్కిలం విజయలక్ష్మి	70
అప్పారావూ... అతడి భాష - ఎ. వి. ఎస్. హెచ్. ఎస్. శర్మ	81
వాయులీనం - చాసో	92

తెలుగు వెలుగు

సంపాదకుడు: **రామోజీరావు**

సంపుటి : 1, సంచిక : 2

అక్టోబరు 2012

పుటలు : 100, **వెల :** రూ. 20

పత్రాలంకరణ : రవిశంకర్

సహకారం : రామోజీ విజ్ఞానకేంద్రం

ప్రకటనల కోసం : +91 80081 51599, +91 90001 80608

వివరాలకు : సంపాదకుడు, తెలుగు వెలుగు, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, రంగారెడ్డి - 501 512.

ఫోను: +91 8415 246 999

మొబైల్: +91 800 800 1656

ఫ్యాక్సు: +91 8415 305 018

Telugu Velugu

Owned, Printed, published and Edited by Ramoji Rao on behalf of Ramoji Foundation, Ramoji Film City, Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh. Printed at Eenadu Press, D.No.7-134/1&2, Moosapet Village, Balanagar Mandal, Kukatpally, Rangareddy District -500 072. RNI-APTEL 12988/01/1/2012-TC.

విన్నపం: తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణ, మేధోమథనం 'తెలుగు వెలుగు' ముఖ్య ఆశయాలు. మన భాషకు పుష్టి చేకూర్చే రచనలకు పత్రికలో అగ్రతాంబూలం లభిస్తుంది. ఈ రచనల్లో వెల్లడయ్యేవి రచయితల అభిప్రాయాలు మాత్రమేనని మనవి. ఇవన్నీ పత్రిక యాజమాన్యం, సంపాదకవర్గ అభిప్రాయాలు కానక్కర్లేదు. భిన్న భావజాలాలకు నిష్పక్షపాత వేదికగా ఈ పత్రిక నిలుస్తుంది.

పదండి ముందుకు... పదాల విందుకు

కొత్త పాయలు తీస్తూ, నూతన చిగుళ్లు తొడుగుతూ, ఎప్పటికప్పుడు ఆధునిక ప్రక్రియలతో నూతన శక్తిని సమీకరించుకుంటూ, ఎక్కడికక్కడ సరికొత్త పదాలను అక్కున చేర్చుకుని సుసంపన్నమై నిలిస్తేనే భాషకు మనుగడ. ప్రవాహగమనం ఆగితే ఎంతటి స్వచ్ఛమైన జలధార అయినా మలినమే అవుతుంది. కొత్త భావాలకు, విధానాలకు స్వాగతం పలకనినాడు మాతృభాష నీరసిస్తుంది. సంప్రదాయ వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూనే కాలానుగుణంగా కొత్త పుంతలు తొక్కనినాడు భాష నశిస్తుంది. తెలుగులో ఆరులక్షల పదాలున్నాయని మురిసిపోతుంటాం. తెలుగు మాగాణంలో మాటల బంగారం ఈ స్థాయిలో పండిందంటే అందుకు కారణం... మన పెద్దల కృషి! కాలం గడుస్తున్న కొద్దీ అమ్మ భాష పరిపుష్టత దిశగా కృషి ఆగిపోయింది. అందువల్లే బ్రహ్మాండమైన పదసంపద ఉన్నా మన భాష ఒక స్థాయిని దాటలేకపోతోంది.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కొత్త బాటలు తొక్కుతున్న దశలో నేడు అసాధ్యమన్న మాటకే అర్థం మారిపోతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నూతన ఆవిష్కారాలకు కొదవలేదు. ఈ పరిణామాలన్నీ విశ్వసంధాన భాష ఇంగ్లిషులోనే ప్రపంచానికి అందుతున్నాయి. ప్రసార మాధ్యమాల్లోనూ ఆంగ్ల పదాలే ప్రతిధ్వనిస్తున్నాయి. అయినా సరే... సృజనకు పదును, పదసృష్టి మీద దృష్టి పెడితే తేట తెనుగు పదాలు ఊటలా పొంగుతాయనడంలో సందేహం లేదు. అందుకు కావలసింది కాసింత చిత్తశుద్ధి, మరికొంత మాతృభాషానురక్తి. భాషోద్ధరణకు నిజమైన సంకల్పం చెప్పుకొన్న పక్షంలో- అంతర్జాతీయ వేదికపై సమున్నత ప్రతిభా పాటవాలతో విజయపతాక ఎగురవేస్తున్న తెలుగువాడికి నిజానికి అదేపాటి పని?

భౌగోళికంగా మన రాష్ట్రం కన్నా చిన్నదైన జపాన్ సమస్త వనరులనూ సొంత భాషలోనే సమీకరించుకొని ఆర్థికశక్తిగా ఎదగడం స్ఫూర్తి నింపేది కాదా? మాతృభాషకు అనన్య ప్రాధాన్యమిచ్చి అమెరికాతో సై అంటే సై అంటున్న చైనా గెలుపు పిలుపు మనకు వినబడేది కాదా? అడుగడుగునా అమ్మ భాషకు గొడుగు పడుతూ పురోగామి పథంలో దూసుకుపోతున్న ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇజ్రాయెల్‌ల విజయనాదం మన మత్తు వదలగొట్టేదే కదా? అంతర్జాతీయంగా అనేక దేశాలు మాతృభాషలోనే ఆలోచిస్తున్నాయి. అభివృద్ధి బాటలో సాగుతున్నాయి. ఇతర భాషల పొడగిట్టకుండా మడిగట్టుకు కూర్చోనవసరం లేదు. కానీ కొత్త పదాలను స్వీకరించే క్రమంలో స్వీయ అస్తిత్వాన్ని పణం పెట్టాల్సిన అగత్యం లేదు. ఇతర భాషల పదాలను అవసరాలకు అనుగుణంగా ఒడుపుగా కలిపేసుకుంటూ ఆంగ్లభాష ప్రవర్ధమానమవుతోంది. మనకూ ఇది ఆదర్శం కావాలి.

అయినా కొత్త పదసృష్టికి సామర్థ్యం కొరవడినప్పుడే అవతలి భాషాపదాలను యథాతథంగా వాడుకోవాలి. తెలుగువారు ఆ దురవస్థను తలెత్తనివ్వరన్నది నమ్మిక. ఎంతటి సంక్లిష్ట శాస్త్ర, సాంకేతిక అంశాలకైనా తేలిక పదాల్ని అందించగల సత్తా మన తెలుగుకు ఉంది. అంతర్నిహిత శక్తి సామర్థ్యాలను అందిపుచ్చుకోవడమే నేటి అవసరం. ఇప్పటి పరిస్థితుల్లో అది మన బాధ్యత కూడా. పదసృష్టి పేరిట మక్కికి మక్కీ అనువాదాలు, దీర్ఘ సమాసాలతో విషయాన్ని సంక్లిష్టంగా మారిస్తేనే సమస్య. తేలికగా అర్థమయ్యే తెలుగు పదాలను సృష్టించి సమర్పిస్తే ప్రజలూ ఆనందంగా స్వీకరిస్తారు. ఈ విషయంలో 'ఈనాడు' గట్టి ప్రయత్నం చేస్తోంది. బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్), తుంపరసాగు (స్ప్రింక్లర్ ఇరిగేషన్), నీకిది-నాకది (క్విడ్‌ప్రోకో) వంటి మాటలే ఇందుకు నిదర్శనం. ఎవరికి పట్టున్న రంగంలో వారు వీలైనన్ని తెలుగు పదాలు సూచిస్తే/సృజిస్తే తెలుగు భాష శాఖోపశాఖలై విస్తరిస్తుంది. దురదృష్టవశాత్తూ ఆంగ్లం నేడు కృత్రిమ ప్రాణవాయువుగా మారింది. దాన్నుంచి బయటపడి సహజసిద్ధమైన తెలుగు పరిమళాన్ని ఆస్వాదించడం ఎంత మేలు.. ఎంత హాయి!

ఈ సంచిక నుంచీ కొన్ని ఆంగ్లపదాలను, వాటి నిఘంటు అర్థాలను ఇస్తున్నాం. 'తెలుగు వెలుగు' ప్రారంభించనున్న వెబ్‌సైట్‌లోనూ పదసృష్టి కోసం ఓ విభాగాన్ని ప్రత్యేకిస్తున్నాం. రోజువారీ ప్రసారమాధ్యమాల్లో వస్తున్న ఆంగ్లపదాల్ని సేకరించి ఇక్కడ ఉంచుతాం. వాటికి భాషాభిమానులు అర్థవంతమైన, తేట తెలుగు పదాల్ని ప్రతిపాదించవచ్చు. భాషా, విషయ నిపుణుల దృష్టికి ఈ ప్రతిపాదనలను తీసుకువెళ్లి వారి ఆమోదం పొందిన వాటిని వాడుకలోకి తెచ్చుకుందాం. ఆ పదాల్ని సృష్టించిన/సూచించిన వారి వివరాలనూ 'తెలుగు వెలుగు' ద్వారా అందరికీ తెలియజేస్తాం. భాషాభివృద్ధి తెలుగు ప్రజల జీవన వికాసానికీ దోహదపడుతుందని గుర్తించాల్సిన నేపథ్యమిది. బహుముఖమూ, బాధ్యతాయుతమూ అయిన ఈ కార్యక్రమానికి భాషాభిమానులందరూ తలో చేయివేసి సహకరిస్తేనే తెలుగుజాతికి నిజమైన ఉత్సవం. మరి కొన్ని రోజుల్లో దసరా. కొత్త బట్టలు, కమ్మని పిండివంటలు, కనులపండువ అలంకారాలతో ఈ దసరాను తెలుగువారందరూ అద్భుతంగా జరుపుకోవాలని, ఆనందం పండించుకోవాలని ఆశిస్తూ... శుభాకాంక్షలతో

జాతికి పునరుత్తేజం

యావత్ తెలుగు జాతిని పునరుత్తేజ పరుస్తూ తద్వారా తెలుగు భాషకు దేశ విదేశాల్లో కూడా పూర్వవైభవాన్ని తీసుకుని వచ్చే ఈ ప్రయత్నం సఫలీకృతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

- నాదెండ్ల మనోహర్, సభాపతి, ఆంధ్రప్రదేశ్ శాసనసభ

కనుల వెలుగుగా ఉంది

తెలుగు భాష అన్ని రంగాల్లో దయనీయ స్థితిల్లో ఉన్న ఈనాడు మీరు ప్రచురించిన 'తెలుగు వెలుగు' కనువెలుగుగా ఉంది. పత్రిక ఆశయాలన్నిటితో నేను హృదయపూర్వకంగా ఏకీభవిస్తూ నా అభినందనలందిస్తున్నాను.

డా॥ సి.నారాయణరెడ్డి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, హైదరాబాద్.

కాళోజీ చురకలను గుర్తు చేసుకోవాలి

'తెలుగు వెలుగు'కు హృదయపూర్వక ఆహ్వానం. సాంకేతిక పదాలకు తెలుగులో సమానార్థకాలు లేనందు వల్ల ఆంగ్ల భాష వాడుతున్నామని అంటున్నారు. ఎన్నో దశాబ్దాల క్రితమే నైజాం నవాబు విశ్వ విద్యాలయంలో ఉర్దూను ప్రవేశపెట్టి ఎందరినో ఇంజనీర్లుగా, వైద్యులుగా తీర్చిదిద్దాడు. రాష్ట్రం ఏర్పడి యాభై ఆరేళ్లు అవుతున్నా భాషాభివృద్ధికి ఎన్టీ రామారావు హయాంలో తప్ప ప్రభుత్వాల కృషి ఏమీ కనిపించదు. తెలుగులో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించి, సాంకేతిక పదాలను మన భాషలోకి మళ్లిస్తే మరింత పుష్టి కలుగుతుంది. 'అన్య భాషలు నేర్చి, ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా' అన్న కాళోజీ వ్యాఖ్యలను మనం నిరంతరం స్మరించుకోవాలి.

- నర్రా రాఘవరెడ్డి, సీపీఎం శాసనసభాపక్ష మాజీ నేత, నల్గొండ

ఉదయించిన తెలుగు వెలుగు

మన తెలుగు వాళ్లకి మాతృభాష గొప్పదనం, అందులోని మాధుర్యాన్ని అందించేందుకు మీరు చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. ఇందుకు 'తెలుగు వెలుగు' ఎంతగానో ఉపకరిస్తుందని నేను విశ్వసిస్తున్నాను. ప్రతి వ్యక్తి తన పరిధిలో మాతృభాషా వికాసానికి కృషి చేసేలా ప్రేరణ కలిగించే విధంగా కార్యక్రమాలను కూడా రూపొందించాలి.

- డా॥దిండిగల రాజేందర్ (జిల్లా అధ్యక్షులు), తెలంగాణ రాష్ట్ర సమితి, ఖమ్మం.

నిత్య వినియోగంలోకి తేవాలి

భాష సంకట స్థితిలో కనిపిస్తున్న ఆశాకిరణమే మన 'తెలుగు వెలుగు'. కారు మబ్బుల మాటున దాగిన తెలుగు సూర్యుణ్ని మన వారికి చూపించి నిత్య వ్యవహారంలో తెలుగు వినియోగాన్ని పునరుద్ధరించాలన్న ఉన్నత ఆశయానికి ధన్యవాదాలు.'తెలుగులో ఇంతటి తేటదనం, తీయదనం, ఉన్నాయా' అనుకునే విధంగా పత్రికను తీర్చిదిద్దిన తీరు మాకు బాగా నచ్చింది. తెలుగును తిరిగి నిత్య వినియోగంలోకి తెచ్చుకోవడం ద్వారా స్వీయతప్పిదాన్ని సరిదిద్దుకోవడం మన తక్షణ సామాజిక కర్తవ్యం.

- వెల్లంపల్లి రామచంద్రరావు, అధ్యక్షులు, విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్.

మాతృభాషను పరిరక్షించాలి

పత్రికల్లో అంశాలన్నీ విజ్ఞానదాయకంగాను, మనోరంజకంగాను భాసిల్లాయి. తెలుగు భాషా వైభవ పరిరక్షణకై, సాహితీ సంపద సంరక్షణ కోసం పత్రిక ద్వారా తెలుగు జాతికి చేస్తున్న సేవ ప్రశంసనీయం.

- చిమ్మపూడి శ్రీరామమూర్తి, హైదరాబాద్.

పరిరక్షణ సమితులు అవసరం

ఈనాడు, తెలుగు వెలుగుల కృషి అభినందనీయం. భాషా 'పరిరక్షణ సమితుల' ఏర్పాటు తక్షణావసరం. విశ్వవిద్యాలయాల స్థాయిలో మా వంతు కృషి చేస్తాం.

- కోదాటి వియ్యన్నరావు, ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

చైతన్యాన్ని రగిలించాలి

పొరుగు రాష్ట్రాల్లో భాషాభివృద్ధికి ప్రజాపరంగా, ప్రభుత్వ పరంగా ఎంతో కృషి జరుగుతోంది. ఆ స్ఫూర్తిని మనం అందిపుచ్చుకోవాలి. తెలుగు సాహిత్యంలో శతకాలు, గ్రంథాలు వంటివి కనుమరుగవ్వకుండా 'తెలుగు వెలుగు' ద్వారా ప్రాచుర్యం కల్పించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు సామాన్యుల్లో కూడా చైతన్యాన్ని తీసుకురావాలి.

- డా॥ కొండెపూడి లాల్ కిషోర్, ఆచార్య కులపతి, జేఎన్టీయూ, అనంతపురం

ప్రతిధ్వనించే శంఖారావం

రామోజీరావు చేపట్టిన తెలుగు భాషోద్యమం, ప్రజాఉద్యమంగా విరాజిల్లాలి. విజయదుందుభి మోగించాలి. మీ పెన్ను... గన్ను కన్నా తీవ్రమైంది, తీక్షణమైంది, చదవ సుందరమైంది, మురిపించేది - మత్తు వదిలించేది - మైమరిపించేది - మరపు తెరను తొలగించేది. పవిత్ర చారిత్రక దినాన విడుదల చేసిన 'తెలుగు వెలుగు' తెలుగు జాతిని పలకరించి పులకరింప జేసింది. ఇది శుభారంభం. మన పాలకులకు మేలుకొలుపు - తెలుగు ప్రజల ప్రతిన ప్రతిధ్వనించే శంఖారావం.

- భాట్టం శ్రీరామమూర్తి, మాజీ మంత్రి, విశాఖపట్నం

జాతి అస్తిత్వాన్ని చాటి చెప్పాలి

తెలుగు పునర్వికాసం కోసం మాస పత్రికను వెలువరించడం ఆహ్వానించదగిన పరిణామం. జాతి అస్తిత్వాన్ని, ప్రత్యేకతను చాటి చెప్పేందుకు మాతృభాష తప్ప మరో మార్గం లేదు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాతృభాష కీర్తిపతాకాన్ని ఎగురవేసేందుకు 'రామోజీ ఫౌండేషన్' చేస్తున్న ఈ ప్రయత్నానికి అభినందనలు.

- డా॥ వి.రవీందర్, ఎస్పీ, కరీంనగర్

కొత్త వెలుగునిచ్చారు

తెలుగు మాధుర్యాన్ని భావితరాలకు పంచడానికి, భాష పట్ల మక్కువను కలిగించడానికి ఈ పత్రికతో కొత్త వెలుగునిచ్చారు. మహత్తర కార్యక్రమాన్ని చేపట్టినందుకు ధన్యవాదాలు. ఈ యజ్ఞంలో ఉడతాభక్తితో సాయమందిస్తాను.

- కె.హరనాథరెడ్డి, ఛైర్మన్, కల్లం గ్రూపు సంస్థలు, గుంటూరు

మంచిరోజులొచ్చాయి

తెలుగువెలుగు ప్రారంభమైనందుకు చాలా సంతోషించాను. తెలుగుభాషా, సాహిత్యాలకు

An Authorized OEA for
ASHOK LEYLAND
ENGINEERING YOUR TOMORROWS
D.G sets Range from
10KVA to 2000KVA
దసరా శుభాకాంక్షలు
GENESIS
For Enquiry
Ph:92462 00543
040 - 67334455
Email:info@genesisinfra.com
Website:www.genesisinfra.com
POWER OF PERFECTION
GENESIS
An ISO 9001-2000
Certified Company
GENESIS
POWERONICS INDIA PVT. LTD.
Head Office: A-46, Madhuranagar, Ameerpet, Hyderabad-500 038
Works: Plot No. 21 & 22, Phase-IV, IDA Jeedimetla, Hyderabad - 500 055
SHOWROOMS
Warangal - Ph:92468 04543
Nizamabad - Ph:92480 02538
Nalgonda - Ph:92462 94543
Ongole - Ph:92480 17543
Vizag - Ph:92462 01543
Karimnagar - Ph: 92463 77543
Khammam - Ph: 92480 15543
Kurnool - Ph: 92462 45543
Kakinada - Ph: 92462 75543
Vijayawada - Ph: 92461 13543


మందులు, ఇంజెక్షన్‌లు
ఆపరేషన్లు లేకుండా
అత్యాధునిక చికిత్స
కంటి వ్యాధులు
కంటిచూపు తగ్గుట, కంటి పూత, శుక్లాలు, కంటి నరముల పోటు, రెటీనా సమస్య వల్ల కంటిచూపు తగ్గినవారికి
కీళ్ళు, ఎముకల వ్యాధులు
మోకాలు నొప్పి, అరిగిన మోకాళ్ళకు, తుంటినొప్పి, నడుము నొప్పి, డిస్క్ సమస్యలు, కాళ్ళు, చేతులు జాలు, పాదములు మంటలు, తిమ్మిరులు, స్పర్శ తగ్గుట, కీళ్ళు నొప్పులు, నడుము వంకర, కాలు వంకర, కీళ్ళవాతం.
నరముల వ్యాధులు
నరముల నొప్పులు, నరములు లాగుట, చేతులు పాదములు తిమ్మిరులు, మంటలు, ఎక్కువ దూరం నడవలేకుండుట, ఎక్కువసేపు నిలబడలేకుండుట, మూర్ఛ, ఫిట్స్, నోటివెంట చొంగ కార్చుట, తల నొప్పి, మెడ నొప్పి, మైగ్రేన్ తలనొప్పి, పార్శ్వపు నొప్పి, వెన్నుముక, తలకు గాయం, మెదడు నరములలో పెరుగుదల లేకుండుట, వెన్నుముక దెబ్బతిని కాళ్ళు, చేతులు చచ్చు పడిన వారికి నీరుడు కంట్రోల్ లేనివారికి, పాదముల పుండ్లు, సయాటికా, ఆల్జిమర్స్
గుండె వ్యాధులు
ఆయాసము, చేతులు, కాళ్ళు లాగుట, ఎక్కువ దూరం నడవ లేకపోవడం, ఊపిరి అందకపోవుట, ఛాతినొప్పి.
జీర్ణకోశ వ్యాధులు
గ్యాస్ట్రిక్ ప్రాబ్లమ్, కామెర్లు, కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం, రక్త వాంతులు, మొలలు, మల బద్ధకం.
చెవి, ముక్కు, గొంతు
చెవిపోటు, చీము కారుట, హోరు శబ్దము, సైనస్ తలనొప్పి, టాన్సిల్స్, గొంతునొప్పి, మింగుడు పడకుండుట, గురక, పక్షవాతము.
కిడ్నీ వ్యాధులు
కిడ్నీలు దెబ్బతినుట, కిడ్నీ ఇన్ఫెక్షన్, డొక్కల నొప్పి, డయాలసిస్ చేయించుకున్న తరువాత వచ్చే మెటబాలిక్ డెఫీషియన్సీ, నీరుడు పూర్తిగా బంద్ అవటం, ప్రోస్టేట్ గ్రంధి వాపు-క్యాన్సర్, నీరుడు తెలియకుండా అవుట.
షుగరు వ్యాధులు
షుగరు వలన వచ్చు పుండ్లు, నీరసము, ఎక్కువసార్లు మూత్ర విసర్జన, చేతుల, పాదముల స్పర్శ తగ్గుట.
దంత వ్యాధులు
చిగుళ్ళవాపు, పన్ను పోటు, దవడ నరముల నొప్పి, దవడ జాయింట్‌లు అరుగుట, పన్ను తీపి, పళ్ళు కదులుట
థైరాయిడ్ సంబంధ వ్యాధులు
అధిక బరువు, గుండెదడ, ఛాతినొప్పి, చేతులు వణుకుట, చేతులు - పాదములకు చెమటలు పట్టుట
డా॥ మాదల రాజశేఖర్ M.B.B.S., M.S. (ORTHO), MIRA, MD (AM), PGDHA, PGDNA, PGDFH, CCIH, (PGDCC) (PGDG)
Certificate Holder in advanced Computers for Orthopedic Surgeons
శేఖర్ ఆర్థో & న్యూరో సెంటర్
ఎడ్వాన్స్‌డ్ మల్టీ స్పెషాలిటీ నాన్ సర్జికల్ సెంటర్, బంగ్ షాపింగ్‌మాల్,
2వ అంతస్తు, నక్కలరోడ్, విజయవాడ-2. Ph: 0866-2439595, 98487 08318, 93466 69280, 92466 62647. Visit us: www.sekharorthocenter.com

మంచి రోజులు వచ్చాయన్న నమ్మకం కలిగింది.

- సి.ధర్మారావు, హైదరాబాద్.

మంచి ముత్యాల మూట

ముచ్చటగొలిపే ముత్యాల సరాలతో తెలుగువారి మనసులను ఓలలాడించిన తొలి సంచిక చూసి ముగ్ధుడనయ్యాను. సంపాదకీయం మనోరంజకంగా ఉంది. మంచి కాగితంతో అతి తక్కువ ధరకు మంచి ముత్యాల మూటను అందిస్తున్నందుకు ధన్యవాదాలు.

- కొడవంటి సుబ్రహ్మణ్యం, విశాఖపట్నం

జాతికి దిక్సూచి

'తలకట్టుతో తెలుగక్షరం... తలెత్తుకోమంది తెలుగు స్వరం...' అన్నట్లుగా ఉంది తొలి సంచిక ముఖచిత్రం. తెలుగు ప్రాభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలన్న మహాయాగాన్ని చేపట్టడం ముదావహం. వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక విషయాలను పొందుపరచడానికి అనువైన అమృత భాష మన తెలుగు. దక్షిణాది భాషల్లో జాతీయభాష కాగలిగిన సత్తా ఉంది. సంస్కృతంలో చక్కెరపాకం, అరవంలో అమృత రాశి, కన్నడంలో కస్తూరీ కలగలిసిన భాష తెలుగు. మాండలికాల గుబాళింపును, ప్రాభవ వైభవాలను, జానపద కళారూపాలను దిగంతాల వరకూ వ్యాపింపచేయాలన్న ఆకాంక్షతో చేపట్టిన ఈ అక్షరయజ్ఞంలో ప్రతి తెలుగు వాడూ సమిధలందించాలి. మన భాష మధురిమను, సంస్కృతి సౌరభాన్ని, గళగరిమను భవిష్యత్తరాలకు అందించాలన్న తపన పత్రికలో కనిపించింది. 'తెలుగు వెలుగు' మన జాతి చైతన్య దీపికగా భాసిల్లాలి.

- డా॥ పి.విజయకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాల, కర్నూలు

ధైర్యంగా చదవగలిగే పత్రిక

అమ్మభాష మీద గౌరవాన్ని పెంపొందించేలా అన్నీ సమపాళ్లలో పొందుపరిచిన మన పత్రిక తెలుగు వారికి వరం. సమాజానికి పనికొచ్చే చక్కని కథలు అందించారు. 'ఈనాడు' స్థాయికి తగినట్లుగా, హుందాగా వెలువరించినందుకు మా శుభాకాంక్షలు. ఇది ఇంట్లో పెద్దల ముందు, ఎదిగిన పిల్లల ముందు కూడా ధైర్యంగా చదవగలిగే ఆరోగ్యవంతమైన పత్రిక.

- గాడిచెర్ల ఫణి, కె.శ్రీహరి, విజయవాడ

పూర్వవైభవాన్ని తేవాలి

తెలుగు వెలుగు వల్ల మన భాషకు మునుపటి ప్రాభవం త్వరలోనే చేకూరుతుందని ఆశిస్తున్నాం. అందరూ తెలుగు మాధ్యమాన్ని విడిచిపెట్టి ఆంగ్లమాధ్యమం వైపు తరలి పోతున్నారు. ఈ తరుణంలో మీరు చేపట్టిన కార్యక్రమం వల్ల ఏ కొద్దిమంది మాతృభాషను ప్రోత్సహించటం మొదలుపెట్టినా ఎనలేని మేలు జరుగుతుంది.

- నారాయణ, సంపాదకులు, కొత్తపల్లి పత్రిక

కొత్తదనాన్ని ఇవ్వాలి

వ్యాసాలన్నీ బాగున్నాయి. ఇంకా మంచి కథనాలు, వ్యాసాలతో మరింత తెలుగుదనం ఉట్టిపడేలా అందిస్తారని ఆశిస్తున్నాం.

- తమిళనాడు హిందీ అకాడమీ, చెన్నై

తెలుగు రచయితల డైరెక్టరీకి ఆహ్వానం

'కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్' సంస్థ 'ప్రపంచ తెలుగు రచయితల డైరెక్టరీ' రూపొందిస్తోంది. ఇందులో పొందుపరిచేందుకు రచయితలు వారి పేరు, చేసిన కృషి, మూడు రచనలు, పొందిన పురస్కారాలు తదితర వివరాలు, తాజా ఫొటోలను 31.10.12లోగా అందజేయవచ్చు. చిరునామా: 'కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్, 2-2-647/77/బి16, ఎస్.బి.ఐ కాలనీ, బాగ్అంబర్‌పేట, హైదరాబాద్. వివరాలకు 9866605777లో సంప్రదించవచ్చు. kinneraarttheatres@gmail.comకు మెయిల్ కూడా చేయవచ్చు.

తొలిమెట్టు

తొలిసంచికలో అన్ని అంశాలూ చాలా బాగున్నాయి. 'రామోజీ ఫౌండేషన్'కి అభినందనలు. మరిన్ని ప్రచురణలతో మన భాషకు, సంస్కృతికీ పూర్వ వైభవాన్ని తెస్తారని ఆశిస్తున్నాను. ఈ పుస్తకాన్ని ఎవరు చదివినా మాతృభాష ఖ్యాతి గుర్తిస్తారనుకుంటున్నాను.

- పి.సురేష్, లీడ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, థాంసన్ రాయిటర్స్

బాల్యం గుర్తొచ్చింది

'తెలుగు వెలుగు' కోసం 'రామోజీ ఫౌండేషన్' చేపట్టిన ఈ బృహత్కార్యం తప్పక విజయం సాధిస్తుందని నా నమ్మకం. 'వైకుంఠపాళి'ని చూస్తే నా బాల్యం గుర్తుకొచ్చింది.

- ఎ.సూర్యారావు, విశాఖపట్నం

గజల్స్ వేయండి

తొలి సంచిక కోసం ప్రతి దుకాణమూ తిరిగి వెతికి తెచ్చుకున్నాను. తెలుగులో గజళ్లను చాలా మంది రాస్తున్నారు. తెలుగు వెలుగులో జీవన సంబంధ గజల్స్‌కి ప్రాధాన్యత ఇవ్వాలని ఆశిస్తున్నాను.

- ఇ.వెంకటేశ్వరరావు, పాలకొల్లు

తెలుగులో సంతకం పెడదాం

'ఈనాడు' మొదటి పేజీలో రామోజీరావు సంపాదకీయం చదివి 'తెలుగు వెలుగు' పత్రిక కొన్నాను. తొలిసంచిక అద్భుతం. మాతృభాష గురించి పత్రిక మొదలవడం విశేషం. వ్యాసాలు, కథలు, కవితలు బాగున్నాయి. తెలుగు వారంతా ముందుగా సంతకాన్ని మాతృభాషలోనే పెట్టడం అలవాటు చేసుకోవాలి. తల్లి భాషకు మనమిచ్చే గౌరవమిదే.

- భట్టాకం సుధీర్‌కుమార్, హైదరాబాద్

మా మానస పుత్రికే

'తెలుగు వెలుగు' ఆవిష్కృతం మహోన్నతం. పురుడు పోసుకున్నప్పటి నుంచే తెలుగు పరిమళాలతో భాషాభిమానులను పులకరింప చేస్తోంది. ఈ మాసపత్రిక తెలుగు వారి మానస పత్రిక అనడంలో సందేహం లేదు.

- దివాన్జీ ప్రభాకర్‌రావు, ఆత్మకూరు,

గ్రాంథికాన్ని మార్చొద్దు!

'తెలుగు వెలుగు' ప్రారంభం శుభ సూచకం. 'స్వభాష' వ్యాసాన్ని గ్రాంథికం నుంచి వ్యావహారికంలోకి మార్చారు. గ్రాంథికంలో ఉన్న వాటిని అలాగే చదివి ఆనందించాలే తప్ప మార్చటం మంచిది కాదు.

- పులకేశి, హైదరాబాద్

ముచ్చటైన బిడ్డ

మీ మానసపుత్రి 'తెలుగు వెలుగు', కానుకగా పరమపద సోపాన పటం అందుకున్నాం. బిడ్డ (పుస్తకం) చాలా అందంగా, ముద్దుగా, ముచ్చటగా ఉంది. ఈ బిడ్డలోని ప్రతి అవయవ పొందిక, వస్త్రాలంకరణ (సంచికకు వాడిన కాగితం) హృదయానందాన్ని కలిగించాయి. విశ్రాంత ఉపాధ్యాయులు ముందుకొచ్చి చుట్టుపక్కల పిల్లలకు 'తాతయ్య కథలు' పేరుతో నీతికథలు, పద్యాలు చెబితే ఆయా ప్రాంతాల యాసబాసలతో తెలుగు పరిమళాలు ఇంటింటా నిండుతాయి.

- కె. భాస్కరరాజు, విశాఖపట్నం

చదువుల తల్లిని చూసినట్లుంది

సరస్వతీదేవిని పుస్తకరూపంలో చూపినందుకు ధన్యుణ్ని. మా తెలుగు వెలుగు దిగ్విజయ పయనాన్ని సాగిస్తుందని ఆశిస్తున్నాను. సామెతలు, చమత్కార హాస్య గుళికలు, జానపదాలు, గేయాలకు స్థానమివ్వాలి. తెలుగు వెలుగు కాంతులు మరింత ద్విగుణీకృతం కావాలి. ప్రతి ఇంటా ప్రకాశించాలి.

- తంగిరాల ప్రభాకరశాస్త్రి, నెల్లూరు

బెంగళూరు దీపావళి కవితలు, కథానికల పోటీకి ఆహ్వానం

ఇతివృత్తం సామాజిక దృక్పథంతో ఉండాలి. కవిత అరఠావు 30పంక్తులకు మించరాదు. కథానిక 3 అరఠావులకు మించరాదు. రాత లేదా టైపు, నిజ ప్రతులను పంపాలి. ఫొటోస్టాట్ కాపీలను స్వీకరించం. రచనల్లో ఎక్కడా రచయిత పేరు రాయకూడదు. హామీపత్రంలో మాత్రమే రచయిత పేరు, వివరాలు ఉండాలి. కవిత కథానికలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల తోపాటు ప్రశంసాపత్రం ఇస్తాం. ఎంపికలో సమాఖ్యదే తుది నిర్ణయం. రచనలను ప్రత్యేక పుస్తక రూపంలో ప్రచురిస్తాం. రచనలను అక్టోబరు 31, 2012 లోపు కింది చిరునామాకు పంపాలి.

అధ్యక్షులు, కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య, నెం. 802, 9బి మెయిన్, హెచ్.ఆర్.బి.ఆర్. మొదటి బ్లాకు, కళ్యాణ నగర, బెంగళూరు - 560 043. ఫోన్: 09741407099.

ప్రజల్లో అవగాహన కల్పించాలి

పత్రిక ద్వారా పల్లెల్లో అవగాహన కల్పించాలి. సదస్సులు నిర్వహించాలి. ఉత్తరాల ఉద్యమం, పాఠశాలల్లో భాషా సంబంధిత పోటీలు నిర్వహిస్తే బాగుంటుంది. ప్రాచీనం నుంచి ఆధునికం వరకూ తెలుగు భాష ప్రతిష్ఠను ప్రతిబింబించేలా కథలు, వ్యాసాలు ఇవ్వాలి.

- సి.విజయ్, హైదరాబాద్

ఆ అనుభూతి అనిర్వచనీయం

అమ్మభాషకు వెలుగు తీసుకురావడానికి ఈ పత్రిక పునాది వేసింది. వైకుంఠపాళి కానుక చిన్ననాటి రోజులను గుర్తుకు తెచ్చింది. ప్రతి పుటలోనూ ఉట్టిపడిన తెలుగుదనం అనిర్వచనీయమైన అనుభూతి కలిగించింది.

- పులిపాటి దుర్గారావు, విజయవాడ

తెలుగు దాతా సుఖీభవ

'తెలుగు వెలుగు' తొలి సంచిక మా ఇంటిల్లిపాదిని ఆకట్టుకుంది. ఆణిముత్యాల్లాంటి ఆరు కథలు షడ్రుచులను మేళవించి విందారగింపజేశాయి. భేష్..! తెలుగు దాతా! సుఖీభవ.

- బిక్కునూరి రాజేశ్వర్, పొన్కల్,ఆదిలాబాద్

మన నిఘంటువులకు మంగళారతి

ఆంధ్రభారతి

చాలామందికి అభిరుచులనేవి జీవితానికి అనుబంధంగానే ఉంటాయి. కొందరికి మాత్రం అవే ఆయువుపట్టవుతాయి. ప్రళయ సదృశంగా చుట్టుముట్టి వేరే ఏమీ కనపడకుండా చేసి నడిపిస్తాయి. ఇక 'ఏంటి దీని వల్ల లాభం' లాంటి ప్రశ్నలకు వారి వద్ద జవాబు దొరకదు. అది సమాజానికి, జాతికి ఉపకరించేదైతే చెప్పేదేముంది! ఈ కోవకు చెందిన ఇద్దరు మిత్రులు ఉన్నారు! వారు సొంత లాభం ఎంతో మానుకుని మరీ తెలుగు భాషకు, సాహిత్యానికి చేస్తున్న సేవ ఏమిటో చదవండి...

తెలుగు వెలుగు బృందం

బృహత్కార్యాల్ని సాధించడానికి ప్రభుత్వాలు, సంస్థలే అక్కర్లేదు. అభిరుచి, పట్టుదల ఉన్న వ్యక్తులైనా చాలని నిరూపిస్తున్నారు వాడపల్లి శేషతల్పశాయి, కాలెపు నాగభూషణరావులు. వీరిద్దరూ కలిసి పదకొండేళ్ల క్రితం 'ఆంధ్రభారతి' పేరుతో ఒక వెబ్‌సైటుకు శ్రీకారం చుట్టారు. అదిపుడు తెలుగు భాషాభిమానుల పాలిట పెన్నిధిగా మారింది. అక్కడ పొందుపరిచిన ప్రాచీన సాహిత్యం అంతా ఒక ఎత్తయితే, వారు ఏర్పాటు చేసిన నిఘంటువుల సదుపాయం మరొక ఎత్తు.

ఇక్కడ పుటలు వెతికే అలసట లేదు. పుటలన్నీ వెతికినా అర్థం దొరకని అగత్యమూ రాదు. ఒక పదం టైపు చేస్తే చాలు, పదహారు నిఘంటువుల్లో దాని జాడ ఎక్కడున్నా అర్థంతో సహా మన ముందు ప్రత్యక్షమవుతుంది. పదహారు నిఘంటువులన్నది ఇప్పటి సంగతి. రానున్న కాలంలో ఈ సంఖ్య పెరగనుంది. మరొక్క మూడేళ్లు గడిస్తే, తెలుగులో ఇప్పటిదాకా వెలువడిన నిఘంటువులన్నీ (సుమారు డెబ్భై దాకా) మన సేవలో ఉంటాయి.

ఈ వెబ్‌సైటు నడపటం వల్ల వీరికి నయాపైసా రాదు. ప్రకటనలకు కూడా వీరు చోటివ్వరు. పైపెచ్చు బోలెడు ఖర్చు. మరెందుకీ ప్రయాస అనే ప్రశ్న రావచ్చు. దీనికి జవాబు చెప్పినా అది అభిరుచుల విలువ తెలిసినవారికే అర్థమవుతుంది.

అభిరుచే కలిపింది... నడిపింది

ఈ ఇద్దరు మిత్రుల పరిచయం నిన్నామొన్నటిది కాదు. నాగభూషణరావు కాకినాడ నుంచి వచ్చి హైదరాబాదులో స్థిరపడినవారు. శేషతల్పశాయి స్వస్థలం తెనాలి. హైదరాబాదు జె.ఎన్.టి.యులో బి.టెక్. చదివినపుడు మొదటిసారి కలిశారు. సాహిత్యం పట్ల అనురక్తి, భాషపై ప్రేమ... ఇలా ఉమ్మడి అభిరుచులు వారి మధ్య స్నేహానికి వంతెన వేశాయి. కళాశాల దాటారు. సాఫ్టువేరు ఉద్యోగాల్లో కుదురుకున్నారు. ముప్పైయేళ్లయినా ఆ అభిరుచులు మాత్రం అలాగే నిలిచాయి. నిలవడమే కాదు, ఊడలు వేసి పాతుకుపోయాయి. ఏదో చేయమని పురికొల్పాయి. ఫలితమే 'ఆంధ్రభారతి'.

ఈ వెబ్‌సైటు ఆలోచన 1999లో వచ్చింది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధ రచనల్ని ఒక నెలవుకు చేర్చాలనుకున్నారు. తెలుగు నిఘంటువుని అంతర్జాలం వాడేవారందరికీ అందుబాటులోకి తేవాలనుకున్నారు. ఇలాంటి ప్రయత్నాలు ఇంకేమైనా జరిగాయా అని వెతికారు. తెలుగులో ఏమీ దొరకలేదు.

అడ్లూరి శేషుమాధవరావు నడుపుతున్న వెబ్‌సైటు ఒకటి ఉంది. అందులో కొత్తగా చేర్పులేమీ లేవు. తమిళంలో మాత్రం 'ప్రాజెక్టు మధురై' అనే ఒక వెబ్‌సైటు తారసపడింది. అందులో ప్రాచీన తమిళ సాహిత్యం అంతా టైపు చేసి ఉంచుతున్నారు. కావాలనుకున్నవారికి వాటిని పుస్తక రూపంలో దించుకునే అవకాశం ఉంది. ఈ ప్రయత్నమూ, దీనికి తమిళుల నుంచి లభిస్తున్న తోడ్పాటు చూసి మిత్రులిద్దరూ ఉత్తేజితులయ్యారు. ఇలాంటిది తెలుగులోనూ ప్రారంభించాలని నడుం బిగించారు.

జులై 2001లో 'ఆంధ్రభారతి.కామ్' పేరు నమోదు చేశారు. పుస్తక దుకాణాల్లో పాత సాహిత్యం కొంత కొన్నారు. ఒక్కొక్కటిగా ఎక్కించడం మొదలుపెట్టారు. మొదట కొన్ని శతకాలు (దాశరథి, కృష్ణ), ఆంధ్రప్రశస్తి వంటి పద్యకావ్యాలు, త్యాగరాజు కీర్తనలు ఎక్కించారు. వీటి కోసం 'సూరి టిఎల్ఎస్' అనే ఒక ఫాంటు కూడా రూపొందించుకున్నారు. ఇపుడు వాడకంలో లేక ప్రాచీన గ్రంథాల్లో మాత్రమే ఎక్కువగా ఉండే అక్షరాలన్నీ ఇందులో ఉంటాయి. ఉదాహరణకి దంత్య 'చ'-'జ'లు, నకార పొల్లు, వలపలిగిలక, గురు-లఘువుల గుర్తులు... మొదలైనవి. మొదట్లో గ్రంథాల టైపింగు వీరే చేశారు. దిద్దుబాట్ల బాధ్యత కూడా వీరిదే. వృత్తి జీవితం లోంచి మిగుల్చుకున్న సమయాన్నే దీనికి ఖర్చుపెట్టారు. ముందుకు సాగే కొద్దీ ప్రయత్న విస్తృతి పెరిగింది. పని పెరగడంతో టైపింగుకు బయటివారి సాయం తీసుకోవడం ప్రారంభించారు.

నిఘంటువుల చేర్పు

ఈ సైటులో నిఘంటు సదుపాయం కల్పించాలన్నది మొదట్నించీ ఉన్న ఆలోచనే. కాని ఇన్ని నిఘంటువులు చేరతాయని అప్పట్లో అనుకోలేదు. 'శబ్దరత్నాకరం' ఒకటే పెడదామనుకున్నారు. 'డిక్షనరీ.కామ్' అనే ఇంగ్లిషు సైటు చూశాక ఆలోచన మారింది. అది ఒక పదానికి వేర్వేరు నిఘంటువుల్లో ఏ అర్థాలున్నాయో అన్నింటినీ చూపిస్తుంది. తెలుగుకి కూడా ఇటు వంటి సదుపాయం కల్పించాలన్న ఆలోచన వచ్చింది. శబ్దరత్నాకరం, రెండు బ్రౌన్ నిఘంటువులు, బూదరాజు ఆధునిక వ్యవహార కోశము - ఈ నాలుగింటితో ప్రారంభించారు. నెమ్మదిగా ఒక్కో నిఘంటువు జత చేస్తూ వచ్చారు. ఇపుడు మొత్తం పదహారు నిఘంటువులు సమకూరాయి. ఇవి గాక, మరో ఇరవై టైపింగ్ పూర్తయి సిద్ధంగా ఉన్నాయి. దిద్దుబాటు పని జరుగుతోంది. ఇంకో పది నిఘంటువులు టైపింగ్ దశలో ఉన్నాయి. తర్వాత ఇరవై నిఘంటువులు వరసలో ఎదురుచూస్తున్నాయి.

ఈ నిఘంటువులు సేకరించడమన్నది మరో శ్రమ. వాటిలో చాలా వరకు ఇపుడు ప్రచురణలో లేవు. దుకాణాల్లో దొరికితే కొనడం, లేదంటే పాతపుస్తకాల దుకాణాల్లో వెతకడం, అక్కడా దొరక్కపోతే గ్రంథాలయాల నుంచి అద్దెకు తీసుకోవడమో, నకలు తీసుకోవడమో చేసేవారు. వావిళ్ల నిఘంటువు వంటివి కొన్ని లభ్యం కావడం కష్టమైంది. ప్రస్తుతానికి దాదాపు అన్నీ సమకూరినట్టే. వీటిలో 'ఆంధ్ర వాచస్పత్యము' (కొట్ర శ్యామలకామశాస్త్రి), 'ఆంధ్రశబ్దరత్నాకరము' (చెలమచెర్ల రంగాచార్యులు), 'తెలుగు వ్యుత్పత్తికోశం' (ఆంధ్రవిశ్వకళాపరిషత్తు) వంటి ఎన్నో విలక్షణ నిఘంటువులు ఉన్నాయి. ప్రసిద్ధ 'సూర్యరాయాంధ్ర నిఘంటువు' ఆరు సంపుటాల్లో అయిదు పూర్తికాగా, మిగిలినదానికి టైపింగు జరుగుతోంది. ఇంకా అనేక మాండలిక కోశాలు జాబితాలో ఉన్నాయి. రెండుమూడు నిఘంటువులు మాత్రం టైపు చేయాల్సిన అవసరం లేకుండానే సమకూరాయి. విరల్, వ్యాస్ అనే వ్యక్తుల దగ్గర అవి సిద్ధంగా ఉన్నాయి. వారు 'రచన' అనే కమర్షియల్ సాఫ్టువేరు కోసం వాటిని తయారు చేసుకున్నారు. అడగ్గానే ఇచ్చారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ - ఇందిరా క్రాంతి పథం
అనంతపురం. ఫోన్: 08554- 275316
SERP

ముఖ్య పథకాలు (స్కీమ్స్)

1) రాజీవ్ యువ కిరణాలు
2) స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు ఋణాలు
3) వడ్డీలేని ఋణాలు 4) పాల ప్రగతి కేంద్రాలు
5) డా॥ వై.ఎస్.ఆర్. అభయహస్తం - ఇందిర జీవిత బీమా పథకము
6) ఆరోగ్యం మరియు పౌష్టికాహార కేంద్రాలు
7) స్త్రీ నిధి - స్వయం సహాయక సంఘాలకు అత్యవసర ఋణాలు (మహిళా బ్యాంకు)
8) వృద్ధాప్య మరియు సామాజిక భద్రత పెన్షన్లు
9) సేంద్రీయ వ్యవసాయం (పురుగుమందు లేని వ్యవసాయం)
10) నిరుపేదల వ్యూహం 11) మార్కెటింగ్ (వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు)
12) లింగ వివక్షత - కుటుంబ సలహా కేంద్రాలు - మహిళా అక్రమ రవాణా నిరోధం మరియు జీవనోపాధి కల్పించుట 13) బాల బడుల నిర్వహణ
14) కులగణన సర్వే 15) భూమి వివాద పరిష్కారం

బ్యాంకు అప్పులు సకాలంలో చెల్లించడంలోనే మీ అభివృద్ధి దాగి వుంది
బ్యాంకుల నుండి తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించండి. ఇది ప్రజల సొమ్ము, తిరిగి ప్రజలకే ఉపయోగపడుతుంది.
బ్యాంకుల కన్నా తక్కువ వడ్డీకి ఏ బంధువు, ఏ వడ్డీ వ్యాపారి కూడా ఇవ్వలేడు. బ్యాంకుల నమ్మకాన్ని కోల్పోవద్దు.
వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాలలో నలిగిపోవద్దు. ఆర్థిక క్రమశిక్షణతో మెలగండి.
మీ అభివృద్ధే దేశాభివృద్ధికి మూలమని గమనించండి.

శ్రీ వి.దుర్గాదాస్
జిల్లా కలెక్టర్ /చైర్మన్, డి.ఆర్.డి.ఏ - అనంతపురం.

శ్రీమతి పి.ప్రశాంతి
ప్రాజెక్ట్ డైరెక్టర్, డి.ఆర్.డి.ఏ - అనంతపురం.

చిత్తశుద్ధి ఉంటే చాలు...

నిఘంటు హక్కుల్ని సంపాదించటానికి పెద్ద ఇబ్బంది పడలేదంటారు శాయి. "చాలా నిఘంటువులు పాతవే కనుక గ్రంథహక్కుల ప్రమేయం రాలేదు. సమకాలీన నిఘంటువుల విషయంలో కూడా అంతా సాయపడ్డారు. రవ్వా శ్రీహరి (శ్రీహరి నిఘంటువు, సంఖ్యాపదకోశం, నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం), లక్ష్మణరావు పతంగే (ఉర్దూ-తెలుగు నిఘంటువు', నలిమెల భాస్కర్ (తెలంగాణ పదకోశం)... మొదలైనవారంతా అడగ్గానే ఒప్పుకున్నారు. నిఘంటుకర్తలు మరణించిన సందర్భాల్లో, వారి కుటుంబ సభ్యుల నుంచి అనుమతులు తీసుకున్నాం. సంస్థల విషయంలో కూడా సాఫీగానే నడిచింది. సూర్యరాయాంధ్ర నిఘంటువు తెలుగు విశ్వవిద్యాలయానిది. ప్రముఖ సాహితీ విమర్శకులు వెల్చేరు నారాయణరావు మాట సాయం వల్ల అనుమతి సులువైంది. ఇపుడు తెలుగు అకాడమి వారి అనుమతికి ప్రయత్నాలు చేస్తున్నాం. పాఠ్యపుస్తకాల నేపథ్యం గల సంస్థ కనుక వారి వద్ద ఎన్నో విలువైన పారిభాషిక పదకోశాలు ఉన్నాయి. న్యాయశాస్త్రం, జీవశాస్త్రం మొదలైన ప్రత్యేక విభాగాల కోసం పదకోశాలు తయారు చేశారు. వారి అనుమతి లభిస్తే విలువైన నిఘంటువులు చేకూరతాయి."

పెరుగుతున్న వీక్షకులు

ఆంధ్రభారతి వీక్షకులు అంతకంతకూ పెరుగుతున్నారు. ఎక్కువమందిని ఇటువైపు లాక్కొస్తున్నవి నిఘంటువులే. అందులోనూ అధికులు చూసేది 'ఇంగ్లీషు నుంచి తెలుగు' పదాల అర్థాల్నే. "మేం మొదట్లో అలా అనుకోలేదు. తెలుగు పదాలకు తెలుగు అర్థాలు తెలుసుకునేందుకు చాలామంది వస్తారనుకున్నాం. కాని అలా జరగలేదు. బహుశా ఇపుడు వాడేవారు ఎక్కువశాతం విద్యార్థులో, లేక అనువాదకులో అయ్యుంటారు. మన రాష్ట్రంలో కంప్యూటర్ వాడకం చాలా పరిమితం. అది పెరిగే కొద్దీ దీన్ని వాడుకునే వారింకా పెరుగుతారని ఆశిస్తున్నాం. విద్యార్థులు దీన్ని ఎక్కువ ఉపయోగించుకోవాలన్నది మా ఆశ. వారి దాకా చేరాలంటే ముందు ఉపాధ్యాయులకు దీని గురించి తెలియాలి. గూగుల్‌లో 'తెలుగు నిఘంటువు' అని టైపు చేయగానే మా వెబ్‌సైటే మొదట వచ్చేలా చర్యలు తీసుకున్నాం. దీని ప్రయోజనం అందరికీ చేరాలంటే ఇంకా చాలా జరగాల్సి ఉంది." అంటున్నారు శాయి.

ఆంధ్రభారతి ఆకర్షణకు ముఖ్యకారణం తెలుగులో నిఘంటువుల పరిస్థితి. ప్రాచీన పద్య సాహిత్యాన్ని, లేదా ఇటీవలి మాండలిక సాహిత్యాన్ని నిఘంటువు సాయం లేకుండా చదవటం కష్టం. కాని ఆంగ్లంలో ఆక్స్‌ఫర్డ్, వెబ్‌స్టర్ నిఘంటువుల స్థాయిలో తెలుగుకు ఒక సమగ్రమైన నిఘంటువు లేదు. ఉన్నవి కూడా ప్రచురణలో ఉండటం లేదు. ఉదాహరణకి ప్రస్తుతం దొరుకుతున్న తెలుగు - తెలుగు నిఘంటువు 'శబ్దరత్నాకరం' ఒక్కటే. దాని పరిమితులు దానికున్నాయి. మనకున్న నిఘంటువుల్లో 'సూర్యరాయాంధ్ర' నిఘంటువును సమగ్ర నిఘంటువుగా పరిగణిస్తారు. అది ఆరుసంపుటాలు. ఒక పుస్తకం చదువుకునేటపుడు అన్ని సంపుటాలు పక్కన పెట్టుకోవడమన్నది శ్రమ. అందుకే, ఒక్క పదం టైపు చేయడంతోనే దానికున్న అన్ని అర్థాల్ని తెచ్చి కళ్లవాకిట నిలిపే 'ఆంధ్రభారతి'కి ఆదరణ లభిస్తోంది.

పాత సాహిత్య ఖజానా

ఒక పక్క నిఘంటువుల చేర్పు సాగుతుంటే, మరోపక్క వెబ్‌సైటులో పాత సాహిత్య ఖజానా కూడా బరువెక్కుతోంది. ఈ విభాగంలో అనేక

భావి ప్రణాళికలు

- ఇంగ్లీషు లిపిలో తెలుగు పదాల్ని టైపు చేసినా పని చేసేలా వెబ్‌సైటులో మార్పులు చేయనున్నారు.
- సంస్కృత నిఘంటువులు కూడా జతపరిచే యోచనలో ఉన్నారు. పది నిఘంటువులకు సంబంధించి సమాచారాన్ని సేకరించారు.
- కొన్ని ప్రాచీన కావ్యాల్ని టీకా తాత్పర్య సహితంగా చేర్చనున్నారు. శృంగార నైషధం, పాండురంగ మహాత్మ్యం, ఆముక్తమాల్యదలను టైపు చేసి ఉంచారు. దిద్దుబాటు జరుగుతోంది.
- పాల్కురికి సోమనాథునిపై ఇప్పటిదాకా వచ్చిన వ్యాసాల్ని, విశ్లేషణాత్మక సాహిత్యాన్ని ఒక చోట చేర్చబోతున్నారు. తర్వాత నాచన సోమన, శ్రీనాథుడు తదితర కవులందరిపై వచ్చిన సాహిత్యాన్ని కూడా పొందుపరుస్తారు.

తానా చేయూత

చాలాకాలం క్రితం సాహిత్యాభిరుచి గల కొందరు ఇంటర్నెట్‌లో 'రచ్చబండ' అనే సమూహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో సాహితీ సంబంధమైన చర్చలు సాగుతుంటాయి. అక్కడ శేషతల్పశాయికి ప్రవాసాంధ్రులు కొందరు పరిచయం అయ్యారు. వారిలో జర్మనీ వాసి పరుచూరి శ్రీనివాస్, అమెరికా వాసి జంపాల చౌదరి ముఖ్యులు. వీరి ప్రయత్నాల వల్ల 2001 జులైలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) తరపున 'ఆంధ్రభారతి'కి ఆర్థిక సాయం మంజూరైంది. నిఘంటువుకు సంబంధించిన టైపింగ్ పనులు వేగిరమవటానికి ఇది ఎంతగానో సాయపడింది.

ఉపవిభాగాలున్నాయి. వీటిలో అపురూపమైన సాహిత్యం లభ్యమవుతోంది. 'భాష' ఉపవిభాగంలో చిన్నయసూరి వ్యాకరణం మొదలు అనేక ఛందోగ్రంథాల దాకా లభిస్తున్నాయి. 'చరిత్ర'లో మల్లంపల్లి సోమశేఖర శర్మ చారిత్రాత్మక వ్యాసాలు ఉన్నాయి. 'ఇతిహాసములు'లో భారత, భాగవత పర్వాలు, స్కంధాలు దొరుకుతున్నాయి. 'కావ్యములు'లో మనుచరిత్ర లాంటి ప్రబంధకావ్యాలు మొదలు విశ్వనాథ, పుట్టపర్తి వంటి వారి ఆధునిక కావ్యాల దాకా చదువుకోవచ్చు. 'శతకములు'లో వేమన, బద్దెన, పోతన, నారాయణ శతకం ఆదిగా 29 శతకాలు సంపూర్ణంగా ఉన్నాయి. 'కవితలు'లో కిన్నెరసాని పాటల నుంచి ఎంకిపాటల దాకా ఎన్నో కవితా కుసుమ గుచ్ఛాలు విరబూసి ఉన్నాయి. ఇవిగాక కీర్తనలు, బాలసాహిత్యం, వచనసాహిత్యం, నాటకములు, లలితకళలు... తదితర ఉపవిభాగాల్లో ఇంకెన్నో రచనలు లభిస్తున్నాయి.

శ్రమ పంచుకునేవారు కావాలి...

'ఆంధ్రభారతి'కి కార్యాలయమంటూ లేదు. టైపు చేసే వారు, ప్రూఫులు దిద్దేవారు... వీరంతా తమ తమ నివాసాల నుంచే పని చేస్తారు. టైపు చేసేవారిలో హైదరాబాదు వారే కాదు, విజయవాడ, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల వారు కూడా ఉన్నారు. ప్రస్తుతం ఏడెనిమిది మంది ఈ పని చేస్తున్నారు. దిద్దుబాటు పని ఇద్దరు తెలుగు పండితులు చూస్తున్నారు. దిద్దేవారు తగినంతమంది లేకపోవడం వల్ల పని ఆలస్యమవుతోందంటున్నారు శాయి. "అదీగాక, మాకు ప్రూఫులు దిద్దేవారు పండితులే గాని, సాంకేతిక అవగాహన లేనివారు. వారు పేపరు మీద దిద్దుతారు. దాని ఆధారంగా మళ్లీ ఎవరో ఒకరు కంప్యూటర్ మీద సరి చేయాలి. దీని వల్ల పని జాప్యం అవుతోంది. ఎవరన్నా అవగాహన అభిరుచి ఉన్నవారు ముందుకొస్తే సహాయకారి అవుతుంది. ఒక్క దిద్దుబాట్ల కోసమే కాదు. ఈ పని మీద ప్రేమ ఉండి, మాలాంటి శ్రద్ధ ఉన్నవారు మరో ఇద్దరు దొరికితే చాలు, ఎంతో పని చేయగలం." అంటున్నారు.

వెబ్‌సైటు: www.andhrabharati.com

వాడుక ఇలా

- ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ ఈ వెబ్‌సైటును వాడటానికి అనుకూలమైన బ్రౌజర్.
- వెబ్‌సైటులో ప్రవేశించగానే 'నిఘంటుశోధన' అనే విభాగంలోకి వెళ్లాలి.
- ఇంగ్లిషు, తెలుగుల్లో ఏ భాషలోనైనా టైపు చేసుకునే సదుపాయం ఉంది. పదం టైపు చేస్తుండగానే టైపు అంత వరకూ గల అక్షరాలతో మొదలయ్యే పదాలన్నింటినీ చూపిస్తుంది. మనకు కావలసిన పదం ఉందో లేదో ఇక్కడే తెలిసిపోతుంది.
- ఒక వేళ మనకు పదంలోని కొంతభాగంతో మొదలయ్యే, లేదా చివరలో ఉండే పదాల జాబితా, వాటి అర్థాలు ఒకేసారి చూడాలంటే 'పదాంశం', 'మొదట్లో-చివర్లో' విభాగాలు వాడుకోవచ్చు. ఉదా: 'అర్థ', 'అర్థ'లతో మొదలయ్యే పదాలు. 'కత్తె'తో అంతమయ్యే పదాలు మొదలైనవి.

Miyapur is my life.

FIRST SMR HOLDINGS
INNOVATIONS FOR BETTER LIVING
HYDERABAD | BENGALURU | NJ, USA

AMENITIES @ FOUNTAINHEAD
• Temple • Bus Bay • Sky-pool • Sky Gym • Cricket Ground • Indoor Shuttle Court • Basketball Court • Tennis Court • Jogging Track • Clubhouse with all facilities • Ample Parking Space (7 lakh sft, 3 level Parking for 2000 cars)

EXCELLENT ACCESSIBILITY @ FOUNTAINHEAD
• Metro Terminus - Corridor ONE - 0.5 km • Hafeezpet MMTS Station - 0.5 km • JNTU University - 1 km • Entertainment & Fine dining - 2 km • Multi speciality Hospitals (Remedy, Image, Prime) • International Schools (DAV, OAKRIDGE, SENTIA) • IT hub - 5 km • Hitech City - 5 km • Financial District - 7 km • ORR - 12 km • International Airport - 28 km • Proposed Asia's Biggest Bus Terminus - 1 km

3BHK HOMES IN NINE ACRE GATED COMMUNITY WITH WORLD-CLASS AMENITIES - 4 TOWERS 969 APARTMENTS

KKR's SMR VINAY
FOUNTAINHEAD
HYDERNAGAR, OFF JNTU

HANDING OVER STARTED

CREDAI

www.smrholdings.in

Ph: 9676 00 77 00, 6460 0066

verb

అంతా తెలుగుమయం అయితేనే జయం

వసంతం కోసం వనాలు కొత్తపూతలు సింగారించుకుంటాయి. సంక్రాంతి కోసం గుమ్మాలు తోరణాలు తగిలించుకుంటాయి. బిడ్డల రాకకి పక్షులు గూళ్లు అల్లుకుంటాయి. ఏ సందర్భమైనా సార్థకం కావాలంటే కాస్త సంసిద్ధతా, సన్నాహమూ అవసరమని ప్రకృతి మనకు నేర్పుతుంది. మీ దేశాన్ని పాలించుకునే సంసిద్ధత మీకు లేదంటూ ఆంగ్లేయులు తీసిపడేసేవారు మనల్ని. ఇప్పటికీ చాలా విషయాల్లో నిజమే అనిపించే మాట అది. భాష విషయమే తీసుకుంటే, తెలుగును కాపాడుకునే సంసిద్ధత మనకు ఉందా? ఉంటే ఏం చేస్తున్నాం? ఇంకా ఏం చేయాలి? ప్రాచీన భాష హోదా లభించిన తరువాత జరుగనున్న తొలి తెలుగు మహాసభల నేపథ్యంలో ఈ ప్రశ్నలకు సమాధానాల్ని సమీక్షించుకోవాలి

ఎర్రాప్రగడ రామకృష్ణ

ఈసారి ఒలింపిక్ క్రీడల ప్రారంభవేడుకల ధోరణి చాలామందిని విస్మయపరిచింది. బ్రిటన్‌వారు సరికొత్త పంథా ఎన్నుకున్నారు. సమస్త ప్రపంచదృష్టినీ ఆకర్షించే క్రీడల ప్రారంభ వేడుకలను చాలా తెలివిగా తమ ఔద్ధత్య ప్రదర్శనకు అనువుగా మలిచారు. వినోదాన్ని తగ్గించి, సందేశానికి ప్రాధాన్యం పెంచారు. పూర్వమేధావులు, దార్శనికులు కవులు తమ జాతి ప్రగతి గురించి కన్న కలలు, ఆలపించిన వైతాళిక గీతాలను తొలుత ప్రదర్శించారు. చివరకు వారి ఆశలు నెరవేరినట్లు, అంచనాలు ఫలించినట్లు చిత్రీకరించారు. ప్రాచీన బ్రిటిష్ పచ్చని గ్రామీణ వాతావరణం, పటిష్టమైన వాటి మూలాల నుంచి క్రమంగా యంత్రయుగ ఆవిర్భావం, పారిశ్రామికీకరణ, పొగచిమ్మీలు, పెద్దపెద్ద యంత్రాల చక్రాలతో ఆధునికత చొరబడింది. ఆ తర్వాత వేగంగా సాధించిన సాంకేతిక ప్రగతి, ప్రజల పురోగతి విలాసవంతమైన జనజీవన సరళితో పూర్తిగా మారిపోయిన బ్రిటిష్ జాతి ముఖచిత్రం దర్శనం ఇచ్చింది. ఇదంతా సరే, బ్రిటిష్ జాతి సాధించిన సమస్త ప్రగతి - వీధి గడపపై దీపం అన్నట్లు, తక్కిన ప్రపంచానికి తాము దారిచూపించినట్లు అంతర్లీనంగా ప్రదర్శించడంలో ఉంది అసలైన ఎత్తుగడ! ఈ సందేశం ఆ జాతి ఆభిజాత్యానికి దర్పణం. అలనాటి దార్శనికుల తపన, తపస్సుల మూలాల్లోంచి - తాము సాధించిన ఔజ్వల్యాన్ని సాధించామని - ఈ విశ్వానికి నాగరికత నేర్పామని, వెనుకబడిన ఎన్నోదేశాలను జాతులను తమ పాలన ముందుకు నడిపిందని, విద్యవైద్యాదిరంగాల్లో అభివృద్ధికి తామే ఆద్యులమని, ప్రపంచాన్ని తమ జాతే ఆదుకుందని, సమస్త భూమండలాన్ని పాలించగల, శాసించగల ఆధిక్యత తమకు సంక్రమించిందని... ఈ ప్రదర్శనలో చెప్పుకున్నారు. ప్రపంచానికి తామే పెద్దదిక్కు అన్నది అంతర్లీనంగా సాగిన సందేశం. ఎంతో కీలకమైన సందేశం లోలోపల ఇమిడిపోయేలా అద్భుతమైన చిత్రీకరణను రూపొందించడం చిన్నవిషయం కాదు. తమ జాతిపట్ల రక్తంలో ప్రగాఢమైన గర్వం, గౌరవం నిండి ఉంటే తప్ప ఇలాంటి ఊహలు రావు. ప్రపంచమంతా కళ్ల విప్పార్చి పరికించే సందర్భాన్ని ఇలా తమ ఆధిపత్య, అతిశయ, రాజస, జాతి లక్షణాల మోహరింపునకు ఒడుపుగా వినియోగించుకోవడం వెనుక తమ జాతిపట్ల వారి తిరుగులేని నిబద్ధత కారణం. ఎన్నో ఏళ్లు మనల్ని పాలించిన ఆ జాతి ఆభిజాత్యం, ఆత్మగౌరవం మన జాతికీ ఒంటబడితే ఎంత బాగుండేది!

జాతివేడుకలు... ప్రపంచ తెలుగు సభలు

ప్రాచీనభాషగా గుర్తింపుపొందాక, ప్రభుత్వ పక్షాన తెలుగుభాషకు జరుగుతున్న తొలి సంబరాలివి. ఈ నేపథ్యంలో కొన్ని మౌలిక ప్రశ్నలు తలెత్తడం సహజం! అవసరం కూడా!

ఏ భాష విషయంలోనైనా ఇలాంటి వేడుకలు జరపవలసిన అవసరం ఏమిటి? ముందుగా నిర్ణయించుకోవలసిన ప్రాధాన్యాలెటువంటివి? సభలకు ప్రజలు, నేతలు, ప్రభుత్వం ఏ రకంగా సమాయత్తమవ్వాలి? సభలలో చర్చించవలసిన విషయాలేమిటి? సభల నిర్వహణ వల్ల భాషకు తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికపై జరిగే మేళ్లు ఏమిటి? ఇత్యాది అంశాలపై చర్చ అవసరం.

ఒక జాతి నాగరికతను, ఘనతను నిర్ణయించేది జనాభాలెక్కలు కావు. ఆ జాతిలో విలసిల్లిన సాహిత్యం, సంగీతం, నృత్యం వంటి సృజనాత్మక కళలు. వాటికి వన్నెతెచ్చిన విద్వాంసుల మూలంగా ఆ జాతి గొప్పదనం, నాగరికత గుర్తింపు పొందుతాయి. ప్రజల అభిరుచులు, ఆచారవ్యవహారాలు, అన్నపానీయాలు, వస్త్రాభరణాలు, సాహిత్య విజ్ఞాన విశేషాలు, భాషలు, ముఖ్యంగా జీవితంపట్ల ప్రజల దృక్పథం... ఇలా ప్రజల మనుగడలోంచి తొంగిచూసే అనేకాంశాలు ఆ జాతి సంస్కృతిని నిర్ధరిస్తాయి. అడపాదడపా సంస్కృతిని, నాగరికతను

మోకాళ్ళ మరియు వెన్నుముక నొప్పులనుండి విముక్తి

శస్త్రచికిత్స లేకుండా సరికొత్త సాంకేతిక పద్ధతిలో చికిత్స

కీళ్ళల్లో ఎముకల మధ్య కుషన్‌గా పనిచేసే కార్టిలేజ్ (కణజాలం) దెబ్బతినడం వల్ల చాలామంది మోకాళ్ళు, వెన్నెముక నొప్పులతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితి వృద్ధాప్యంలో లేదా గాయాల వల్ల ఎదురవుతోంది. స్థిరంగా కూర్చొని పనిచేసే జీవనశైలి, ఊబకాయం, మొదలగు కారణాలవల్ల చాలామంది ఆస్టియోఆర్థరైటిస్‌కి గురిఅవుతున్నారు. సాధారణంగా శస్త్రచికిత్స ద్వారా మరియు బలమైన స్టెరాయిడ్స్, యాంటి-ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ (పెయిన్ కిల్లర్స్) సూచించేవారు. దీని వల్ల తాత్కాలికంగా ఉపశమనం కలిగినప్పటికీ, దుష్ప్రభావాలకి గురిఅవుతున్నారు. మోకాలుచిప్ప పూర్తిగా మార్చుచేయడం ఒక పద్ధతి అయినప్పటికీ, ఇది అత్యంత బాధాకరం, ఇబ్బందికరం మరియు ఖర్చుతో కూడుకొన్నది. అంతేకాక సర్జరీ అయిన తరువాత నయంకావడానికి దీర్ఘకాలం పడుతుంది.

దీనికి ప్రత్యామ్నాయంగా అరిగిపోయిన కార్టిలేజ్‌ని (కణజాలాన్ని) సరిచేసి, పునరుత్పత్తి చేయడమే **సేఫ్ హెల్త్ నీ జాయింట్ సెంటర్** వారి ప్రత్యేకత. ఈ సెంటర్‌లో మోకాళ్ళకు & వెన్నెముకకు సరికొత్త సాంకేతిక పరికరం సైటోట్రాన్ ద్వారా శస్త్రచికిత్స లేకుండా చికిత్స అందిస్తున్నారు.

సైటోట్రాన్‌తో సరికొత్త చికిత్స– బాధలేకుండా హామీ ఇచ్చే కంప్యూటర్ స్వీయనియంత్రణ పరికరం. సైటోట్రాన్ నుండి మాగ్నటిక్ మరియు ఎలక్ట్రానిక్ రేస్ (అయస్కాంత మరియు విద్యుత్ కిరణాలు) అరిగిన కీళ్ళపై ప్రసరింపజేయడం ద్వారా పునరుత్పత్తి జరిగి క్షీణించిన కణజాల పునరుద్ధరణ మరియు పెరుగుదల ద్వారా నిరంతర నొప్పిని తొలగించి కీళ్ళను మెరుగుపరిచి చలనశక్తి పెంపొందిస్తుంది. ఇది ఇంటర్నేషనల్ కమీషన్ ఆన్ నాన్-అయోనైజింగ్ రేడియేషన్ ప్రొటెక్షన్ (ఐ.సి.యన్.ఐ.ఆర్.పి.) చే ధృవీకరించబడినది.

అత్యధిక వృద్ధి రేటుతో గడచిన 5 సంవత్సరాలలో ఈ ప్రక్రియ ద్వారా ఎంతో మంది డాక్టర్లు, మరియు ప్రముఖ వ్యక్తులతో సహా 600 మందికి పైగా విజయవంతంగా చికిత్సనందించారు.

సేఫ్ హెల్త్ నీ జాయింట్ సెంటర్‌లో సమర్థులైన డాక్టర్ల బృందం ఉంది. వారు ఫిజియోథెరపీ, పౌష్టికాహార మరియు మెడికల్ కౌన్సిలింగ్ ఇచ్చి సైటోట్రాన్ ద్వారా చికిత్స చేస్తారు.

ప్రయోజనాలు : ఈ సరికొత్త సాంకేతిక పద్ధతితో చేసిన చికిత్స పూర్తిగా ప్రమాదరహితమైనది. చికిత్స వలన ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు మరియు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరి చికిత్సచేసుకొవలసిన అవసరం ఉండదు. 21 రోజులు, రోజూ 1 గంట సమయంతో శస్త్రచికిత్సలేకుండా, అనస్థీషియా ఇవ్వకుండా మరియు నొప్పి లేకుండా చికిత్స అందిస్తారు.

కణజాల పునరుత్పత్తి (కార్టిలేజ్)

చికిత్సకాలంలో, చికిత్సచేసుకునేవారు తమ దైనందిన కార్యకలాపాలను యధావిధంగా చేసుకొనవచ్చును.

తదుపరి వివరాల కోసం సేఫ్ హెల్త్ నీ జాయింట్ సెంటర్, బంజారాహిల్స్, హైదరాబాదు. ఫోన్: **98480 19561, 99893 99896** లను సంప్రదించవచ్చును.

మెయిల్ : **appointment@safehealth.in or visit www.safehealth.in**

(వ్యాపార ప్రకటన)

మదింపు వేసుకుంటూ, కాలానికి అనుగుణంగా సవరింపులు చేసుకుంటూనే - జాతి ప్రత్యేకతను ప్రతిబింబించే తల్లి పేగు లాంటి మౌలిక జీవన సూత్రాన్ని భద్రంగా కాపాడుకుంటూ ముందుకు సాగుతూ ఉండాలి. అప్పుడే ఆ జాతికి గొప్ప మన్నన లభిస్తుంది. నిన్నటి పోరాటాలను గుర్తు చేసుకోవడానికి, నేటి పరిస్థితులను సమీక్షించుకోవడానికి, రేపటి అవసరాలను గుర్తించడానికి - ఈ మహాసభలు వేదికగా ఉపయోగపడాలి!

తమిళుల ముందడుగు

తమిళుల మాతృభాషాభిమానం మనకు తెలుసు. 1999లో భాజపా ప్రభుత్వం సంస్కృత భాషకు రాజసత్కారం తలపెడితే - మా తమిళం సంగతేమిటని ప్రజలు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. ప్రభుత్వం స్వయంగా బంద్ నిర్వహించింది. పరభాషా నాయికలు తమిళ చిత్రాలలో నటించాలంటే మా భాష నేర్చి, సంభాషణలు స్వయంగా పలికి తీరాల్సిందే అక్కడి ప్రజల పట్టుదల. తమ మాతృభాషపట్ల వారికింత ప్రచండమైన నిబద్ధత, దృఢవైఖరి ఉన్నాయి కాబట్టే - రాజకీయ పక్షాలూ ఆ దారినే నడుస్తున్నాయి. అంతెందుకు 1996 ఎన్నికల ముందు తిరుచ్చిలో జరిగిన డిఎంకె సదస్సు తమిళాన్ని కేంద్రం ప్రాచీనభాషగా గుర్తించి తీరాలని రాజకీయ తీర్మానం చేసింది. దాన్ని ఎన్నికల వాగ్దానాలలో చేర్చింది.

తమిళ మహాసభలు గత ఏడాది జూన్‌లో కోయంబత్తూర్‌లో వైభవంగా జరిగాయి. అప్పటి ముఖ్యమంత్రి డా॥ కరుణానిధి - మహాసభల భూమికను వివరిస్తూ ఇరవైరోజుల ముందుగా 'హిందూ' పత్రికలో విపులమైన వ్యాసం రాశారు. తానే స్వయంగా సమావేశాల ఇతివృత్తగీతాన్ని (థీమ్‌సాంగ్) రచించి, అంతటి పెద్దవయసులోనూ ఉత్సవ నిర్వహణకు తానే పూనుకున్నారు. దీంతో ప్రజలు ఎంత ఉత్తేజితులై ఉంటారో మనం ఊహించుకోవచ్చు. మన పొరుగునే ఉన్న తమిళ ప్రజల, రాజకీయ నేతల తపన, భాషపట్ల అంకితభావం, చిత్తశుద్ధి, దీక్షల నుంచి - మనం ఏమైనా నేర్చుకోగల్గితే ఎంత బాగుండును!

మన జాతి స్తబ్ధత!

స్వభావం చేతను, ఆత్మగౌరవం కారణంగానూ మనిషిలోంచి తొంగిచూసే హుందాతనానికి వాల్మీకి మహర్షి 'వృత్తశౌండీర్య గర్వం' అని అందమైన పదం సూచించారు. ఇతర భాషల్లోంచి చక్కని పదాలు తెచ్చుకుంటే భాషకు నాజూకుతనం పెరుగుతుంది. సంస్కృతం నుండి వృత్తశౌండీర్య గర్వాన్ని దిగుమతి చేసుకుంటే మాటకు విలువ, మనిషికి దర్జా పెరుగుతాయి. భాషను బలోపేతం చేసేటట్లుంటే అలాంటి ఎత్తిపోతలకు పాల్పడినా దోషం ఉండదు. అలాగే మన మాండలికాల సొగసు, జానపదాల స్వచ్ఛత, గ్రామీణుల నోట వినవచ్చే అచ్చ తెనుగు అందం వగైరాలను జాగ్రత్తగా కాపాడుకునే దిశగా ఈ మహాసభలు ఆలోచన చేయాలి. ప్రణాళికలు రూపొందించాలి. భాషను, తెలుగు సంస్కృతిని పరిపుష్టం చేయడానికి మనం పూనుకోవాలి. దీనికోసం స్వయం ప్రతిపత్తితో సర్వసమగ్రంగా వ్యవహరించే ప్రత్యేక అధ్యయన కేంద్రం కోసం తీర్మానించాలి.

ప్రత్యేక అధ్యయన కేంద్రం

తెలుగు భాషా సాహిత్యాల పరిశీలనకు, పర్యవేక్షణకు ఒక సమగ్ర అధ్యయన కేంద్రం చాలా అవసరం. ప్రాచీన భాషా సాహిత్యాలపై జరిగినంత కృషి, పరిశోధన - ఆధునిక ప్రక్రియల పట్ల ఉండటంలేదు. మన రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలతో పాటు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు సైతం - ప్రాచీన సాహిత్యంపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల - అప్పట్లో పరిశోధనాదిరంగాల్లో చెప్పుకోదగ్గ కృషి జరిగింది. అయితే ఇటీవలి కాలంలో అవి తూతూమంత్రంగా ఉంటున్నాయి. సమగ్రత లేదు, నిబద్ధత లేదు, శాస్త్రీయత లేదు. అధ్యయనం తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో..ఎక్కడున్నా మనం? మన సాహిత్యం ఏ స్థితిలో ఉంది? ప్రపంచ సాహిత్యంలో తెలుగు స్థానం ఏమిటి? భారతీయ భాషల్లో తెలుగు పరిస్థితి ఏమిటి? స్థాయి ఏమిటి?.. వంటి ప్రశ్నలకు జవాబు చెప్పగల సమగ్ర అధ్యయన సంస్థ కావాలి. జీవించి ఉన్న కవుల, రచయితల సృజన వైఖరులతో పాటు, సజీవ భాషకు చెందిన సమస్త శాఖలు, మాండలికాలు, వర్తమాన వ్యవహార శైలి, ఆధునిక భావజాలం వంటివన్నీ చక్కగా మదింపు చేసేలా, అంతర్వీక్షణ జరిగేలా చూసే ఒకానొక కేంద్రీయ వ్యవస్థకు రూపకల్పన జరగాలి. ప్రాచీన భాషగా హోదా ఒకటే చాలదు, భవిష్యత్తులో దాని దర్జాను నిలబెట్టుకునేందుకు తగిన కృషి జరగాలి. మన సాహిత్యం ఎల్లలుదాటి ఖండాతర వ్యాప్తి చెందేందుకు తగిన అనువాద పరిశోధనా వనరులు కూడా ఆ సంస్థకు చేకూర్చాలి. ఈ కోణంలో తెలుగు మహాసభలు ఆలోచన చేయాలి.

కార్యాచరణ ప్రణాళిక

తెలుగు భాష దుస్థితికి కారణం - ప్రజలా, రాజకీయ నేతలా, ప్రభుత్వాలా.. అని ఆలోచిస్తే.. 'అరయంగా కర్ణుడీల్గె ఆర్గురిచేతన్' అనే పద్యం గుర్తొస్తుంది. కర్ణుడి మాదిరిగా మన తెలుగు తల్లీ శాపగ్రస్తురాలే అనిపిస్తుంది. పాలకోసం వీధిమొగలో రాజుగారు పెట్టించిన గుండెగ కథ, బుట్టలో పీతల కథ వగైరాలన్నీ మన గురించేనన్న ఆలోచన తోచి సిగ్గేస్తుంది. ఈ దుస్థితి నుంచి మనం ఇప్పటికైనా తేరుకోవాలి. ఇకనైనా మనందరం తెలుగు భాషాభివృద్ధికై ప్రతిజ్ఞ స్వీకరించాలి. దాని బాగుకై మనమంతా కృషిచేస్తామని శపథం చెయ్యాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. పొరుగువారి నుంచి ఈ విషయంలో స్ఫూర్తి పొందాలి. మౌలికమైన మార్పులతో మన ఆలోచనలకు పదును పెట్టాలి. ఔను! మన ఆలోచనల్లో మార్పు వచ్చి తీరాలి. పుష్కరాలలో, యుద్ధ సమయాలలో, క్రీడోత్సవాలలో ఎటువంటి భావ సమైక్యత మనలో తలెత్తుతుందో - అటువంటి భావన ఇప్పుడు చాలా అవసరం. పూర్వీకుల నుంచి వారసత్వంగా పొందిన గొప్ప సంపదగా మాతృభాషను మనం గుర్తించాలి. భాష, సాహిత్య చరిత్ర, శాస్త్ర విజ్ఞాన జానపద కళాసంస్కృతి సంప్రదాయాల సేకరణ, పరిరక్షణ, వాటిపై అధ్యయనం, పరిశోధన, ప్రచురణ వంటి అంశాలన్నింటినీ శ్రద్ధగా చేపట్టాలి. తరువాయి తరానికి ఈ అపురూపమైన సంపదను పదిలంగా అందజేయాలి. లేకపోతే రాబోయే తరాలవారు మనల్ని క్షమించరు.



సాహితీవేత్త, ఎస్.బి.ఐ ఉద్యోగి, రాజమండ్రి.
93979 07344

తరతరాలుగా నిలిచిపోయే
పటిష్ఠమైన గృహాలను నిర్మించడానికి
మీ భవన నిర్మాణ దారుని
"వైజాగ్ టి.ఎమ్.టి." రి బార్స్‌ను
ఉపయోగించమని
పట్టుబట్టండి.
అవి మీ కట్టడాలను
పటిష్ఠంగా, ఉత్కృష్ఠంగా, వేగంగా
నిర్మించడానికి సహాయ పడతాయి...
"వైజాగ్ టి.ఎమ్.టి" రి బార్స్
✦ అతి శ్రేష్ఠమైన ముడి పదార్థాలతో తయారు చేయబడతాయి.
✦ విశ్వవిఖ్యాత పరికరాలు, పద్ధతులు వినియోగించబడతాయి.
✦ ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానముతో నాణ్యమైన, శుద్ధ పరిపూర్ణమైన ఉక్కును తయారుచేసే ఆధునికమైన రోలింగ్ మిల్స్‌లో ఇవి మలచబడతాయి.
✦ దేశంలో మరెక్కడా లేనటువంటి 120 మీటర్ల పొడవుగల కూలింగ్ బెడ్ (చల్లార్చు శయ్య) కలదు.
✦ ఐ.ఎస్.ఓ. 9001, ఐ.ఎస్.ఓ. 14001 మరియు ఓ.హెచ్.ఎస్.ఏ.ఎస్. 18001 ప్రమాణ పత్రం గలవి.
VIZAG TMT
100% Virgin Steel
www.vizagsteel.com
आर.आइ.एन.एल RINL
VIZAG STEEL
Pride of Steel
A Navratna Company
For Safe Living Use our High Strength
✓ "VIZAG TMT" RE-BARS,
✓ "VIZAG UKKU" STRUCTURALS
సురక్షితమైన జీవనమునకై అధిక శక్తి గల
✓ "వైజాగ్" టి.ఎమ్.టి" రి బార్స్
✓ "వైజాగ్ ఉక్కు" స్ట్రక్చరల్స్‌నే వాడండి
For details, please contact : GM (Mktg), RS, e-mail: ysudhakar@vizagsteel.com;
GM (Mktg), PS, e-mail: girao@vizagsteel.com
Rashtriya Ispat Nigam Ltd., Visakhapatnam Steel Plant, Fax: 0891-2518025

అమృతముకన్న మిన్న

హెచ్.వి.ఎల్.ప్రసాదుబాబు

అమ్మపాల రుచుల కమ్మదనము గల్పి
ఆత్మనింపిన భాష ఆంధ్రభాష
వీనుల విందుగా వినిపించు లాలితో
అమ్మ చెప్పిన భాష ఆంధ్రభాష
ఊయల తొట్టెలో "ఊ"కొట్టు నాతోడ
అమ్మ పల్కిన భాష ఆంధ్రభాష
'అత్త' 'తాత' యనుచు ఆదిగురువగుచు
అమ్మ నేర్పిన భాష ఆంధ్రభాష

నడక నేర్వని పూర్వమే నన్ను పిలిచి
ఎత్తి ముద్దాడి గుండెకు హత్తుకొనుచు
అత్త పెట్టిన 'ముద్దరా' ఆంధ్రభాష
అమృతమున కన్న మిన్న నా ఆంధ్రభాష ...1

బంగారు తల్లికి సింగార మొప్పార
హరిత శోభను గూర్చు హాలికుండు
అందాల జననికి ఆభరణంబగు
కాంతార సీమల కష్టజీవి
అమృత స్వరూపిణి కాత్మయై అలరారి
నట్టింట నడయాడు నవవధూటి
కరుణాతరంగిణీ వరలీలలను జాటు
కావ్యరాజములల్లు కవివరుండు

తలపులను పంచి పుడమిని వలపు పెంచు
పాటయై వెల్గి ప్రగతికి బాట జూపి
అమల విఖ్యాతి నార్జించి అవనియందు
వెలుగు లీనిన భాష నా తెలుగుభాష ... 2

మనము నా కర్షించు మల్లెల గంధాలు
వెల్లి విరియజేయు పల్లెపలుకు
రాతిపలకపైన రాగిరేకులలోన
అద్భుతాకృతి నిల్చు అక్షరములు
తాటియాకుల మీద తామరతంపరై
తలపుల వెలయించు కలము బలము
తందాన పాటతో తప్పెట గుళ్ళతో
చిందులు వేయించు చిత్రజతులు

కూడి ఒకచోట నిలువగా కూర్మిమీర
నలువ తీరిచిదిద్దిన విలువతోడ
నాదవేదమై భాసిల్లి ఆదరమున
వెలుగుజిలుగులు నింపె నా తెలుగుభాష ...3

ఆంధ్రభూముల లోన అవతరించినయట్టి
భారత గ్రంథమై పరగుభాష
తెలగాణ మాగాణి ఫలముగా వినుతించు
భాగవతమ్మున వరలుభాష
రాయలసీమలో రతనాల పంటయౌ
రామాయణమున చెలంగుభాష
పలుమాండలికముల ప్రశ్లేషణమ్ముతో
మహితమై చెన్నొందు మధురభాష

గుండె లోతుల కదలాడి కూర్మిపెంచి
ఐకమత్యమే బలమని అవనిజాటి
ప్రాంత భేదాలు మరచిన ప్రజలభాష
వెలుగుజిలుగులు విరజిమ్ము తెలుగుభాష ...4

ఉద్యోతనుని నోట ఊసులాడినభాష
హాలుని గాథలో నలరుభాష
కృష్ణవేణీతటి కీర్తి పెంచినభాష
'నాగబు' శబ్దమై నడచు భాష
తెలివాహతీరాన పలుకాడు వరభాష
పంచమ వేదమై పరగుభాష
పెన్నానదీ సాధు పేయమౌ మృదుభాష
ధర్మార్థ సారమై తనరుభాష

అక్షరాకృతి గాంచిన అందమొల్కి
శబ్దమాధురి వీనుల శ్రావ్యమవగ
కనిన వినిన వారికి ప్రీతి కరము గూర్చి
తేజరిల్లిన భాష నా తెలుగుభాష ... 5



ఉపాధ్యాయుడు, ఎర్రుపాలెం,
ఖమ్మం
94400 83119

సభ్యులకు, ఏజెంట్లకు మరియు శ్రేయోభిలాషులకు

విజయదశమి

శుభాకాంక్షలు

KAPIL GROUP

visit us:
www.kapilchits.com

31 years
Trusted Service

కపిల్ చిట్ ఫండ్స్ (ప్రై) లిమిటెడ్

కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

sricharana2008@gmail.com



పులిపాక కృష్ణాజి

పత్రికలకు వార్తలు, వాణిజ్య ప్రకటనలు రెండు కళ్లలాంటివయినా వాడుకభాష వార్తల్లో మాత్రమే చకచకా విశ్వరూపం ప్రదర్శించింది. వాణిజ్య ప్రకటనల్లో మార్పు పెళ్లి నడకగా సాగింది. గ్రాంధిక భాషే రాజ్యమేలింది.

ఆ మాటకొస్తే పాతకాలపు వాణిజ్య ప్రకటనల్లో ఒక్కొక్కపుడు పద్యాలు కూడా ఉండేవంటే ఆశ్చర్యం వేస్తుంది. అలనాటి ఆంధ్ర పత్రిక, కృష్ణాపత్రిక సంచికలను తిరగేస్తే ఇటువంటివి కనిపిస్తాయి. నిజానికి ప్రకటనల ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. వాటికి ప్రత్యేక పాఠకులు కూడా ఉంటారు. ఒక ప్రకటన పెళ్ళి చేయిస్తుంది. ఇంకో ప్రకటన ఉద్యోగమిప్పిస్తుంది. ఒక ప్రకటన ఆనందం ఇస్తుంది. ఇంకో ప్రకటన విచారాన్ని ఇస్తుంది. ప్రకటన రచయితలంటే ఆషామాషీ కాదు. క్లుప్తత, పాఠకులను ఆకర్షించే పద్ధతి, చమత్కృతి, భావప్రకటనా నైపుణ్యం వంటివెన్నో వీరికి అవసరం. ప్రపంచీకరణ నేపథ్యంలో బహుళజాతి సంస్థలు దేశంలో ప్రవేశించాయి. ఆధిపత్యం సాధించాయి. ఈ సంస్థలు తమ తమ ఉత్పత్తుల ప్రచారానికి ఎక్కువగా ఆంగ్లానికే ప్రాధాన్యమిచ్చాయి. లేదా అనువాదం చేసిన ప్రకటనల్లో 90 శాతం ఆంగ్లపదాల వినియోగం ఉందా అనిపించేటట్లు చేశాయి.

ప్రకటనల్ని అనువాదం చేసే రచయితలకు ఆయా భాషల్లో మంచి పట్టుండాలి. భాష వినిమయంలోనే కాదు, భావ ప్రకటనలోనూ పట్టు, సూటిదనం ఉండాలి. 'నువ్వు రాస్తున్నది ఏదయినా అది నీలోనుంచి రావాలి. అది నీదై ఉండాలి.' అంటాడు అమృతం కురిసిన రాత్రి కవి తిలక్. భావవ్యక్తీకరణలో స్పష్టత లేనప్పుడు, చెప్పే భావంతో పాటు చేరవలసిన వస్తువు అసలే చేరదు. ఇది మౌలికంగా దెబ్బతీసే చర్య. గజిబిజి, గందరగోళానికి ఆస్కారం లేకుండా ప్రకటన ఉండాలి. మక్కికి మక్కి అనువాదాలు చేసే ప్రకటనలు గందరగోళాన్ని ఏర్పరుస్తాయి.

ఉదాహరణకి: 'మీ పెట్టుబడిపై వడ్డీ రాబడి సాలుకు 18 శాతం' అని చెప్పాల్సి ఉంటే 'ప్రతి ఏడాది 18 శాతం (18 శాతం పి.ఏ)' అని అంటే స్పష్టత కొరవడుతుంది.

మీ వ్యాపార ప్రకటనలకు చక్కని వేదిక తెలుగు వెలుగు మాసపత్రిక



ప్రకటనల కోసం

+91 80081 51599

+91 90001 80608

ప్రకటనల ధరలు

[illegible]	ధర రూ.లలో
[illegible]	70,000
[illegible]	35,000
[illegible]	87,500
రెండు పేజీలు కలిపి	1,30,000
రెండు మధ్య పేజీలు	1,40,000
మొదటిపేజీ లోపలివైపు	87,500
వెనుకపేజీ లోపలివైపు	87,500
వెనుక పేజీ	1,40,000

సాంకేతిక వివరాలు

కాలమ్ ఎత్తు	22.8 సెం.మీ
కాలమ్ వెడల్పు	5.4 సెం.మీ
పేజీకి	3 కాలమ్స్
ఒక పేజీ కొలతలు	19.5(వె) X 26(ఎ)సెం.మీ.
ముద్రణ విస్తీర్ణం	17(వె) X 22.8(ఎ)సెం.మీ.
సగం పేజీ కొలత (అడ్డం)	17(వె) X 11.2(ఎ)సెం.మీ.
సగం పేజీ (నిలువు)	8.3(వె) X 22.8(ఎ)సెం.మీ.

గమనిక: ప్రకటనలన్నీ రంగుల్లోనే ఉంటాయి.

వందేళ్ల కిందట వచ్చిన వీరేశలింగం గారి సత్య [illegible] సంచికలో ఓ గాజుల ప్రకటన ఇలా ఉంది.

'Garowa chooories' చిత్రమైన గాజులు. ఈ కంకణములు జర్మనీలో తయారుచేయబడినవి. వీనియందు వజ్రములు, కెంపులు, పచ్చలు, ముత్యము మున్నగు రాళ్ళవలె ప్రకాశించు కరపక రాళ్ళు చెక్కబడియున్నవి. ప్రతి కడియమునకు కొక్కెమమర్చబడియున్నది. సులభముగా చేతనుంచు కొనవచ్చును. ఈ కడియమును అందరు స్త్రీలు ధరించుకొనవచ్చును. ఈ కంకణములు, అమర్చబడిన పెట్టె మూత తీయుచున్నప్పుడు కంకణముల కాంతి వల్ల కండ్లు మిరుమిట్లు గ్రమ్మును - అని చెప్పడంలో గ్రాంధికంలోనైనా చమత్కారం పాలులేకపోలేదు.

పులుగుర్త లక్ష్మీనరసమాంబ సంపాదకురాలిగా 'సావిత్రి' పత్రిక వచ్చింది. ఆ పత్రికలో ఓ గ్రంథ ప్రకటన:

కాశీమజిలీలు - ప్రథమభాగం 240 పుటలు; వెల ఒక రూపాయి.

ఈ గ్రంథమిదివరకు ఆంధ్రభాషలో లేదు. కాశీమజిలీలవంటి అత్యద్భుత చమత్కార కథాభూయిష్ఠమైన కథలు తెలుగువారిలో లేనేలేవు. అరేబియన్ నైట్సు కథలకంటె వేయిరెట్లు చమత్కారముగ నుండును. ఇది ప్రచురింపవలెనని మేమెన్నాళ్ళ నుండియు భగీరథ ప్రయత్నము చేయగా ఆంధ్రుల పూర్వపుణ్యమున నిది నేటికి సమకూడినది. ఈ కథలు చదివిన కడుపు చెక్కలగునట్లు నవ్వవచ్చును. ఇది ఇంగ్లీషు చేసి ఇంగ్లాండు దేశమున నచ్చు వేయుటకు యత్నించుచున్నాము - ప్రకటనలవల్ల చరిత్రాంశాలు కూడా తెలుస్తాయనడానికి ఈ ప్రకటనే ఉదాహరణ.

అలాగే - అయిదు సంవత్సరాల కాలవ్యవధిగల డిపాజిట్లపై వచ్చే రాబడి' అని చెప్పడానికి బదులు ప్రభావవంతమైన వార్షిక దిగుబడి అంటే ఎలా అర్థం చేసుకోవాలో తెలియదు. జనసామాన్యంలో వాడుకలో లేని మాటల్ని రాయించడం వల్ల, సందర్భాన్ని గమనించకుండా నిఘంటువుల అర్థాన్ని యధాతథంగా ఆశ్రయించడం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని వాణిజ్యప్రకటనలు రూపొందించి వాటి వల్ల కూడా తెలుగు మీద మమకారాన్ని పెంచాలి. ప్రకటనల్లో భావం, భాష ఎలా మారుతూ వచ్చాయో తెలుసుకోవడానికి పాతపత్రికల సంచికలు మనకు ఉపయోగపడతాయి.

'స్వర్ణాంధ్ర' పత్రిక సంపాదకుడు,
విజయవాడ
90520 19999

అక్షర జ్యోతులు సామెతలు

గతించిన తరాలు తర్వాతి తరాలకు అందించే అపురూప కానుకలు సామెతలు. కాచి వడబోసిన జీవన సారాన్ని, అనుభూతుల్ని, ఆలోచనల్ని రంగరించి అక్షర జ్యోతులుగా వెలుగునిచ్చి ముందుకు నడిపేవి సామెతలు. ఒక భాషకుండే జవజీవాలకు రుజువులు సామెతలు. తెలుగువారి సామెతల సంపద అనన్య సామాన్యం. ఈ సంపద వాడటం వల్ల తరిగేది. వాడుకతో వన్నెదేరటం సామెతల స్వభావం. వాటిలో కొన్ని ఆణిముత్యాల్ని మననం చేసుకుందాం.

బి. లలితానంద ప్రసాద్

సామెత సంభాషణకు శక్తినిస్తుంది. వాక్యాన్ని అర్థవంతం చేస్తుంది. పదును పెడుతుంది. సాహిత్యానికి అదనపు విలువనిస్తుంది. అందువల్లనే సామెత జన జీవనంలో జమిలిగా కలిసిపోయింది. అంతర్భాగమై మిగిలిపోయింది. సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. అల్పాక్షరాల్లో అనల్ప భావాల్ని సందేశాన్ని, కర్తవ్యాన్ని, ఉపదేశాన్నిస్తుంది సామెత.

ఇంత ప్రాధాన్యతగల సామెతలు వినడం, అర్థం చేసుకోవడం, తదనుగుణంగా నడుచుకోవడం జరిగితే జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చు. ఈ పని జరగాలంటే అవి చెప్పగలిగే వారుండాలి. వాటి అర్థం, అంతరార్థం చెప్పే వారికి తెలిసి ఉండాలి. అప్పుడే సందర్భోచితంగా ఉంటుంది. మానవ విలువలు మారక విలువలుగా, వ్యక్తి ప్రపంచం వస్తు ప్రపంచంగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో చెప్పేవారు, వినేవారు అంతకంతకూ 'నానాటికీ తీసికట్టు నాగంబొట్లు' అన్నట్లు తగ్గిపోతున్నారు.

మన దేశం ఆత్మ పల్లెపట్టులో ఉన్నట్లు సామెత ఇంకా గ్రామాల్లో, గ్రామీణ జీవనంలో సజీవంగా ఉంది. అక్కడి వారు దాని ఉనికికి ఊపిరి పోస్తూనే ఉన్నారు. చాలా సందర్భాల్లో యథాలాపంగా మాటల్లో కలిపి సామెతల్ని వాడేస్తుంటారు. సునిశితంగా పరిశీలిస్తే ఎన్నెన్నో అంశాలు వాటిలో గోచరిస్తాయి. సంప్రదాయాలు, విశ్వాసాలు, కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, పని విలువ, వయసు, పెద్దరికానికి గౌరవం, ముందు చూపు, సోమరితనంపై నిరసన వగైరా ఎన్నెన్నో అద్భుతంగా వాటిలో ఒదిగి ఇమిడిపోయాయి. ఒక విధంగా అవి స్పృశించని జీవన పార్శ్వం ఉండదు. అలా వెలువడ్డ ప్రతిదీ ఆణిముత్యమే. కొన్ని మచ్చుకి...

పని చేయకుండా ఫలితం ఆశించే వారిని కొంత కరకుగానే మందలిస్తూ -'పనికి దూడల్లో- తిండికి దున్నల్లో' అంటారు. ఇక్కడ మనిషికి, పశువుకి, పనికి మనిషికి తొలిరోజుల్లోనే పరస్పర సంబంధాన్ని తెల్పుతుంది. -'ఊడుపులపుడు ఊళ్ల మీద పోయి, కోతలపుడు కొడవలి పట్టుకొచ్చినట్లు'. తిండికి అధిక ప్రాధాన్యతనిచ్చే వారిని ఆక్షేపిస్తూ 'పందుం

ప్రయాణ సాధనాలంతగా పెరగని రోజుల్లో ఓ తండ్రి తనయునితో - 'కంటికి దూరమైతే కాలికీ దూరమవుతుందా!' అన్నాడట. అంటే ఎంత దూరమైనా నడచి వెళ్లవచ్చుననేది శ్లేష. ద్విచక్ర, చతుశ్చక్ర వాహనాలపై వెళ్లేవారు ఈ పని చేస్తే ఎంతో ఇంధన పొదుపు. అట్లాగే పనికి సంబంధించి - 'చూస్తూ ఉంటే అట్లాగే ఉంటుంది. చేస్తూ ఉంటే ఎంతైనా అయిపోతుంది'. పని వాయిదా వేసే వారికి ప్రబోధమిది. ఇట్లాంటిదే మరొకటి -'ఎక్కడ తిరిగినా ఏమీ రాదు. ఏకు వడికితేనే ఏగాణి వస్తుంది'. ఇపుడా కాణీలు లేకున్నా ఏకు వడకడం తగ్గినా సోమరితనం కూడదనేది సారాంశం.

తిన్నా పరగడుపే, ఏదుం తిన్నా ఏగడుపే'. అలాగే 'వాములు తినే వారికి పచ్చగడ్డి ఫలహారమా?

గ్రామం అనగానే అక్కడ ప్రధాన వృత్తి వ్యవసాయం. అందువల్లనే వ్యవసాయ పనులకు సంబంధించిన సామెతలు నిత్యం కొల్లలుగా విన్పిస్తుంటాయి. దైనందిన జీవితంలో వీటిలో సుపరిచితమైనవి కొన్ని ఆయా రుతువులు, పనుల పరస్పర, ప్రభావాన్ని తెలుపుతాయి. ఇందుకు-

'ఉత్తర జూసీ ఎత్తర గంప'

ఇష్టంలేని పని చేస్తే వచ్చే నష్టాన్ని చెప్పటానికి - 'ఏడుస్తూ నాగలి కడితే- కాడీ మోకులు దొంగలెత్తికెళ్లినట్లు; ఆర్థిక స్థితి తెలుపుతూ - 'రైతు పేదగాని నేలకాదు'. కదురు, కవ్వం ఆడిన ఇంట కొదువ ఉండదు. 'ఇది ఒకప్పటి విషయం అనిపించడం సహజం.

కొన్ని 'ప్రశ్న- సమాధానం' రూపాల్లో ఉంటాయి. 'తాటిచెట్టు ఎందుకు ఎక్కావంటే - దూడమేతకన్నట్లు'. అడిగిందొకటి - ప్రత్యుత్తరం మరొకటయినపుడూ, చేసే పని మంచిగా ఉండటమేగాక ఉన్నట్లు కనిపించడానికి -'తాటిచెట్టు కింద పాలుతాగినా, కల్లు తాగినట్లే'.

గ్రామీణ జీవనంలో తొలి నుంచీ స్త్రీలకు ప్రాధాన్యత ఉంటుందనేందుకు సాక్ష్యాలివే. తల్లి స్థానం గురించి, నమ్ముకున్న వ్యవసాయం లేక పనిని గురించి ఎంత బాగా చెప్తుందీ సామెత-

'తల్లిని నమ్మిన వాడు, ధరణిని నమ్మిన వాడు చెడడు.' అలాగే ఇంటిలో ఇల్లాలి స్థానం చెప్పేది... 'ఇంటినిజూసి ఇల్లాలిని చూడాలి'. కుటుంబంలో ఇల్లాలిని ఎంతో అపురూపంగా ఉంచాల్సిన బాధ్యత మిగతా వారిపై ఎంత ఉందో తెలుపుతుంది. లేనందున ఏమి జరుగుతుందో హెచ్చరిస్తుంది. 'ఎద్దు ఏడ్చిన వ్యవసాయం - ఆలి ఏడ్చిన సంసారం ముందుకు రావు'. ఆమె విచారానికి దుఃఖానికి కారణం, ఏమైనా, ఎవరైనా ఆ ప్రభావం ఇంటిలో ప్రతి వారిపై పడుతుందనే సూచన.

మనిషి జీవితంలో స్థల కాలాల్ని మనిషికీ అన్వయిస్తూ చెప్పేవి - నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది- దేనికైనా 'ఆక్షేపణ' కాదు

వయసుకీ, పెద్దరికానికీ గౌరవం, మన్నన గ్రామాల్లో ఉన్నంతగా మిగతాచోట్ల కన్పించదు. అది ఆయా మాటల్లో ప్రతిఫలిస్తుంది. 'పెద్ద వాళ్ల మాట సద్ది అన్నపు మూట'. ఇప్పుడు సద్ది తినేవారు తగ్గినా ముందుచూపుతో, ఎంతో అనుభవంతో చెప్పే పెద్దల మాట పాటించమని.

తగు జాగ్రత్త, ముందు చూపుల గురించి చెప్పేందుకు - 'అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు' అంటారు. ముందు తొందరపడి తర్వాత పశ్చాత్తాప పడొద్దని. 'అడుసు తొక్కనేల - కాలు కడుగనేల' 'చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు' లాంటివన్నీ ఉత్తమ జీవన విధానాన్ని నిర్దేశించుకోమని చెబుతాయి.

సుదీర్ఘ అనుభవం.... సునిశిత నైపుణ్యం....

గాల్ బ్లాడర్ స్టోన్స్ చికిత్సలకు తిరుగులేని ఎంపిక 'నాగార్జున'



లాపరోస్కోపి ప్రయోజనాలు :
తక్కువ నొప్పి, తక్కువ కుట్లు, తక్కువ రక్తం వృధా, తక్కువ కోత, తక్కువ మచ్చ, తక్కువ మానసిక ఒత్తిడి, త్వరగా కోలుకోవడం

send enquiry email to admin@nagarjunahospitals.com
Phone : 0866-2554727 (9 am to 6 pm)
SMS (GB+your Mobile No.) to 9346434666

NH
నాగార్జున హాస్పిటల్
కానూరు, విజయవాడ. ఫోన్స్ : 0866-2554701-705
విలువైన ప్రాణానికి ఎనలేని రక్షణ....

FOCUS ADS/VJA

'ఆత్మపరిశీలన' ముఖ్యమని దీని ద్వారా గ్రహించవచ్చు.

అనుకరణల్ని నిరసిస్తూ - పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు. సహనానికి పెద్ద పీట వేస్తూ- 'పడ్డవాడెవడూ చెడ్డవాడు కాదు' అంటుంటారు. వృత్తుల పరంగా కుల విభజన కారణంగా ఏర్పడిన సామెతలనేకం. ఆ విభజన అంతరిస్తున్న నేపథ్యంలో అవి తమ ఉనికిని కోల్పోవడం సహజం. అట్లాగే ప్రాంతాన్ని బట్టి వాడుకలో కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తదనంతరం రూపాంతరం చెందుతాయి. ఆదరణ లేక అంతరిస్తాయి.

మన వేమన, బద్దెన లాంటి శతక కారుల పద్యాల్లోని మాటలు, వాక్యాలు సామెతలుగా చలామణి కావడం తెలిసిందే. జీవన తత్వం, జీవిత సత్యాలు వాటిలో నిక్షిప్తమై సరళ భాషలో ఉండబట్టే అవి తెలుగు వారి జీవితంతో అంతగా మమేక మయ్యాయి.

కొన్ని సామెతలు పామర, పండిత భాషలు రెండింటిలోనూ కనిపిస్తాయి. "కోటి విద్యలూ కూటి కొరకే", "ఉదర నిమిత్తం బహుకృత వేషం". మొదటి దానిలోని స్వచ్ఛత, సరళత, సహజత రెండో దానిలో ఉండదు. దాని ఉనికి కూడా ఆ ప్రత్యేకతల ఉనికి ఉన్నంత వరకే. అలాగే నన్నయ్య విరచితమని చెప్పే 'గతము మేలు వచ్చు కాలం కంటెన్', సంస్కృత సంబంధిత 'గత జల సేతు బంధనం' లాంటి వాటి వినియోగం ఏ కొందరికో పరిమితం.





ఎక్కువగా పుస్తకాలు చదివేవారు తమకిష్టమైన పుస్తకాల్లోంచి వాక్యాల్ని అధికంగా వాడుకలోకి తెస్తారు. తద్వారా వాటికి కాలక్రమేణా ఎంతో ప్రాధాన్యత వస్తుంది. అవికూడా సామెతలు కాకున్నా అన్నట్లు చలామణి అవుతాయి. ఇందుకు ఆధునిక కాలంలో గురజాడ 'కన్యాశుల్కం'లో వాక్యాలు, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, నండూరి లాంటి వారి కవితా పంక్తులు, మ్యూజింగ్స్‌లో చలం మాటలు ప్రస్తావిస్తారు. అయితే ఇవి ముఖ్యంగా చదువరులకే పరిమితం. పంచతంత్ర కథలు, ఈసప్ కథలు, కథాసరిత్సాగరము లాంటివి సామెతల గనులు. ప్రాచీన, ఆంగ్ల సాహిత్యంలో పరిచయం, ప్రావీణ్యం ఉన్న వారు వాటిలోని సుప్రసిద్ధ వాక్యాలు సంభాషణల్లో దొర్లిస్తూ తమ ప్రత్యేకతల్ని చాటుకుంటుంటారు.

జానపద కళారూపాలు జన జీవనాన్ని వినోద భరితమేగాక విజ్ఞానవంతం కూడా చేస్తుంటాయి అనడానికి హరికథలు, బుర్రకథలు, పురాణ కాలక్షేపం, తోలుబొమ్మలాటల్లాంటివి. వాటిలో కథతో సరిపెట్టక ఎన్నెన్నో సామెతల్ని పిట్ట కథల రూపంలో హాస్యంలో రంగరించి చూసే వారికీ, వినే వారికీ పంచేవారు. వారిని జీవన సత్యాలకు దగ్గరగా తెచ్చేవారు. ఆ విధంగా వారు జ్ఞాన ప్రచారకులయ్యారు. సామాజిక పునాది పరిరక్షణలో వారి కృషి విస్మరింపరానిది.

తల్లిదండ్రుల్ని పిల్లలు వృద్ధజనాశ్రమాలకు తరలించే సంస్కృతి పెరుగుతోంది. తద్వారా అటు వృద్ధులు ఇటు వారి తాలూకు వారు ఎన్నెన్నో కోల్పోతున్నారు. వీటిలో ముఖ్యమైన, స్వచ్ఛమైన, సరళమైన, సహజమైన ఆదరణ, అవగాహనలతో పాటు 'సామెత'లాంటి మౌఖిక సంప్రదాయ విస్తరణల్లాంటివి కూడా. వీటిని దృష్టిలో ఉంచుకునే 'అడ్డాల నాడు బిడ్డలుగాని గడ్డాలనాడా' అన్నారు. నానాటికీ పెరుగుతున్న ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా సినిమా అధిక శాతానికి అత్యంత సన్నిహితమైంది. దీంతో సహజంగానే సినిమా సాహిత్యమూ విపరీతంగా ప్రభావితం చేస్తోంది. పర్యవసానంగా సామెతల స్థానంలో సినిమా సంభాషణలు, ఊత పదాలు విన్పిస్తుంటాయి.

వ్యక్తిగా/ సమష్టిగా ఉన్నత, ఉత్తమ అభిరుచులు కలిగి ఉండటం, పెంచుకోవడం అందుకు విరుద్ధమైన వాటిలా సాధ్య పడదు. కాబట్టే ఎక్కువ మందికి భిన్నంగా కొందరే ఉంటారు. ఉండగలరు. వారే మిగతావారికి 'కష్టేఫలి' అన్నట్లు మార్గదర్శకులు కాగలరు.

నానాటికీ పెరిగే వేగం, పోటీ, సంక్లిష్ట భరిత సమాజంలో 'పరుగెత్తి పాలు తాగాలనేవారేగానీ' నిలబడి నీరు తాగాలనుకునే' వారెవరుంటారు. అయితే, నీరు ప్రాణదాత. పాలు బలవర్థకం. ప్రాణం ఉంటేనే కదా! బలం మాట. అనూచానంగా వస్తున్న తేట నీటి సామెత వాడకం కొనసాగించినపుడు అందుకు ఏ కొంతైనా ఏదో రూపంలో ప్రయత్నించినప్పుడే మన సాంస్కృతిక మూలాలూ వాటితోపాటు మనమూ ఆ రూపంలో బతికి ఉన్నట్లు లెక్క. అంధ అనుకరణ, వెన్నెముక లేని ప్రాణం అస్వాభావికమని విస్మరించరాదు.



ఆచార్యులు, జి.వి.ఆర్, ఎస్.
ఇంజినీరింగ్, టెక్నాలజీ
కళాశాల, గుంటూరు.
92474 99715

చెల్లని ముఖం

ఏడాది మనుమరాలు
ఎటమటంగా అడుగులు వేస్తూ
వల్లరల్లరి చేస్తుంది

ఒక రోజు నిండు బకెట్లో చూస్తూ
వచ్చీరానీ మాటలతో
'నేనూ' అంటూ మొఖమంతా
నవ్వు ఉదయపు వెలుగుతో నింపి
ఒక చెయ్యితో నీళ్లను కొట్టింది
చెదిరిపోయిన నీడ కోసం
నివ్వెరపోతూ ఏడుస్తుంది

మరో రోజు
కింద పెట్టిన చిన్న అద్దాన్ని
రెండు చేతులా పట్టుకు
తనను తాను చూసుకుంటూ
ముచ్చట పడుతూ
ముసి రశ్మిలా లాస్యం చేస్తుండు

'అద్దం పగులుతుంది ఇటియ్యి'
మా అమ్మాయి గుంజుకుంది
కలెపడి తీసుకు
నాలుగేళ్ల మనమడు
కోపంగా విసిరి కొట్టిండు
అద్దం వెయ్యి వక్కలయింది
వాళ్లమ్మ ఏమనకముందే
కొట్టినట్టు ముందే ఏడుపు అందుకుండు

ఇప్పుడు స్వచ్ఛమైన నిలువెత్తు
అమాయక అద్దంలాంటి
మనవడు మనుమరాలు ముందు
లౌక్యంతో ముక్కచెక్కలైన
చెల్లని మా ముఖాల్ని
ఎంత దాచుకున్నా
ఎక్కడా దాగడం లేదు

– జూకంటి జగన్నాథం
సిరిసిల్ల, కరీంనగర్.
9441078095



తెలుగువీర లేవరా!

తెలుగుబాటసారి స.వెం.రమేష్

అతడనేక యుద్ధముల ఆరితేరిన యోధుడు. అటు తమిళనాడు ప్రభుత్వంతోను, ఇటు ఆంధ్ర ప్రభుత్వంతోనూ తెలుగు భాష కోసం పోరాడుతున్నవాడు. నిత్యం తెలుగు భాషనే శ్వాసిస్తున్నవాడు. 'ప్రళయకావేరి కథల'తో కథాసాగరంలో అలలు రేపినవాడు. తెలుగు మూలాల అన్వేషణలో నిరంతర బాటసారి... సన్నాడి వెంకట రమేష్, క్లుప్తంగా స.వెం. రమేష్.. తెలుగు భాష తనదని సగర్వంగా చెప్పుకున్నందుకు ఎన్ని కష్టాలు పడ్డాడో, రాజీపడకుండా ఎలా ఉద్యమిస్తున్నాడో స.వెం.రమేష్ మాటల్లోనే!

హోసూరు 1969 : అవడానికి అది తమిళనాడైనా మూడొంతులు తెలుగువారు నివసించే ప్రాంతం. అక్కడి బళ్లలో ప్రతిరోజూ 'మా తెలుగు తల్లి' ప్రార్థననీ చదవడం ఆనవాయితీ. ఏ భాష వారైనా సరే తమిళ ప్రార్థనే చేయాలన్నారు అక్కడి తమిళులు. మా తల్లినే స్మరించుకుంటామన్నారు తెలుగువారు. చర్చలు జరగలేదు, వాదోపవాదాలు వినలేదు. ఒకరోజు తెలుగువారు బడిలో ఉండగానే బడి చుట్టూ ముళ్లకంచెని వేసేశారు. దొరికినవాళ్లని దొరికినట్లు చావబాదారు, కంచెని దాటబోయిన వారి శరీరాలని ఇనప ముళ్లు నిర్దాక్షిణ్యంగా చీరేశాయి. మరికొందరి గొంతులో అవి దిగబడ్డాయి. జలియన్‌వాలా బాగ్‌ని తలపించే ఈ ఘటన విన్న ప్రతివారి గుండె తరుక్కుపోయింది. కానీ ఈ విషయాన్ని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించినప్పుడు వచ్చిన స్పందన 'తమిళనాడులో ఉన్నారు కదా! తమిళం నేర్చుకోండి' అని. ఇప్పటికీ అదేరకమైన స్పందన మన ప్రభుత్వానిది!

ఉద్యమాలతోనే ఎదిగాను

పుట్టింది మా అమ్మగారి ఊరైన సూళ్లూరుపేటలో. పీజీ వరకూ ఆంగ్ల మాధ్యమంలోనే చదివాను. పద్దెనిమిదో ఏట వరకూ నాకు తెలుగు చదవడం రాదు. కానీ తెలుగు పట్ల మక్కువకి కారణం మా కుటుంబ నేపథ్యమే! మా అమ్మమ్మ అక్కాచెల్లెళ్లు పద్నాలుగు మంది. మా తాతయ్యల్లో కొందరికి తెలుగంటే విపరీతమైన ప్రేమ. వారిలో ఒకరైన వేణుగోపాల్‌రెడ్డి తమిళనాడులోని సత్యవేడు ప్రాంతాన్ని ఆంధ్రరాష్ట్రంలో కలపాలని ఉద్యమించారు. వేణుగోపాల్‌రెడ్డి మిత్రుడైన కోదండరామయ్యేమో హోసూరుని ఆంధ్రాలో కలపాలని గొప్ప ఉద్యమం లేవదీశారు. వీరి సమావేశాల్లో టీ, సిగరెట్లను అందిస్తూ, వారి చర్చలు వింటూ పెరిగిన నాలో తెలుగు భాష పట్ల విపరీతమైన అభిమానం ఏర్పడింది.

తెలుగంటే వెర్రి

ఆంత్రోపాలజీలో పీజీ చేయడం, మానవ సమాజంలో భాషా వికాసం గురించి సమగ్రంగా తెలుసుకోగలిగాను. తెలుగంటే ప్రేమతో ఆ భాష లోతుల్లోకి వెళ్తే ఎన్నో గొప్ప విషయాలు తోచాయి. తెలుగు భాష ఎల్లలు విస్తృతం. కన్యాకుమారి నుంచి వింధ్య పర్వతాల దాకా తెలుగువారు అసంఖ్యాకం. అందుకే పార్లమెంటులో హిందీని జాతీయభాషగా చేయడంపై చర్చ జరిగినప్పుడు, ఇంత అఖండమైన దేశానికి కొద్ది మంది మాత్రమే మాట్లాడుకునే భాషని జాతీయభాషగా గుర్తించడం పట్ల వ్యతిరేకత వచ్చింది. దానికి బదులు ఉత్తరాదికీ దక్షిణాదికీ అనుసంధాన భాషగా తెలుగును గుర్తించాలన్న వాదనను అన్నాదురై వంటి తమిళ నాయకులు సైతం బలపరిచారు. తెలుగువారు మనం ఊహించలేని మారుమూలల్లో ఉనికిని నిలబెట్టుకుంటున్నారు. ఉదాహరణకు శ్రీలంకలో నివసించే నాలుగు మూల జాతుల్లో మూడు తెలుగువారివే! వారు అహికూటిక (పాములు పట్టేవాళ్లు), రామకూడూరు (కోతులనాడించేవాళ్లు), వాగై (సోది చెప్పుకునే వారు). అంతదాకా ఎందుకు శ్రీలంకని పాలించిన చివరి రాజు తెలుగువాడే, ఆంగ్లేయులని ఎదిరించినందుకు ఆయన్ని బంధించి వేలూరుకి తరలించారు. ఇప్పటికీ ఆయన సమాధిని అక్కడ చూడవచ్చు - తమిళ ఫలకంతో! ఆయన వారసులు చిత్తూరు దగ్గరలో ఉంటున్నారు.

భాషావికాసంలో ఆరుమెట్లు

ప్రతి భాషా మొదట్లో కొద్దిమందికే పరిమితం అవుతుంది - ఇది మొదటి మెట్టు (దశ). పరిసరాల వల్ల కొత్త మాటల సృష్టి జరగడం తర్వాత మెట్టు. నాగరికత వైపు అడుగులు వేయడం మూడవ మెట్టు - ఈ మెట్టులోనే తెలుగు భాష మూల ద్రావిడ భాష నుంచి విడిపోయింది. తనదైన సాహిత్యాన్ని రాతలో నిక్షిప్తం చేసుకోవడం నాలుగవ మెట్టు - ఇక్కడ మనం అశ్రద్ధ వహించాం; జనంలో ఉన్న సాహిత్యాన్ని కాదని, సంస్కృతాన్ని నెత్తికెత్తుకున్నాం. రాచరికపు అండతోనో, మతం అండతోనో భాషకి బలం చేకూరడం ఐదవ మెట్టు - ఇక్కడా మనకి ప్రోత్సాహం దక్కలేదు. ఇక శాస్త్ర సాంకేతిక అవసరాలకి కావల్సిన మొత్తం మాటలని సమకూర్చుకోవడం ఆఖరు మెట్టు. ఈ మెట్టుని చేరుకున్న భాషకు ప్రపంచాన్ని శాసించేంత బలం ఉంటుంది.

మూడవ మట్టు పట్టు తప్పింది

ప్రసిద్ధ భాషా శాస్త్రవేత్త నోమ్‌చామ్‌స్కీ అంచనాల ప్రకారం మూలద్రవిడ భాషనుంచి మొదటగా విడిపోయింది తెలుగే కానీ తమిళం కాదు. అది కూడా రుగ్వేద కాలంనాటికే, అంటే 3,500 సంవత్సరాల పూర్వమే తెలుగు భాషకి తనదైన అస్తిత్వం ఏర్పడిపోయింది. కానీ తన తర్వాత వచ్చిన తమిళం కంటే తెలుగు వెనుకబడిపోయింది. దానికి కారణం భాషావికాసంలోని మూడవ మట్టులో మనం తప్పటడుగు వేయడమే!

వెన్నుగల భాష మనది

ఆరవ మట్టుని సులభంగా చేరుకోగల సత్తా తెలుగు భాషకి ఉంది, ఎందుకంటే మరే భాషకీ తీసిపోకుండా తెలుగులో 1780 క్రియా ధాతువులు ఉన్నాయి. తమిళంలో ఉన్నది 400 క్రియా ధాతువులే! కానీ వారు వైద్య విద్యని సైతం తమిళ మాధ్యమంలో నేర్చుకునే స్థాయిలో ఉన్నారు. 800 క్రియా ధాతువులు ఉన్న హిబ్రూ భాషలో, బోధన అత్యుత్తమంగా జరుగుతోంది. కానీ తెలుగులో? కొత్త పదం అవసరమైతే అరువు తెచ్చుకుంటున్నాం. తేలికైన పదాలను కాదని క్లిష్ట సమాసాలకి మొగ్గు చూపుతున్నాం. ఉదాహరణకి, వెర్టిబ్రేట్స్ అన్న ఆంగ్ల పదానికి వెన్నుగల జీవులు అని అర్థం. కానీ 'సకశేరుకాలు' అన్న పదం వాడటం వల్ల, తెలుగులో సాంకేతిక బోధన క్లిష్టం అన్న భావన కలుగుతుంది. తెలుగులో క్రియా ధాతువులకి కొదవ లేదు. నన్నయ్య, అన్నమయ్య సాహిత్యాల్లోనే కాదు, తమిళ సాహిత్యానికే తలమానికమైన 'సంగ సాహిత్యం'లోనూ కనిపించే తెలుగు పదాలు ఎన్నో. మన సాంకేతిక అవసరాలన్నీ తీర్చగల పదాలు మనకి ఉన్నాయి. ఉదాహరణకి ఓట్ర పురుషోత్తం 'ప్రొటొజొవా' అన్న పదానికి 'తొలిఏలు' అన్న సమానార్థకాన్ని కనుగొన్నాడు. ప్రొటో అంటే తొలి, జొవా (జీవి) అంటే తెలుగులో ఏలు. కుందేలు, తోడేలు లోని ఏలు పదం అన్నమాట.

తమిళనాట క్షీణిస్తున్న తెలుగు

ఆంధ్రరాష్ట్రం ఏర్పడే నాటికి తమిళనాడులో ఉన్న 17 వేల ప్రాథమిక పాఠశాలల్లో 8 వేలు తెలుగు మాధ్యమంలో నడిచేవి. ఇప్పుడు ప్రాథమిక పాఠశాలలు 48 వేలు అయ్యాయి, వాటిలో తెలుగు మాధ్యమం ఉన్నవి మాత్రం 6 వందలే. మరోపక్క మన రాష్ట్రంలో మాత్రం తమిళ మాధ్యమ పాఠశాలలు 20 నుంచి 400కు పెరిగాయి. ఏ రాష్ట్ర ప్రభుత్వ అంకితభావం ఏమిటో చెప్పడానికి ఈ గణాంకాలు చాలవా? తమిళాన్నే ద్వితీయ భాషగా ఎంచుకోవాలన్న నిర్బంధ తమిళ చట్టం కనుక అమల్లోకి వస్తే ఇక ఏ గణాంకాలూ అవసరం లేదు.

మీరూ పట్టించుకోకుంటే!

తెలుగువారికోసం ఒక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలుగు భాష ఒక ప్రాంతానికే పరిమితం అన్న భావన ఏర్పడిపోయింది. 'మీకంటూ ఒక రాష్ట్రం ఉంది కదా! అక్కడికే పోండి' అన్న మాటలు మొదలయ్యాయి. తమిళనాడులో ఉండే తెలుగువారి సంగతి చెప్పనే అక్కర్లేదు. భాషని బట్టి, యాసని బట్టి, కులాన్ని బట్టి, ఇంటిపేరుని బట్టి తమిళులు తెలుగువారిని గుర్తుపట్టేస్తారు. వివక్ష చూపిస్తారు. సరే! మంచో, చెడో వారు మాపట్ల వివక్షని చూపించడంలో అర్థం ఉంది. కానీ ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వమూ మమ్మల్ని పట్టించుకోకపోవడం బాధ కలిగిస్తుంది.

ప్రతీ సంవత్సరం తమిళనాడు ప్రభుత్వం విదేశాల్లోని తమిళుల కోసం కొంత బడ్జెట్‌ను కేటాయిస్తుంది. మన రాష్ట్ర ప్రభుత్వం మాకు పాఠ్య పుస్తకాలను ఇవ్వడానికి కూడా పదిసార్లు తిప్పించుకుంటుంది. పొరుగు వాడితో సమస్య వస్తే తిట్టుకుంటాం, కొట్టుకుంటాం. మనవారే మనల్ని పట్టించుకోకుంటే ఎవరితో చెప్పుకునేది!

మేమే తంటాలు పడుతున్నాం

హోసూరులో మొదటి నుంచీ ఉన్న తెలుగు బడులు మూతపడే పరిస్థితుల్లో ఉన్నాయి. నేను అక్కడికి వెళ్లినప్పుడు ఏడెనిమిది మంది తెలుగు కార్యకర్తలు దొరికారు. వాళ్లని తీసుకుపోయి పల్లె పల్లెకీ ప్రచారయాత్ర చేశాం. వెళ్లిన చోటల్లా తమ పిల్లల్ని తెలుగులో చదివించకపోవడానికి ఏవో కారణాలు చెప్పారు. ముఖ్య కారణం బడులు అధ్వాన్నంగా ఉండటం. పిల్లల్ని తిరిగి బడికి రప్పించేటందుకు వాటిని బాగుచేయడానికి పూనుకున్నాం. కొంత ప్రభుత్వ సాయంతో, కొంత దాతల సాయంతో మేమే సున్నాలూ అవీ వేయించాం. తెలుగు చెప్పేవారు లేనిచోట్ల మా కార్యకర్తలే పాఠాలు చెప్పారు. చుట్టూ తెలుగు కనిపిస్తే ప్రజల్లో నమ్మకం కలుగుతుందని, అన్ని చోట్లా తెలుగు బోర్డులు పెట్టించాం. నాలుగైదేళ్ల పాటు ఒక ఉద్యమంలా, ఇవన్నీ చేస్తూ తిరగడం వల్ల ఆయా స్కూళ్లన్నింటినీ నిలబెట్టుకోగలిగాం. అలా ఇప్పుడు 970 పల్లెల్లో 480 స్కూళ్లు ఉన్నాయి.

తెలుగు బడి లేని చోట తెలుగు వాణి

ఇక దక్షిణ తమిళనాడులోని తెలుగువారి కోసం 'తెలుగు వాణి' అనే కార్యక్రమాన్ని చేపట్టాం. రెండు నెలల్లో వారికి తెలుగు నేర్పించేట్లుగా. అలా 80 పల్లెల్లో



నాలుగు వేల మందికి తెలుగు రాయడం, చదవడం నేర్పించాం. ఇతర రాష్ట్రాల్లో ఉండే తెలుగువారు, తెలుగు నేర్చుకోకపోతే దాని గురించి వారికి ఎలా తెలుస్తుంది. తమిళంలో తెలుగు గొప్పదనం గురించి రాయరు కదా! వారిలో స్వాభిమానాన్ని కలుగజేయాలంటే వారికి తెలుగును దగ్గర చేయాలి. అదే మా ప్రయత్నం.

నేను సైతం అన్నది ఎందరో

నేను మాత్రమే కాదు. పొరుగు రాష్ట్రాలలో తెలుగు కోసం కృషి చేస్తున్న వారు ఎందరో! ఒకప్పుడు కారు వరదరాజన్ పంతులు తమిళ లిపిలో తెలుగు పత్రిక నడిపారు. 'తల్లిభాష తెలుగును కాపాడు' అని మెడలో ఒక అట్ట తగిలించుకుని దక్షిణ తమిళనాడులో రెండు వేల పల్లెలు తిరిగారాయన.

పేసెట్ల భాస్కరుడు అనే ఆయన ఒడ రేవులో ఉద్యోగి. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మేం అతన్ని చూడ్డానికి వెళ్లినప్పుడు పాత ఇంట్లో అద్దెకి ఉన్నాడు. ప్రభుత్వ ఉద్యోగి అయినా ఎందుకు అతను ఆ పరిస్థితిలో ఉన్నాడు అంటే, వచ్చిన జీతాన్నంతా తెలుగు బడులకే ఖర్చు పెట్టేవాడు. ఆ పిల్లలకి పుస్తకాలు కొని పెట్టడం, బట్టలు కొని పెట్టడం. పొట్టి శ్రీరాములు జయంతికి పిల్లల చేత వేషాలు వేయించడం, ప్రకాశం పంతులు విగ్రహానికీ పూలమాలలు వేయడం... ఇలాంటి పనులెన్నో చేసేవాడు. అతని జీవితమంతా వీటికే అంకితం చేశాడు. మూడు నెలల క్రితమే చనిపోయాడు. ఇలా చరిత్రకి ఎక్కనివాళ్లు ఎందరో!

మందితో మంది భాషలో

మామూలు జనాన్ని భాష దగ్గరకి లాక్కోవడానికి చూస్తున్నాం. నీళ్లు తోడేదానికి యాతమెట్లా దించాలో, అలా మనమే వారికి దగ్గరగా వెళ్లాలి. దీనికొకటే మార్గం, అచ్చులోని తెలుగుని మరింత తేలిక చేయాలి. వారి మాటల్లోనే వారితో సంభాషించాలి.

మాండలికాల్ని గౌరవించాలి

ప్రతి భాషలోనూ మాండలికాలు ఉండటం సహజం. తమ మాండలికాల్ని కాపాడుకుంటూనే ఇతర మాండలికాల్ని గౌరవించడం సాంప్రదాయం. కానీ మన రాష్ట్రంలో అలా లేదు. ఇతరుల మాండలికాలను హేళన చేసే ప్రయత్నం నిరంతరం జరుగుతోంది. 'మా అమ్మవాడు నీ కోసం ఈని ఉన్నాడు' అని ఒక చిత్రంలో తమిళ యాస గుర్తుకుతెచ్చారు. తమిళనాడులో ఎవరూ ఆ మాటని వాడరు. నిజానికి మాండలికాల్లో గొప్ప పద సంపద ఉంది. అందుకని మాండలికాలలో విస్తృతంగా కథలు రావడం మంచిదే. ఎందుకంటే ఒక మాటకి గౌరవం అచ్చులో పెరుగుతుంది, మాండలికాలలోని పదాలు తరచు అచ్చులో రావడం వల్ల దాని వాడకం పెరుగుతుంది.

ప్రాథమిక విద్యలో మాతృభాష

దేశం అంతటా ఇప్పుడు ఆంగ్ల విద్య పట్ల మోజు పెరిగింది. ఇది కేవలం ఏ ఒక్క రాష్ట్రానికో పరిమితం కాదు. తమిళనాడులో మనకంటే ముందుగానే ఆంగ్లమాధ్యమంలో ప్రభుత్వ పాఠశాలలు నెలకొల్పారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇది అనివార్యం. అలాగని మేము మా ఉద్యమాలని విరమించుకోం. మాతృభాషలో బోధన కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకు వస్తూనే ఉంటాం. కానీ.. ప్రపంచ మేధావుల విశ్లేషణ ప్రకారం, అగ్రరాజ్యంగా అమెరికా మరెంతో కాలం ఉండబోదు. అప్పుడిక ఆంగ్ల భాషతో పెద్దగా అవసరం ఉండదు. ఆ సమయాన్ని అందిపుచ్చుకోడానికి మనం సిద్ధంగా ఉండాలి.

ఉదాహరణకు హిబ్రూ మాట్లాడే యూదు జాతి ఉంది. వారు అరవై ఏళ్ల క్రితంవరకూ చెల్లా చెదురుగా ఉండేవారు. 60 శాతం మందికి తమ భాష కూడా రాదు. కానీ ఎప్పుడైతే వారికంటూ ఒక దేశం (ఇజ్రాయిల్) ఏర్పడిందో, అంతా ఒక చోటకి చేరారు. వారి భాషలోనే శాస్త్ర సాంకేతిక రంగాలకి కావల్సిన పదజాలమంతా ఏర్పరుచుకున్నారు. ఈ రోజున హిబ్రూ విశ్వవిద్యాలయానికి ప్రపంచంలోనే గొప్ప పేరుంది. అలాగే తమిళులు కూడా! ఆంగ్ల భాషలో విద్యబోధన కొంతమేరకు అవసరం అని వారికి తెలుసు. ఎప్పుడైతే ఆంగ్లభాష పట్ల మోజు తగ్గి మాతృభాష అవసరం ఏర్పడుతుందో, ఆ సందర్భాన్ని అందిపుచ్చుకోవడానికి వారు సిద్ధంగా ఉన్నారు. అప్పటికి కావలసిన పదజాలాన్ని వారు ఇప్పటికే తయారుచేసేసుకున్నారు.

భాషా ఉద్యమం రావాలి

తెలుగుకు పూర్వవైభవం రావాలంటే భాషోద్యమం రావాలి. తమిళనాడులో 1860లోనే సంస్కృత వ్యతిరేక ఉద్యమం మొదలైంది. అది మొదలు పెరియార్ రామస్వామి నేతృత్వంలోని ద్రవిడ ఉద్యమం వరకూ భాషా పరమైన ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయి. అక్కడ ఉద్యమాల

ఫొటోలు: పిట్టల యాదగిరి

నుంచి నాయకులు వచ్చారు, అందుకనే వారిలో భాష పట్ల చిత్తశుద్ధి ఉంది. మన రాష్ట్రంలో కూడా ఈ స్ఫూర్తి కలగాలి.

అడుగు ముందుకెయ్యాలి

ఆంగ్లభాష మోజు తగ్గిపోయిన రోజున, జాతీయ స్థాయిలో అనుసంధాన భాష గురించిన చర్చ మళ్లీ మొదలవుతుంది. అందుకోసం హిందీ, బెంగాలీ, తమిళ భాషలు పోటీపడతాయి. మనం కనుక ఆ అడుగు ముందుకు వేయగలిగితే జాతీయ స్థాయిలో తెలుగుని అనుసంధాన భాషగా నిలుపవచ్చు. ఆ చేవ మన భాషకి ఉంది.

ఆంధ్ర రాష్ట్రం నుంచి కావల్సినవి

మేము ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుకునేవి అతి కొద్దే. ముందుగా మా పిల్లలకి పుస్తకాలు కావాలి. రెండు - మేము ఎదుర్కొనే చిన్నచిన్న సమస్యలని పరిష్కరించడానికి ముందుకు రావాలి. అలాగే అక్కడి కళారూపాలని ఇక్కడికి తీసుకువచ్చి ప్రదర్శించాలి. పాపం అక్కడి కళాకారులకు తెలుగువారి మధ్య ఆడాలని కోరిక, మమ్మల్ని 'తిరప్తి'కి (తిరుపతి) తీసుకుపోయి ఆడించప్పా అని ఎంతో ఆశగా అడుగుతారు.

మాయమ్మ భాష మాకు కావాలి

కన్యాకుమారికి పోయినా కూడా 'తెలుగు నేర్పిస్తాను నేర్చుకుంటారా' అని అడిగితే వాళ్ల మొహాలు వెలిగిపోతాయి. 'మాయమ్మ భాష మాకు కావాలి, మేం నేర్చుకుంటాం' అంటారు. పదేళ్లుగా ఈ స్పందన మరింత పెరిగింది. అలాగే గొడుగులు (డిష్ టీవీలు) వచ్చిన తర్వాత ఇంట్లో పిల్లలకి ఎంతో కొంత సేపు తెలుగు ఛానెళ్లని చూపిస్తున్నారు. ఆ తపన వారిలో ఉంది. అందుకని వారి యాసలో ఏదో ఒక రోజు అరగంటన్నా కార్యక్రమం ప్రసారం అయితే బాగుంటుంది.

సంచార కులాల్లో చరిత్ర

తమిళనాడులో 82 సంచార కులాలు ఉంటే వాటిలో 79 కులాలకు ఇంటి భాష తెలుగు. వీరిలో విపరీతమైన జ్ఞానం ఉంది, మాటల మూట ఉంది. ఉదాహరణకి తమిళనాడులోని 'నాళ్‌మణికారర్' అనే సంచార జాతి వద్ద ఎక్కడా దొరకని 200 తెలుగు మాటలు దొరికాయి.

సంచార కులాల్లో ఒకే కులాన్ని ఆశ్రయించి బతికే కులాలు కూడా ఉన్నాయి, వీటిని ఆశ్రిత కులాలు అంటారు. వీరి దగ్గర కులపురాణాలు కళా రూపాలలో ఉన్నాయి. కానీ ఇప్పుడవి అంత్య దశలో ఉన్నాయి. ఉదాహరణకి వెలమ కులానికి ఆంధ్రరాష్ట్రంలో కులపురాణం లేదు. దీనిని చెప్పగలిగిన వాడు నాకు మధుర దగ్గర కలుమపట్టి అనే ఊరిలో దొరికాడు. అతని జ్ఞానాన్ని భద్రపరచాలని నేను ఎంతో మందిని కలిసాను, లాభం లేకపోయింది. చివరికి అతను చనిపోయాడు! అలాగే కమ్మవారి కులపురాణం చెప్పగలిగే గోపాల్ అనే కళాకారుడు ఉన్నాడు. అతనికిప్పుడు 70 ఏళ్లకి పైనే ఉంటాయి. పన్నెండేళ్ల క్రితం అతన్ని చూసినప్పుడు 22 రాత్రులపాటు కులపురాణం చెప్పేవాడు. తర్వాత అది ఆరు రాత్రులకి వచ్చింది. ఇప్పుడు ఒక్క రాత్రిలోనే అంతా ముగించేస్తున్నాడు.

గంగాపురం వద్ద ఆండిపండారం అనే సంచార కులం ఉంది. వాళ్లు 42 యక్షగానాలు రాయగలరు. కానీ ఇప్పటి తరం బడికి పోవడం మొదలుపెట్టడంతో ఇక ఆ ప్రక్రియ ముగిసిపోనుంది. ద్రౌపది పూర్వ జన్మ వృత్తాంతం అయిన నలాయణి వంటి అరుదైన కథలని కొన్ని తరాలుగా వీరు యక్షగానంలో ఆడుతున్నారు. ఇంతా చేసి గంగాపురం అనే ఊరు తిరుపతి నుంచి కేవలం 65 కిలోమీటర్లే, అయినా వీరి కళని భద్రపరిచే ప్రయత్నం ఎవరూ చేయడం లేదు.

మన సీమకి తిరిగి వెళ్లాలి

డిండిగల్ జిల్లాలో కంబళంకార్ అనే తెలుగు కులం ఉంది, వారు ఇప్పటికీ పెళ్లిళ్లలో 'దేవరాట్టం' అనే గొప్ప నాట్యాన్ని మూడు రోజుల పాటు విడతలవారీగా ప్రదర్శిస్తారు. పెళ్లి పూర్తయిన తర్వాత ఆడవాళ్లంతా ఒక చోట కూర్చుని ఏడుస్తూ పాడతారు, ఎందుకు వీరు ఏడుస్తున్నారు అని జాగ్రత్తగా వింటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. అదేమిటయ్యా అంటే, బళ్లారి జిల్లా హంపీ ప్రాంతం నుంచి, వాళ్లిప్పుడు ఉండే కావేరీ తీరంలోని డిండిగల్ జిల్లాకి ఎలా వచ్చారనేదాని ఆనవాళ్లు, కొండలూ, ప్రాంతాల పేర్లతో సహా వారు పాడతారు! ఏనాటికైనా సొంత సీమకి చేరాలనే ఉద్దేశంతో ఎనిమిది వందల సంవత్సరాలుగా ఆ ఆనవాళ్లని వారు పాట రూపంలో గుర్తుంచుకున్నారు.

ఇంత విజ్ఞానాన్ని మన ప్రజలు మనకి కళారూపంలో ఇస్తూ ఉంటే, వాటిని భద్రపరచకపోవడం ద్రోహం కదా! ఇదంతా చూసి నిరాశ కలుగుతుంది, బాధ కలుగుతుంది, కోపం వస్తుంది. కానీ మళ్లీ ముందుకు సాగిపోతుంటాను.

ప్రస్తుతం కంచి జిల్లా

కంచి మన కతలు పోయిన ఊరేగానీ అక్కడి తెలుగు వారు ఉగాది కూడా చేసుకోవడం లేదు. నాలుగు నెలల క్రితం అక్కడ ఉన్న తెలుగు కులసంఘాలన్నింటిని కలిసి అయిదు వేల మందితో ఒక చిన్న ఊరేగింపు కూడా నిర్వహించాం. వారి సాయంతో రాబోయే ఉగాదిని ఘనంగా చెయ్యాలని అనుకుంటున్నాను. దాంతోపాటుగా కొన్ని జానపద కళారూపాలను వారికి గుర్తు చేయాలి.

మేధావులు తెలుగు దోవ పట్టాలి

భాషాభివృద్ధికి నిర్మాణాత్మక ఆచరణ కావాలి. అది ప్రభుత్వంలోనో, సామాన్య ప్రజల్లోనో మొదలవుతుందని ఆశించలేం. ప్రతి జాతిలోనూ మేధావి వర్గం ఒకటి ఉంటుంది. అది తన జాతిని కట్టడించి, మెరిగించాల్సి ఉంటుంది. మేధావులు కులాలవారీగా, ప్రాంతాలవారీగా విడిపోవడం అనేది భారతదేశమంతటా ఉంది. కానీ నిజమైన మేధావి తన పని తను చేసుకుపోవాలి. మన మేధావులు తెలుగు దోవ పట్టాలి, మందిని తెలుగు దోవ పట్టించాలి.

అధిక వృద్ధి న్యాయం

అసలుకంటే వడ్డీ ముద్దు అని దీనర్థం. మనిషి స్వభావమే అంత, చేతిలో లేని దాని గురించే చింత! అందుకే అసలుపై అంతకంతా ఆశిస్తాడు. కుబేరుడంతటి వాడు వెంకన్న దగ్గర వడ్డీ కాసులని దండుకుంటున్నాడు. మనుషులు అధికవృద్ధిని ఆశించడంలో ఆశ్చర్యమేముంది! 'వడ్డీ ముందు వడిగల గుర్రాలు కూడా పారవు' అన్నది సామెత. కానీ అధిక వృద్ధి అనేది వెంపర్లాటగా మారితే, అసలుకే మోసం అన్న హెచ్చరిక కూడా ఇందులో ఉంది.

ముక్కు తిమ్మన ముద్దు పలుకులు

డా॥ ఎన్.శాంతమ్మ

శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ఒకడైన నందితిమ్మన రచించిన కావ్యం పారిజాతాపహరణం. ఈయనకు ముక్కుతిమ్మన అనే మరొక పేరూ ఉంది. ఇతడు కృష్ణరాయల పట్టమహిషి తిరుమలదేవి వెంట అరణపు కవిగా వచ్చినవాడు. ఒక ప్రణయకలహ సందర్భంలో తిరుమలదేవి పాదం రాయల శిరస్సును తాకినదట. రాయలు ఆమెపై ఆగ్రహించి ఆమె అంతఃపురానికి వెళ్లక నిరాదరించినాడట. ఆమె తనకత్యంత సన్నిహితుడు, వయోవృద్ధుడైన తిమ్మనకు ఈ విషయం చెప్పి విలపించినదట. తాను పరిస్థితిని చక్కదిద్దుతానని తిమ్మన ఆమెను ఓదార్చినాడట. అందుకే సత్యాకృష్ణులు నాయికానాయకులుగా పారిజాతాపహరణ కావ్యాన్ని రచించి సత్యాకృష్ణుల ప్రణయకలహాన్ని, మితిమీరిన కోపంతో సత్యభామ శ్రీకృష్ణుని తన ఎడమ పాదంతో తన్నిన వైనాన్ని, అందుకు శ్రీకృష్ణుని సరసమైన స్పందనను హృద్యంగా వర్ణించి రాయలకు భార్యపై గల కోపాన్ని పోగొట్టారనీ ఈ కావ్య నిర్మాణాన్ని గురించి ఒక కథ ప్రచారంలో ఉంది.

సంస్కృత భాగవతంలోని దశమస్కంధంలో మూడు శ్లోకాల్లో అతిక్లుప్తంగా వర్ణించిన కథను తిమ్మన అయిదు ఆశ్వాసాల కావ్యంగా రచించాడు. సంస్కృత హరివంశంలో ఈ కథ మరికొంత విస్తృతంగా ఉంది.

రుక్మిణి భవనంలో ఉన్న శ్రీకృష్ణుని వద్దకు నారదుడు వచ్చి పారిజాత పుష్పాన్ని బహూకరించడం, దాన్ని కృష్ణుడు పక్కనే ఉన్న రుక్మిణికీయడం, ఆ పుష్పమహిమచేత రుక్మిణి సౌందర్యం అతిశయించడం, నారదుడు సత్యభామ గర్వాతిశయాన్ని ప్రస్తావించడం, చెలికత్తె ద్వారా ఇది విన్న సత్యభామ తనను అనునయిస్తున్న కృష్ణుని కాలితో తన్నటం, ఆమె కోపాన్ని తీర్చడానికి పారిజాత వృక్షాన్నే తెచ్చిఇస్తానని కృష్ణుడు శపథం చేయటం, సత్యభామతో సహా వెళ్లి ఇంద్రునితో యుద్ధంచేసి, గెలిచి, పారిజాత వృక్షాన్ని తెచ్చి సత్యభామ పెరటిచెట్టుగా నాటించడం, తర్వాత నారదుడు సత్యభామతో పుణ్యకవ్రతం చేయించి, పారిజాతవృక్షంతో సహా శ్రీకృష్ణుణ్ణి దానంగా గ్రహించడం, శ్రీకృష్ణునితో కొన్ని సేవలు చేయించుకోవడం, తిరిగి ఆమెకే అప్పగించడం అనే కల్పనలను కథాచమత్కారం కోసం కల్పించాడు.

ఈయన కవిత్వం మృదుమధురం. తెలుగు పదాలే అధికం. ముద్దులు మూటగట్టే నుడికారాలు, జాతీయాలు, పదబంధాలు సందర్భోచిత అలంకారాలు ప్రయోగిస్తూ రాసిన ఈ కావ్యం 'ముక్కుతిమ్మనార్యు ముద్దు పలుకు' అన్న ప్రశస్తికి నోచుకుంది.

పీఠికలోని ఆరవ పద్యం నిండా తెలుగు పదాలే. చంద్రుడు 'వలిమలయల్లువాడు తలవాక ధరించిన పూవుగుత్తి' అట! వలిమల అంటే మంచుకొండ. 'తలవాక' శివుని శిరస్సు నందలి మిన్నేరు. వేల్పులగమి జీవగట్టు - దేవతా సముదాయానికి జీవనాధారం. ఉదివోవని చల్వల టెంకి- తరగని చల్లదనానికి తావైనవాడు. 'వెన్నెలల్మొలిచిన పాదు - వెన్నెలల పుట్టుకకు స్థానమైనవాడు' 'పాల్కడలిముద్దులపట్టి' అయిన చంద్రుడు మిమ్ము కరుణతో జూచుగాక! అని కృష్ణరాయలకాశీస్సు. రాయలది చంద్రవంశం. చంద్రుడు ఆయన వంశ మూలపురుషుడు. 'జీవగట్టు' దుష్టసమాసమే అయినా మహాకవులు ప్రయోగించారు.

గోపికలతో శ్రీకృష్ణుడు సవిలాసంగా క్రీడించాడనే అర్థంలో 'గొల్లయిల్లాండ్రతో కోపగించుట చేసి' అన్నాడు. నరకాసురుని చెరలోనున్నవారు 'అచ్చర కొలమువా'రట 'ఎలజవ్వనంబు పోలివోవనివా'రట! ప్రథమాశ్వాసమంతా అధిక శాతం అందాలను గుదిగుచ్చియిచ్చిన ఆణిముత్యాలే. రుక్మిణి భవనంలో ఉన్న శ్రీకృష్ణుని వద్దకు వచ్చిన నారదుడు చేసిన దశావతారవర్ణన. ఈ సీసపద్యం ఎత్తుగీతితో సహా తెలుగు పదాలే.

రుక్మిణి ఇంటి నుంచి వచ్చిన సత్యభామ చెలికత్తె అక్కడి వృత్తాంతమంతా పూసగుచ్చినట్టు చెబుతుంది. 'మోమోటలు' మాని అంతా చెప్పమని సత్య చెలికత్తెను హెచ్చరిస్తుంది. నారదునివి 'పలుదెరగు ముళ్ల మా

టలు' 'మనమెరియదె ప్రాణమయిన మగడిట్లయినన్' 'పూసలలో దారంబు పగిది' 'అనిగి పెనగి' 'గూడిమాడి' 'కలసిమెలసి' - ఉన్న మగడు సవతి రుక్మిణికి పారిజాత పుష్పాన్ని ఇచ్చినాడని సత్యభామ చెందిన వంతను కమ్మని జాతీయాలతో కళ్లకు కట్టించాడు తిమ్మన.

పారిజాతసుమాన్ని ధరించిన రుక్మిణి గురించి చెలికత్తె వర్ణించిన సౌందర్యం చూడండి.

మగమీల నగజాలు తెగగీలుకొనువాలు

కనుగవ కొకవింతకాంతి యొదవె
వలిజక్కవల పెక్కువలు దక్కువగ నిక్కు
చనుదోయి కొకవింత చాయ దోచె
నెల తుమ్మెదల దిమ్ము వెలిజిమ్ము చెలువమ్ము
గల వేణి కొకవింత నలుపుమీరె
నల చెందొవల విందు చెలువొందు వెస జిందు
మొగమున కొక వింత జిగి దొలంకె

జక్కదనమున కొకవింత చక్కదనము
విభ్రమంబున కొకవింత విభ్రమంబు
జవ్వనంబున కొకవింత జవ్వనంబు
గలిగె నద్దివ్య కుసుమంబు కతన సతికి!

సీసపద్యం మొత్తం సగణాలు కావడంతో ఒకలయ. హాయిగా పాడుకోవడానికి అనువుగా ఉంది. వృత్త్యనుప్రాసాలంకారం తోడుకావడంతో అదనపు సొగసు చేకూరింది.

అంతఃపురమంతా 'అలబలము' లేకుండా ఉన్నదట. కోలాహలమేమీ లేదని, సత్య ననునయించడానికి ఆమె చెంతనే కూర్చొని ఏవేవో ప్రియోక్తులు 'నెయ్యము తియ్యము' దోప కృష్ణుడు పల్కుతాడు. 'పలుకుల తేనెలుట్టిపడపల్కవు' 'కడగంటనైన చూడవు' 'నవ్వుటాలకా' అని తనపై అలుక మానమని ఆమె పాదాలకు మొక్కుతాడు. కోపంతో బుసలుకొడుతున్న సత్య శ్రీకృష్ణుని శిరస్సును తన ఎడమపాదంతో 'తొలగంద్రోచె'- తన్నిందని అర్థం. 'నీవు తన్నినా అదినాకు మన్ననే. అందమైన చిగురుటాకు వంటి నీ పాదం నా శరీరంలోని పులకరింతలనే ముళ్లుసోక నొచ్చెనేమో. ఇకనైనా అలుకమాను' అంటాడు.

అప్పుడు సత్య మే యఱదోప నిక్కి 'ఈ నయగారపుం బ్రియము, ఈ పసలు, ఈ మొగమిచ్చుమాటలు చాలును, గట్టివ చేతులు, కల్లదనాలు నీవు పుట్టగా పుట్టినవి. ఎందులేని పలుపోకల మాయలు నీకు వెన్నతో బెట్టిన విద్య' లంటుంది.

ప్రథమాశ్వాసమంతా తేనెలూరే తెలుగు పలుకులతో రసజ్ఞుల మనస్సుల్ని దోచుకుంటుంది.

రెండవ ఆశ్వాసంలో శ్రీకృష్ణునికి సత్యభామ చెలికత్తెలు మాధ్యాహ్నిక స్నానం చేయిస్తున్నప్పటి వర్ణన. ఒక సఖి ' కొనగోళ్ల నెఱులు (కురులని) సిక్కులు వాపిన'దట. 'తామరదోయిలో దగిలి దాటెడు తేటుల బోలు నెన్నెఱున్ వేమరు చేతులం బడిచి, విప్పి, విదిర్చి' నదట ఒకతె. 'తెలిగొజ్జగి నీరిడ చల్లిచల్లి'నదట వేరొకతె. 'చంద్రిక పూవన్నె జిలుగు దువ్వలువను తడియొత్తిన'దట మరియొకతె. 'వెన్నెల నిగ్గులు వెదజల్లుడు మడుగు'లందించినదట ఇంకొకతె. అన్నీ చక్కని చిక్కని తెలుగు నుడులే.

సాయంకాలపు చీకట్లో తోచినతారలు కటిక చీకటి అనే మేఘబృందం కురిసిన వడగండ్లలా, చక్రవాక మిథునాన్ని ఎడబాపడానికి కిరణాలనే గొట్టాల ద్వారా చంద్రుడు చిమ్మిన స్ఫటికపు గుళికల్లా, అప్సరసలు మిన్నేటి ఇసుకలో పరచిన వెన్నెలకుప్పల్లా, స్వచ్ఛమైన వెండితీగల సాగించు ఆకాశమనే కమ్మచ్చు రంధ్రంలా, తన భర్త లోకాన్ని జయించడానికి బయల్దేరగా రతీదేవి అతనిపై సవిలాసంగా చల్లిన ఆశీరక్షతల్లా, సూర్యుని ఎండచే కాగిన కారణంగా ఆకాశపు శరీరంపై తోచిన చెమట బొట్లలాగాను ఉన్నాయట చుక్కలు! ఎంత అద్భుతమైన కల్పన!

ఇంకా చంద్రబింబం, చంద్రునిలోని వర్ణనలు పూర్తిగా తెలుగునుడులే. వెన్నెలను వర్ణిస్తూ సాగిన '... విరహులమై సోకి వేడియౌ వెన్నెల' అన్న పద్యంలో 'ముదురు వెన్నెల', పచ్చి వెన్నెల, వలిపవెన్నెల, 'తనుపు వెన్నెల'లతో

చిగురు విలుకాని జాతర సేయబూని
కొలము సాములనందర గూడబెట్టి
వంతు గలయంగా బువ్వంపు బంతి విందు
వెట్టి రెలమి జకోరపు పేరంటాండ్రు

చుట్టాలైన ఆడవాళ్ళు, మగవాళ్లు కలిసి భోజనం చేయడమే 'బువ్వపుబంతి'. ముఖ్యంగా వివాహ సందర్భాల్లో లేదా గృహ సంబంధమైన శుభకార్యాల్లో ఈ 'బువ్వపుబంతి' ఏర్పాటు చేస్తారు తెలుగునాట.

పసిడికొండ (మేరు పర్వతానికి) ఒక వింత తేజస్సును నింపించి, తీక్షణత లేని సాయంకాలపు 'ముదుసలి ఎండ' వ్యాపించిందట. 'వెన్నెలలో ప్రియసమాగమం కోసం ధవళాలంకారంతో వెళ్లామంటే ఎవరైనా మనల్ని తాకినా, వారు మనల్ని గమనించరు' అని జ్యోత్స్నాభిసారికలు తమలో తాము ముచ్చటించుకొంటూ పలికారు. - 'తాకియుం దలచెడి వారు లేరు' అన్నది కమ్మనైన జాతీయం. అంధకారమనే దొంగకు 'చీకటి బందె కాదు' అని తెలుగుసేత, దిక్కులు తెల్లవైనవి అనడానికి 'పలుకబా

గర్ధభ చందన న్యాయం



గంధపు చెక్కలు మోసే గాడిద, దాని సువాసనని ఆస్వాదించలేదు. పాపం దానికి గంధమైనా గుడ్డ పీలికలైనా ఒకటే. తేడా తెలియదు, చెప్పినా తెలుసుకో లేదు! బరువు మోశామా, ప్రయాణం సాగిందా అన్నదే దానికి ముఖ్యం. కొందరి జీవనయాత్రలూ దీనికి మిన హాయింపు కాదు. అష్టైశ్వర్యాలు ఉన్నవాడు పరమపిసినారి కావచ్చు. అన్ని శాస్త్రాలూ తెలిసినవాడు అహంతో రగిలిపోవచ్చు. జీవితంలో లభించిన వనరులని సద్వినియోగం చేసుకోవాలని చెప్పేదే గర్ధభ చందన న్యాయం.

రెను' అని తెలుగుసేత. 'నిదురమంపున' అచ్చమైన గ్రామ్యభాషా ప్రయోగం! మెల్లమెల్లన అనడానికి 'ఒయ్యనొయ్యన' అంటారు ముద్దుముద్దుగా. తృతీయాశ్వాసంలో 'కేకిసలు గొట్టుట' అన్నది కరతాళ ధ్వనులకు తెలుగుమాట. శ్రీకృష్ణుని చూచిన నాకలోకపు భామినుల మేను లుప్పొంగగా కాలి అందెలు 'తుత్తుమురైన'వట. అంటే ముక్కలు ముక్కలైనవని. ఇంద్రభవన బహిర్భాగంలో శ్రీకృష్ణుడు గరుత్మంతుని మీద నుంచి దిగగానే వేత్రహస్తులు చేసిన హుంకారానికి 'దిక్కులు పిక్కటిల్లిన'వట.

నరసింహావతార వర్ణనలో కూడా చంపకమాల మూడు పాదాలు ధ్వన్యనుకరణంతో ఒప్పుతున్న తెల్గునుడులే.

> సటలిటమానురోరి! హరి సర్వమయుండటె యంచు బట్టితో
> జిటజిటలాడి యిందుగనజేయుము నీవని దైత్యుడాడినం
> బటబట బాతికంబ మిరువాయలుగా...

సటలంటే నేర్పుమాటలు. చిటచిటలంటే కోపపు మాటలు. పటపట ధ్వన్యనుకరణం. తేటికదుపుల వర్ణనతో కూడిన సీసపద్యమూ, ఎత్తుగీతీ హృద్యమైన జాతీయాలు, నుడికారాలే!

> పరువంబు గాక చొప్పడని మామిడితేనె
> లాన నాసాసనట్టెడు నవియు
> దమకించి చిగురాకు గమిటి నోరొగరైన
> గడగి గొజ్జగి నీట గడుగునవియు
> సంపంగె పొదరింటి చక్కి శోరటగాంచి
> యుసురంచు మగిడి నోరూరు నవియు
> గలిగొట్టు పసరు మొగ్గల గోర్కి పొలివోయి
> మునుపటి మొల్లల మూగు నవియు
> నగుచు దేటికదుపు లామని దలసూపె
> జూపు దనుక నెల్లచోట దోట
> యందు దామయగుచు నమ్మరు నెలగోలు
> పౌజులనగ జూడ్కి పండులౌచు

ఈ పద్యంలోని 'ఆసాస నట్టెడుట', 'ఉసురంచు', 'నోరూరుట', 'కలిగొట్టు పసరుమొగ్గలు', 'కోర్కిపొలివోయి' - వంటి పదప్రయోగాల సొగసు తెలుగు వారిని ముగ్ధుల్ని చేస్తుంది.

శ్రీకృష్ణుడు ఇంద్రునితో చేస్తున్న యుద్ధంలో ఇంద్రునికి సాయంగా వచ్చిన దేవతలు, విద్యాధరులు, గరుడులు మొదలైన వారి దుర్గతిని దేశీయమైన పలుకుబళ్లతో వర్ణించిన మరో సీసపద్యం అందచందాలివి.

> తలలు వీడంగ విద్యాధరుల్పరచిరి
> గగ్గులకాడైరి ఖచరవరులు
> కన్నది గతిగాగ కిన్నరు లరిగిరి
> పన్నగేంద్రులు పటాపంచలైరి
> పోయిన పోకలై పోయిరి సిద్ధులు
> దిక్కామొకములైరి దిగధిపతులు...

గగ్గులకాడంటే నిస్సారమైనవారు. చట్టుపై పోకలంటే బండరాతిపై బడిన వక్కలు. కన్నది గతిగాగ - ఏ దారిబడితే ఆ దారిబట్టి వెళ్లిపోయారని. దిక్కామొకములైరి అంటే దిగంతాలకు పారిపోయారని ఈ ప్రయోగాలన్నీ వారి దీనస్థితిని తెల్పుతూనే నవ్వుపుట్టిస్తున్నాయి.

పారిజాత వృక్షాన్ని తెచ్చి శ్రీకృష్ణుడు తాను సత్యకిచ్చిన మాట ప్రకారం ఆమె ఉద్యానవనంలో నాటించాడు. ఆ వృక్ష దర్శన మాత్రం చేత దరిద్రులకు సంపదలు 'తామర తంపరై' తనరెనట! తిమ్మన నారదుడిని అచ్చతెనుగులో 'చివ్వల యోగిరంపు తపసి' అన్నాడు. పుణ్యకవ్రతం చేయించి సత్యభామ నుంచి శ్రీకృష్ణుడిని దానంగా స్వీకరించిన నారదుడు అతనిచేత "నవ్వుటాలకు పనులుగొన్నా"డట అంటే పరిహాసానికి సేవలు చేయించుకొన్నాడని.

ఎమ్మెలు పచరించరాదు అన్నది ఇంకో ప్రయోగం. టక్కులు చేయవద్దనడం, ధర్మజ భీమార్జునులు సత్యభామ చెలికత్తెలతో పరిహాసంగా పల్కినమాట. బావమరదులు కదా కృష్ణునికి! పరిహాసం చేయడం, పరిహాసానికి చెలికత్తెల నొకమాట అనడం ఉచితమే!

ఇలా తెలుగు పలుకుబడులు, నుడికారాలు, జాతీయాలతో నందితిమ్మన షడ్రసోపేతమైన విందు నందించాడు. సంస్కృత సమాసాలతో, తత్సమాలతో కూడిన పద్యాలలోనూ సరళమైన తెలుగుపదాలు సమృద్ధిగానే వాడాడు. ప్రజల వాడుకలో ఉన్నవీ, నిరంతరం గ్రామీణుల నాలుకలపై నర్తించేవీ, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేవీ అయిన తెలుగు పలుకుబడులకు తిమ్మన పారిజాతాపహరణ కావ్యం ఆలవాలమనడంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు.



విశ్రాంత ఉపన్యాసకురాలు, కర్నూలు
08518-223322

ఆహ్వానం

ఏదైనా శుభకార్యానికి ఇలాంటి సృజనాత్మక ఆహ్వానాన్ని మీరూ రూపొందిస్తే... దాన్ని మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. ఎంపికైన ఆహ్వానానికి చక్కని బహుమతి ఉంటుంది. తెలుగు సమానార్థకాలు లేకపోతే తప్ప అందులో ఇంగ్లీషు పదాలు ఉండకూడదు, తాజా ఆహ్వానం అయి ఉండాలన్నవి నిబంధనలు.

నా పెళ్లి

అనుకోకుండా పెళ్లి కుదిరింది
దగ్గర సంబంధమేలెండి... నాకు వరసకు అక్క కూతురు

అలేఖ్య తో

ఫిబ్రవరి ఇరవై అయిదో తేదీ రాత్రి మూడు గంటల పదహారు
నిమిషాలకు దివ్యమైన ముహూర్తం అన్నారు పెద్దలు.

పెళ్లి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలోని మా ఇంట్లో.

కానీ, ఇక్కడ్నుంచి మీరు అంతదూరం రాలేరని

ప్రత్యేకంగా మీకోసం మార్చి పదకొండో తేదీ ఆదివారం మధ్యాహ్నం
పన్నెండు గంటలకు విందు ఏర్పాటుచేశా. మా జంటను
ఆశీర్వదించడానికి తప్పక వస్తారని ఎదురుచూస్తుంటా.

మీ
భాస్కర్

విందు
ఇంటి సంఖ్య
రాజ్‌భవన్ ఎదురుగా, రాజ్‌నగర్, ఖైరతాబాద్, హైదరాబాద్.

అనుభూతి



ఎవరికైనా ఎప్పుడైనా
అనివార్యమైన గతి
అనుకోకుండా అందే అనుభూతి..

ఒక్కోసారి
మదిని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది
వెన్నెల్లోనూ ఉక్కపోత పోయిస్తుంది

ఏకమైనా అనేకంగా
గుండెల్లో ప్రతిధ్వనిస్తుంది
నిన్న మొన్నటిదే కాక ఎన్నేళ్లదైనా
ఆవహించుకుంటే కన్నుల్లో ప్రతిఫలిస్తుంది...

దాని ప్రభావం
మనో యవనికపై కదులుతూనే వుంటుంది
మౌనవీణను మీటితే పలుకుతుంటుంది...

అనుభూతిని ఆహ్వానించినప్పుడు
ఆపాదమస్తకం తడిపేయనూ వచ్చు
ఆసాంతం అయస్కాంతంలా అతుక్కోనూవచ్చు
అందులో - కొలిమిలా కాగుతూ కమిలిపోయినా
చెలమగా ఊరుతూ ఆస్వాదించినా
ఆ స్పందనలు ముద్రలు వేస్తూనే వుంటాయి
ఆ ప్రభావాలు భద్రంగా వున్నాయంటాయి...

ఒక అనుభూతి శాశ్వతవరమైతే
మరో అనుభూతి తక్షణ శోకమవుతుంది
అందమైన అనుభూతిలోని తన్మయత్వం
ఆజన్మాంతం వెంటాడుతూనే వుంటుంది
ఆవేదన నిండిన అనుభవ తీక్షణత్వం
అనుక్షణం వేటాడుతానంటుంది...

ప్రతి మనిషి అనుభూతులకూ
ముక్తాయింపు వుంటుందేమో కానీ
మినహాయింపు మాత్రం ఉండదు...

– బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, నెల్లూరు.
సెల్: 98854 81939

దేశవ్రత

ఎలక్ట్రాన్

అందం ప్రసక్తి వచ్చినప్పుడు అందరూ వసంతసేననే తలుచుకొనేవారు. చంద్రుడు సిగ్గుతో మబ్బులచాటున మొహం చాటేసుకొనేవాడు. తోటలోని పూవులు వెలవెలబోయేవి. సాటి స్త్రీలు అసూయతో కుమిలి పోయేవారు. వసంతసేన పర్వతసానువుల్లో ఓ గ్రామంలో ఉండేది. ఆ గ్రామంపేరు అగ్నిపాలెం. ఊరి శివార్లలో హరిహరస్వామి దేవాలయముంది. తెరల వెనుక పెరిగి, నృత్య గానాలలో శిక్షణ పొందిన వసంతసేనకు వయసు రాగానే ఆమెచే అమ్మమ్మ ప్రియంవద హరిహరస్వామి దేవాలయంలో అరంగేట్రం చేయించింది. ఆరోజు వసంతసేన ప్రజల దృష్టిలో పడింది. కోడెకారంతా ఆమె కనుసన్నల కోసం పడిగాపులు కాచారు. ధనవంతులు ప్రియంవదతో బేరసారాలు సాగించారు. వసంతసేన అందాలు ఆ రాజ్యాన్నేలే రాజు చెవిన బడ్డాయి. వెలితి బడకుండా మారువేషంలో ఆ గ్రామాన్ని సందర్శించాడు. హరిహరస్వామి ఆలయంలో కార్తీక ఏకాదశినాడు జరిగే అఖండ జ్యోతి ప్రజ్వలనంలో, ప్రజల దృష్టి జ్వాలల్లో ధగధగా మెరిసిపోతూ వసంతసేన కనబడింది. రాజు మకరందుడు యువకుడు, అందగాడు. ఏడాది క్రితం తండ్రి మరణాంతరం రాజ్యాభిషిక్తుడయ్యాడు. దినాంతం వరకూ అక్కడ ఉండి రాజధానీ నగరమైన సమంతపురం చేరుకొన్నాడు. వసంతసేనతో పొందుకోసం తన మనసులోని మాటని ఆంతరంగికుడైన మంత్రి సుబోధుడికి తెలియజేశాడు.

"మకరందా! పాలకుడు ప్రజలకు ఆదర్శంగా ఉండాలే తప్ప వ్యసనపరుడిగా కనబడకూడదు" అన్నాడు సుబోధుడు.

"నేను వసంతసేనను వివాహమాడదల్చు కొన్నాను. రాజు సామాన్యస్త్రీని వివాహమాడటాన్ని ఆదర్శం కిందే భావించాలి కదా? నన్ను మన్నించి ఈ దిశలో ప్రయత్నాలు చేయండి!" అని మకరందుడు సుబోధుణ్ణి బతిమాలాడు.

"ఆ మాటకొస్తే రాజు చతుర్వర్ణాలవారినీ వివాహం ఆడవచ్చునని శాస్త్రాలు చెప్పినా, ప్రథమంగా క్షత్రియకన్యను వివాహమాడాలి. అందుచేత నువ్వు ముందుగా ఏ రాజకుమార్తెనో వివాహమాడు. పట్టపురాణి కోటలో అడుగుపెట్టిన తర్వాత కొంత వ్యవధినిచ్చి, నీవు వసంతసేనను రాజనర్తకిగా నియోగించవచ్చు. లేదా..."



"పాలకులకీ, ప్రజలకీ సామాజిక నియమాలు ఒకేలా ఉండాలి. నేను బహు భార్యాత్వానికి విరుద్ధుడను. అందుచేత ఆలస్యం చేయకుండా వసంతసేన తల్లిని సంప్రదించండి" మకరందుడు పట్టు పట్టడంతో సుబోధకుడికి ఏమీ తోచలేదు. తనకి రాజుతో ఎంత చనువున్నా, పెద్దరికంతో ఏకవచనంలో సంబోధించినా, రాజు రాజే!

"వివాహానికి కేవలం శరీరాకర్షణే కాదు, అభిరుచుల గురించి పరస్పరావగాహన ఉండాలి. అందాన్నేకాక గుణగణాలను కూడా పరిశీలించాలి కదా? మారువేషాల్లో పోదాం పద!" అన్నాడు సుబోధుడు. ఇద్దరూ వేషాలు మార్చి అగ్నిపాలెం చేరారు. ముందు హరిహరస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ లౌక్యంగా కొన్ని వివరాలు సేకరించారు. తర్వాత వసంతసేన ఇంటి అరుగు మీద నడుం వాల్చారు. అలసిన ప్రయాణికుల్లా సేద తీర్చుకోసాగారు. అలికిడి విని బయటకు వచ్చిన ఓ వృద్ధురాలిని చూసి సుబోధుడు లేచాడు. మకరందుడు అటు తిరిగి నిద్ర నటిస్తున్నాడు.

ఆమె ముఖంలో వార్ధక్య చిహ్నాలు ప్రస్ఫుటిస్తున్నాయి. తల బాగా నెరిసింది. తెల్లటి మేను, నుదుట కాసంత బొట్టుతో లక్ష్మీకళ తాండవిస్తోంది. ఆమెను చూడగానే సుబోధుడి మనస్సులో భక్తి భావం జనించింది.

"మీరు చాలా దూరం ప్రయాణం చేసిన బాటసారుల్లా కనబడుతున్నారు. ఉండండి, మంచినీళ్ళు తీసుకొస్తాను," అని లోపలికి వెళ్ళి ఓ తామ్రపాత్రలో నీళ్లు తెచ్చింది. సుబోధుడు మకరందుణ్ణి లేపాడు. ఇద్దరూ నీళ్ళు తాగి ఆమెకు కృతజ్ఞతలు తెలుపుకొన్నారు. ఆమె మకరందుణ్ణి తేరిపార చూసింది. అతనిలో రాజకళ ఉట్టిపడుతోంది. "మీరిద్దరూ సామాన్య బాటసారులనుకోను. మీరెవరో తెలిస్తే జంకు లేకుండా, లోపం రాకుండా ఆతిథ్యమిచ్చే అవకాశముంటుంది!" అంది వినమ్రంగా.

సుబోధుడు ఒక్కక్షణం ఆలోచించి "ఇతను మకరందుడు. మన అవంతీ దేశానికి రాజు, నేను మంత్రి సుబోధుణ్ణి. మారువేషంలో దేశపరిస్థితులను వీక్షించడానికి బయలుదేరాం!" అని నిజాన్ని ఓ అబద్ధంతో జోడించి చెప్పాడు.

"అయ్యయ్యో, ఎంతటి అపరాధం జరిగింది? లోపలికి రండి. స్నానాలు చేసి విశ్రాంతి తీసుకోండి. భోజనానికి వంట చేస్తాను" అని వారిని సాదరంగా లోపలికి తీసుకుపోయింది. పాలరాతితో నిర్మితమైన స్నానాలగదిలో ఇత్తడి గంగాళాల్లో ఉన్న చల్లటి నీటితో స్నానం చేశారు. తమకు ప్రత్యేకించిన గదిలోకి వెళ్లి సంచీలోని దుస్తులను తీయబోతుండగా, "ఆగండి, మీకు చక్కటి దుస్తుల్ని ఇస్తాను" అని లోపలికి వెళ్లి కొద్ది సమయం తర్వాత ఓ వెండి పళ్ళెంలో రెండు జతల దుస్తులు తీసుకువచ్చి వారి ముందుంచింది. దుస్తులు ధరించిన తర్వాత సుబోధుడు మకరందుణ్ణి నిశితంగా పరిశీలించాడు. "మకరందా! నువ్వు ధరించిన దుస్తులు ఒకనాడు నీ తండ్రి ధరించినవి! అవి ఈ ఇంట్లో ఉన్నాయంటే...? " ప్రశ్నార్థకంగా ఆగాడు. ఇద్దరూ ముందు చావిట్లోకి రాగానే వారిని ఆమె సుఖాసీనుల్ని చేసింది.

సుబోధుడు మకరందుని దుస్తుల వైపు చూపిస్తూ వృద్ధురాలి వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. ఆమె లోపలికి వెళ్లి ఓ వర్ణచిత్రంతో తిరిగివచ్చింది. దాన్ని సుబోధకుడికి అందించింది. అందులో ఉన్నది మకరందుడి తండ్రి శర్వానందుడు. పక్కనే ఆమె వయసులో ఉన్నప్పటి చిత్రం. చేతిలో ముద్దులు మూట కట్టే ఓ పసిపాప! "ఈ చిత్రాన్ని చూడగానే మీలో ఎన్నో ప్రశ్నలు ఉద్భవించవచ్చు. చిత్రంలో ఉన్నది మకరందుని తండ్రి శర్వానందుడు. నా పోలికలతో ఉన్న ఆ యువతి నా కూతురు నందిని. ఆ పసిపాప నా మనవరాలు వసంతసేన. నా పేరు ప్రియంవద. ఇక చిత్రాన్ని చిత్రించింది..." ప్రియంవద ఆగింది.

"ఆస్థాన చిత్రకారుడు గుణశేఖరుడని చూస్తేనే తెలిసిపోతోంది. అతను చాలా ఏళ్ల క్రితమే రాజ్యం నుంచి అదృశ్యమయ్యాడు. అతని అంతర్ధానం వెనుక...? " సుబోధకుడు ప్రశ్నార్థకంగా ఆగాడు.

"ఈ చిత్రం ప్రభావం ఉందనే చెప్పుకోవాలి. మేం ఉజ్జయినికి చెందినవారం. అక్కడ మహంకాళేశ్వరుడి గుడిలో ఒకసారి వసంతోత్సవాలకి ఉజ్జయిని రాజు ఆదిత్యుడు చాలా మంది రాజ్యాధినేతల్ని ఆహ్వానించారు. ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాడు. ఆ సందర్భంగా పద్దెనిమిదేళ్ల నా కూతురు నందిని మొదటిసారిగా నృత్య ప్రదర్శన ఇచ్చింది. శర్వానందుడు నందిని అంటే వెర్రి వ్యామోహంలో పడిపోయాడు. రహస్యంగా మా ఇంటికి వచ్చి నందిని పట్ల అనురాగాన్ని వ్యక్తం చేశాడు. నందిని కూడా కాదనలేదు. అయితే అప్పటికే ఉజ్జయినిలో చాలామంది ప్రముఖులు కన్నెరికం చేయడానికి రాయబారాలు పంపి ఉన్నారు. నాకు నందినిని వృత్తిలోకి దింపడానికి ఇష్టం లేకపోయింది. అరంగేట్రం జరిగేవరకూ ఆగండి అని వాయిదా వేస్తూ వచ్చాను. ఈ సంగతే శర్వానందునితో చెప్పాను. స్థానికుల కారణంగా నాకు హాని కలగవచ్చునన్న భయాన్ని వ్యక్తం చేశాను. శర్వానందుడు ఆదిత్యునితో విషయం చెప్పి, ఆయన అంగీకారంతో మమ్మల్ని రాత్రికి రాత్రే ఈ రాజ్యానికి తరలించాడు.

"ప్రజా సమక్షంలో నందినిని తన రెండో రాణిగా పెళ్ళాడటానికి శర్వానందుడు ప్రయత్నం చేయబోగా నేనూ, తనూ వారించాం. మకరందా! నీ తల్లి మహా దొడ్డమనసు కలదని విన్నాం. శర్వానందుని పాలనలో ప్రజలు శాంతియుత జీవితాల్ని గడుపుతున్నారనీ విన్నాం. మాకు ఎవరి మనసులూ నొప్పించడానికి ఇష్టం లేకపోయింది. ఓ వారకాంతగా రాజు ప్రాపకంలో ఉంటే ప్రజలు పట్టించుకోరు కానీ, వివాహమంటే వ్యతిరేకత తలెత్తుతుంది. శర్వానందుడు ఒప్పుకోలేదు. మధ్యేమార్గంగా ఇక్కడికి దగ్గరలోనే ఓ భిల్ల గ్రామంలో ఉన్న కాళీ దేవాలయంలో భిల్లుల సాక్షిగా నందినిని వివాహమాడాడు. వారి బాగోగులని గురించి శ్రద్ధ చూపే శర్వానందుడంటే వారికి చాలా అభిమానమనీ, వారు నోరు మెదపరనీ గ్రహించాను. తర్వాత మాకు ఈ ఇంట స్థిర నివాసమేర్పరిచాడు. వేట వంకనా, సంచారం వంకనా వచ్చి కాపురం చేశాడు. నందినికి ఇక్కడే పురుడు పోశాం. రాజభోగాలతో అంతఃపురంలో పెరగాల్సిన పిల్లని అజ్ఞాతంలో ఉంచాల్సి వచ్చిందే అని మీ నాయన చింతించేవాడు.

"ఒకరోజు శర్వానందుడు తన ఆస్థాన చిత్రకారుడు గుణశేఖరుడిని తీసుకొని వచ్చి ఈ వర్ణచిత్రాన్ని వేయించాడు. పదిరోజుల తర్వాత గుణశేఖరుడు వచ్చి నందినితో పొందుకోరాడు. కాని పక్షంలో రహస్యాన్ని బయట పెడతానని బెదిరించాడు. ఇలాంటి మాటన్నాడని తెలిస్తే రాజు తనకి శిరచ్ఛేదం చేయిస్తారని నచ్చచెప్పాను. 'రాజు నా శిరచ్ఛేదానికి గల కారణం ప్రజలకు చెప్పాలి. అది అతనికి సాధ్యం కాని పని! అందునా సరిహద్దుల్లో పొరుగు సేనలు అలజడి సృష్టిస్తున్నాయని కబురంది

శర్వానందుడు నిన్న రాత్రే అక్కడికి వెళ్ళాడు. నాకోరిక తీరిస్తే రాజు వచ్చేలోగా రాజ్యం వదిలి వెళ్ళిపోతాను. కాని పక్షంలో ఈ కబురు యిప్పుడే ప్రచారం చేసి పరారౌతాను!' అని మొండిగా మాట్లాడాడు.

"ఇక్కడ మా పరువు ముఖ్యం కాదు. వారవనితను వివాహమాడాడన్న వార్త ప్రబలితే రాజు మీద ప్రజల గౌరవం తగ్గవచ్చు. ఆ కారణంగా వ్యతిరేక శక్తులు అలజడి చేయవచ్చు. అందుకని చిరునవ్వు పులుముకొని, నందిని ఋతుక్రమంలో ఉందనీ, మర్నాడే శుద్ధిస్నానమనీ, అదయ్యాక రమ్మని నమ్మించాను. ఆనందంగా వెళ్ళిపోయాడు. నేను భిల్లు నాయకుడితో విషయం చెప్పాను. మర్నాడు భిల్లు నాయకుడు దారి కాసి, గుణశేఖరుణ్ణి మట్టుబెట్టి ఎక్కడో పాతిపెట్టేశాడు."

"అలజడుల అణచివేతలో తగిలిన శరాఘాతం కారణంగా రాజవైద్యులు శర్వానందుడి కుడికాలు తీసివేశారు. మేము మళ్ళీ ఆలోచనలో పడ్డాం. రాజుకి ఇప్పుడు ఒంటరిగా రావడం కుదరదు. ఎవరో ఒకరు తోడు రావాలి. నమ్మకద్రోహం జరిగితే వ్యవహారం మళ్ళీ మొదటికి వస్తుంది. భిల్లులతో మారువేషంలో వెళ్ళి, రాజుని బతిమలాడి రాజ్యం వదిలి వెళ్లడానికి అనుమతి తీసుకున్నాను. రాజ్యం వదిలి కోసల దేశం వెళ్లాను. భిల్లు నాయకుడు కూడా రాజుకేవో వనమూలికలిచ్చి మా పట్ల మరుపుని కలిగించాడు. కోసల దేశంలో పిల్లకి నృత్యగానాదులలో శిక్షణ ప్రారంభించాను. భర్త మీది ప్రేమతో నందిని చిక్కిశల్యమై చివరికి తనువు చాలించింది. వసంతను పెంచుతూ వచ్చాను. శర్వానందుడి మరణ వార్త విని తిరిగి ఈ ఊరు వచ్చాను. మాకు తెలిసిన భిల్లులు కూడా కొందరు కాలగర్భంలో కలిసిపోయారు."

మకరందుడు మ్రాన్పడిపోయాడు. సుబోధుడు మకరందుని వైపు వాత్సల్యంతో చూస్తూ అన్నాడు. "మకరందా! ఒక్కోసారి అద్భుతాలు జరుగుతాయి. ఈ నాటి ఈ దేశసంచారం నీకో సోదరి ఉందని తెలియజేసింది. అవునూ, వసంత ఎక్కడ? "

"నువ్వు ఎవరో తెలియగానే, ఆనందం పట్టలేక 'నీ సోదరుడొచ్చాడని' సేనతో చెప్పాను. ఇంతవరకూ ఒంటరిగా పెరిగిన పిల్ల, నీముందుకెలా రావాలో తెలియక వంటగదిలో చేరి తర్జన భర్జన పడిపోతోంది." అంది ప్రియంవద నవ్వుతూ.

మకరందుడు మనసుని స్వాధీనంలోకి తెచ్చుకొన్నాడు. లేచి, "చిన్నమ్మమ్మా, నమస్కారం!" అని పాదాభివందనం చేశాడు. ప్రియంవద మకరందుణ్ణి లేవనెత్తి అక్కున చేర్చుకొంది. మకరందుడు వంటింటివైపు దారితీశాడు. నుదుట శ్వేద బిందువులతో కనబడ్డ వసంతసేన అతనికిప్పుడు ఆత్మీయత కురిపిస్తున్న వర్షంలా కనబడింది. దరిచేరి, భుజాల మీద చేతులు వేసి నుదుట ముద్దాడాడు. "సమాజాన్ని సరిగా అంచనా వేసిన నీ అమ్మా, అమ్మమ్మల ఆదర్శమనూ, లేదా వారిని ఒప్పించలేని మన నాన్న పిరికితనం వల్లన బంగారంలాంటి బాల్యాన్ని పోగొట్టుకొన్నావు. వచ్చే శుక్రవారం రక్షాబంధన దినం. అమ్మమ్మతో వచ్చి నా చేతికి తోరణం కట్టు. జరిగిందంతా చెప్పి సభాముఖంగా, సగర్వంగా నువ్వు నా సోదరివని వెల్లడిస్తాను. ఇకనుంచీ మీ నివాసం రాజభవనంలోనే!"

మకరందుడి మాటలు విని ముగ్గురూ ఆశ్చర్యపడ్డారు. ప్రియంవద కూడదీసుకొంటూ అంది. "నాయనా! తొందర పడుతున్నావేమో ఆలోచించు. రాజమాత మనసు..."

"మహా దొడ్డదని మీరే చెప్పారు. ఆ రోజున ఒక భార్యగా మా నాన్న ప్రవర్తనకి అభ్యంతరం తెలిపేదేమో నాకు తెలియదు కానీ, ఈ రోజు నా తల్లిగా మట్టుకు అభ్యంతరం తెలుపు తుందని నేననుకోను. ఓ కూతురు లేదన్నలోటు నా తల్లి ఎన్నో సార్లు వ్యక్తం చేసింది. ఇంటి ఆడపడుచుని తెస్తున్నందుకు సంతసించి ఆదరిస్తుందే కానీ, తిరస్కరించదు" అన్నాడు మకరందుడు ఆవేశంగా.

సుబోధుడు సమ్మతించాడు. అన్నా చెల్లెళ్ళిద్దరూ మాట్లాడుకుంటూంటే ఆశ్చర్యంగా వినసాగాడు. ఈ రోజు వరకూ వారికెవరికెవరో తెలియదు. తెలిసిన తర్వాత రక్తసంబంధంలోని ఆకర్షణ సుబోధుడికి అవగాహన కావొచ్చింది. దైవేచ్ఛగానేమో తను ముందుగా మకరందుని ఆనవాలు చెప్పినట్లయింది. అటుపైన ప్రియంవద ఎంతోకాలం దాచిన రహస్యాన్ని చెప్పింది. లేకపోతే ఈ సమావేశం ఎంతటి విపరీత పరిస్థితులకు దారితీసేదో?

పొద్దు పోయే వరకూ కబుర్లు చెప్పుకుంటూనే ఉండిపోయారు. తర్వాత ప్రియంవద అందరికీ మధుర పానీయాలందించి... "చీకటి పడింది. వేరుగా అనుకోకండి. మీరు వెంటనే ఎవరి కంటా పడకుండా వెళ్తే మంచిది" అని తొందర చేసింది.

ఇద్దరూ బాటసారుల దుస్తుల్లోకి మారి రాజధాని బాటపట్టారు. దారిలో మకరందుడు సుబోధునితో, "నన్నో విషయం బాధిస్తోంది. వారకాంతల క్షేత్రాలలో పుట్టి, అన్ని హక్కులు పోగొట్టుకొన్న బిడ్డలకి సమాజంలో ఏ స్థానముంటుందో, వారి మనోప్రవృత్తి ఎలా ఉంటుందో ఆలోచిస్తే, ఆందోళనగా ఉంది. ఈ ఘటనతో నాకు కనువిప్పు కలిగింది. నా నిర్ణయానికి ఇదీ కారణమే. ఈ విషయమై కొన్ని రాజ్యాంగ నియమాల్ని త్వరలో రూపొందించాలి," అన్నాడు. సుబోధుడు అంగీకరించాడు.

ఆ రాత్రి వసంతకు నిద్రరాలేదు. పక్కనే ఉన్న ప్రియంవద మనవరాలి మీద చేయి వేసి, "సేనా! నిద్ర రావట్లేదా? " అని ప్రశ్నించింది.

"రాజభవనంలో అడుగుపెట్టాలంటే భయం వేస్తోందమ్మమ్మా! జనాలు భయం వల్ల కానీ, లేదా భక్తి వల్ల కానీ మకరందుణ్ణి పొగిడినా, తగుదునమ్మా అని రాజ సౌకర్యాలు పొందడానికి స్వార్థంతో వచ్చారన్న అపప్రథ వస్తుందని భయంగా ఉంది!"

"నువ్వన్నమాట నిజమే! మకరందుడు సమర్థంగా, సభాముఖంగా అందర్నీ ఒప్పించగలిగినా, రాజ బంధువులూ, రాజోద్యోగులూ, పరిచారికలూ, నీ పట్ల ఎలా ప్రవర్తిస్తారా, నీ గురించి ఎలా ఆలోచిస్తారా అన్న సందేహం నన్నూ బాధిస్తోంది. నీలో రాజబీజం ఉన్నా, రాచరక్తం ఉన్నా, నువ్వు వారకాంత క్షేత్రంలో పుట్టినదానవు కాబట్టి చాలామందికి నీ పట్ల అలుసు కలగవచ్చు. ఎవరూ ముందుకు రాని కారణంగా మకరందుడు నీకు వివాహం కూడా చేయలేపోవచ్చు" అంది ప్రియంవద.

"రాజభవనానికి వెళ్తే నా కారణంగా అన్నకి కూడా వివాహం కాకపోవచ్చునేమో? " వసంతసేన తన సందేహాన్ని వెలిబుచ్చింది.

"ఆ అవకాశమూ లేకపోలేదు! అయినా జరిగేదేదో జరుగుతుంది. అంతవరకూ రానీ చూద్దాం! నిద్రపోడానికి ప్రయత్నించు."

"అవును అమ్మమ్మా! నా జన్మ రహస్యాన్ని వారికెందుకు చెప్పావు? అలా చెప్పకపోతే ఈ తలనొప్పి ఉండేది కాదుకదా? "

"చూడమ్మా సేనా! పురుషుల మనస్తత్వాలని చదివీ చదివీ తల నెరిసిపోయింది. హరిహరస్వామి దేవాలయంలో కార్తీక జ్యోతి ప్రజ్వలనం జరుగుతున్నప్పుడు మారు వేషంలో ఉన్న మకరందుణ్ణి చూశాను. అతని చూపులనూ గమనించాను. అయితే అతను రాజకుమారుడని అప్పుడు తెలియదు. ఈ రోజు వారిద్దరూ మన అరుగు మీద చేరినప్పుడు అతన్ని గుర్తించాను. అతని మనోగతాన్ని అవలీలగా గ్రహించాను. శర్వానందుడి కుమారుడని తెలియగానే నిజం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేకపోతే పరిణామాలు దారుణంగా ఉండేవి. అయితే రాజాచారంగా, పురుష లక్షణంగా అతను చేసిన ప్రయత్నం మాటటుంచి, నిజం తెలిసిన మరుక్షణం అతనిలో మార్పుని గమనించాను. అతను నిన్ను మనసా వాచా సోదరిగా స్వీకరించాడు. ఆ భావన నీకు రక్షణగా ఉన్నా, సామాజిక అంశాలు వెంటాడుతూనే ఉంటాయి! పడుకో, అట్టే ఆలోచించకు. రేపు నీ అన్నకి చమ్కీ జలతారులతో రక్షాబంధన తోరణం చెయ్యి"

ఉదయమే మకరందుడు సుబోధుణ్ణి వెంటబెట్టుకొని రాణివాసానికి వెళ్ళి తల్లికి ప్రణమిల్లాడు. సుబోధుడు రాజమాత కనకావతికి జరిగిన విషయాన్ని దాపరికం లేకుండా వివరించి, మకరందుడి నిర్ణయాన్ని గురించి చెప్పాడు.

కనకావతి స్థిరంగా అంది. "మకరందా! మీ నాయన నందిని సంగతి ఏనాడో నాకు చెప్పారు. ఆయన దాపరికం లేని మనిషి. అయితే వారకాంతను వివాహమాడటమనేది సంఘం ఆమోదించని నిజం. అయినా, మీ నాయన నందినిని రహస్యంగా వివాహమాడాడు. వసంతసేన పుట్టగానే, గుట్టుగా తీసుకువచ్చి ఆమెను నా పాపగానే పెంచుదామని చెప్పాను. నందినికి గర్భశోకం కలిగించలేనని మీ నాయన నిరాకరించారు. అటుపైన వారి ప్రసక్తి తీసుకురాలేదు. ఈ రోజు నీ నిర్ణయం మంచిదే. రాచమర్యాదకి భంగమని అలజడి లేవక తప్పదు. అయినా నీ కోరిక ప్రకారమే కానియ్యి."

మకరందుడు సంతోషంతో, కారణం చెప్పకుండా రక్షాబంధన వేడుకలు ఘనంగా జరగాలని ఉద్యోగులను ఆజ్ఞాపించాడు.

మర్నాడు ఉదయం మకరందుడు సుబోధునితో మంతనాలు జరుపుతున్న వేళ... ఓ పరిచారకుడు వచ్చి, ఎవరో భిల్లుడు కలవడానికి వచ్చాడని చెప్పగా, అతగాణ్ణి లోపలికి తీసుకురమ్మన్నారు. భిల్లుడు ప్రవేశించి ఇరువురికీ ప్రణమిల్లి, ప్రియంవద అందివ్వమని చెప్పిందంటూ ఓ అరటి ఆకు పొట్లాం అందించి, చేతులు కట్టుకొని నిలబడ్డాడు. సుబోధుడు దర్భగడ్డితో వేసిన ముడిని విప్పి, ఆకు మడతల్ని తీయగానే రెండు అందమైన రక్షాబంధన తోరణాలు కనబడ్డాయి. మణికట్టు బిళ్లల వెనుక అమర్చిన తాళపత్రాలు కనబడ్డాయి. ఇరువురూ ఆశ్చర్యంగా చూశారు. ఒక దాని మీద 'సోదరసమానులు సుబోధుడికి ఆశీర్వచనాలతో ప్రియంవద' అని ఉంది. రెండో దాని మీద 'అన్నకి ప్రణమిల్లుతూ వసంతసేన' అని ఉంది. రెండు నిమిషాలలో ఆ అక్షరాలు అదృశ్యమైపోయాయి. సుబోధుడు ఒక్కసారిగా అప్రమత్తుడయ్యాడు. "ప్రియంవద ఈ పొట్లాన్ని నీకెప్పుడిచ్చారు? " అని ప్రశ్నించాడు.

"నిన్న సాయంత్రం అమ్మ మా గూడేనికి వచ్చి ఇచ్చింది. సూర్యోదయానికి ముందే లేచి బయలుదేరి వచ్చాను," అన్నాడు భిల్లుడు.

"మకరందా! నా మనసు కీడు శంకిస్తోంది పద!" అని ఒక్క ఉదుటున లేచాడు. ఇద్దరూ అశ్వారూఢులై అగ్నిపాలెంకి దౌడు తీశారు. అక్కడ ప్రియంవద గృహం కాలి, మసిబారిన గోడలతో కనబడింది. స్థానిక ప్రజలు అప్పటికే అగ్నికి ఆహుతైన మృతదేహాల్ని వెలికి తీశారు.

"బతికుంటే వీళ్ళెందరి కొంపలు కూల్చేవారో? " జనాల్లో సంభాషణలు రూపు దాలుస్తున్నాయి.

మకరందుడికి ఆవేశం పెల్లుబికింది. సుబోధుడు మకరందుడి చేయి పట్టుకొని దూరంగా తీసుకొని పోయి అన్నాడు. "మకరందా! ఏదో రసాయనంతో రాసిన అక్షరాలు మనం పొట్లం విప్పిన కొద్దిక్షణాల్లోనే మాయమయ్యాయి. అంటే ప్రియంవద తమను జ్ఞాపకాల్లోంచి శాశ్వతంగా తుడిచేసుకోమని సందేశం పంపింది. రాజు గౌరవాన్ని కాపాడేందుకు వారీ నిర్ణయం తీసుకొన్నారని అనుకోవాలి. ప్రియంవద వారకాంతే కావొచ్చు. కానీ ఆమె నిత్యసువాసిని. రాజు శ్రేయస్సూ, సమాజ శ్రేయస్సూ పరస్పరాధారాలు. ఆ సమాజ శ్రేయస్సు కోసమే వారు ఆత్మత్యాగం చేసుకొన్నారు. ప్రియంవద తన దేహాన్ని జనాలకి అర్పించి ఉండొచ్చుకాక, కానీ తన మనసును దేశానికే అర్పించింది. ఈ కారణంగా ఆమెను పతివ్రతగా కాదు, అంతకు మించి దేశవ్రతగా పూజించాలి. నువ్వన్నట్టు వారకాంతలకి రాజ్యాంగబద్ధ రక్షణ, వారి సంతానానికి హక్కులు కల్పించి, ఇతర జీవనమార్గాలు రచించి, నెమ్మదిగా ఈ వ్యవస్థని రూపుమాపాలి. ఇదే వారు పంపిన రక్షాతోరణాలకి సరైన కానుక!"

"మీరన్నది నిజం. క్షణికమైన నా చపలత్వానికి, అందునా ఆమాటకొస్తే మా తండ్రిగారి కారణంగా కూడా ఈ కుటుంబం బలైపోయింది. సమాజానికి మార్గదర్శకత్వం చేయాల్సిన నేను ఇక సమాజమంటే భయపడదల్చుకోలేదు. వీటన్నిటితో బాటు సంస్కరణలకూ వెంటనే నడుంకడతాను." మకరందుడు దృఢనిశ్చయంతో అన్నాడు.

ఇద్దరూ అశ్రునయనాలతో ప్రియంవద, నందిని, వసంతసేనల ఆత్మశాంతికై హరిహరస్వామిని మౌనంగా ప్రార్థించారు.

చందన న్యాయం



చుక్క చందనాన్ని రాసుకోగానే ఒంటికి చల్లదనం కలుగుతుంది, పరిసరాలూ పరిమళిస్తాయి. ఆత్మ అతి సూక్ష్మంగా ఉన్నా శరీరాన్ని నడిపిస్తుంది. ఇదే చందన న్యాయం. ఆత్మశక్తిని నమ్ముకున్నా జీవశక్తిని విస్మరించలేం కదా! పట్టుదల ఉంటే పరిమితులు అడ్డు కావు. జనాన్ని కదిలించడానికి యుగపురుషులే కానక్కర్లేదు. చందన న్యాయాన్ని గుర్తుంచుకుంటే, ఇంతింతై వటుడింతై అన్నట్టు ప్రతి మనిషీ విశ్వరూపాన్ని చూపగలడు.



పింగళి వెంకట రమణారావు, విశ్రాంత జనరల్ మేనేజర్, ఓఎన్జీసీ, హన్మకొండ, వరంగల్లు
99496 94396

వైద్యులూ! భాషను బతికించండి

డా.పి.హెచ్.బి.యస్.శర్మ

సృష్టిలో అన్ని జీవులూ అనుభూతులను ఎంతో కొంత గ్రహిస్తాయి. కానీ వాటిని ఇతరులకు వివరించగలిగేది మనిషొక్కడే. అందుకు అతనికి ఉన్న ఏకైక సాధనం భాష.

మనకెన్ని భాషలు వచ్చినా... ఆనందం, విచారం, బాధ, నొప్పి వంటి ఏ అనుభూతినైనా, తొలుత వ్యక్తపరిచేది 'మాతృభాష'లోనే కదా. మన బాధను తెలుగులో చెబుతాం. కానీ దురదృష్టవశాత్తూ అదెందుకు వచ్చింది, ఎంత కాలం ఉంటుంది? దాని తీవ్రత ఏమిటి? రోగనిర్ధరణకు ఏం పరీక్షలు చేయాలి? ఆ పరీక్షల్లో వచ్చిన ఫలితాలు ఏమిటి? చికిత్స ఏమిటి? ఎలాంటి చికిత్స అవసరం? ... ఇవన్నీ రోగులు పరాయి భాషలో వింటున్నాం.

ఇప్పుడే కాదు... మొదటి నుంచీ చాలా మంది వైద్యులు ప్రజలకు అర్థం కాని భాషలోనే మాట్లాడుతుంటారు. ఇది వరకు సంస్కృతంలో, ఇప్పుడు ఇంగ్లిషులో. ఈ పద్ధతికి స్వస్తి పలికి అన్ని విషయాలనూ సాధారణ రోగులకు కూడా అర్థం అయ్యేట్లు మన మాతృభాష - తెలుగులో వివరిస్తే రోగులకు కొండంత ధైర్యం వస్తుంది.

సరే, వైద్యులెందుకు సామాన్యులకు అర్థం కాని భాష మాట్లాడతారంటే, దానికీ కారణాలు లేకపోలేదు... సాంకేతిక పదాలను సరిగ్గా వివరించేందుకో, తెలుగు సమానార్థకాల కొరత వల్లో, అర్థమైనా కాకపోయినా, ఇంగ్లిషు వంటి (వైద్యశాఖలకు సంబంధించిన అనేక సాంకేతిక పదాలు గ్రీకు - లాటిన్ వంటి భాషల నుంచి తీసుకొన్నవే) ఇతర భాషా పదాలనే వాడుతున్నారు.

గత రెండు దశాబ్దాల్లో సాంకేతిక విజ్ఞానం విశేషాభివృద్ధి చెందింది. వైద్య విజ్ఞానం కూడా అనూహ్యంగా వృద్ధి చెందుతోంది. గతంలో చికిత్స లేని, కనీసం రోగ నిర్ధరణ కూడా లేని అనేక వ్యాధులను గుర్తించే ప్రక్రియలతో పాటు చికిత్సా పద్ధతులూ అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు పెద్ద నగరాల్లో మాత్రమే లభించే అనేక వైద్యసేవలు, ఇటీవల చిన్న చిన్న పట్టణాల్లో కూడా అందుబాటులోకి వచ్చాయి. ఇది మరింత వేగవంతమూ అవుతుంది.

భాష విషయానికి వస్తే... సాంకేతిక పదాలకు తెలుగెందుకు? వాటిని అట్లానే ఉపయోగించవచ్చు కదా! అని వాదించే వారి సంఖ్య తక్కువేమీ కాదు. ఎవరికైనా వారి రోగ తీవ్రతను గురించి వారి మాతృభాషలో వివరిస్తున్నపుడు చక్కగా అర్థం చేసుకుంటారు. అంతే కాదు అలా వివరించే వారిని ఆత్మీయులుగా చూస్తారన్నది చాలా మంది వైద్యుల అనుభవంలోనిదే. దీన్ని దృష్టిలో పెట్టుకునే కార్పొరేట్ ఆసుపత్రులు 3, 4 భాషలు మాట్లాడగలిగిన వారిని ఉద్యోగులుగా నియమించుకోవటానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి.

ఇది వరకు ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పరిమితంగా ఉండేది. తినే ఆహారం, తాగే నీరు, చివరికి వాతావరణం కూడా స్వచ్ఛత కోల్పోవడం వల్ల రోగాల సంఖ్య బాగా పెరిగింది. ఆధునికత మూలంగా ఇప్పటి తరం అనేక కొత్త రుగ్మతలతో బాధపడుతోంది. కానీ వైద్యపరిభాషకు తెలుగు పద సృష్టి కానీ అన్వేషణ కానీ జరగడంలేదు.

నిజానికి ఇప్పుడే వైద్యంలో తెలుగు అవసరం ఎక్కువగా ఉంది. ఒకప్పుడు రోగులు తక్కువగా ఉండటం వల్ల వైద్యులు ఓపిగ్గా, వారితో మాట్లాడేవారు. వ్యాధిని గురించి విపులంగా చెప్పేవాళ్లు. ఇప్పటి వైద్యులకు అంత సమయం, ఓపిక ఉండటం లేదు. ఉన్న కొద్ది సమయంలో రోగులకు వారి సమస్యలను వివరంగా అర్థమయ్యేట్లు చెప్పాలంటే అది తెలుగుతోనే సాధ్యం.

రోగులకు ఇచ్చే ప్రిస్క్రిప్షన్, ఓపీ చీటీలూ తెలుగులో ఉండాలి. నిర్ధరించిన వ్యాధి, నిర్ధరణ పరీక్షల పేరు, వాటి అవసరం, వాడవలసిన మందులు, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార నియమాలు వంటి వివరాలను తెలుగులో పేర్కొంటే రోగులకు ఎంతో మేలు.



రోగులకు ఇచ్చే ప్రిస్క్రిప్షన్, ఓపీ చీటీలూ తెలుగులో ఉండాలి. నిర్ధరించిన వ్యాధి, నిర్ధరణ పరీక్షల పేరు, వాటి అవసరం, వాడవలసిన మందులు, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార నియమాలు వంటి వివరాలను తెలుగులో పేర్కొంటే రోగులకు ఎంతో మేలు.

అంతే కాదు, మందుల ప్యాకింగ్‌పై వాడే విధానం, దుష్ఫలితాలు, పాడయ్యే తేదీలు తెలుగులో ఉంటే వాటిని ఉపయోగించే వారికి ఇబ్బంది ఉండదు.

జీవన వేగం పెరిగింది. అన్ని రంగాలలో వ్యాపార ధోరణి పెరిగింది. సామాజిక బాధ్యతతో అందించాల్సిన విద్య - వైద్యం వంటి సేవలు కూడా పక్కా వ్యాపార రంగాలుగా మారిపోయాయి. తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు వినియోగదారుల్ని ఎన్నో రకాలుగా మోసగిస్తుండటం చూస్తూనే ఉన్నాం. అటువంటి మోసపూరిత ధోరణులకు వైద్యరంగం మినహాయింపేమీ కాదన్నది తరచూ రుజువవుతూనే ఉంది. ఫలితంగా నిజాయితీగా పనిచేసే వైద్యులు కూడా అనుమానపు చూపుల్ని ఎదుర్కొనాల్ని వస్తోంది. అందుకే వైద్యులు - వైద్య సంస్థలు తమ నిజాయితీకి మచ్చ రాకుండా ఉండాలంటే 'తెలుగులో చికిత్స'లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భాష ప్రాధాన్యం గురించి నా అనుభవం ఒకటి చెబుతాను... ఒకమ్మాయి తన చెల్లెల్ని ఒక సంవత్సరం కార్డియాలజి టెక్నీషియన్ కోర్సు చదివించేందుకు తీసుకుని వచ్చింది. ఆ అమ్మాయి ఆంగ్ల మాధ్యమంలో ఇంటర్ చదివింది. కానీ భౌతికశాస్త్రంలో మూడు సార్లు తప్పింది. అదే సబ్జెక్టులో తప్పడానికి కారణాలను విచారిస్తే ఆసక్తికర విషయాలు తెలిశాయి. విషయం అర్థం కాకపోవడం, ఫలితంగా బట్టీ పట్టే ప్రయత్నంలో సరిగా గుర్తుంచుకోలేకపోవడం వల్ల పరీక్ష సరిగా రాయలేకపోయింది. అదే తెలుగులో అయితే కనీసం విషయం అర్థం అయ్యేది కదా అనిపించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వైద్య విభాగం ఇంటర్‌లో ఎన్నో టెక్నీషియన్, నర్సింగ్ కోర్సులను (10+2) ప్రవేశ పెట్టాయి. వీటి బోధన ఆంగ్లంలో జరుగుతున్నా, పరీక్షల్లో జవాబులు తెలుగులో రాసేందుకు అనుమతిస్తున్నారు. కానీ చక్కటి తెలుగు పాఠ్యపుస్తకాల కొరత ఎక్కువగానే ఉంది. అయినా ఈ పరీక్షల్లో ఆంగ్లంలో జవాబులు రాసే వారికన్నా తెలుగులో రాసే విద్యార్థులకు ఎక్కువ మార్కులు వస్తున్నాయన్నది ప్రస్తావనార్హం. తెలుగు సమాధాన పత్రాలను పరిశీలిస్తే... అవగాహన కాని, అర్థం కాని, నోరు తిరగని సాంకేతిక పదాలను గుర్తుంచుకోలేక పోవటం వల్ల రావాల్సినన్ని మార్కులు రావటంలేదని అనిపించింది.

ప్రతి మనిషికీ అతి ముఖ్యమైంది వైద్యం. అటువంటి వైద్య శాస్త్రంలోని సాంకేతిక పదాలకు అర్థం / భావం, వాటి వివరణలను తెలుగు భాషలో అభివృద్ధి చేసుకోవలసిన అవసరం ఎంతో ఉంది. కానీ దురదృష్టవశాత్తూ నేటి సాంకేతిక వైద్య విజ్ఞానాన్ని తెలుగులో విపులీకరించే గ్రంథాలు కానీ, వైద్య విజ్ఞాన పదాలకు తెలుగు భావం కానీ అందుబాటులో లేవనే చెప్పాలి. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగింది. ఈ విషయంలో ఇతర ప్రాంతీయ భాషల్లో చాలా కృషి జరిగింది, జరుగుతోంది.

సాంకేతిక పదాలు, నూతనంగా వచ్చే సాంకేతిక పదాలకు, ముఖ్యంగా వైద్య శాస్త్రానికి సంబంధించిన సాంకేతిక పదాలకు, సులభంగా అర్థమయ్యే తెలుగు సమానార్థకాలను అభివృద్ధి చెయ్యాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు, మేధావులు, సామాజిక సంస్థలు తీసుకోవాలి. అప్పుడే భాష అభివృద్ధి చెందుతుంది. రోగులు కూడా అటువంటి వైద్య సంస్థలు, వైద్యులనే ఎంపిక చేసుకోవటం ద్వారా సొంతానికి ఎంతో మేలు చేసుకున్నట్టు అవుతుంది.

ప్రముఖ హోమియో వైద్యులు, హైదరాబాద్.
98494 43810

విభక్తులున్నాయి జాగ్రత్త!!

రంగనాయకమ్మ

ఈ వాక్యం చూడండి: 'ఈ నెల 19వ తేదీ సాయంత్రం, సోనియాగాంధీ, ప్రధాన మంత్రికి రాసిన లేఖలో శరద్ పవార్ ఇలా పేర్కొన్నారు.'

ఏం అర్థమైంది? ఇది చదవటం మొదలైనప్పుడు, సోనియాగాంధీ ప్రధాన మంత్రికి లేఖ రాసిందనీ, ఆ లేఖలో రాసినదేమిటో చదవబోతున్నామనీ, అనుకుంటూ ముందుకు వెళ్తాం. అక్కడ శరద్‌పవార్ ఏమిటి? అర్థం కాదు. అది తెలియాలంటే, ఆ వాక్యంలో లోపం ఏమిటో తెలియాలి. ఆ వాక్యాన్ని ఇలా చూడండి!

'ఈ నెల 19వ తేదీ సాయంత్రం సోనియాగాంధీకీ, ప్రధాన మంత్రికీ రాసిన లేఖలో శరద్‌పవార్ ఇలా పేర్కొన్నారు.'

ఇలా ఉండాల్సిన వాక్యం, అలా ఎందుకు ఉంది? రెంటికీ తేడా ఏమిటో చూడండి! మొదటి వాక్యంలో, 'సోనియాగాంధీ' పక్కన 'కి' లేకపోవడం కనబడుతుంది. అక్కడ 'కి'ని పెట్టేస్తే అంతా స్పష్టం అవుతుంది. ఆ 'కి' ఒక విభక్తి. దాన్ని ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టకపోవడం వల్లే, ఆ మొదటి వాక్యం అలా తయారైంది. ఇద్దరు వ్యక్తులకు వెళ్ళిన లేఖల సంగతి చెప్పాలంటే, ఆ సంగతి నోటితో చెప్పేటప్పుడైతే, 'సోనియాగాంధీకీ, ప్రధాన మంత్రికీ రాసిన...' అంటామా, 'సోనియాగాంధీ, ప్రధాన మంత్రికి రాసిన' అంటామా? ఇలా అంటే, సోనియాగాంధీయే ఉత్తరం రాసిన కర్త అయిపోదా? తెలుగు భాషలో విభక్తులు ఎక్కడెక్కడ అవసరమవుతాయో దానికి ఒక నియమం ఉంటుంది. కానీ దాన్ని రాతలో చాలామంది పాటించరు. పాటించకపోతే అది తెలుగు ఎలా అవుతుంది? నిజానికి అవదు, కానీ మన పత్రికల్లో అలా అవుతూనే ఉంది.

అలా రాసే పాత్రికేయుల్ని అడిగితే ఏమంటారంటే, 'వార్తలు రాసేటప్పుడు మేం చాలా ఒత్తిడిలో ఉంటాం. నగిషీలతో రాయలేం' అంటారు. కానీ, మాట్లాడేటప్పుడు, ఎంత ఒత్తిడిలో ఉన్నా విభక్తులు లేకుండా మాట్లాడం. విభక్తులు వాడటం నగిషీలు పెట్టడం అవదు.

◆ 'విజయసాయిరెడ్డి, జగన్‌పై నార్కో పరీక్ష నిర్వహించడానికి అనుమతించాలని కోరిన పిటీషన్ కొట్టివేత.' ఇలా ఒక టీవీలో ప్రసారమైంది.

ఇది ఎలా అర్థమవుతోంది? జగన్‌పై నార్కో పరీక్ష నిర్వహించడానికి అనుమతి కావాలని విజయసాయిరెడ్డి కోరాడనీ, కానీ ఆ అనుమతి దొరకలేదనీ! ఇది తప్పు దానికి ఇంకో అర్థం వస్తుందా? అసలు సమస్య ఏమిటంటే, 'పై' అనే విభక్తి ఒక చోట లోపించింది. అందువల్లే అలాంటి తప్పు అర్థం వచ్చింది. ఆ లోపం జరగకపోతే, ఆ వాక్యం ఇలా వస్తుంది:

'విజయసాయిరెడ్డిపై, జగన్‌పై, నార్కో పరీక్షలు నిర్వహించడానికి...' ఇలా, 'పై'ని ఎన్నిచోట్ల ఉండాలో అన్ని చోట్లా పెడితే, ఆ వాక్యానికి తప్పు అర్థం వచ్చేది కాదు.

◆ 'తెలంగాణ ప్రజలు, రాజకీయ నాయకులు, ఆమోదించినందునే రెండు ప్రాంతాలు కలపబడ్డాయని సీమాంధ్ర నేతలు వాదిస్తున్నారు.'

ఇది కాస్త అర్థం అవుతుంది. అయినా, మూడుచోట్ల దీర్ఘాలు ఉంటే, వాడుక భాషా నియమాలతో ఉండే వాక్యం తయారయ్యేది, ఈ విధంగా:

'తెలంగాణ ప్రజలూ, రాజకీయ నాయకులూ ఆమోదించినందునే, రెండు ప్రాంతాలూ కలపబడ్డాయని...'

ఇదే విషయాన్ని మాట్లాడేటప్పుడైతే, తప్పకుండా ఆ దీర్ఘాలతోనే మాట్లాడతాం. వరసగా రెండు కర్తలు (లేదా, రెండు కర్మలు) వచ్చినప్పుడు, ఇంగ్లిషులో అయితే, ఆ మాటల మధ్య 'అండ్' ఉంటుంది; హిందీలో అయితే, 'ఔర్' ఉంటుంది. తెలుగులో కూడా గ్రాంథిక పద్ధతిలో అయితే 'మరియు' ఉంటుంది. కానీ, వాడుక భాషలో అలాంటి మాట ఏదీ ఉండదు. అప్పుడెలా జరుగుతుందంటే, ఆ రెండు మాటల్నీ దీర్ఘాలతో పలకడమే! 'తల్లి తండ్రి' - కాదు, 'తల్లీ తండ్రీ'. 'రాత్రి పగలు' - కాదు, 'రాత్రీ పగలూ'.

'మాటల మధ్య కామాలు పెడతాం కదా? దీర్ఘాలెందుకు?' అంటారు కొందరు. కామా వల్ల కొంత విరామం వస్తుంది గానీ, మాటలకు దీర్ఘాలు రావు. దీర్ఘం చేసే పనిని కామా చెయ్యదు. మనం మాట్లాడేటప్పుడు దీర్ఘాలతో మాట్లాడతాం. ఆగిఆగి విరామాలతో మాట్లాడం. కర్తలూ, కర్మలూ, క్రియలూ - అని చెప్పుకుంటే, అదేదో కష్టమైన వ్యాకరణంలా అనిపిస్తుంది. ఆ మాటలు లేకుండా, 'మనం మాట్లాడేటప్పుడు ఎలాంటి పద్ధతులు ఉంటున్నాయి?' అని చూసుకుంటే చాలు. తేలిగ్గా అర్థమవుతుంది.

కొన్ని సందర్భాల్లో దీర్ఘాలు అత్యవసరం అవుతాయి. అలాంటి సందర్భాల్లో కూడా పత్రికల్లో దీర్ఘాల నియమం పాటించరు. అలాంటి వాక్యాలు, కొంచెం ఇబ్బందిగా అర్థమైనా, కుంటి కుంటిగానే ఉంటాయి.

◆ ఇది చూడండి: 'వారి చరిత్ర, ఏ పుస్తకాల్లో కనపడదు.' - ఇలా అంటామా?

'వారి చరిత్ర, ఏ పుస్తకాల్లోనూ కనపడదు.' - అని కదా అనాల్సింది. ఏకదీర్ఘం, అవసరమయ్యే సందర్భం అది.

రాసే వాళ్లందరూ, మాట్లాడేటప్పుడు ఒకే రకమైన దీర్ఘాలతో మాట్లాడరు కదా - అంటారేమో: కానీ, ఇక్కడ చూస్తోన్న ఉదాహరణల్లో మాత్రం, ఈ దీర్ఘాలు అందరి దగ్గరా, అన్ని తెలుగు మాండలికాల్లోనూ ఉండేవే.

◆ 'రాజకీయ పార్టీలు, నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలపబడ్డాయి.'

చదువుతుంటే మొదట అర్థం కాదు. 'రాజకీయ పార్టీలు' అనేదే కర్తలాగా కనిపిస్తుంది. కానీ కాదు. స్వార్థ ప్రయోజనాలు, నాయకులవే కాదు; రాజకీయ పార్టీలవి కూడా. అది తెలిసే విధంగా ఆ వాక్యంలో మాటలు ఉండాలి. ఒకచోట, ఒక్క అక్షరం మారితే అది జరుగుతుంది.

'రాజకీయ పార్టీల, నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం, ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలు కలపబడ్డాయి.' అసలు అర్థం ఇదీ! కానీ అది, ఒక విభక్తి లోపం వల్ల కనపడ లేదు. పత్రికల్లోనూ, పుస్తకాల్లోనూ కూడా బ్రహ్మాండమైన లోపాలు జరుగుతున్నాయి.

1. విభక్తుల లోపాలు
2. ఏక దీర్ఘాల లోపాలు
3. జంట దీర్ఘాల లోపాలు
4. క్రియల్లో లోపాలు

ఇంకా ఇలాంటివే కొన్ని. ఇవి అక్కడక్కడా కాదు; ప్రతీరోజూ, ప్రతిచోటా, ప్రతీ పేజీలోనూ! తరచుగా జరిగే పెద్ద లోపం విభక్తుల్ని సరిగా వాడకపోవడం. దీనివల్ల, కర్తలన్నీ తారుమారవుతాయి. ఈ విషయంలో, అన్ని పత్రికలూ ఒకటే. ఇక్కడ ఇచ్చే ఉదాహరణలు, అన్ని పత్రికల నుంచీ కొంతకాలంగా తీసిన వాటిలో కొన్ని మాత్రమే.

◆ 'తొలుత ఈ 1500 ఎకరాల కేటాయింపు ఆఫర్‌ను, సత్యం కంపెనీకి చెందిన రామలింగరాజు, రామరాజుకు ఇచ్చారు.'

ఇది చదివితే ఒక రాజు, ఇంకో రాజుకి ఆ ఆఫర్ ఇచ్చారేమో అనుకుంటాం. కానీ, విషయం అది కాదు. ఆ ఆఫర్‌ని ఆ రాజుకీ, ఈ రాజుకీ ఇద్దరికీ కూడా ఇచ్చిన విషయం అది. మరి, ఆ సంగతి ఆ వాక్యంలో తెలిసేలాగే లేదు. ఏమిటి లోపం? ఒకచోట విభక్తి లేక, మొదటి రాజే కర్త అయ్యాడు.

'ఆఫర్‌ని, సత్యం కంపెనీకి చెందిన రామలింగరాజుకీ, రామరాజుకీ, ఇచ్చారు' అని ఉండొద్దూ?

"ఆ విభక్తి లేకపోయినా తప్పేమీ రాదు. విషయం సరిగానే, ఆఫర్‌ని ఇద్దరికీ ఇచ్చినట్టే అర్థమవుతుంది" అని వివరించగలరేమో ఎవరైనా, చెప్పండి!

◆ 'ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుంచీ అన్ని రంగాల్లో తమకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు.'

'జరుగుతుందని' అనేది, భవిష్యత్తుని చెప్పే క్రియ. అది 'జరుగుతున్నదని' లేదా 'జరుగుతోందని' లేదా 'జరుగుతూందని' ఇలా ఉంటేనే సరైన అర్థాన్ని ఇస్తుంది. పత్రికల్లో, ఈ స్పృహ అనేక చోట్ల ఉండదు.

◆ ఇప్పుడు, 'బడు' క్రియల గొడవ! ఒక వాక్యంలో, చిన్న భాగం చూడండి:

'ఇక్కడ ఉండబడేటటువంటి...'

'ఉండటం' క్రియతో బడు రాదు. అది, కర్మలేని క్రియ. దీనితో 'బడు'ని తయారు చేస్తే, అర్థం లేని మాట అవుతుంది. దాన్ని, 'ఇక్కడ ఉండేటటువంటి' అని సాదాగా అనవచ్చు.

◆ 'బడు'క్రియలు రావడం, మహా ఇబ్బంది కలిగించే విషయం అనడానికి ఇంకో ఉదాహరణ:

'కాబట్టి ఏదైతే ది: 1-2-90 నాడు సీనియర్ అసిస్టెంటుగా నియామకం జరుగబడినదో అప్పుడు అతని మూలవేతనం రూ. 1180గా పొందుతాడు.'

'జరుగబడినదో' - కాదు. జరుపబడినదో - అని రావాలి. 'జరుగుట' అనేది, కర్మలేని క్రియ. దీనితో బడు క్రియ రాదు. అలా రాస్తే అది అర్థం లేని క్రియ అవుతుంది. 'జరుపుట' - అనేది, కర్మ ఉన్న క్రియ. కావాలంటే, దీనితో 'బడు'ని రాయవచ్చు. చక్కగా అనువాదాలు చేసే రచయితలైనా, ఈ బడు క్రియల్ని రాయడంలో, 'కాబడింది, అవబడింది' అనే తెలివితక్కువ తప్పులు రాసేసిన సందర్భాలు ఉన్నాయి. మొదట చూసిన వాక్యంలో, బడుని తీసేసి, సాదాగా రాసి చూడండి!

"...ఏదైతే సీనియర్ అసిస్టెంటుగా నియామకం జరిగిందో అప్పుడు" - ఇలా రాస్తే ఎంత తేలిక! 'జరిగిందో' అని రాయకుండా, 'జరుగబడిందో' ఎందుకు?

◆ ఈ వాక్యం చూడండి: 'అమెరికా, ఇతర అగ్రదేశాల నుంచి రియాక్టర్లను, ఇతర పరికరాలను, అత్యధిక ధరలకు దిగుమతి చేసుకునేందుకు చూపిస్తున్న తహతహ, నష్ట పరిహారం విషయంలో ప్రభుత్వం చూపిస్తున్న దాఖలాలు లేవు.'

మొదట్లో, 'అమెరికా'యే కర్త అనిపిస్తుంది. చివరికి ఎప్పటికో 'ప్రభుత్వం' అన్నమాట కనపడితే, ఇదేదో వేరే వ్యవహారం అని

పించి, మళ్లీ మొదటికి వెళ్లి, అప్పుడు కిందికొచ్చి, అలా పైకీ కిందకీ తిరిగితే, అంత ఓపికా, ఆసక్తీ ఉన్న వాళ్లకి... చివరికి ఇలా అర్థమవుతుంది:

'అమెరికా నుంచి, ఇతర అగ్రదేశాల నుంచి...' ఇలా మొదలుపెట్టి చదవండి ఆ వాక్యం అంతా. భారతదేశమే విదేశాల నుంచి రియాక్టర్లని ఎక్కువ ధరలతో కొంటోందనీ, కానీ ఆ రియాక్టర్ల వల్ల ఏవైనా ప్రమాదాలు జరిగితే నష్టపరిహారాల గురించి మాత్రం ఆలోచించడం లేదనీ, చెప్పినట్టు అర్థమవుతుంది. మొదట ఉన్న వాక్యం ఎందుకు అర్థం కాలేదు?

పత్రికల, టీవీల వార్తల్లో 95 శాతం తప్పులు, విభక్తుల లోపాల వల్లే. పత్రికల పాఠకులందరూ చదివేటప్పుడు ఆసక్తిగా చదవరు. ఏదో చదివి, సారాంశాన్ని పసిగట్టి వదిలేస్తారు. మరి సరిగా అర్థం కాని వాటితో ఏం తిప్పలు పడతారు? అయితే, వార్తలు ఎలాగూ అర్థం కావు గనక పత్రికలు తిరగేసేది, సినిమా బొమ్మల కోసమేగానీ, వార్తల కోసం కాదని అనుకోవలసి వస్తుంది.

◆ 'మూడోసారి ఆస్కార్ దక్కలేదు.'

అంటే, రెండుసార్లు దక్కిందిగానీ, మూడోసారి దక్కలేదు - అనే కదా? కానీ, అది కాదు. మూడోసారి కూడా దక్కలేదు. - అని చెప్పాలని. అయితే, అది ఎలా ఉండాలి? 'మూడోసారీ ఆస్కార్ దక్కలేదు' అని ఉండాలి. అవసరమైన చోట ఒక దీర్ఘం లేకపోవడం వల్ల, అర్థం తారుమారై, ఆస్కార్ రెండుసార్లు దక్కింది గానీ, మూడోసారి దక్కలేదు అనే అర్థం వచ్చింది. ఒక్క దీర్ఘం లేక! పాఠకులకు ఈ వార్త మీద సానుభూతే ఉండదు. 'రెండుసార్లు వస్తే చాలదా, మూడోసారి కూడా రావాలా? మరీ అంత ఆశా?' అనేస్తారు. వార్త తప్పు అర్థం ఇస్తే, ఎవరో ఒకరి కొంప మునుగుతుంది.

◆ 'హైదరాబాద్‌కు చెందిన టీవీ ఆర్టిస్టులు, జూనియర్ ఆర్టిస్టులు, విజయవాడకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారిని, అరెస్టు చేసినట్లు, రెండవ డివిజన్ ఏసీపీ కృష్ణారావు విలేఖరులకు సోమవారం నాడు తెలిపారు.'

ఏసీపీ కృష్ణారావు, విలేకరులకు ఏం తెలిపారు? - హైదరాబాద్ ఆర్టిస్టులు, ఒక విజయవాడ వ్యాపారిని అరెస్టు చేశారు - అనా? రాసింది అదే గానీ, నిజంగా జరిగింది అది కాదు. అరెస్టు చేసింది ఏసీపీయే. ఎవర్ని? హైదరాబాద్ టీవీ ఆర్టిస్టుల్నీ, జూనియర్ ఆర్టిస్టుల్నీ, విజయవాడ వ్యాపారిని కూడా. కానీ అలాగే ఉందా వాక్యం? జరిగింది అర్థం అవ్వాలంటే ఆ వాక్యం ఇలా ఉండాలి:

'...టీవీ ఆర్టిస్టుల్నీ, జూనియర్ ఆర్టిస్టుల్నీ, విజయవాడకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారినీ అరెస్టు చేసినట్లు ఏసీపీ విలేకరులకు తెలిపారు.'

ఇలా ఉంటే అరెస్టు చేసింది ఎవరో, అది జరిగింది ఎవరి మీదో స్పష్టంగా తెలిసేది. వాక్యం తప్పు అర్థాన్ని ఇవ్వడం వల్ల, అన్ని అరెస్టులు చేసిన ఏసీపీ కృష్ణారావుకి, ప్రమోషన్ వచ్చి డీసీపీ అయ్యారో లేదో!

◆ 'గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారిని అధికారానికి శాశ్వతంగా దూరంగా ఉంచేందుకు పన్నిన కుట్రలో భాగమే మహిళా రిజర్వేషన్ బిల్లు అని కల్యాణ్ సింగ్ ఆరోపించారు.'

గిరిజనులు కుట్ర చేశారనే అర్థం రావడం లేదూ? ఇంత నిందా?

'గిరిజనులనూ, వెనుకబడిన తరగతుల వారినీ, అధికారానికి దూరంగా...' - ఇలా చదవండి. కుట్ర చేసేది ఎవరో తెలియకపోయినా, అది గిరిజనుల కుట్ర మాత్రం కాదని తెలుస్తుంది.

◆ ఇది ఎలా ఉందో చూడండి!

'ఖమ్మంలో, ఇల్లెందులో, సత్తుపల్లిలో, మా కార్యకర్తలు, మహిళలపై కేసులు పెట్టారు.'

'మా కార్యకర్తలే మహిళలపై కేసులు పెట్టార'ని చెప్పుకుంటున్నారు. కార్యకర్తల మీద నింద పోవాలంటే, ఆ వాక్యం ఇలా ఉండాలి:

'... మా కార్యకర్తలపై, మహిళలపై, కేసులు పెట్టారు' - అని వార్తని తప్పుగా రాసిన పాత్రికేయుడు సంఘం వాళ్లకి నింద వచ్చేలాగ చేశాడు.

◆ 'పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న న్యాయపోరాటంలో...'

ఈ వాక్యం చాలా పెద్దది. చదవటం మొదలైనప్పుడు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయపోరాటం పోలీసులు చేస్తున్నారని చూస్తే, ముచ్చటా వేస్తుంది. ఆశ్చర్యమూ వేస్తుంది. తీరా చివరికి వెళ్తే, ఆ పోరాటం చేసేది ఆదివాసీలు! ఆ పోరాటం, ప్రభుత్వం మీదే కాదు, పోలీసుల మీద కూడా! అంటే,

'పోలీసులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా చేస్తున్న న్యాయపోరాటంలో, ఆదివాసీలు...' - అలా ఆ వాక్యం ఉంటే, పోలీసుల్ని చూసి తొందరపాటుగా ముచ్చటపడే తప్పు జరగదు కదా?

గమనించవలసిన విషయాల్లో ఇంకొకటి ఏమిటంటే: హఠాత్తుగా, రైలు ప్రమాదమో, బస్సు ప్రమాదమో, వరదలో - తుపానులో - అలా ఏదైనా విషాద సంఘటన జరిగితే, ఆ విషాద వార్తని అనేక పత్రికల్లో కవిత్వంతో ఇస్తారు. ఎక్కడైనా రెండు బాంబులు పడి జనం చచ్చిపోతే, అది, 'బాంబుల తోరణం!' బాంబుల్ని కూడా, మామిడాకుల తోరణంగా చూస్తారు మన పాత్రికేయులు.

మొన్న తమిళనాడు రైలుబోగీ తగలబడి జనం చనిపోతే, 'అగ్గీ-బుగ్గీ' అట! పదాల మధ్య లయ కావాలి, ఎలాంటి విషాదంలో అయినా! 'కాలిందా, పేలిందా?' అట! 'కూలిందా, వాలిందా?' అట! దుఃఖాన్ని సొగసుగా చెపుతారు! ఒక్క కరుణ పదం కూడా పడదు.

సరైన అర్థాలు రావాలంటే, నేర్వాల్సింది బ్రహ్మవిద్య కాదు; విభక్తులూ, దీర్ఘాలూ, అంతే.

బకబంధన న్యాయం

ఒకడు బకాన్ని (కొంగని) పట్టుకోవాలని అనుకున్నాడు. దాన్ని గభాలున పట్టేసుకుంటే పొడుస్తుందని భయం. అందుకని ఓ వెన్నముద్దని తీసుకువచ్చి కొంగ తలపై పెట్టాడు. ఆ వెన్న కరిగి, అది నెయ్యిగా మారి, కొంగ కళ్లలో పడగానే, దాన్ని సులువుగా పట్టుకోవచ్చునని అతడి ఆలోచన. 'తెడ్డు ఉండగా చెయ్యి కాల్చుకున్నట్టు' గోటితో పోయేదానికి గొడ్డలి వాడరాదు అని సూచించేది బకబంధన న్యాయం.

ప్రముఖ రచయిత్రి,
గుత్తల బేగంపేట్,
హైదరాబాద్

పెళ్లికి వెళ్లి వచ్చాను!

మన భాషలో 56 అక్షరాలు ఉన్నాయి కదా. ఇందులో సగం కూడా లేని ఆంగ్ల భాష అంతర్జాతీయ భాషగా వెలుగొందు తున్నప్పుడు మనకు ఇన్ని అక్షరాలేల అనుకున్నామో ఏమో గాని స్వచ్ఛందంగా కొన్ని, మనకు తెలియకుండానే కొన్ని అక్షరాలు మాయమైపోయాయి. **ఱ ఌ ౡ ౘ ౙ ఙ ఞ** మొదలైనవి నేటి రచనలలో ఎక్కడా కనపడవు. అయితే అందువల్ల వ్యవహారానికి కానీ, సంభాషణకు కానీ ఏ ఇబ్బందీ కలగటం లేదు. అవి మాయమైనా అంత లోపంగా అనిపించటం లేదు. రాత సరే... భాషకు అందాన్ని చేకూర్చే 'ఒత్తులు' కూడా మనవాళ్లు సరిగా పలకటం లేదు. మీ రచన ఎంతో బావ యుక్తంగా ఉంది, నా బావ కవిత్వం పద్యాలు చదివారా? 'నన్ను గురించి సబలో మీరు గోరంగా మాట్లాడారు. చాలా బాదాకరంగా ఉంది, అన్ని సౌక్యాలు దనవంతుల కేనా? పేదవారి బాదలు పట్టించుకోరా, మేమిక్కడ ఎంతో బాదాకరంగా బయంబయంగా బతుకుతున్నాము...' ఇలాంటి ఏ మాత్రమూ ఒత్తులు లేని మాటలు ఎన్నో నిత్యమూ వినిపిస్తూ ఉంటాయి. అలానే 'ళ' అక్షరాన్ని చాలా మంది ఎందుకు పలకటం లేదో అర్థం కాదు. నేను మొన్న పెల్లికి వెల్లి వచ్చాను. మల్లీ మల్లీ చెపుతున్నాను విను, ఎన్ని బల్లొచ్చినాయి సామాను తీసెకెల్ల డానికి? నేను పైకొస్తున్నానని నీకు కుల్లుగా ఉందా? అరటి పల్లు డజనెంతా? ఇలా నడుస్తోంది మన భాష. ఒత్తులు పలక్కపోవడం వల్ల తెలుగు భాష ఎన్నో ఒత్తిళ్లకు గురవుతోంది. ఈనాటి హీరో, హీరోయిన్లు కూడా మనం పెళ్లెప్పుడు చేసుకుందాం అంటారే గాని 'ళ' ఉచ్చరించరు. హిందీలో 'ళ' ఎక్కువ వాడరు. 'ల'యే వాడతారు. అది ఆ భాషకు సరిపోయింది. కానీ మరాఠీలో 'ళ' కచ్చితంగా వాడతారు. మనం ఎందుకు వదిలేశామో! ఉచ్చారణ దోషాలతో భాష వన్నె కోల్పోతోందని నటులు, మాటల రచయితలు, డబ్బింగ్ కళాకారులు తెలుసుకోవాలి.



– సూరంపూడి రాధాకృష్ణమూర్తి, హైదరాబాద్. 92465 73439

అతి పరిచయ న్యాయం

'అతి సర్వత్ర వర్జయేత్' అన్నది ఆర్యోక్తి. దాన్ని పరిచయాలకీ వర్తింపచేస్తుంది ఈ న్యాయం. అతి పరిచయానికి పోతే, కష్టపెట్టే మాట పడాల్సి వస్తుంది, అప్పుడు బాధపడి ఉపయోగం ఉండదు. ఒకే కంచం ఒకే మంచం అన్నంతగా ఉన్నా, ఒత్తిగిలి ఉండాలన్నదే సారాంశం. 'దగ్గర వాళ్లకే దగ్గులెక్కువ' అన్న సామెత ఇందుకే వచ్చింది. చనువు కాస్త చట్టుబండలైన రోజున చెడు తలపుకు రాని పరిచయాలు ఉండాలి. అలా ఉండాలి అంటే ప్రతి పరిచయానికీ ఒక హద్దు ఉండాలి.

కాఫీ జగన్మోహినీ!

ఉదయాన్నే కాఫీ చుక్క గొంతులో పడనిదే ఏ పనీ చేయలేని వారెందరో. మాన్యుల నుంచి సామాన్యుల వరకూ చరిత్రలో కాఫీదాసులెందరో! ఇలాంటి వారి తరఫున పోకూరి కాశీపతి అనే అష్టావధాని కాఫీపై సరదాగా చెప్పిన దండకం ఇది...

శ్రీమన్మహాదేవీ! లోకేశ్వరీ!
కాశికాసన్నిభాకారిణీ! లోకసంచారిణీ!
అంబ! కాఫీ జగన్మోహినీ! నీ ఇంపు నీ సొంపు నీపెంపు వర్ణింప నేనెంత వాడన్? ధనాకర్షణీ! ప్రాణ సంరక్షణీ!
ధాత్రి నెవ్వారలేన్ వేకువన్ లేచియున్ నిత్యకృత్యంబులన్ దీర్చి మున్ముందుగా నిన్నుబానంబు గావింపకున్ - ద్విజుల్ వేద మంత్రంబులన్ బల్కగా లేరు, టీచర్లు పాఠంబులన్ జెప్పగాలేరు, డాక్టర్లు సూదిమందుల్ వేయగాలేరు, ప్లీడర్లు నోరెత్తి వాదింపగా లేరు, జడ్జీలు నేర్పుమై తీర్పులన్ వ్రాయగా లేరు, దిట్టంబుగా బాలసుల్ కూట సాక్ష్యంబులన్ చెప్పగాలేరు, వారాంగనల్ కోడెగాండ్రన్ వెసన్‌గేళిలో నోలలాడింపగా లేరు... పోకూరి కాశీపతి స్వాంతరాజీవ సంవాసినీ! నీకికన్ మంగళంబౌ మహాకాఫీదేవీ!
నమస్తే నమస్తే నమః

'రవి' గాంచిన మాతృభాష

చంద్రప్రతాప్

భాషాభివృద్ధికి సమష్టి ప్రయత్నం అవసరమన్నది నిజమే. కాని ఒక్కోసారి మహనీయ వ్యక్తుల ఒంటిచేతి ప్రయత్నాలూ జనసమష్టిని కదిలించి అభివృద్ధికి బాటలు వేస్తాయి. విశ్వకవి రవీంద్రునిది ఈ తీరే. ఎవరికి వారు మాతృభాషను ప్రేమించాలనేది ఆయన సిద్ధాంతం. దీన్ని తాను నమ్మటమే కాదు, తన జాతి జనులందరూ నమ్మేలా ఆచరించి చూపాడు.

ప్రాచీన ఆధునిక భారతాల మధ్య రవీంద్రుని వ్యక్తిత్వం పటిష్ఠమైన వంతెనై నిలిచింది. ఆయనలో రెండు అంశలూ సమంగా ఉన్నాయి. మన దేశ ఆధ్యాత్మిక తత్త్వాన్ని ప్రతిబింబించే గీతాంజలి రాసిన కవీ ఆయనే, దేశ అభ్యుదయ పథానికి దిశ నిర్దేశించిన జాతీయవాదీ ఆయనే. ఈ మేలు కలయిక ఆయన్ని వైతాళికుణ్ణి చేసింది.

విద్యా ప్రక్షాళనకు శాంతినికేతన్

భారతీయ ప్రాచీన విద్యావిధానం పట్ల ఆయనకు అచంచల విశ్వాసం. ఆధునిక విద్యావిధానంలోని లోటుపాట్లేమిటో ఆయనకు తెలుసు. బడి గోడల మధ్య విద్యార్థుల్ని వరుసల్లో కూర్చోబెట్టి పాఠాలు గుమ్మరించే పద్ధతి నిష్ఫలం. విద్యార్థే పూనుకొని బయటి లోకంతో మమేకమై సంపాదించే జ్ఞానం చిరకాలం నిలిచి ఉంటుంది. ప్రకృతి మధ్య సహజమైన పద్ధతుల్లో చదువు నేర్చుకోవడం విద్యార్థికి ఆదర్శ వ్యక్తిత్వాన్ని సమకూరుస్తుంది. ఇది మన గురుకుల పద్ధతి. ఆయన దీన్ని నమ్మారు. ఈ నమ్మకానికి మూర్తి రూపమే ఆయన స్థాపించిన 'శాంతినికేతన్'. ఆదర్శవంతమైన విద్యా బోధనపై తన ఆలోచనల్ని ఇక్కడ ఆచరణలో పెట్టారు. దీని సఫలతకు నిదర్శనంగా అద్వితీయ మేధస్సులెన్నో ఇక్కడ మొగ్గ తొడిగాయి. తమ తమ రంగాల్లో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన ఇందిరాగాంధీ, సత్యజిత్‌రే, అమర్త్యసేన్ వంటి దిగ్గజాలెందరో ఇక్కడ ఓనమాలు దిద్దుకున్నారు.

తల్లినుడే ఒరవడి

భావాల మార్పిడికి భాష అవసరం. ఏ మనిషైనా భావాల్ని సులభంగా వ్యక్తం చేసేది, గ్రహించేది మాతృభాషలోనే. అందుకే విద్యాబోధన మాతృభాషలోనే జరగాలన్న నియమాన్ని శాంతినికేతన్‌లో అమలు చేశారు ఠాగూర్. శాంతినికేతన్ స్థాపనకు పదేళ్ల ముందే, ఠాగూర్ తన ముప్ఫయ్యేళ్ల వయస్సులో ఒక వ్యాసంలో ఇలా రాశారు: 'మన విద్యాబోధనలో తొలి ఆటంకం భాష. వ్యాకరణపరంగానూ, వాక్య నిర్మాణపరంగానూ ఉన్న పలు భేదాల వల్ల ఇంగ్లిషు ఎప్పటికీ మనకు పరాయి భాషే. ఇంగ్లిషు పాఠ్యపుస్తకాలతో మరో ఇబ్బంది కూడా ఉంది. ఆ పాఠాల్లోని వాతావరణంతో మన పిల్లలకు పరిచయం ఉండదు. వాటిని బండగా బట్టీ పట్టడం తప్ప వారికి మార్గాంతరం లేదు. అన్నం ముద్ద నమలకుండా మింగేస్తే ప్రయోజనం ఏముంది? అలాంటిదే ఇదీను. ఉదాహరణకి ఒక బాల వాచకంలో పిల్లలు మంచుముద్దలతో దెబ్బలాడుకోవడం గురించి కథ ఉందనుకోండి. మంచు కురవడ మనేది ఇంగ్లండు బాలలకు తెలిసిన వాతావరణం. వారు అన్వయించుకోగల కథాంశం. మన పిల్లల మనసుల్లో మాత్రం ఈ పాఠం ఎలాంటి జ్ఞాపకాలనూ తట్టి లేపలేదు, వారి కళ్ల ముందు ఏ దృశ్యాలనూ తెచ్చి నిలపలేదు. ఇలాంటి పాఠాల విషయంలో మన పిల్లల పరిస్థితి చీకట్లో తడుములాటే.'

ఒక్క విద్యార్థులే కాదు, బెంగాలీ మాతృభాష అయిన సాహితీవేత్తలందరూ ఇంగ్లిషు మాని బెంగాలీలోనే రాయాలని పిలుపునిచ్చారు ఠాగూర్. ఇదే వ్యాసంలో ఈ విషయమై ఇలా అంటారు: 'మన పిల్లలు ఇంగ్లిషు భాష నేర్చుకునే ప్రయాసలో పడి, ఆ భాష వెనుక భావాల్ని మాత్రం సొంతం చేసుకోలేక, విలువైన సమయాన్ని ఎలా నష్టపరుచుకుంటున్నారో చెప్పాను. వారు పెద్దయ్యేసరికి ఈ పరిస్థితి మరోలా తారుమారవుతుంది. అపుడు వారికంటూ భావాలు ఉంటాయి. కానీ వాటిని వ్యక్తం చేయటానికి సొంత భాష మిగలదు. ఎంత శ్రమపడ్డా ఇంగ్లిషు ఎలాగూ ఆత్మీయమైన భాష కాలేదు. ఎందుకంటే జన్మతః మన భావాలకు ఆ భాషకూ మధ్య పొందిక మృగ్యం. అందుకే ఈ తరం మేధావులు ఇంగ్లిషు సాహిత్యంతో త్వరలోనే అసంతృప్తులవుతారు. అప్పటికే వీరి భావాలకు అటు ఇంగ్లిషే కాదు, ఇటు మాతృభాష అయిన బెంగాలీ కూడా దూరమైపోతుంది. అయినా బెంగాలీ తమకు తెలియదని ఒప్పుకోరు. సరికదా ఆ భాష తమ భావాలను వెల్లడించేంత సమర్థమైంది కాదని వాపోతుంటారు. తమదంతా అందని ద్రాక్ష పుల్లన వ్యవహారంగా మారిందని మాత్రం అర్థం చేసుకోరు.'

సృజనకు సొంపు సొంత భాషతోనే...

ఈ మాటలు చూసి విశ్వకవి అభిమానమంతా సొంత భాష బెంగాలీ మీదే అనుకుంటే పొరబాటు. ఆయన వాదన అంతరార్థం బెంగాలీని సమర్థించడం కాదు, మాతృభాష విలువ తెలియజెప్పటం. దీన్ని నిరూపించే ఒక సంఘటన ఆయనకీ, ప్రముఖ హిందీ నటుడు బల్‌రాజ్ సహనికీ మధ్య జరిగింది. నటుడు కాక మునుపు బల్‌రాజ్ సహని శాంతినికేతన్‌లో ఉపాధ్యాయునిగా కొంతకాలం పని చేశారు. అపుడు జరిగిన ఈ సన్నివేశం గురించి సహనినే ఒక చోట నెమరు వేసుకున్నారు.

ఒక వార్షిక హిందీ సమ్మేళనానికి ఠాగూర్‌ని ఆహ్వానించడానికి సహని గురుదేవుల్ని కలుసుకున్నారు. సంభాషణ కొనసాగుతుండగా, "ఇక్కడ చదువు చెప్పడంతో పాటు మీరింకేం చేస్తుంటారు" అని అడిగారు ఠాగూర్.

"హిందీలో కథలు రాస్తుంటాను. ప్రముఖ హిందీ పత్రికలన్నింట్లోనూ వస్తుంటాయి," అన్నారు సహని.

"అదేంటి, మీరు పంజాబీ కదా? మాతృభాషలో ఎందుకు రాయరు?" ఆశ్చర్యం వ్యక్తం చేశారు రవీంద్రులు.

అప్పటికి గురుదేవుల భావాలు పూర్తిగా తెలియని సహనికి ఈ ధోరణి సంకుచితంగా తోచింది. ఆయన ప్రాంతీయ మనస్తత్వం కలిగిన మనిషిలా అనిపించారు. "హిందీ జాతీయ భాష. హిందీలో రాస్తే దేశమంతా తెలుస్తుంది.



పంజాబీ లాంటి ప్రాంతీయ భాషలో రాస్తే ఎందరికి తెలుస్తుంది? " అని ప్రశ్నించారు.

"మరి నా మాతృభాష బెంగాలీ కూడా ప్రాంతీయ భాషే. నేను ఆ భాషలోనే రాస్తున్నాను. అయినా ప్రపంచమంతా దాన్ని చదవడం లేదా? "

"నేను మీ అంత గొప్ప రచయితను కాదు, నాకు అంత గుర్తింపు లేదు."

"ఇది గొప్పతనానికీ, గుర్తింపు లేకపోవటానికీ సంబంధించిన విషయం కాదు. ప్రతీ రచయితకీ తన జన్మస్థలంతోను, అక్కడి జనంతోను, భాషతోనూ అనుబంధం ఉంటుంది. ఈ అనుబంధమే తాను వారిలో ఒకడినన్న ఆత్మీయ అనుభూతిని కలిగిస్తుంది," అన్నారు గురుదేవులు.

సహని ఒప్పుకోలేకపోయారు. "బహుశా మీకు మా రాష్ట్రంలో పరిస్థితులు తెలియవనుకుంటా. పంజాబులో ఇపుడు రాస్తే హిందీ రాస్తున్నారు, లేదంటే ఉర్దూ. పంజాబీలో రాసేవాళ్లెవరూ లేరు. అదో వెనుకబడిన భాష. నిక్కచ్చిగా చెప్పాలంటే, అదసలు భాషే కాదు. అనుబంధ భాష. హిందీలో ఒక యాస. అంతే!"

"నేను అంగీకరించను. పంజాబీ, బెంగాలీ సాహిత్యాలు చాలా ప్రాచీనమైనవి. గురునానక్ వంటి మహాకవులు రచనలు చేసిన భాష పంజాబీ. దాన్ని మీరు వెనుకబడిన భాష అని ఎలా అనగలుగుతున్నారు? " అన్నారు గురుదేవులు. అక్కడితో ఆగక సహనికి కూడా తెలియని గురునానక్ పంక్తులు కొన్నింటిని పంజాబీలో చక్కగా పాడారు. నానక్ సాహిత్యాన్ని బెంగాలీ భాషలోకి అనువదించాలని ఉందనీ, న్యాయం చేయలేనేమోనని జంకుతున్నాననీ అన్నారు.

సహని అప్పటికీ తన వాదన వెనక్కి తీసుకోలేదు. "కానీ మీరు ఉట్టంకించింది సిక్కుల మత సాహిత్యం కదా? నేను వర్గాలకూ, మతాలకూ అతీతమైన సాహిత్యం గురించి మాట్లాడుతున్నాను. అలాంటి సాహిత్యం పంజాబీలో లేదు. అందుకే నా దృష్టిలో పంజాబీ ఒక అవశేష భాష" అన్నారు.

"ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్న మా బెంగాలీ మేధావులూ ఒక శతాబ్ద క్రితం వరకూ బెంగాలీ గురించి ఇలానే అనుకున్నారు. తలచుకోవాలే గానీ ఎవరికి వారు తమ భాషను సుసంపన్నం చేసుకోవచ్చు. బంకిం బాబు (వందేమాతరం గీత కర్త) బెంగాలీ భాషకు వేలాది కొత్త పదాలు ఇచ్చారు. ఇంకో వేయి పదాలతో నేనూ కొంత కృషి చేశాను. ఇపుడు మా భాష ప్రపంచభాషలు దేనితో పోల్చినా దీటైనదే. దానికంటూ ఒక సొంత అభివ్యక్తి, స్వరూప స్వభావాలూ ఏర్పడ్డాయి. ఇప్పుడది మరే ఇతర భాషకూ తీసిపోదు," అంటూ ఓపిగ్గా ఉద్బోధించారు గురుదేవులు.

అయినా రవీంద్రునితో ఏకీభవించలేకపోయానంటారు సహని. మాట మార్చి వచ్చిన పని చెప్పారు. హిందీ భాషా సమ్మేళనానికి ఆహ్వానించారు. రవీంద్రుడు అంగీకరించారు. వీడ్కోలు తీసుకుని వెళిపోతున్న సహనితో ఇలా అన్నారు, "ఒక వేశ్య ప్రపంచంలో సంపదంతా కూడబెట్టనీ, కానీ మర్యాద మాత్రం దక్కించుకోలేదు. ఇదీ అలాగే. నువ్వు నీ జీవితమంతా నీకు పరిచయం లేని భాషలో రాస్తూంటే, ఇటు నీ సొంత ప్రజలూ నిన్ను తమవాడిగా అంగీకరించరు, అటు నువ్వు ఏ భాషలో రాస్తున్నావో వారూ నిన్ను స్వీకరించరు. రచ్చ గెలిచే ముందు ఇంట గెలిచి చూపించాలి." ఈ మాటలు చాన్నాళ్లపాటు తనను వెంటాడాయంటారు సహని. కాలక్రమేణా వాటిలో నిజమేమిటో తెలిసివచ్చిందంటారు.

రవీంద్రుని ఈ మాటల సారం తెలుగువారికి బాగా అర్థమవుతుంది. బెంగాలీ సాహిత్యం మన తెలుగు సాహిత్యంపై చూపించిన ప్రభావం అపారం. శరత్‌బాబు, బిభూతిభూషణ్ బందోపాధ్యాయ వంటి బెంగాలీ రచయితలెందర్నో తెలుగువాళ్లు తమవారే అన్నంతగా అక్కున చేర్చుకున్నారు. ఈ రచయితలు తమ మాతృభాష బెంగాలీలో రాసి ఇంట గెలవడమే కాదు, ఎన్నో భాషల్లోకి అనువాదమై రచ్చ కూడా గెలిచారు. తన మాతృభాషాభిమానంతో బెంగాలీ భాషకు ఈ చేవ ఉందని నిరూపించిన రవీంద్రుని మార్గం సర్వదా అనుసరణీయం.

చతుర - విపుల సాహిత్య మాసపత్రికల సారథి,
హైదరాబాద్
80081 43507

తెలుగుదనానికి రక్ష...
పెద్దబాలశిక్ష

పూర్వం పెళ్లి సంబంధాలు మాట్లాడేటప్పుడు 'మీ అబ్బాయి ఏం చదివాడు?', 'మీ అమ్మాయి ఏం చదివింది?' అని అడిగితే, 'మా వాడు పెద్దబాలశిక్ష పూర్తి చేశాడు', 'మా అమ్మాయికి పెద్దబాలశిక్ష కంఠోపాఠం వచ్చు' అని గొప్పగా చెప్పేవారు. పెద్దబాలశిక్ష గ్రంథాన్ని పూర్తిగా చదివితే ప్రపంచంలోని అన్ని విషయాల గురించీ తెలుసుకున్నట్లు భావించేవారు. తెలుగువారికే ప్రత్యేకమైన పెద్దబాలశిక్ష పుట్టుపూర్వోత్తరాల గురించి, ప్రస్తుతం అత్యంత ప్రాచుర్యంలో ఉన్న ఓ పెద్దబాలశిక్ష రూపకర్త గాజుల సత్యన్నారాయణతో ముఖాముఖీ ఇది.

తెలుగు వెలుగు బృందం

తరాలు మారినా తరగని విలువల గని పెద్దబాలశిక్ష. పుట్టుపూర్వోత్తరాలు ఆసక్తికరం. పెద్దబాలశిక్ష అనే విజ్ఞాన గ్రంథానికి క్రీ.శ. 1832లో అంకురారోపణ జరిగింది. అప్పట్లో తెలుగునేలపై నివసించిన ఆంగ్లేయుడు మేస్టర్ కుళులో అనే తెల్లదొర తెలుగు పిల్లల కోసం మంచి పుస్తకాలు రాయించాలని సంకల్పించారు. ఈ బాధ్యతను తన మిత్రుడైన పుదూరు చదలవాడ సీతారామశాస్త్రికి అప్పగించారు. సీతారామశాస్త్రి గొప్ప పండితుడు. ఆయన ఏయే విషయాల ద్వారా బాలలను ఆకట్టుకోవచ్చో అధ్యయనం చేశారు. ఆమేరకు వారికి అవసరమైన విజ్ఞాన విషయాలను కూర్చి 76 పేజీలతో చిన్న గ్రంథం రచించారు. అది 1856లో మొదటిసారి ముద్రితమైంది. ఆ తరువాత సాహిత్య విషయాలు, భూభౌగోళిక విషయాలు, సంస్కృత శ్లోకాలను చేర్చి, 14 పేజీలను జోడించి 90 పేజీలతో 'బాలల వివేక కల్పతరువు' అనే పేరుతో 1865లో పునర్ముద్రించారు. అప్పటికే ఈ గ్రంథం పెద్దలకూ మార్గదర్శకంగా మారింది. అందువల్ల క్రమేపి దీని పేరు పెద్దబాలశిక్షగా మారింది. తరువాత 1916లో వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ (చెన్నపట్నం) సంస్థ పెద్దబాలశిక్షను తాజాగా రూపొందించి ముద్రించింది. ఆ తరువాత శతాబ్దంలో ఎన్నో 'పెద్దబాలశిక్షలు' వెలువడ్డాయి. తెలుగు పుస్తకాలు ప్రచురించే ముఖ్య ప్రచురణ సంస్థలు అన్నీ పెద్దబాలశిక్షను ముద్రించాయి. ఈ తరహా పుస్తకాల్లో మద్రాసు నుంచి వెలువడ్డ రాయల పెద్దబాలశిక్ష ఎక్కువ ప్రాచుర్యం పొందింది. తరువాత ఎన్నో వచ్చాయి. గొల్లపూడి, మోహన్, విక్టరీ, గౌరు పెద్దబాలశిక్షలతోపాటు మరో అరడజనుకు పైగా వచ్చాయి. ప్రముఖ కవి జంధ్యాల పాపయ్యశాస్త్రి కూడా ముద్దుబాలశిక్ష పేరుతో ఒక గ్రంథాన్ని ముద్రించారు. పెద్దబాలశిక్ష తరహా పుస్తకం మరే భాషల్లోనూ లేదు. ఇది మన తెలుగు వారి ఆస్తి.

ఆనాటి పెద్దబాలశిక్షలో...

ముందు పేజీల్లో దేవతామూర్తుల ప్రార్థనలు, అక్షరాలు, తెలుగు గుణింతాలు, అక్షరాలతో మాటలు, అందరూ తెలుసుకోదగిన విషయాలు, తెలుగు అంకెలు, దండకాలు, ఎక్కాలు, లెక్కలు, పంచాంగ విషయాలు కొన్ని, చిన్నచిన్న గేయాలు, నీతి పద్యాలు, నీతి కథలు, ఆడపిల్లలకు బుద్ధులు నేర్పే పాటలు, గేయాల రూపంలో ఆరోగ్య సూక్తులు, హితోక్తులు, భూగోళ, ఖగోళ విషయాలు, యుక్తి లెక్కలు, చమత్కార లెక్కలు, చమత్కార పద్యాలు, విజ్ఞాన, ఆరోగ్య విషయాలతో కూడిన పాటలు ఉండేవి. ఇది సంస్కృత సంప్రదాయాల విషయాలతోపాటు ప్రపంచ విజ్ఞానాన్నీ పంచేవి. అందుకే పెద్దబాలశిక్షకు అంత ఆదరణ లభించింది.

ప్రస్తుతం వెలువడుతున్న పెద్దబాలశిక్షల్లో ప్రముఖమైంది గాజుల సత్యనారాయణ పెద్దబాలశిక్ష. తాను పెద్దగా చదువుకోకపోయినా తెలుగు వారికి మన వారసత్వ సంపదను అందించాలన్న సంకల్పంతో ఈ బాలశిక్షను రూపొందించారు సత్యనారాయణ. సేవాభావంతో ఆయన చేస్తున్న ఈ క్రతువు గురించి ఆయనతో ముఖాముఖీ ఇది...

తె.వె.: మీ కుటుంబ నేపథ్యం, సాహిత్య అభిరుచుల గురించి చెప్పండి?

గాజుల: కుటుంబపరంగా సాహితీ నేపథ్యం ఏమీ లేదు. మా అమ్మానాన్నా నేతపని వారు. నా చదువు కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నతపాఠశాల స్థాయి వరకే సాగింది. కానీ నాకు చిన్నప్పటి నుంచి కథలు రాయడం ఇష్టం. చిన్న చిన్న నీతి కథలు రాసి మాసపత్రికలకు పంపేవాడిని. అవి ప్రచురితం అయినప్పుడు చాలా సంతోషించే వాడిని. ఏనాటికైనా ఒక పెద్దపుస్తకం రాయాలి అన్న కోరిక అప్పటి నుంచే బలంగా ఉండేది. కానీ పెద్ద బాలశిక్ష రాస్తానని అనుకోలేదు. విజయవాడ వెంకటేశ్వరా బుక్ డిపోలో పాతికేళ్ల పాటు గుమాస్తాగా పనిచేశాను. అపుడు కూడా బాలల కథలు రాసి పత్రికలకు పంపేవాణ్ణి.

తె.వె.: ఈ గ్రంథ రచన ఆలోచన ఎలా వచ్చింది? ప్రేరణ ఏమిటి?

గాజుల: దీనికి కారకులు ప్రముఖ సినీగాయకులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం. ప్రతి సంవత్సరం జనవరి ఒకటిన విజయవాడలో పుస్తకాల పండుగ (పుస్తక ప్రదర్శన) ఏర్పాటు చేస్తారు. రెండో ఏడాది ఆ ప్రదర్శన ప్రారంభకులుగా బాలసుబ్రహ్మణ్యం వచ్చారు. ఆ సభలో బాలు మాట్లాడుతూ పెద్దబాలశిక్ష ప్రస్తావన తెచ్చారు. దాని ఘనతను వివరించి అది కనుమరుగు కాకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఆ పని నేనే ఎందుకు చెయ్యకూడదన్న ఆలోచన కలిగింది. సుమారు పుష్కరకాలం చేసిన ప్రయత్నమే ఈ అక్షర విజ్ఞాన నిధి.

తె.వె.: పెద్ద బాలశిక్ష రూపకల్పనలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

గాజుల: తెలుగు జాతి వారసత్వ సాహిత్య సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, బాంధవ్యాలు, కట్టూ, బొట్టూ, మరెన్నో విధులు, మంచీచెడుల వంటి అనేక అమూల్య విషయాలను ముందుతరాలకు అందించాలనుకున్నాం. దాంతో పాటు ప్రాపంచిక జ్ఞానాన్నీ కలిగించేలా 18 పర్వాల విజ్ఞాన సర్వస్వంగా రూపుదిద్దా. అన్ని స్థాయిల విద్యార్థులకు నిత్యావసరమైన విజ్ఞానం ఇచ్చే విషయాలతో వడ్డించిన విస్తరిలా చేయాలనుకున్నా. మొదట 2700 పేజీలయిన దాన్ని 900 పేజీలకు కుదించా. అన్ని పేజీల పుస్తకాన్ని హెచ్చు ధరకి తప్ప అమ్మలేమని ప్రచురణకర్తలు నిరాశపరచారు. అయినా మిత్రుల సాయంతో రూ. 116కే విక్రయిస్తున్నా.

తె.వె.: అంశాల ఎంపిక ఎలా చేశారు?

గాజుల: 'యదిహాస్తి తదన్యత్రయన్నేహాస్తి నతత్ క్వచిత్' (ఇందులో ఉన్న విషయాలు ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నాయి. ఇందులో లేని విషయాలు మరెక్కడా లేవు) అనే విధంగా కూర్చాం. భాషా విజ్ఞాన పర్వము, సంస్కృతీ సంప్రదాయ పర్వము, బాలానంద, శతక, నీతికథా, సంఖ్యాశాస్త్ర, ఆధ్యాత్మిక, గణిత, విజ్ఞాన, వాస్తుశాస్త్ర, పంచాంగ, మహిళా, ఆంధ్రప్రదేశ్, భారతదేశ, ప్రపంచ పర్వాలనే విభాగాలుగా చేశాం. ఇప్పటి తరానికి అవసరం అయిన కంప్యూటర్, ఆరోగ్యం, క్రీడారంగ పర్వాలనూ జోడించాం.

తె.వె.: ఏయే వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకున్నారు?

గాజుల: కేవలం పిల్లలనే కాకుండా మిగిలిన వారికీ ఉపయోగపడేలా ఉండాలని అనుకున్నా. కళాశాల విద్యార్థులు, ఉద్యోగార్థులకు మార్గదర్శకంగా, గృహిణులకు విజ్ఞానదాయకంగా, ఉద్యోగమో, వ్యాపారమో విరమించిన వారికి చక్కని కాలక్షేపంగా ఉండాలనుకున్నా. అంతే కాదు ఉద్యోగస్థులు, వ్యాపారస్థులు, ఒకరనేమిటి తమ విజ్ఞాన సంపదను ఇంకా మెరుగుపరుచుకోవాలనుకునే ప్రతీ వారికీ మా గ్రంథం ఉపకరించాలని అనుకున్నా. పోటీ పరీక్షలైన సివిల్ సర్వీసెస్, ఏపీపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్, ఆర్.ఆర్.బి., బి.ఎస్.ఆర్.బి. మొదలైనవి రాసే పరీక్షార్థులనూ దృష్టిలో పెట్టుకున్నా.

తె.వె.: పెద్దబాలశిక్ష రెండో భాగం చేయాలన్న ఆలోచన ఎందుకు వచ్చింది?

గాజుల: తొలిభాగాన్ని 2004లో విజయవాడ పుస్తకప్రదర్శనలో అమ్మకానికి ఉంచాం. మూడు రోజుల్లో మొత్తం ప్రతులు అమ్ముడుపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి దాకా పుస్తకం మొత్తం వంద ముద్రణలు జరుపుకుంది. ఐదు లక్షల ముప్పైవేల కాపీలు అమ్ముడు పోయాయి. ఈ స్పందన చూసి పూర్తిగా తెలుగు సంస్కృతీ సంప్రదాయాలతో మరొక పుస్తకాన్ని తెలుగువారికి అందించాలని అనిపించింది. ఈనాటి తెలుగు వాచకాలలో భాషను నేర్పేందుకు సాధారణంగా అక్షరాలతో ప్రారంభించే మాటలు... అమ్మ, ఆవు, ఇల్లు, ఈగ, ఉడుత ఈ విధంగా ఉంటాయి. కానీ అక్షరాలు నేర్పిన తరువాత గుణింతాలు, వత్తులు చెప్పకుండానే మాటలు నేర్పాలనుకుంటున్నారు. ఉదాహరణకు అమ్మ అనే మాటలో 'అ'

(ఫొటో: వి.మరిడయ్య)

అక్షరం 'మ' అక్షరం పిల్లవాడికి తెలుసు కానీ 'ృ' వత్తు తెలియదు. అలాగే ఉడుత అనే పదంలో 'ఉ', 'త' తెలుసు 'డు' అనే అక్షరం వారికి తెలియదు. గుణింతాలు, వత్తులు అన్నీ నేర్పాకే పిల్లలకు మాటలు నేర్పితే వారు బాగా అర్థం చేసుకోగలరు. అలాంటి ప్రయోగమే 'పెద్దబాలశిక్ష ద్వితీయ భాగం'.

తె.వె.: రెండో భాగంలో ఏమేం చెప్పారు?

గాజుల: ఇందులో అఆలు మొదలు అష్టాదశ పురాణాల వరకూ వివరించాం. అక్షరాలు, మాటలు, వాక్యాలు, గుణింతాలు, ఒత్తులు, సామెతలు, పొడుపు కథలు, వ్యాసాలు, లేఖలు, సూక్తులు, అర్థాలు, ఏకవచనం-బహువచనం, ప్రకృతి-వికృతులు, నానార్థాలు, తప్పులు-ఒప్పులు, తెలుగు వ్యాకరణం ఉంటాయి. వేమన, సుమతి, కృష్ణ, దాశరథీ, భాస్కర, కుమారీ, కుమార, భర్తృహరి, శ్రీకాళహస్తీశ్వర, నరసింహ, గువ్వలచెన్నా, కవిచౌడప్ప శతకాలు, పోతన భాగవతంలోని రుక్మిణీ కల్యాణం, గజేంద్ర మోక్షం కూడా తాత్పర్యాలతో చేర్చాం. బాలల అభినయ గేయాలు, పంచతంత్ర కథలు, నీతికథలు, పిల్లల విజ్ఞాన విషయాలు, తాళపత్ర విజ్ఞాన నిధి, పురాణనామ నిఘంటువు, దశావతారాలు, రామాయణం, భాగవతం, భారతం, భగవద్గీత, అష్టాదశ పురాణ పరిచయం వంటివీ ఉన్నాయి. ఇది భాషాభిమానులకు, తెలుగు నేర్చుకొనే ప్రతి వారికీ తెలుగు భాషా విజ్ఞాన నిధిలా ఉపయోగపడాలన్నది లక్ష్యం.

తె.వె.: స్పందన ఎలా ఉంది?

గాజుల: చాలా బాగుంది. వృత్తిరీత్యా మాతృదేశాన్ని వదిలి విదేశాలకు వెళ్తున్న తెలుగువారికి ఇది బాగా ఉపయోగపడుతోందని అనుకుంటున్నాను. తెలుగువారు తమ పిల్లలను ఏ భాషలో చదివించినా సరే, తెలుగు నేర్పటం మరచిపోకూడదన్నది నా ఉద్దేశం. వారికి ఈ విషయంలో సహాయకారిగా ఉండేలా చేయాలనుకున్నాను.

తె.వె.: ఈ గ్రంథం రూపకల్పనకు ఎంతకాలం పట్టింది?

గాజుల: మూడు సంవత్సరాలు. రాత్రింబవళ్లు కష్టించి తెలుగుబాలశిక్షకు రూపకల్పన చేశాను. ఇందులో కూడా 18 పర్వాలు ఉంటాయి. ఎన్నో మార్పులు, చేర్పులతో 960 పేజీలకు కుదించాక పుస్తక రూపం దాల్చింది. 2011 జనవరి 1న విజయవాడ పుస్తక ప్రదర్శనలో విడుదల చేశాను. పాఠకుల నుంచి అపూర్వ ఆదరణ లభించింది.

తె.వె.: పెద్దబాల శిక్ష విషయంలో మీకు సంతృప్తినిచ్చిన ఉదంతాలు?

గాజుల: కొందరు భాషాభిమానుల స్పందన చూసినప్పుడు కళ్లు చెమ్మగిల్లాయి. గత ఏడాది ఒడిషాలో స్థిరపడిన తెలుగువారు కోటిని సాంబమూర్తి తన మనవడి వివాహ ఆహ్వానాన్ని పెద్దబాలశిక్ష పుస్తకంలో ముద్రించి, దాన్నే శుభలేఖగా పంచారు. మరొకరు గృహప్రవేశానికి వచ్చిన అతిథులందరికీ ఈ పెద్దబాలశిక్షను కానుకగా ఇచ్చారు. శ్రీకాకుళంలో బరాటం లక్ష్మణరావు తమ దేవాలయంలో అక్షరాభ్యాసం చేసుకున్న ప్రతివారికీ ఈ పుస్తకాన్ని బహూకరించారు. ఆయనే పాఠశాలలకు, గ్రంథాలయాలకు సుమారు 10 వేల పుస్తకాలు ఉచితంగా పంచారు. ఇలా ఎందరో అనేక సందర్భాల్లో పెద్దబాలశిక్షను... తద్వారా తెలుగుదనాన్ని పంచుతున్నారు.

తె.వె.: సేవాభావంతో చేస్తున్నా ప్రచురణ ఖర్చుతో కూడిన వ్యవహారం కదా? ఎలా చేస్తున్నారు?

గాజుల: వందో ముద్రణ దాకా కాగితం వెల ఎంత పెరిగినా, పుస్తకం వెల మాత్రం పెంచలేదు. ఇప్పటికీ 116 రూపాయలకే అందిస్తున్నాం. మన సంప్రదాయ అంకె 116ను మార్చడం నాకు ఇష్టం లేదు. నష్టమైనా భరిస్తూ వచ్చాను. ఇంకెన్నాళ్లో చెప్పలేను. ప్రస్తుతం ఆధ్యాత్మిక పుస్తకాలు రాస్తున్నాను. వీటిని సొంతంగా స్థాపించిన విజేత బుక్స్ ద్వారా విడుదల చేస్తున్నాను.

తె.వె.: ఈ గ్రంథ ప్రచురణలో మీరు కోరుకుంటున్న సహకారం ఏమైనా ఉందా?

గాజుల: రాష్ట్ర ప్రభుత్వం ఈ పుస్తకం విలువను గుర్తించాలి. ఆదరించాలి. రాష్ట్ర గ్రంథ హోదా కల్పించాలి. దిన, వార, మాస పత్రికలకు ఇస్తున్నట్టే రాయితీలను ఇవ్వాలి. ఈ పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయం కొనుగోలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలి.

ఓ తెలుగు తల్లి

కృష్ణమ్మ నీ నవ్వు
గోదారి నీ నడక
చెరకు తోటల పచ్చ పావడా కట్టి
ఆవకాయ ఓ చేత గోంగూర ఓ చేత
కాకతీయుల కోట కాలు పెట్టేవు
విజయనగరపు కీర్తి
కృష్ణరాయల మూర్తి
పసిడి కాసుల కుప్ప
పల్లె పిల్లల పాట
పాదాల పరవళ్ళ పాయలో కలిసె
సింగరేణి నల్ల కాటుకను పెట్టే
పచ్చని చేల అన్నపూర్ణవు నీవు
శ్రీనాథ నైషధము ఆముక్తమాల్యద
అద్దాల చెక్కిలికి హారతులు పట్టె
విశ్వనాథుల వారి కావ్యకన్యకవు
అందుకో కైదండ. మా మనసు దండ
తియ్యందనాల తల్లి, ఓ తెలుగు తల్లి

– లక్ష్మీహరిత ఇంద్రగంటి,
పెనగడప, ఖమ్మం. 94919 49797.

మర్కట కిశోర న్యాయం



ఒకోసారి మనం గమ్యాన్ని చేరాలంటే ఆసరా కావాలి. బంధాలను నిలుపుకోవాలంటే భాగస్వామ్యం ఉండాలి. లేకపోతే 'ఇసుక తక్కెడకి పేడ తక్కెడే' మిగుల్తుంది. ఇదే మర్కట కిశోర న్యాయంలోని అంతరార్థం. తల్లి కోతి ఒక కొమ్మ మీద నుంచి మరో కొమ్మకి గెంతుతోంటే, పిల్ల కోతి దాని పొట్టని కరుచుకుని ఉంటుంది. పిల్ల కింద పడిపోతుందన్న భయం తల్లికి ఉండదు. ఎందుకంటే ఇక్కడ తల్లిని గట్టిగా పట్టుకుని ఉండాల్సిన బాధ్యత పిల్లదే. మరో చోటుకు తీసుకెళ్లడం వరకే తల్లి పని. మనవంతు బాధ్యత సవ్యంగా నిర్వహించినప్పుడే జీవన యానం నిశ్చింతగా సాగిపోతుంది. లేదంటే కారణాలు వెతకడంలోనే కాలం గడిచిపోతుంది.

ఒక విడిపోని స్మృతిలోకి

బి.వి.వి.ప్రసాద్

సరే, మన హృదయాలు ఒకరిలోకొకరివి వెళ్లిపోయాయా, లేదా
నీలోకి చూసుకో ఓసారి, తడి కన్నులతో నేను కనిపిస్తున్నానో, లేదో
నా స్మృతి గులాబీలా వికసిస్తూ ఉందో, వాడిపోయిందో

ఇక చెప్పేదేమీ లేదు
బహుశా, మన స్పర్శలలో అదనంగా మేలుకొనే కొత్త లోకాలూ లేవు
మనకి ప్రేమంటే ఒక శుభ్రమైన అవగాహన

మళ్లీ ఎక్కడైనా ఎదురైనపుడు
మన మధ్య ఇంద్రధనువుని తట్టిలేపే చిరునవ్వే మన ఏకైక సంభాషణ
ఒకరికొకరం గుర్తొచ్చినపుడు పాపాయిలా కళ్లు తెరిచే దిగులే సాంత్వన

మృదువుగా విను నా చివరి మాటలు
వివరణలేవైనా మన ప్రేమపై వాలే నీడలని తెలిసినా
జాగ్రత్త నా బలహీనత గనుక
మనకీ కాస్త జీవించటం నేర్పిన మౌనాన్నుంచి
నీ దగ్గర మాత్రమే బహిరంగపరచే నా పసిదనం నుంచి
దాని బేలతనపు పొరలే ఉత్సాహం నుండి వస్తున్న మాటలు

నువు వినవని తెలుసు
నా అర్థాలకన్నా, నా పదాల చప్పుడే నీకు ఇష్టమని తెలుసు
వాటిని పరుగుపెట్టించే ఉత్సాహమే ఇష్టమని తెలుసు
ఉత్సాహం కన్నా, నేనుంటే చాలు ఊరికే నిండిపోవటమే ఇష్టమని తెలుసు

అయినా నాతో నడువు, ఈ చివరిమాటల చివరి అర్థాలలోకి

మన తొలి ఆశ్చర్యాలకు ముందే మనం తెలుసు
మన జీవన మూలాల్లో ఎక్కడో యుగాలపర్యంతం కలిసే జీవిస్తున్నాం
మన పైపై బెంగల అలల లోతుల్లో ఎపుడో ఒకరితో ఒకరు నిండిపోయాం

నువు తొలిసారి ఎదురైనపుడు నాలోపలి వెలితి ఒకటి తెరలా తొలిగింది
నీ అద్దంలో నా రూపం చూసినపుడు నేనెపుడూ నిండుగా ఉన్నానని కనుగొన్నాను

'ఇక ఎవరిదారిన వాళ్లం, ఎపుడూ కొత్తగా జన్మించటంలోకి వెళ్లిపోదాం'

నిన్ను చూసిన క్షణం చాలదా జీవితమంతా విసుగులేకుండా బతికేందుకు
నా దారిలో ఎదురైన పిట్టలకి కొత్త సంగీతపు పాఠాలు బోధిస్తూ తిరిగేందుకు
నా పగళ్లని పూవులుగా, రాత్రుళ్లని నక్షత్రాలుగా జీవితమంతా వెదజల్లుకునేందుకు
విడిపోయేవేళ మేఘావృతమైన ముఖాలూ, వర్షనేత్రాలూ చాలవా
ఇక్కడ జీవించి వెళ్లిన గుర్తులేవో మిగిలేందుకు

ఇక మాటలు లేవు ఎక్కడా
ఒక నక్షత్రమేదో మెరిసి మాయమయింది
ఇప్పుడిక దేనినీ గుర్తుపట్టాలని లేదు.

కవి, సజ్జాపురం, తణుకు,
పశ్చిమగోదావరి
90320 75415.

జయీభవ... విజయీభవ

ప్రకృతి ఆరాధన మనిషి మనుగడకు మహాద్వారం. ప్రకృతిలో ప్రతి అణువునూ ఆరాధించే మహావేదాంత తత్త్వం గలది మన సంప్రదాయం. ఆ సంప్రదాయాన్ని జీర్ణించుకున్న పండుగ దసరా. దీన్ని నిజానికి దశరా అని పిలవాలి. దశ అంటే పది. పదిరోజుల పండుగ కాబట్టి దీన్ని దశరా అంటారు.

పి. స్నేహలతా మురళి

పిల్లలు బాగా పాల్గొనే పండుగల్లో దీపావళి తర్వాతి స్థానం దసరాదే. ఒకప్పుడు చిన్న పిల్లలు అందరూ కలిసి వీధుల్లో తిరుగుతూ "జయీభవ జయవిజయీభవ దిగ్విజయీభవ" అని గొంతెత్తి అరుస్తూ ప్రార్థనా పద్యంతో ప్రారంభించి వినాయకుని మీద, సరస్వతి మీద, శివుని మీద, ఆంజనేయుని మీద పద్యాలు చెప్తూ..

అయ్యవారికి చాలు అయిదు వరహాలు
పిల్లలకు చాలు పప్పుబెల్లాలు
బాలురము వస్తిమిటు పరగనతిప్రేమ
మాముద్దు చెల్లించి మముబంపవలయు
పసి బాలకుల మేము బడలియున్నాము
వసివాడితిమి యెండ వానలకు సొలసి
మాపురా రేపురా మరలరమ్మనక
తేపతేపకు మమ్ము తిరిగి రమ్మనక
అల్లుంద్రవలెకాదు అలిగి మిమ్మడుగ
బంట్రోతులముగాము భయపెట్టి యడుగ
తగవువారముగాదు దండించి యడుగ
నిలువ జీతముగాదు నిలిచి మిమ్మడుగ
పాతప్పులివిగావు పలుమారులడుగ
కొత్తప్పులివిగావు కొసరి మిమ్మడుగ
ఈ పొద్దులేదనక యివ్వవలె కనుక

నవరాత్రి పండుగను నార్యులందరికి
పండుగలు మాకును మెండు వేడుకలు
మీ కటాక్షంబున మేము వచ్చితిమి
దానములలో విద్యాదానమే హెచ్చు
అయ్యవారికి భూమి ఐదు వీసములు
పన్నెండు వరహాలు బహుమానమిచ్చి
నిలిచి చెప్పించుడి నేర్పుగా చదువ
బాలురకు సెలవిచ్చి బంపుడింటికిని
దీనులను రక్షించు దీనజనమందార

దసరా నవరాత్రులలో బొమ్మల కొలువులు పెట్టి పన్నెండేళ్ల లోపు పిల్లలతో అందంగా అలంకరింపజేసి ఇరుగుపొరుగు వారిని పేరంటానికి పిలిచి పసుపుకుంకుమ తాంబూలాలు ఇచ్చుకోవడం ఆనవాయితీ. ఈ బొమ్మల కొలువు సందడితో సంఘంలో స్నేహసంబంధాలు ఏరడతాయి. ఇచ్చిపుచ్చుకునే ఆరోగ్యకరమైన అలవాటు పిల్లల్లో అలవడటానికి దోహదపడుతుంది. సరదాగా ఓ బొమ్మల కొలువుపాట.

చిట్టి బొమ్మల పెండ్లి చేసేను జ్ఞానాంబ
చిత్రముగ చూడరమ్మ
మట్టు మీరిన లోకమంతా బొమ్మలు జేసి
నిట్టముగా లక్ష్మీదేవి వియ్యామందే ॥

భూరిబ్రహ్మాండము బొమ్మరిల్లుగ జేసి
ధారణి అల్లా పెండ్లరుగులు జేసి
దారిగా ఆకాశతలము పందిరిజేసి
భారతింద్రాణుల పేరంటాండ్రుగ జేసి ॥చి॥

తళుకు అరుంధతిని తాళిబొట్టుగ జేసి
జలధులన్నీ వాసంతములుగ జేసి
బలు సూర్యచంద్రుల బాసికమ్ముల జేసి
జిలుగు చుక్కలనెల్ల సేసబియ్యము చేసి ॥చి॥

సారె ఓంకారము భేరినాదము జేసి
భారతింద్రాణుల పేరంటాండ్రుగ జేసి
ఘనశేష వాసుల కంకణమ్ముగ జేసి
తనువు శివునకు కన్యాదానము చేసి ॥చి॥

తొమ్మిది రోజులూ ఒక్కొక్కరోజు ఒక్కొక్క అవతారంలో అమ్మవారిని అలంకరించడం, ఉపవాసంతో, నియమ నిష్టలతో కలశస్థాపన చేసి ధూపదీప నైవేద్యాలతో, సంగీత నృత్యాలతో అమ్మవారిని సంతృప్తిపర్చడం ఇలా వైదికాచార పద్ధతుల్లో దసరా పండుగ జరుగుతుంది. ఇదే దసరా తెలంగాణ ప్రాంతానికి వచ్చేసరికి జానపదరూపాన్ని సంతరించుకుంటుంది.

దసరా నవరాత్రుల్లో చేసే బతకమ్మ పండుగ యావత్ తెలంగాణాకే ఓ తలమానికం. మహిళలు అత్యంత ఆనందంగా జరుపుకునే ఈ బతకమ్మ పండుగలో అనేక వైవిధ్యాలు కనిపిస్తాయి. చిన్నపిల్లల దగ్గరినుంచి ముసలివాళ్ల దాకా నూతన వస్త్రాలు పట్టుచీరలు కట్టుకుని బతకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ ఆడటం, పోటీలు పడుతూ బతకమ్మలని తయారు చేయడం చూసి తరించవలసిందే. ప్రకృతిలోని వివిధ రకాల పూలని, ఆకులని తెచ్చి, అందంగా అలంకరించి ఆ బతకమ్మని శ్రీమహాలక్ష్మి, మహాసరస్వతి, మహాకాళి అవతారాలుగా భావించి పూజిస్తారు. ఈ తొమ్మిది రోజులూ పార్వతీదేవి పుట్టింటికి వచ్చినట్టు భావిస్తారు. ప్రతి పూజలోనూ, సపర్యలోనూ పార్వతీదేవిని చూసుకుంటూ ఆడిపాడి పూజలతో ఆ దేవిని ఆనందింపజేసి తొమ్మిదోరోజు నిమజ్జనం చేస్తారు. మళ్లీ పార్వతీదేవి శివుని వద్దకు వెళ్లినట్టు భావిస్తారు. ఈ ప్రక్రియలో ప్రకృతి పురుషుల తత్వం, శివపార్వతుల భక్తితత్వం మనకి బోధపడుతుంది.

శ్రీలక్ష్మిగౌరిని ఉయ్యాలో
చిత్తమందున నిల్పి ఉయ్యాలో
తపమాచరించగ ఉయ్యాలో
తరుణి లక్ష్మీగౌరి ఉయ్యాలో
ఉయ్యాలో ఉయ్యాలో..

బంతి పువ్వులతోడ ఉయ్యాలో
చాలగ మదినెంచి ఉయ్యాలో
గురువింద పువ్వులతో ఉయ్యాలో
తరుణి లక్ష్మీదేవి ఉయ్యాలో ॥ఉ॥

కలువ పువ్వులు చేర్చి ఉయ్యాలో
కన్నె ముత్తైదువలు ఉయ్యాలో
గురువింద పువ్వులతో ఉయ్యాలో
తరుణి లక్ష్మీదేవి ఉయ్యాలో

చాలంగ వర్షించి ఉయ్యాలో
పాలింప మదినెంచి ఉయ్యాలో
తపమాచరించగ ఉయ్యాలో
తరుణి లక్ష్మీగౌరి ఉయ్యాలో

సంగీత ప్రపంచంలో అందునా జానపద సంగీతంలో బతకమ్మ పాటలకు ప్రత్యేక స్థానముంది. ఈ పాటల్లో పురాణాలు, మానవీయ విలువలని తెలిపే విషయాలు, అత్తాకోడళ్ల హాస్యాలు వంటివి నిండి ఉంటాయి.

డప్పు వాయిద్యం, చప్పట్లు ఈ పాటలకి చక్కటి ఊపునిస్తాయి. తేలికైన పదాలతో చక్కటి లయలో ఇముడుతూ మంచి సాహిత్యపు విలువలతో సాగే ఈ పాటల్లో ద్విపదలు, అంత్యప్రాసలు, ముక్తపదగ్రస్తాలు మన మనసులకి ఆనందం కలిగిస్తూ ఉంటాయి.

ఈ పాటల్లో తరచుగా ఉయ్యాలో, చందమామ, వలలో, కోల్‌కోల్ వంటి పదాలు వస్తూ అటు ఆడేవారికి ఇటు పాడేవారికి ఉత్సాహం కలిగిస్తూ ఉంటాయి. బతకమ్మని తయారు చేసేముందు పసుపుతో బతకమ్మని చేసి, పూజించి, తరువాత పూలతో బతకమ్మని చేసి పూజించడం ఓ పద్ధతి. అప్పుడు పాడే పాట ఇది.

పసుపులో పుట్టిన గౌరమ్మ
పసుపులో పెరిగిన గౌరమ్మ
పసుపులో వసంతమాడేవా ॥ 2 ॥

తీగే తిరుపతి మాయిల్లు
పొన్నగంటి తాళ్లు, పోకలగంటి వనములు
వనముల సిలుకలు కొబ్బరిగొట్టె
వనమంతాతోడే గౌరమ్మ
మేడంతాతోడే గౌరమ్మ

కుంకుమలో బుట్టిన గౌరమ్మ
కుంకుమలో బెరిగిన గౌరమ్మ
కుంకుమలో వసంతమాడేవా ॥ 2 ॥

బొజ్జెమ్మ పండుగ దసరా నవరాత్రుల ముందు తొమ్మిది రోజులు జరుపుతారు. ఇది తెలంగాణ ప్రత్యేకత. కన్నె పడుచులు భాద్రపద బహుళ పంచమి రోజు పుట్టమట్టితో బొజ్జెమ్మని చేసి తమకు చక్కని వరుడు లభించాలని లక్ష్మీపార్వతులను పూజిస్తారు. ఈ పాట పాడుతూ చప్పట్లు కొడుతూ ఆడతారు. ఇందులో సాహిత్యపరంగా గమనిస్తే ముక్తపదగ్రస్తం అంటే వచ్చిన పదమే మళ్లీ వస్తూ చమత్కారంగా పాటకి ఒక అందాన్ని, ప్రత్యేకతని తెచ్చి పెడుతుంది. ఈ బొజ్జెమ్మ పూజ మహాలయ అమావాస్యతో పూర్తవుతుంది. తరువాత బతకమ్మని పూజిస్తారు. తొమ్మిదో రోజు నిమజ్జనం చేస్తారు.

మాలుమర్తి మేడ మీద - చందమామ
వెండియ్య వేనగరలు - చందమామ
వెండియ్య వేనగరలకు - చందమామ
ఇత్తిడీయ సేరలు - చందమామ
ఇత్తడీయ సేరలకు - చందమామ
రాగీయ కడుపలు - చందమామ
రాగీయ కడుపలకు - చందమామ
ముత్యాల ముగ్గులు - చందమామ

ముత్యాల ముగ్గులకు - చంద
మామ
వజ్రాల వాకిండ్లు - చందమామ
వజ్రాల వాకిండ్లకు - చందమామ
పగడాల పందిళ్లు - చందమామ
పగడాల పందిళ్లకు - చందమామ
మంచినీళ్ల బావిపుట్టె - చందమామ
మంచినీళ్ల బావిపక్క - చందమామ
మంచి మల్లె తీగబుట్టె - చందమామ
కోసెవారెవరు లేక - చందమామ
కొండెత్తు పెరిగిపోయె - చందమామ
కోయించ సందప్ప - చందమామ
పంచిపెట్టు గౌరమ్మ - చందమామ

బతకమ్మ పాటల్లో పురాణాలు, మోహినీ, రుక్మిణీగాథ, బాలనాగమ్మ, సీతారాములు కథల లాంటివి ఒకరు చెప్తూ ఉంటే తక్కినవారు ఉయ్యాలో అంటూ పాడుతూ బతకమ్మ చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ పాడటం ఓ సరదా. అలాంటి ఆణిముత్యం:

రామరామ ఓ రామ ఉయ్యాలో
శ్రీరామ ఓరామ ఉయ్యాలో ॥ 2 ॥
తొక్కుతూ భూదేవి ఉయ్యాలో
మొక్కుదమ్మా నిన్ను ఉయ్యాలో
మొక్కినవారికి ఉయ్యాలో
వరించే మాట తల్లి ఉయ్యాలో
తొక్కిన వారికి ఉయ్యాలో
తోడువట తల్లీ ఉయ్యాలో
భూమ్మీద సారెడు ఉయ్యాలో
ఒండారిబోసి ఉయ్యాలో
భూదేవి నాపాట ఉయ్యాలో
బుగ్గలాయి రమ్మి ఉయ్యాలో
సెతిమీద సారెడు ఉయ్యాలో
సెంద్రమ్ము బోసి ఉయ్యాలో
జలదేవి నాపాట ఉయ్యాలో
జనులు మెచ్చారమ్మ ఉయ్యాలో

ఈ విధంగా కథ పూర్తయ్యే వరకూ సాగుతుంది. బతకమ్మ పండుగ రోజుల్లో తెలంగాణ ఆడబడుచులు తమ అన్నలు చల్లగా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ వాయనాలు ఇచ్చుకుంటూ ఈ పాట పాడతారు.

జొన్నల్ల పుట్టినగౌరి జొన్నల్ల పెరిగినగౌరి
అన్నలేసిన పొన్నలకింద నేను వేసిన
నిమ్మలకింద
చల్లంగుండు సంపతి గౌరమ్మ
వడ్లల్ల పుట్టినగౌరి వడ్లల్ల పెరిగినగౌరి
అన్నలేసిన పొన్నలకింద నేను వేసిన
నిమ్మలకింద
చల్లంగుండు సంపతిగౌరమ్మ
కందుల్లో పుట్టిన గౌరి కందుల్లో పెరిగిన గౌరి
అన్నలేసిన పొన్నలకింద నేను వేసిన
నిమ్మలకింద
చల్లంగుండు సంపతిగౌరమ్మ

ప్రకృతిలో ఉండే చెట్లతో చిలకలతో పక్షులతో పలుకరిస్తూ సాగే మరో పాట బతకమ్మ పాటల్లోనే అరుదైనదిగా చెప్పవచ్చు. తమాషాగా



మూడు నడకలతో సాగుతూ అందరినీ ఆనందింపజేస్తుంది. ఇది నా చిన్నతనంలో సత్తెమ్మ అనే మా పక్కింటి మహిళ వద్ద నేర్చుకున్నాను.

రుద్రాక్ష చెట్లల్ల ఆటసిలకల్లారా
పాట సిలకల్లార
కలికి సిలకల్లార కొలికి సిలకల్లారా
కందూవ గువ్వలు, కందూవ గువ్వలు
నీనోము నీకిత్తునే గౌరమ్మ
నానోము ఫలమీయవే ॥
తంగేడు సెట్లల్ల ఆటసిలకల్లార
పాట సిలకల్లార
కలికి సిలకల్లార కొలికి సిలకల్లార

కందూవ గువ్వలు కందూవ గువ్వలు
నీనోము నీకిత్తునే గౌరమ్మ
నానోము ఫలమీయవే ॥
గోరింట్ల సెట్లల్ల ఆట సిలకల్లార
పాటసిలకల్లార
కలికి సిలకల్లార కొలికి సిలకల్లార
కందూవ గువ్వలు కందూవ గువ్వలు
నీనోము నీకిత్తునే గౌరమ్మ
నానోము ఫలమీయవే ॥

పండుగలు కేలండర్ గడుల్లో పదాలుగా కాక జనజీవితాల్లో ఎలాంటి పాత్ర పోషించాయన్న దానికి దసరా పండగే రుజువు. ఒకప్పుడు మనుషులు ప్రకృతితో ఎంతగా మమేకమై జీవించారన్న దానికి ఈ జానపదగీతాలే తార్కాణం. రసం ఆవిరై నెర్రెలు దీసిన ఆధునిక జీవన తలంపై తొలకరి కురిపించి ఆనందపు మొలకలు వేయించగల కళ ఉంది పండుగల్లో. ఆ సంస్కృతిని రక్షించుకోవాలి.



లలిత జానపద గాయని,
సంగీత దర్శకురాలు
040 - 65096899

సరదాల వరద

ఎర్రాప్రగడ రామమూర్తి

సరదాల వరద దసరా
నరవిరిసిన విరులగుమ్మ లాబతకమ్మల్
గిరిజా శ్రీవాణుల సం
బరాల నవరాత్రులు మహి మహిళల మహిమల్.

ఏవీ ఆ దసరా మహోత్సవములేవీ ఆ ధనుర్బాణ వి
ద్యా విన్యాస విరాజమాన గురు శిష్యామోద గీతావళుల్!
లేవే ఇప్పుడు పప్పుబెల్లముల ఊరేగింపు సన్మానముల్!
రావే పల్లెల స్వప్నవీధికయినన్ రంగారు తద్దృశ్యముల్!

కలకల నవ్వుచున్ కదన గాథలు గానము చేయుచున్ రణ
స్థలి వెలవెల్లనై నిలువ శత్రు శిరమ్ముల బంతులాడడే
గిలకలు పట్టుబాలకుడె క్రీడియనన్; దసరాల వేడుకల్
పిలచిన పల్కునట్లు ముడిపెట్టిరి పూర్వులు దేశభక్తితో.

వేదిక చిందులేయ పులివేషము కట్టినవారెకాదు, బా
లాదిగ చూచువారును మహాధృతిమంతులుకారె? దుష్కృతో
ద్వేదన భండనాభిజిత భీమపరాక్రమ రుద్రమోద్ధతిన్
పేదరికంబులేని పులిబిడ్డల బొడ్డు తెలుంగుగడ్డరా!

కొన్నియైన కోతకు రావు పిన్నవరులు
దరులు నెరిసి సాంబమసూరి ఎరువుకోరు
అన్నదాతకు అప్పుపై అప్పులైన
కరవురోజుల పండుగ బరువుకాదె!

శారద నీరదాల తెలిసొరుల జాబిలి జోరుమీరి, క
ల్హార విలాస వాసిత సలాలస చుంబనహేల సోలి, కా
సారములందు వాలి, మనసారగ సారెకు నోలలాడగా
తారకలన్నియున్ విరహతాపము నోర్వక చిన్నవోయెరా!

తెలుగు పలుగు నిపుడు తిలకింపకున్నచో
విజయ దశమి ఫలము వీగిపోవు
మొండి బండరాతి గుండెలవారికి
తరమె పాలపిట్ట దర్శనమ్ము?

నిను రామఫల్గుణులు న
మ్మినవారు విజయులయిరి శమీతరువరమా!
మనుమా! మా మనుషుల విష
సునిశిత పరశువుల కన్ను చూడని చోటన్!

ఒదిగి త్రిమూర్తులందు పురుషోత్తముడుండియు చేతులెత్తివే
య, దురము సేయగా దిగిన అమ్మహిషాసురమర్దనిన్ దలం
చి, దశదిశల్ గ్రసించు అవినీతిఖరాసురులన్ వధింపగా
కదలి కరాళ కాళికలుగా మహిళాంబికలార రండికన్

విశ్రాంత తెలుగు
ఉపాధ్యాయులు,
బహు గ్రంథకర్త, ఖమ్మం
సెల్: 94905 20986

మనో ప్రస్థానం
కలంలో...
హృదయభావాన్ని నింపితే
జాలువారే ప్రతిఅక్షరం
ఓ మ(హా)నో ప్రస్థానమే...

ఇంతేగా ఈ జీవితం
నిన్నంటే జ్ఞాపకం!
నేడంటే వాస్తవం!
రేపంటే స్వప్నం!
ఇంతేగా జీవితం!

క్షణికావేశం... జీవిత కాలం!
ఒక్క క్షణం మాత్రమే...
క్షణికావేశం జీవితకాలం!
కాని ఆ ఒక్క క్షణమే...
మనకు జీవితకాలవిషాదం!

అందరిలోనూ కవితాహృదయం
అందరిలోనూ...
కవితాహృదయం ఉంది.
మనిషి...
రాయనంతవరకే రాయి..
రాస్తే ఋషి.

రగిలే గుండె
ఎగిరే జెండా...
గాలి దిశను సూచిస్తుంది!
రగిలే గుండె...
రేపటి ప్రపంచాన్ని శాసిస్తుంది!

పదునైన పదం
ఆరువందల పేజీల...
అర్థంకాని గ్రంథం కన్నా
పదునైన పదం ఒక్కటిచాలు
ప్రపంచానికి సందేశమివ్వటానికి.

–నక్కా సంజీవరావు, విజయనగరం.
99668 55727

అత్తా కోడళ్లు

సూర్యకాంతాలూ చంద్రకాంతాలు

పోలాప్రగడ జనార్దనరావు (జెన్నీ)
సన్నిధానం నరసింహశర్మ

అత్త మన కుటుంబంలో ఓ గొప్పపాత్ర. అత్తా ఒకింటి కోడలే అయినా కొందరికి గుర్తుండదు, పదవి వచ్చింది దిగడమెందు కనుకునేవారు కొందరు.

అత్తల్లో సూర్యకాంతాలే కాదు, చంద్రకాంతాలూ ఉన్నారు. కోడల్ని కూతురుగా చూసుకుని ప్రేమపొందే అయస్కాంతాలూ ఉన్నారు. కోడల్ని బాధపెట్టే అత్తగా సూర్యకాంతం నటించినప్పుడు ఆ సినిమాలు చూసిన కొందరాడవాళ్లు సూర్యకాంతాన్ని కొట్టాలని తెర వద్దకు వెళ్లేవారట కూడా!

ఒక్కొక్కప్పుడు అత్తది ద్విపాత్రాభినయం కూడా. అల్లుడి దృష్టిలో దేవత. ఆ అల్లుడికి అత్తగారిల్లు ఓ భూతల స్వర్గం.

'అత్తలందు మంచి అత్తలు లేరయా' అని కాదు 'అత్తలందు మంచి అత్తలు వేరయా' విశ్వదాభిరామ వినురవేమ అని చదువుకోవాలి.

దేవతల్లోనూ అత్తాకోడళ్లు, నర్మగర్భంగా మాట్లాడుకోవడాలూ దెప్పుకోవడాలూ ఉంటాయి. ఇందుకు పురాణ కథనాలు జనం చెప్పుకోవడాల్లో ఉన్నాయి.

అత్త లక్ష్మీదేవిని పలకరించడానికి కోడలు సరస్వతి పాలసముద్రానికి వచ్చిందట.

"అత్తమ్మా! లక్ష్మీ, పాము మీద కూర్చున్నావు ఒళ్లు జలదరించదా? " అంది సరస్వతి.

"పక్షుల మీద కుర్చునేంత సుకుమార శరీరం కాదమ్మా నాది" అంది లక్ష్మి.

పిల్లనగ్రోవిని చూసి "అత్తా దీనికి ఇన్ని చిల్లులున్నాయేంటి? " అంటే

"వాక్శుద్ధి ఉందనుకున్న దానికి జల్లెడనిచ్చి దీన్ని విశ్లేషించమంటే నిండా చిల్లులే ఏం చెప్పమంటావు" అందట.

"అత్తా! పాలసముద్రం ఇలా నీళ్లసముద్రమయిందేమిటి? " అంది సరస్వతి

"అమ్మా కోడలా! ఇప్పుడే ఓ హంస ఆకలితో వచ్చి పాలన్నీ తాగేసి ఉప్పునీళ్లు వదిలేసింది" అంది లక్ష్మి

ఇక ఆధునిక కథనాల విషయానికి వస్తే సాహిత్య అకాడమీ బహుమతి పొందిన సినీ నటి భానుమతికి పేరు తీసుకువచ్చింది అత్తగారి కథలే. పత్రికల్లో ఆ కథలు పడ్డాయి. వాటి సంకలనం పుస్తకంగానూ వచ్చింది, విశేషాదరణ పొందింది. అత్తగారి పాత్రను అంత అందంగా తీర్చిదిద్దిన ఘనత భానుమతిదే.

ఆ మధ్య ఓ పేరున్న రచయిత్రి కథలో ఓ అక్క పెళ్లయిన చెల్లెలికి అత్తగారి దగ్గర కోడలి నటన ఎలా ఉండాలో తన అనుభవంతో చెప్పింది. దాని సారాంశం ఇదిగోయిదీ!

"పిచ్చిదానా అత్తగారితో తగవు పెట్టుకోకు. నాలాగే నువ్వూ నటించడం నేర్చుకో అత్తగారి పట్ల ప్రేమను సరిగ్గా నటించావనుకో ఆమెలో ఒక ఆయా, ఒక వంటమనిషి, ఒక పనిమనిషి, ఒక కాపలామనిషి ఇలా ఎందర్నో చూసుకుని ఉపయోగించుకోవచ్చు. అత్తను వదులుకున్నావో వీరందరికీ ప్రత్యేకంగా జీతాలు ఇచ్చి పెట్టుకోవాలి" అని.

అత్త అనేది రెండక్షరాల మాటే- అత్తంటే.. పెనిమిటి తల్లి, భార్యతల్లి, తండ్రి సోదరి, మేనత్త, మేనమామ భార్య, వేశ్యామాత. సంస్కృత విశేష్య అర్థంలో తినువాడు, భక్షకుడు అని పురుషపరంగా సూర్యరాయాంధ్ర నిఘంటువు చెప్పింది.

అత్తేకాదు, కోడలికీ సాహిత్యంలో ప్రముఖ స్థానం ఉంది.

జానపదగేయాల్లో అత్తాకోడళ్లు ముఖ్యపాత్రలున్నవాళ్లు. వాళ్ల చిర్రుబుర్రులూ తమాషాగా ఉంటాయి. కొన్ని శ్రామిక కుటుంబాల్లో కోడల్ని 'కోడాలు' అని అనడం కూడా ఉంది. కోడె అంటే వయస్సులో ఉన్న అని భావం. ఇల్లు మాటకు ఆలు కలిసి ఇల్లాలు అయినట్లే 'కోడె'కు ఆలు కలిసి కోడాలు అయిందని కొందరంటారు. ఇంట్లో కోడెలాంటి కుర్రాడికి ఆలు కాబట్టి 'కోడాలు' అనీ అనుకోవచ్చు! తల్లి చాటున లాలనగా ఉన్న అమ్మాయి అత్తింటిలో కాలు పెట్టడంతో ఓ కళ వచ్చినట్లే. అత్త

ఎంతగా చూసినా ఆకలేస్తే అమ్మే గుర్తుకు వస్తుంది.

'ఆకలికి వేళాయె అమ్మ తలపాయె
అమ్మగారింటికి వెళ్లబుద్ధాయె'

అనే జానపదగేయ వాక్యాలందుకు వచ్చినవే.

'పుంటి కూరతిన్నా పుట్టిల్లు పుట్టిల్లే' అనే సామెత ఒకటి కోడలి తలపునకు అద్దం పడుతుంది. 'అత్తింటి సుఖం మోచేతి దెబ్బ'లాంటిది అనేది మరో సామెత!

అత్త, కోడళ్లు కుటుంబ సమగ్రతకు తప్పనిసరి. కానీ ఒకళ్ల ఉనికికి మరొకళ్లు అయిష్టం చూపడం సామాన్య అంశాలు. అందుకే

"అత్తలేని కోడలుత్తమురాలూ ఓయమ్మా!
కోడల్లేని అత్త గుణవంతూరాలు - ఆ (హూ)"

నాగరికత పెరిగినకొద్దీ అత్తల ఆరళ్లూ, కోడళ్ల బాధలూ బాగా తగ్గాయి. కొన్నిచోట్ల అస్సలుండని తావులూ ఉన్నాయి. కానీ ఒకనాటి కాలంలో అవి ఉండటాన్ని జానపదగేయాలు పొదిగించుకున్నాయి.

నేటి కాలంలోని మిషన్లూ, సౌకర్యాలు ఒకనాడు లేవు. ఇంట్లో పనులు అత్త కోడళ్లూ కలిసి చేసుకోవాలి. అలా చేసుకోవడంలో అత్త చెలాయింపులు సహజంగా ఉండేవి.

"కొయ్య తోటకూర కొయ్యక చెడెను
దంచక్క (క) వంగవే ధాన్య రాశుల్లు
వంచక్క వంగరే వనిత! కోడళ్లు"

అనే పాట వాక్యాల్లో కొయ్య తోటకూరని కోయకపోతే చెడిపోతుంది. దంచకపోతే ధాన్యం ఉపయోగంలోకి రాదు. వంచకపోతే కోడళ్లు పనుల్లో వంగరు అనడంలో అత్తకోణమే ఎక్కువ.

అత్తకి ఒళ్లు మండితే కోడల్ని- "పచ్చిపాల మీద మీగడలేవి" అని, "వేడి పాలమీద వెన్నల్లు ఏవి" అనీ "నూనె ముంతలమీద నురగల్లు" ఏవి అనీ ప్రశ్నించగలదు.

కానీ ఆ ప్రశ్నల్లో ఎంత చమత్కారం పాలుందో, ఎంత అతిశయం పెరిగిందో ఆలోచిస్తే భలే ఉంటుంది.

ఇలా ప్రశ్నిస్తే కోడలూరుకుందా? అలా ఉంటాయా అని అడగడమే కాదు, పంచాయతీలాంటిది పెట్టింది

"ఇరుగు
పొరుగులార!
ఓ చెలియలారా!
అత్తగారి ఆరళ్లు
చిత్తగించారా" అని వారిని

అడిగినట్లడిగి పరిష్కారాన్ని తానే చెబుతోంది

"పెత్తనం లాగేస్తే
పేచీలు పోను" అని కుండబద్దలు కొట్టి

మరీ చెప్పింది.

బతుకుల అందాలు పల్లెటూళ్లలోనే ఉన్నాయేమో! పనిపాటల్లో అత్తాకోడళ్లూ ఒకరిపై ఒకరు ఒకచోటే నవ్వుకుంటూ దెప్పుకుంటూన్నట్లు పాడటం వాళ్లకే చెల్లింది.

అత్తాకోడళ్ల తత్వాలు మారలేదేమో ఎటొచ్చీ నాగరికమయ్యాయేమో!

చివరకు అత్తామామల మరణాలపై కూడా పరిహాసాలు, చమత్కారాలే

అత్తచచ్చిన కోడలేమని ఏడ్పు?
"పంటకాడ చీద్రమ్ముపోతివా? అత్తా"
మామచచ్చిన కోడలేమని ఏడ్పు
"మంచాల మరణమ్ము పోతివా? మామ!"

ఏది ఏమనుకున్నా అత్తాకోడళ్లు చచ్చినట్లు కలిసి ఉండాల్సిందే అందులోనే బతుకు బంధాల తియ్యందనాలు, అనే వారున్నారు.

పదివాక్యాల భావం ఒక్క వాక్యంలో రసాత్మకంగా చెప్పడం కావ్య లక్షణం. అవన్నీ జానపద వాఙ్మయంలో - అందునా ఈ అత్తాకోడళ్ల సంబంధాల్లో పుష్కలంగా ఉన్నాయి.

'అత్త చచ్చిన ఆరుమాసాలకి కోడలికంట నీరు వచ్చినట్లు' 'కోడలి గృహప్రవేశం అత్త గంగా ప్రవేశం' వంటి సామెతల్ని ఎంతగానో వ్యాఖ్యానించుకోవచ్చు మరి.

మన కుటుంబ వ్యవస్థలో అత్తాకోడళ్లు ప్రేమతో సామరస్యంగా సాగుతూంటే ఆయింట- అనుకోడం, వినుకోడం, మనుకోడం హాయిగా సాగుతాయి. ఆ ఇంటి ఆకుపచ్చతోరణాల్లో మిసమిసలు మరింతగా పెరుగుతాయి. అత్తలకు, కాబోయే అత్తలకూ (అక్టోబరు నాల్గవ ఆదివారం) అత్తల దినోత్సవ శుభాకాంక్షలు.

గుడజిహ్వాకా న్యాయం

గుడమంటే బెల్లం, జిహ్వాక అంటే నాలుక. తినేదైనా, వినేదైనా ప్రియంగా ఉంటేనే సొక్కుతుందని చెప్పేదే గుడజిహ్వాకా న్యాయం. యదార్థవాదీ లోక విరోధి అన్నారు కదా. అందుకే సత్యాన్ని ఎప్పుడూ సుతిమెత్తగా చెప్పాలే కానీ సుత్తితో మొత్తినట్లుగా కాదు. ఎంత మంచి మాత్రైనా చేదుగా ఉంటే ఇష్టపడం. ఎంత చిన్న విషయమైనా అహాన్ని తాకితే ఓర్చుకోలేం. అందుకే అనుసరించాలి గుడజిహ్వాకా న్యాయం.



• జెన్నీ హాస్య నటుడు, మూకాభినయ కళాకారుడు, హైదరాబాదు, 98491 42361
• సన్నిధానం నరసింహశర్మ, రాజమండ్రి గౌతమి గ్రంథాలయ పూర్వోద్యోగి, హైదరాబాదు. 80085 51841.

నందుగాడి రంగుల కల

గుర్రం ఆనంద్

శనివారం పగటి పూట బల్లే రెండో బెల్లు కొట్టిండ్రు. నందుగాడు హింది చూసిరాత కాపీ తీసి టేబుల్ మీద పెట్టొచ్చి ఆడి జాగల ఆడు కూసున్నడు. హింది సారు రావల్నా... డ్రాయింగు సారొచ్చిండు. పిల్ల గాండ్లందరు లేసి నిలవడి గుడ్ మార్నింగని, గుడ్ ఆఫ్టర్‌నోనని, గుడ్ ఈవినింగని ఎవడికి యాదికొచ్చింది ఆడు జెప్పిన్రు. ఇగ డ్రాయింగు సారేమొ "సిడౌన్ సిడౌన్" అనుకుంట సేతులున్న నోటిస్ బుక్కు తెరిసిండు. డ్రాయింగు సారు గీ మధ్యన్నే బల్లే జేరిండు. పిలగాండ్లకు వీజిగ బొమ్మల ఎట్ల దించుడో మంచిగ నేర్పిత్తుండు. నందుగాడికి గీ సారంటే బాగా ఇష్టమైంది. పిల్లిని ఎలక లెక్క, కాకిని కొంగల లెక్క దించటోడు గిప్పుడు నందుగాడు పిట్టని పిట్ట లెక్క, గుట్టని గుట్ట లెక్క దించుతుండు. అయిన గూడ ఐదో తర్గతల బొమ్మలు దించుడు రాంది ఎవల్కంటే నందుగాడి పేరే జెప్తరు అంతా.

డ్రాయింగు సారు "సైలెన్స్ సైలెన్స్" అనుకుంట పిలగాండ్ల నోర్లు మూసి నోటీస్ సదువుడు పెట్టిండు. "ఇందుమూలముగా విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేయునది ఏమనగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జవహర్ బాల భవన్ వారు పిల్లలందరికి జిల్లా స్థాయి డ్రాయింగు పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల పిల్లలందరు ఈ పోటీలో పాల్గొనగలరు. ఇట్లు ప్రధానోపాధ్యాయులు" దీన్జదివి "డ్రాయింగు పోటీలో పాల్గొనెటోళ్లు లేసి నిలవడుండ్రి.. పేర్లు రాసుకుంట" అని అన్నడు. బొమ్మలు మంచిగ దించెటోళ్లు పద్మ, విజయ, లక్ష్మి, ఇగ మగ పిలగాండ్లల్ల శీనుగాడు, రమేశ్‌గాడు లేసి నిలవడ్డరు. నందుగాడిగ్గూడ గీ డ్రాయింగు పోటీల పోవాలనుంది. సారు నన్దీసుకుంటడో లేడోనని, నిల్సొవాల్నా అద్దా అని కింది మీదయితండు. ఎట్లయితాట్లాయని దేర్నంగా లేసి నిలవడ్డడు. నందుగాడ్ని సూసి పిల్లగాండ్లందరు నవ్వుడు పెట్టిండ్రు. "సార్... నందుగాడు సున్నా గూడ గుండ్రంగ దించడ"ని సూరిగాడన్నడు. ఇగ శీనుగాడేమొ "ఓరేయి... గిది మన బల్లే గాదు... ఆడికి అన్ని బల్లల నుండి పోటీకి అత్తరు" అని ఆడికే తెలిసినట్టు జెప్పిండు. నందుగాడు సప్పుడు జేయక చీట్లనే నిల్సున్నడు. డ్రాయింగు సారు సప్పుడు జేయక నందుగాడి పేరు గూడ రాసుకొని "రేపు ఆదివారం, పొద్దున తొమ్మిది గంటలకల్లా పేర్లిచ్చినోళ్లంతా పెన్సిల్లు, కలర్ పెన్సిల్లు పట్టుకొని బడికి రావలే, అందర్ని నేను బాలభవన్‌కు తీస్కవోతా" అన్జెప్పి ఆరో తరగత్లకు వోయిండు.

బడి చుట్టికాంగనే నందుగాడు ఇంటికివోయే తొవ్వలున్న అస్లం కిరాణం దుకాణ్ల ఆగి, "కలర్ పెన్సిల్ల డబ్బా ఉందా" అని అడిగిండు. పది నోటు ఇచ్చిన గిరాక్కి సిల్లరియ్యడానికి అస్లం భాయ్ పైసల్ లెక్కపెట్టుకుంట ఉందన్జెప్పిండు. ఎంత అనడిగిండు. ఆర్రూపాలన్జెప్పిండు. అండ్ల ఎన్ని కలర్ పెన్సిల్లుంటయ్? అస్లంభాయ్ పన్నెండన్నడు. ఏవేం కలర్లున్నయ్? అని నందుగాడు మళ్లా అడిగిండు. గింతల అస్లం భాయ్ లెక్క తప్పిండు.. "బద్మాష్! పైసలెక్కవెడ్తంటే అది ఎన్నీ, ఇది ఎంత అనీ పరేషాన్ జేత్తున్నవ్! ఛల్ పైసే లేకే ఆవ్.. బతావుంగా" అని నందుగాన్ని గదుమాయించిండు. గిప్పుడే పట్కత్తాని ఆణ్ణుంచి లగాయించిండు. తొవ్వల చింత చెట్టు కింద చందుగాడు గోరిలాడుతుండు. "రేయ్... జెప్పన్రారా. ఇయ్యాల తొంటోడి గోరిలన్నీ ఎట్లయిన దొబ్బాలే" అని చందుగాడు వెల్తె "కలర్ పెన్సిల్లు కొనుక్కోవాలే, బొమ్మలు దించాలే. ఈయ్యాల రాను పోరా" అనుకుంటూ నందుగాడు ఇంటికురికిండు.

గల్మకాడ గూసోని లచ్చువమ్మ బీడీలు సుడ్తంది. ఓ పదారేండ్ల పొల్ల బీడీలు సుట్టుడు నేర్వాలని లచ్చువమ్మ పక్కగూసోని బీడీల తోకలకు దారం కడ్తంది.

నందుగాడు ఎగపోసుకుంట ఉరికచ్చి లచ్చువమ్మ మొకంల మొకం పెట్టి "అమ్మా... ఆర్రూపాలియ్యే... కలర్ పెన్సిల్లు కొనుక్కోవాలే... బల్లే రేపు డ్రాయింగు పోటీలున్నయ్. అస్లంభాయ్ దుకాణ్లడిగచ్చిన. ఆర్రూపాలట. జల్దియ్యే కొనుకచ్చుకుంట" అని దమ్ముదీయకుండ పాఠం అప్పజెప్పినట్టు జెప్పిండు.

"బాపును పంపువని కారట్ రాద్దంగాని నువ్వోయి కాళ్లేతులు కడుక్కోని అన్నం తినుపో" అని లచ్చువమ్మ నందుగాడి మొకం గూడ సూడకుండా బీడీలెన్నయినయో లెక్కవెట్టమని పక్కగూసున్న పొల్లకు జెప్పింది.

"బొంబాయి నుంచి బాపు పంపించేటల్లాకి ఆర్నెల్ల పరీక్షలత్తయ్. డ్రాయింగ్ పోటీ రేపే ఉందే... నాకియ్యాల్నే గావలే... జల్దియే" అని నందుగాడు ఎగిర్తవడ్తాంటే...

"ఆ... జల్దియ్యడానికి ఈడ ముళ్ళే గట్టివెట్టిన్నా?" అని బీడీల సాట పక్కకు వెట్టి గల్మకానుండి లేసింది లచ్చువమ్మ. "ఓ నాడు పెన్నుగావలంటవు, ఓనాడు పెన్సిలు, ఓనాడు లబ్బరు. రోజుకో యేశం గడ్తవ్" అనుకుంట బాయి దగ్గరికొచ్చి తంబాకు చేతుల్ని సబ్బుతో కడుక్కుంది.

నందుగాడు ఆళ్ళమ్మ ఎనకనే అడుగలడుగేసుకుంట వోయి "గీది డ్రాయింగు పోటీయే. కలర్ పెన్సిల్లతోనే బొమ్మల్దించాలే. నీకేందెల్వదేందే. పైసలియ్, జల్దివోయి కొనుక్కచ్చుకుంట" అని నందుగాడు జబర్దస్తుగడిగిండు.

"కలర్ పెన్సిల్లేవ్ గిలర్ పెన్సిల్లేవ్! పైసల్ సెట్లగ్గాత్తన్నయ్ అనుకుంటున్నవా? సదువు సక్కగ సదువు సాలు" అని గదువాయిస్తు నందుగాడి మొకం కాల్జేతులు కడిగింది.

నందుగాడు ఏడుపు మొకం పెట్టి "నీయమ్మ... నువ్వేదడిగిన గొనవ్" అని ఆడున్న బాల్జి తన్ని కోపంగా ఇంట్లకురికిండు.

పోరనికి ఈపు బాగా ములముల వెడ్తందనుకుంట లచ్చువమ్మ గూడ ఇంట్లకచ్చింది. అంటిట్లకోయి పళ్లెంల అన్నం బెట్టి "అన్నందిందురారా" అని పిల్సింది.

"అన్నవద్దు, ఏవద్దు. ముందుగాల్నాకు కలర్ పెన్సిల్గొనియ్" అని నందుగాడు ఏడ్సుడు వెట్టిండు.

"అద్దయితే ఎండు... కడుపులగాల్తే రోగం తిరుగుద్ది" అని లచ్చువమ్మ మళ్ళా బీడీల సాట ముందట వెట్టుకోని కూసుంది.

నందుగాడికి ఇర్గ కోపమచ్చి "గిప్పుడు నువ్ గొనియకపోతే.. ఏం జేత్తనో సూడు" అని బీడీలకు సుట్టే దారం బింగిరి అందుకోని బాయికాడికి ఉరికిండు. "కలర్ పెన్సిల్లు గొనిత్తవా... గీ బింగిరి బాయిలెయ్యాల్నా" అని బాయిగోడ పక్కకు నిల్సొని దారం బింగిరిని ఓ సేత్తో బాయిలకిడిసి పట్టుకున్నడు.

"బింగిరి బాయిల వడాలే... గప్పుడు జెప్తా నీ సంగతి" అని బెదిరించుకుంట ఆడ్ని వట్టుకోనీకి బీడీల సాట పక్కకువెట్టి లేసింది లచ్చువమ్మ.

"నా దగ్గరికొత్తే... బింగిరి బాయిలవడేత్త.. నాగ్గొనిత్తవా గొనియవా జెప్పు" అని బాయి ఆ పక్కకోయి ఉల్టా బెదిరిచ్చుడు వెట్టిండు.

ఈ మోర్దోపోడు అన్నంత పన్జేత్తడని "సరే కొనిత్తగని... ఆ బింగిరి ఇటియ్యిరా" అంది.

నందుగాడు నమ్మక "ముందుగాల ఆర్రూపాలు ఆడవెట్టు.. గప్పుడిత్తా" అనుకుంట బాయి సుట్టు సెక్కర్లు గొట్టుడు వెట్టిండు.

"నందుగాడు మంచోడు గదా... దుగూట్లున్న డబ్బుల్నే పైసలున్నయ్... నువ్వే అచ్చి తీసుకుందురా" అని బుదుకరించింది.

గిట్లజేత్తనే నాగ్గొనిత్తవన్నట్టు ఓ సూపు జూసి దారం బింగిరిని పెరట్లకిసిరికొట్టిండు. దారం బింగిరి కోసం లచ్చువమ్మ పెరట్లకోంగనే నందుగాడు ఇంట్లకురికి, దుగూట్లున్న పైసల డబ్బకోసం స్టూలెసుకొని ఎక్కవోతుండు.

గింతట్లనే లచ్చువమ్మచ్చి నందుగాడి ఈపుల నాలుగు సరిసి "నక్రాల్జేతున్నవారా గాడ్డి.. ఊకున్నకొద్ది సెప్తినకుంట తయార్రైనవ్.. మొండికెగవడ్డవ్ బాగా" అని ఇర్గమర్గదంచింది. వాడకట్టంత ఇనచ్చటట్టు నందుగాడు మొత్తుకునుడు వెట్టిండు. "మళ్లా గిట్ల అదిగావలే, ఇదిగావల్నని మంకు జేత్తవా?" అని రెండు దవడలు వాయించింది. "సదువు సంక నాకి పోనిగని... బొమ్మల్దించుతడట బొమ్మలు.. సెప్పినట్టు ఇనకపోతే కాళ్లిరగ్గొట్టి మూలగ్గూసుండవెడ్త" అనుకుంట ఇంకో నాలుగు దెబ్బల్సర్సి మళ్లా బీడీల సాట ముంగల వెట్టుకొని సిక్కువడ్డ బింగిరి దారం ఇడదీసుడు వెట్టింది. నందుగాడు ఏడుసుకుంట మూలకు నక్కిండు. ఆడికి యాస్టకొచ్చేదాక ఏడ్సి ఏడ్సి అట్నే నిద్రవోయిండు.

రాత్రి ఎనిమిది గొట్టంగ లచ్చువమ్మ నందుగాడ్ని లేపింది. ఆడు లేసి సుట్టు సుత్తే చీకటి వడ్డదని తెల్సింది. కలర్ పెన్సిల్లు యాదికొచ్చి గుండెలదిరేటట్లు ఎక్కెక్కిపడి మళ్లా ఏడుసుడు వెట్టిండు.

లచ్చువమ్మ దగ్గరికి తీసుకొని "బొమ్మలు కలర్లు ఎయ్యకుంట గూడ దించుతరు" అని బుదకరిచ్చుడు వెట్టింది.

"కలర్లు ఎయ్యకుంటే బొమ్మలు మంచిగెట్లుంటయ్" అని కడుపుల నుండి వచ్చే ఏడుపు ఆపుకుంట అడిగిండు.

నందుగాడ్ని పొత్తిల్లకద్దుకొని ఆడి నుదురు ముద్దాడి "తిరుపతి మావోళ్ళింట్ల నువ్ టీవీ జూత్తవ్గదా. ఆండ్ల పాత సిన్మాల్లత్తయి... గా బొమ్మలు కలర్లుంటయా? నాగేశ్వరరావు బొమ్మ, ఎన్టీఆర్ బొమ్మ, సావిత్రి బొమ్మ ఎంత మంచిగుంటయ్. నువ్ గట్నే దించు" అని సముదాయించింది. నందుగాడికి కొంచెం రైటే

గదా అనిపించింది. "అమ్మ ఆకలే" అన్నడు.

ఆ రాత్రి జోరువాన మొదలైంది. తెల్లారదాక ఎడతెరిపి లేకుండా కొట్టుడు వెట్టింది. నందు గాడు పొద్దుగాల్నే లేసి తానం జేసి తయార యిండు. పెన్సిలు కోసం ఆడి పుస్తకాల సంచిల ఎతుకుతాండు. పుస్తకాలన్నీ దీసి సంచి దులుపితే రెండు ఇరిగిపోయిన మొండి పెన్సిల్లు దొరికినయ్. జంగుపట్టిన బ్లేడు తీసి పెన్సిల్ చెక్కుతుంటే పుసుక్కున ఏల్తెగింది. అమ్మా అమ్మా అని మొత్తుకుంటే అటెంట్ల నుంచి లచ్చువమ్మ ఉరికచ్చింది. రక్తం జల జల కార్తంది. "పెన్సిలు నేను చెక్కపోదునా... ఆగనే ఆగవ్! బయట ముసురు వెడ్తంది. వాన ల ఏడవోతవ్. ఎల్లెగ్గొట్టుకున్నవ్ ఇగ బొమ్మ లెట్ల దించుతవ్" అని మందలించుకుంట పసుపు రాసి గుడ్డ పేగ్గట్టింది. చెంపల మీద గార్తున్న కండ్ల నీళ్ళు తుడుసుకుంట "పెన్సిలె క్కీయ్" అని అన్నడు. "ఇంత మొండోనివి నా కడుపున ఎట్ల పుట్టినవ్‌రా" అనుకుంట పెన్సిలె క్కింది.

ఆ ముసుర్లనే నందుగాడు బడికివోయిండు. పెన్సిలు, అట్టప్యాడు తడువకుండా వరక్కాయి దాంల సుట్టిండు. బడికివోయేసరికి ఎవ్వల్లేరు. తాళం గూడ తీయలే. బడి వరండాల నిలవడి తల మీద తడవకుండేసుకున్న జమ్ముఖానా పక్కకు వెట్టిండు.

డ్రాయింగు సారు చెత్తిరి పట్టుకొని మెల్లగ సైకిల్ మీదచ్చిండు. "ఏందిరా... ను ఒక్కవ నివే అచ్చినవా ఇంకా ఎవ్వల్‌రాలే" అనుకుంట సైకిల్ స్టాండేసి బడి వరండాలకచ్చి చెత్తిరి ముడిసిండు. నందుగాడు ఎవ్వల్‌రాలే అన్నట్లు తలూపిండు. "ఏలెట్ల తెగ్గొట్టుకున్నవ్.. బొమ్మెట్ల దించుతవురా అనడిగితే నందుగాడు సప్పుడు జేయక నిలవడ్డడు. "గీ ముసుర్ల పిలగాండ్లెవ లచ్చెటట్టు లేదు, టైం అయితంది. నినొక్కనన్న తీసుకవోతే పెద్దసారు ముంగట నా పరువన్న నిలవడ్డది" అనుకుంట సైకిల్ మీద గూసుండ వెట్టుకొని చెత్తిరి పట్టుకోమన్నడు.

బాలభవన్‌ల గూడ పిలగాండ్లెక్కో రాలే. పెద్ద తరగతి పిలగాండ్లే అచ్చిండ్రు. అందర్ని ఒకే రూంల గూసుండ వెట్టిండ్రు. ఆడ ఓ బల్ల మీద కూజా, కూజా పక్కన గ్లాసు వెట్టి అందర్నీ అదే దించుమన్నరు. నందుగాడు వాళ్ళిచ్చిన తెల్ల కాయితం అట్ట ప్యాడుకు వెట్టి పెన్సిల్‌తో బొమ్మ దించుడు వెట్టిండు. తెగిన ఏల్తో తంటాలు వడుకుంటా అద్దగంటల బొమ్మే సిండు. చుట్టుజూత్తే కలర్ పెన్సిల్లు, కలర్ సీసాలు, కలర్ బ్రష్షులు వట్టి పిలగాండ్లందరు బొమ్మలేత్తుండ్రు. రూం నిండా ఎటు జూసిన రంగులే. కిటికీ నుండి జూత్తే ముసురు గూడ ఇడిసింది. సూర్యుడు మబ్బుల సాటు నుండి నిక్కి నిక్కి జుత్తండు. గదేందో గని గప్పుడు నందుగాడికి ఆకాశంల గూడా రంగులు కన్పించినయి. ఆడేసిన బొమ్మ మాత్రం టీవీల పాత సిన్మ లెక్కుంది.

నాల్రోజులైనంక నందుగాడు బల్లేకత్తుంటే సూరిగాడెదురొచ్చి "అరేయ్ నీ పేరు నోటీస్ బోర్డ్‌ల రాసిండ్రురా. డ్రాయింగ్ పోటీల నీకు సెంకడు ప్రైజ్ అచ్చిందిరా" అన్నడు. నందు గాడు పుస్తకాల సంచి ఆడికిచ్చి నోటీస్ బోర్డ్ దగ్గరికురికిండు. "జి.నందు జిల్లా స్థాయి డ్రాయింగు పోటీలో రెండవ బహుమతి" అని పెద్ద పెద్ద అక్షరాలతో రాసుంది. గప్పుడే ఆడి కొచ్చిన డ్రాయింగు సారు "నందుగా నువ్ నక్కన్ తొక్కినవ్‌రా. జూనియర్లల్ల ఇద్దరు పిల్ల గాండ్లే పోటీలో పాల్గొన్నర్రా. శారదా స్కూలో డికి ఫస్ట్ ప్రైజ్, నీకు సెకండ్ ప్రైజ్. బడి పరువు నిలబెట్టినవ్‌రా వారి" అని నందుగాన్ని శభాష్ అన్నడు. గప్పుడు నందుగాడి మొకంలో వెలిగిన రంగులు డ్రాయింగు సారు బ్రష్ గూడ అందయ్. గదేందో బడి పక్కనున్న గుడి మైకుల నుంచి గప్పుడే ఘంటసాల కుష్టుడి గీత గురించి జెప్తుండు. "కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచనా"!!.

కాపీరైటర్, రేడియో మిర్చి,
హైదరాబాద్.
98854 83909

దైవం మానుష రూపేణ



నీకు దేవుణ్ని చూడాలనుందా?
అయితే గుడులూ గోపురాలు తిరుగుతూ
పూజలు పునస్కారాల్లో కాలం గడుపు!
నువ్వే దేవుడివి కావాలనుందా?
నీ సీటు ముందు నీ చిన్న సంతకం కోసం
పడిగాపులు పడుతున్న ఆ ముసలి జీవానికి
కాస్త ఊరట కలిగించు... అతనికి నువ్వే దేవుడివి!
వైద్యానికి... మందులకీ చిల్లిగవ్వలేక
తనకి వచ్చిన వ్యాధి మరణానికి ఓ దారియని
తల్లడిల్లిపోతున్న ఓ అభాగ్యుడిని
శాంతి దూతలా దగ్గరకి చేర్చుకో
నువ్వు అతడికి కచ్చితంగా దైవాంశ సంభూతుడివే!
పసితనపు మనసుల్ని మసి చేయకుండా
సరళంగా లలితంగా విద్యనభ్యసింపజేస్తే
నువ్వు కారుణ్యమూర్తివి... కరుణా సముద్రుడివేకదా!
పూబాలికల్లా అగుపించే అమ్మాయిల్ని
తోటమాలిలా కాపాడి... కాపుగాస్తే
దుష్టసంహారంచేసే కారణజన్ముడివి నువ్వుగాక మరెవరు?
దాహానికి గుక్కెడు మంచినీళ్ళిచ్చినా
ఆకలికి గుప్పెడు మెతుకులు పెట్టినా... నువ్వు
సాక్షాత్తు భూమిపై నడయాడే భగవత్స్వరూపానివి
మంచిని బతికిస్తూ... నీతిని పాటిస్తూ
అందరి మనసుల్లో అమరత్వాన్నందే నువ్వు
'దైవం మానుష రూపేణ' అన్న పదానికి
స్పష్టమైన ప్రతిరూపం!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు, హైదరాబాద్
93939 81918

భద్రకాళి జాతరంట...

పి.శ్యామాచార్య

కాకతీయుల కాలం నాటి ఓరుగల్లు జాతరంటే మక్కువలేనిదెవరికి! ఆ మక్కువే ఈ జంట పాట ఉద్భవించడానికి దారితీసింది. మరీ ముఖ్యంగా పల్లెటూరి పడుచులు ఈ జాతర వస్తోందంటే చాలు! పరవశించిపోతారు. వారికి జీవితంలోలేని తొందరలు అలవోకగా వచ్చేస్తాయి. అందులో భాగమే ఈ యవ్వన జంటల శృంగార భాగవతం. ఈ పాటలో మొదటి 'పదం', (గ్రామసీమల్లో 'పదం' అంటే పల్లవి. పల్లవికి మారుగా జానపద మాండలికంలో 'పదం' అంటారు.)

నాయకుడు అందుకొన్నాడు ఇలా!

అతడు: *భద్రకాళి జాతరంట, ఓరుగల్లు పోదమంట*

రావేమే పిల్ల చూసొద్దాం మల్లా

నాయకుడు కాళికాదేవిని అంతర్లీనంగా తలచుకొంటూ పాడుతున్నా, నాయిక మాత్రం తాము పడుతున్న అగచాట్లను, కష్టాలను తీర్చలేదని, తమ తలరాతను మార్చలేదని, వస్తోన్న ఆనందాన్ని లోలోన అణచుకుంటూ, పైకి మాత్రం ఈసడించుకుంటోంది ఇలా!

ఆమె: *జాతరేమో రాతిరాయే తలరాతేమో మారదాయే*

మొడమేమో మబ్బాయె, నీ జాడ కానరాదాయె

అతడి జాడ చాలా ఆలస్యంగా కానవస్తోందన్నట్టుగా, పాటలో పదాన్ని మెలికలు తిప్పుతోంది.

తమ వివాహ పూర్వపు అగచాట్లను వర్ణిస్తూ జరగబోయే తమ పెళ్ళికి, మనసుండాలేగాని, బాజాభజంత్రీలు తీర్చవన్నట్టుగా నాయకుడు అందుకున్నాడు పదాన్ని. తమ వివాహకయ్యానికి కాలుదువ్వుతున్నట్టుగా

మును పేమో మనువంటవ్, తబల గిబల వద్దంటవ్

జగడానికి సై అంటవ్ జనం జాడ రాదంటవ్

విసురుగా, అలా నాయకుడు పదం పాడే సరికి, అంతే కోపంతో తమ జీవితంలో వ్యవసాయం ఒక భాగం కాబట్టి, కూలినాలీ చేసి, పొలంలో వరినాటు పెట్టినాకూడా, అది సరియైన నీటి పోషణ లేక కోతకు రావడం కష్టంగా ఉందని, దుకాణంలో వరి పంట కోసం తీసుకున్న అరువు ఖాతా పెరిగిపోతోందని, తమ పక్క పొలంలో రైతును చూసి, నేర్చుకోమని, అతని జొన్న పంట పెరిగి, ఏపుగా మారి కోతకు వస్తోందని, అలా రొట్టైనా తిని బతకవచ్చని, అంతర్లీనంగా గొణుక్కొంటూ, తన విరుపు మాటలతో పదం పోరుపెడుతోంది!

కోతకేమో రాదాయె వడ్ల ఖాతా పెరిగిపోయె

జొన్నరైతు జోరుసాగే, సన్నరైతు కడుపారే!

అంటూ ఈ పాట చదువరులకు వీనుల విందు కలిగిస్తుంది. మరపురాని మధురానుభూతి కలిగిస్తుంది.



స్కూల్ అసిస్టెంట్,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హకీంపేట్,
మహబూబ్‌నగర్
98667 48953

సంస్కరణ 'ధర్మా'నికి కాగడా

తెలుగు వెలుగు బృందం

చేతులకు మురుగులు, చెవులకు పోగులు, జుట్టుముడి. ఇవీ బడికెళ్లే నాటికి తాపీ ధర్మారావు (1887 సెప్టెంబరు 19 - 1973 మే 8) వేషధారణ. తొలిరోజు ఉపాధ్యాయుడు ఆయనను కొన్ని ప్రశ్నలు అడిగారు. తాపీ తెల్లమొహం వేశారు. ఈ పరిస్థితి చూసి ఉపాధ్యాయుడు ఈ పద్యం చెప్పారు.

మురుగులుంగరములు, ముత్యంపు సరులును
పురుషుని గైసేయు భూషణములె?
అర నిమిషమునకు అన్నియు నశియించు
విద్య యొకటె యెప్డు విడని తొడవు!

తనను ఎద్దేవా చేస్తున్నారని గ్రహించాడు కొత్తగా చేరిన విద్యార్థి. ఇంటికెళ్లగానే చేతికంకణాలు, చెవిపోగులు మొదలైన ఆభరణాలన్నీ తీసిపారేశాడు. ఈ చిన్నహేళన తాపీ ధర్మారావుకు చదువుమీద శ్రద్ధ పెరిగేట్టు చేసింది. అఖండమైన పాండిత్యం సంపాదించారు. విస్మరించడానికి వీలులేని రీతిలో ఇరవయ్యవ శతాబ్ది సాహితీవేత్తగా భాషా సంస్కర్తగా, సామాజిక, సాంస్కృతిక విశ్లేషకుడిగా తెలుగువారి సాంస్కృతిక మూలాల అన్వేషకుడిగా మారారు. మానుష శాస్త్రాన్ని సాహిత్యానికి అన్వయించి మన ఆనవాళ్ల ఆచూకీ కనిపెట్టారు.

మంకు పట్టుదలతోపాటు తిరుగుబాటు తత్వం, నలుగురూ అవునన్న దాన్ని కాదనడం, ఎంతటివారినైనా ఎదిరించడం తాపీకి చిన్ననాడే అబ్బిన లక్షణాలు. 1905లో గిడుగు రామమూర్తి పాఠం చెబుతూ తాపీ నుదుటబొట్టు లేకపోవడం గమనించి "బొట్టు లేదేం?" అని అడిగారు. తాను బ్రాహ్మణుడిని కాదని తాపీ జవాబు. "అయితే బొట్టు అక్కర్లేదా?" అని గద్దించి ధర్మారావు ముఖం చూడ్డం ఇష్టంలేక తన కుర్చీ నల్లబల్లవైపు తిప్పేసుకుని పాఠం చెప్పేవారు గిడుగు. కాలక్రమంలో గిడుగుకు ప్రియశిష్యుడిగా మారేదాకా ఇదే తంతు.

భాషాపాటవం, పాండిత్యం కొన్ని సామాజిక వర్ణాల లోగిళ్లకే పరిమితం అయిపోయిన దశలో వారిని నిలదీయగలిగినంతగా భాషా సాహిత్యాలపై పట్టు సంపాదించారు తాపీ. అంతేకాదు ఆ వర్ణాన్ని ఢీకొనడానికీ వెనుకాడలేదు. ప్రాచీన సాహిత్యంపై ఆధిపత్యం కోసం తాపీ పూనిన దీక్ష తొలిదశలో ఆయనను ఆ మార్గంలోనే నడిపించింది. తన గురువు గిడుగు రామమూర్తి ఉద్ధృతంగా వ్యావహారిక భాషోద్యమాన్ని నిర్వహిస్తున్నప్పటికీ తాను గ్రాంథిక భాషావాదిగానే ఉండిపోయారు.

గురజాడ వాడుకభాష వాడినందుకు తాను రాసిన 'మీసార్జునం' నాటకంలో గుర్రిగాడు, జడ్డిగాడు, అప్పిగాడు అని హేళన చేశారు తాపీ. అయితే స్వభావరీత్యా ఆయన ప్రశ్నల పుట్ట. ఆ ప్రశ్నలకు హేతుబద్ధమైన సమాధానం దొరికేదాకా ఊరుకునేవారు కాదు. ఈ లక్షణమే ఆయనను పునరాలోచనకు పురికొల్పింది.

1936 సంక్రాంతి సంచిక నుంచి ప్రజామిత్ర వారపత్రికలో ఆయన వ్యాసాలు కొన్ని నెలల పాటు వచ్చాయి. అవే తరువాత 'కొత్తపాళీ' గ్రంథంగా వచ్చాయి. అంతకు ముందు మూడేళ్లు ఆయన వ్రతం పూనినట్టు పూర్తిగా అధ్యయనంలో మునిగిపోయారు. 40-50 వేల పేజీల సారస్వతాన్ని చదివారు. దాంతో ఆయన అభిప్రాయాలు సమూలంగా మారిపోయాయి. గ్రాంథిక భాషావాదాన్ని వదిలించుకుని వ్యావహారిక భాషావాదిగా మారిపోయారు. ఆ అధ్యయనమే 'దేవాలయాల మీద బూతుబొమ్మలెందుకు?', 'పెళ్లి దాని పుట్టుపూర్వోత్తరాలు' రాయడానికి కారణం అయింది. మానుష శాస్త్రం ఆధారంగా సంస్కృతీ సంప్రదాయాల ఆనవాళ్లు కనిపెట్టేలా చేసింది.

ఈ అధ్యయన ప్రభావం ఆయన ప్రాపంచిక దృక్పథాన్నే మార్చేసింది. ప్రత్యక్ష రాజకీయాలతో ఆయనకు సంబంధం లేకపోయినా జస్టిస్ పార్టీ నడిపిన 'సమదర్శిని' పత్రికలో పని చేశారు. కానీ మొదట్లో అభివృద్ధికర ఆశయాలను ప్రకటించి చివరకు కులాల కుమ్ములాటలో మునిగిపోతున్న ఆ పార్టీని అసహ్యించుకోవడం ప్రారంభించారు. జస్టిస్ పార్టీ మీద ఆయన ఇష్టానికి కారణం... ఆ పార్టీ బ్రాహ్మణాధిక్యతను వ్యతిరేకించడం, స్వాభిమాన ఉద్యమాలను అభిమానించడం.

"విశ్వాసాలూ, అజ్ఞానం అన్నవి- అది అగ్రవర్ణం కానీ, అధమవర్ణం కానీ- పరిశీలిస్తే అందరిలోనూ సమంగా ఉండటం తాతాజీకి గోచరించింది. అంతే! అంతవరకు ఏ బ్రాహ్మణ వర్ణం అన్నా- అన్ని విషయాల్లో వారి ఆధిపత్యం అన్నా, వారు ప్రయోగించే భాషన్నా వీరికున్న సనాతన వైరభావం మటుమాయమయింది. దృష్టి విశాలమయింది. ఈ నూతన భావాలను ప్రజలకు తెలియపర్చటం విధి అనుకున్నారు. అందుకనువుగా భాషనూ మార్చుకున్నారు.'

సంస్కృతి ఆనవాళ్లను అన్వేషించడంలో తాతాజీ ప్రధానోద్దేశం సామాజిక ఆచారాన్నీ, దాని వెనకదాగిన ప్రాచీన కాలం నాటి నీతిని బయలుచేయడమే. 'ఇనుప కచ్చడాలు', 'పెళ్లి దాని పుట్టుపూర్వోత్తరాలు', 'దేవాలయాల మీద బూతుబొమ్మలెందుకు'... ఈ సామాజిక మూలాల అన్వేషణలో భాగమే. అందుకే మూఢనమ్మకాల మీద దాడి చేయగలిగారు. సామాజిక, సాంస్కృతిక ఆచార వ్యవహారాల వెనక ఉన్న శాస్త్రీయతను నిరూపించగలిగారు.

చతుస్సాచి

తాపీ ధర్మారావు కృషి ప్రధానంగా నాలుగు రంగాలలో సాగింది. తెలుగుభాష- సంస్కృతి, పత్రికలు, సినిమాలు, సామాజిక మానుష శాస్త్ర దృక్కోణంలో సంస్కృతిని విశ్లేషించడం. ఈ నాలుగింటి మీదా ఆయన ఆలోచనా బాణాలను సంధించారు. అందుకే ఆయన చతుస్సాచి.

ఛాందసవాదులుగానో, సంప్రదాయ వాదులుగానో బయలుదేరి అలాగే మిగిలిపోయేవారూ ఉంటారు. అభ్యుదయ వాదులుగా మొదలై ఛాందస, ఆధ్యాత్మిక వాదులుగా మారిపోయేవారూ ఉంటారు. ఛాందసవాదులుగా జీవితంలో అడుగుపెట్టి సమాజ పరిణామక్రమాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకుని అభ్యుదయ వాదులుగా మారి జీవితాంతం అలాగే నిలిచేవారూ ఉంటారు. తాపీది ఈ చివరికోవ. అందుకే ఆయన ఏం చేసినా ఈ క్రమపరిణామం స్పష్టంగా కనిపిస్తుంది.

తాపీ కార్యవాది.. ఏ సంస్కరణ తలపెట్టినా ముందు తను ఆచరించి చూపారు. 15 ఏళ్ల వయసులో ఆయనకు పెళ్లి కుదిరింది. కానీ ఆ పెళ్లి చేసుకోవడానికి షరతులు పెట్టారు. చదువు పూర్తయ్యాకే పెళ్లి, పిల్లనూ చదివించడం, పెళ్లికి ముందే వధూవరులు ఒకరినొకరు చూసుకోవడానికి అవకాశం ఇవ్వడం, కట్నకానుకల విషయంలో చాదస్తాలకు పోకపోవడం ఆ షరతులు. ఆ తర్వాత తన పిల్లలకూ వారి పిల్లలకూ ఆడంబరాలు లేకుండా దండల పెళ్లిళ్లు చేయించారు. పత్రికా రచయిత



వి.హనుమంతరావు - సరళ పెళ్లి, తరిమెల నాగిరెడ్డి కుమార్తె వివాహం, కె.కె.రంగనాథాచార్య పెళ్లి అలాగే చేయించి అభ్యుదయ వివాహాలకు దారి చూపించారు.

వామపక్షం వైపు మొగ్గు

శాస్త్రీయ ఆలోచనా ధోరణి, భౌతికవాదాల ప్రభంజనం, జాతీయ అంతర్జాతీయ వ్యవహారాలపై అవగాహన, అతివాత-మితవాద రాజకీయాల సునిశిత పరిశీలన తాపీ రాజకీయాభిప్రాయాలను సమూలంగా మార్చేశాయి. పాత వ్యవస్థ మారుతున్న వైనాన్ని వేగంగా పసిగట్టారు.

ఆయన నడిపిన 'కాగడా' పత్రిక ఆనాడు ప్రజాజీవన రంగాలన్నింటిలోనూ సాగుతున్న కార్మిక, కర్షక, మహిళ, విద్యార్థి యువజన ఉద్యమాలను ప్రతిబింబించింది. 'కాగడా'లో రాజకీయాలకు తక్కువ ప్రాధాన్యత ఉండేది. కానీ ఆ తర్వాత నడిపిన 'జనవాణి'లో మొదటి నుంచీ రాజకీయాలకు, తెలుగునాట వివిధ రంగాల్లో ప్రజోద్యమాలకూ ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వ దమననీతిని ఎదిరించడానికి పాటుపడ్డారు. జనవాణిది పూర్తి వామపక్ష దృక్పథం. తెలంగాణ సాయుధపోరాట కాలంలో కమ్యూనిస్టు పార్టీకి అధికారికంగా పత్రిక ఏదీ లేదు. ఆ కొరతను జనవాణి తీర్చింది. 1940-42 మధ్య 'కాగడా' ఆ పనే చేసింది. 1952లో విశాలాంధ్ర దినపత్రికను ఆవిష్కరించింది ఆయనే. రెండో ప్రపంచ యుద్ధకాలంలో సోవియట్‌పై దాడి యుద్ధ స్వభావంతోపాటు ఆ యుద్ధంపై వామపక్షాల వైఖరీ మారింది. ఈ మార్పును మొట్టమొదట ప్రజలకు తెలియజేసింది 'కాగడా' పత్రికే.

గ్రాంధిక భాషావాదాన్ని గిడుగు ఖండించి, ఆ భాషా ప్రవర్తకుల డొల్లతనాన్ని బయటపెట్టి వ్యావహారిక భాష అవసరాన్ని నొక్కి చెప్పిన మాట నిజమే, కాని వ్యావహారిక భాష అంటే ఇదీ అని పథనిర్దేశం చేయలేదు. కానీ తాపీ ఆ పని చేసి చూపారు. సృజనాత్మక రచనల్లోనే కాకుండా పత్రికల్లో, సినిమాల్లో వాడుకభాష ప్రయోజనాన్ని సుస్థిరం చేశారు.

ప్రాచీన సాహిత్యం మీద తాపీకి అభిరుచి పెంపొందించింది కూడా గిడుగే. గ్రాంధికభాష మీద ఉన్న వ్యతిరేకత తాపీని ఆ సాహిత్యాన్నంతటినీ నిరాకరించేట్టుగా చేయకపోవడం విశేషం. ప్రాచీన సాహిత్యాన్ని ఆధునిక దృక్పథంలో విశ్లేషించి యువతరం ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని చదివేలా ప్రోత్సహించారు.

కాలంతోపాటు అభిరుచులూ, అభిప్రాయాలూ మారుతుంటాయి. ఈ క్రమంలో ప్రాచీన సాహిత్యం అంతా మరుగున పడిపోతుందేమోనన్న బాధతోనే వాటిలోని విశేషాలను, ఇప్పటికీ పనికొచ్చే విషయాలను వివరించి యువతరం ఆసక్తి రేకెత్తించే ప్రయత్నంలో భాగంగానే 'దాదాపు ఇరవై ఏళ్లపాటు అవకాశం దొరికినప్పుడల్లా, పాత కవుల గురించి చెప్పడమో, రాయడమో' చేశారు. ఆ 'వ్యాసాలకు శీర్షికలు కూడా కొత్త సరదా కలిగించేలా.. ఈ రవంతలో కొంత విమర్శన పద్ధతీ, కొంత పద్య వ్యాఖ్యమూ, కొంత కవుల తారతమ్యమూ రుచి చూపించడానికి ప్రయత్నం' చేశారు. ఆ ప్రయత్న ఫలితమే 'సాహిత్య మొర్మరాలు'.

పెళ్లి, లైంగికత, బాంధవ్యాల వంటి వాటిని మానుష శాస్త్ర దృక్కోణంలోంచి పరిశీలించారు. మానవ నాగరికతలో ప్రధానమైన మతం, దేవాలయాల గురించి ఆరా తీయడం మొదలుపెట్టారు. తాను అలవర్చుకున్న ఆధునిక, శాస్త్రీయ దృక్పథంలో పరిశీలించి, పరిశోధించిన విషయాలను విస్తృత ప్రజానీకానికి తెలియజెప్పారు.

తాపీ ధర్మారావు అలవరచుకున్న శాస్త్రీయ దృక్పథం సహజంగానే ఆయనకు అభ్యుదయ రచయితలను చేరువ చేసింది. 1943లో తెనాలిలో జరిగిన ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం తొలి మహాసభలకు ఆయనే అధ్యక్షత వహించడంలో ఆశ్చర్యం లేదు. 1943లో అఖిలభారత అభ్యుదయ రచయితల సమావేశంలో ఆయన అధ్యక్షవర్గ సభ్యులయ్యారు. చివరిదాకా ఆయన ఈ సాహిత్య స్రవంతికి తోడ్పాటు అందిస్తూనే వచ్చారు. 1970 ఆరంభంలో అభ్యుదయ రచయితల సంఘాన్ని పునరుద్ధరించినప్పుడూ ఆయన ఆశీస్సులున్నాయి.

తాపీకి అనేక బిరుదులు వచ్చినా 'ఆంధ్రవిశారద'ను మాత్రమే వాడుకున్నారు. దీనికీ కారణం ఉంది. 1926లో తాపీ ఉర్కాడు జమీందారు వద్ద పనిచేసేవారు. అదే సమయంలో సరస్వతీ స్తోత్రం రాశారు. దేవీనవరాత్రుల సందర్భంలో ఉర్కాడు జమీందారీలో కవి, పండిత సత్కారాలు జరిగేవి. అప్పుడే అనుకోకుండా శృంగేరీ పీఠాధిపతి చంద్రశేఖర భారతీ శంకరాచార్యుల వారు పట్టలేని ఆనందంతో తాపీని కౌగిలించుకుని 'ఆంధ్ర విశారదా!' అన్నారు. శాలువా కప్పి సత్కరించారు. "ఒక వర్గానికి చెందిన మఠాధిపతుల కోటలో పాగా వేశాను కదా, దానికి గుర్తుగా ఆంధ్ర విశారద బిరుదునే ఉంచేసుకున్నాను" అని చెప్పుకునేవారు. ఆయన సామాజిక నేపథ్యమే దీనికి కారణం.

మాటల మూటలు పారేసుకుంటే ఎలా?

ఎం. దత్తాత్రేయ శర్మ

మనిషికి మాత్రమే అందిన వరం, మాట. అందుకే సరైన వాటిని సందర్భాన్ని బట్టి వాడుతుండాలి. కాలం మారుతోంది. అభిరుచులు మారిపోతున్నాయి. భాష, భాషణంలో బలీయ మార్పులొచ్చేస్తున్నాయి. అవసరం పెరిగేకొద్దీ ఆకాంక్ష అధికం. వాటితోపాటు అర్థ సంపాదన దిశగా అడుగులేస్తుంటాం. అవన్నీ బాగానే ఉన్నా సొంతభాష, స్వధర్మాలను నిర్లక్ష్యం చేయకూడదు. చిన్నచూపు ఫలితంగానే - పెరిగిన ఊరు, ఆడిన ఆటలు, అయినవాళ్ల ఆత్మీయత, అచ్చపు తల్లి బాస.. ఒక్కటొక్కటీ వీడిపోవడం. ఇదే ప్రమాదం ఇప్పటి తరంలో మరీ ముంచుకొచ్చి మనదైన తెలుగును మరి చేలా చేస్తోంది. ఎంతగా మాతృభాషను మనం ఉపయోగంలో పెడితే అంతగా జాతికి మేలు చేసినవాళ్లమవుతాం. మననం చేసుకోకుంటే ఉనికినే మర్చిపోతాం. అందుకే- మామంచి తెలుగు పదాలు కొన్నిటిని వల్లె వేసుకుందాం.

ఓసారి బస్సులో ప్రయాణిస్తుంటే, నా పక్కనే కూర్చున్న ఓ పల్లెటూరి పెద్దాయిన నిద్రమత్తులో జోగాడు. అడపాదడపా మీదకు ఒరుగుతూ ఓ మాదిరి గురక సాగించాడు. ఇంతలోనే అతని సంచిలోని సంచార వాణి గొల్లుమంది. దబ్బున లేచి అత్రంగా చెవినప్పగించాడు. "ఆ.. వస్తున్నా. మనూరినుంచే నిన్న పొద్దుగాల్లనే బయల్దేరిన. పట్నంల పనుండె. అదేనయ్యా నిన్న రాత్రి ఇస్తనన్నడు. అమ్మతోడు! ఇయ్యంగనె కంపల్సరీ తెచ్చి నీకిస్త." ఆ మాటలన్నీ గ్రామీణ మాండలికంలో సాగిపోతున్నాయి. మాటల మధ్యలో ఆంగ్లపదం 'కంపల్సరీ' ఏమిటి? ఎందుకా మాట వాడాడా అని ఆలోచిస్తున్నా. 'తప్పనిసరి' అనాల్సిన మాట కదా. చప్పున స్ఫురించక వాడిందే అది. తప్పనిసరి, కంపల్సరీ.. వీటిలో ఏది తేలిక? తప్పనిసరి అనేది గుర్తుకురానంత లోతుగా కూరు

క్రీ.పూ. నాటిది ఆంధ్రం..!

క్రీ.పూ. 3వ శతాబ్ది నాటి చంద్రగుప్త మౌర్యుని ఆస్థానాన్ని సందర్శించిన గ్రీకు రాయబారి మెగస్తనీస్ 'ఇండికా' గ్రంథంలో మౌర్యులు తర్వాత చెప్పుకోదగ్గ వారు ఆంధ్రులని అన్నారు. ఆంధ్రులకి 30 దుర్గాలు, ఒక లక్ష కాల్బలం, రెండు వేల అశ్వదళం, వేయి ఏనుగులు గల చతురంగ బలం ఉందని పేర్కొన్నారు. క్రీస్తుకు పూర్వమే ఆశోకుడు వేయించిన 13వ ధర్మశిలా శాసనంలో (ప్రాకృతం) ఆంధ్రులు అశోకుని సామ్రాజ్యంలోని వారని, అశోకుని ధర్మ బోధనలను ఆచరించటంలో ముందుంటారని వివరించారు. ప్లినీ అనే గ్రీకు చరిత్రకారుడు కూడా ఆంధ్రుల గుణగణాలను కీర్తించాడు. ఈ ఆధారాలను బట్టి ఆంధ్రజాతి క్రీస్తు పూర్వం నాటికే చరిత్ర కలిగి ఉందని తెలుస్తోంది. అంత చరిత్ర గల జాతికి ఆంధ్ర భాష వాడుకలో ఉంటుంది గదా! కాబట్టి ఆంధ్ర భాష క్రీస్తు పూర్వం నాటికే వాడుకలో ఉండాలి.

కుపోయిందా 'కంపల్సరీ'? అంత అనువుగా మదిలో కుదురుకుపోయిందా? రెండు పదాల్లోనూ 'సరి'సామ్యం ఉండటమే కారణమా?

ఎలాగైనా అతడిని మాటల్లోకి దింపాలని నాలోని భాషా జిజ్ఞాసి నిశ్చయించాడు. "ఏమయ్యా ఏ ఊరుకెళ్తున్నావు." చెప్పాడతను. మా ఊరికే. ఆనందం మదిలో పెరిగిందెందుకో. "మాదీ ఆ ఊరే". అతని మొగమూ వికసించింది. మాటల్లో పడ్డాం. ఎన్నో పదాలు ఆ నాలుక మీద తాండవించాయి. మన తెలుగింకా పల్లెపదాల్లో బతికే ఉంది మరి. "సుక్క పొద్దునలేచి బాయికాడికి పోతా" అన్నాడతను. (కడకు-కాడికి అయింది). "ప్రతి పని తాత్పరంగా చేస్తా!" (తాత్పరం-నిదానం అన్నమాట. తాత్పర్యం-వివరణకు దగ్గరి మాట). "సతాయిస్తే నాకేపనీ సుదరాయించదు" అన్నాడు. అలాగే హైదరాబాదులో- కమాయించు, జమాయించు, లగాయించు, బనాయించు, బజాయించులు బాగానే వాడుకలో ఉన్నాయి. "ఏగిరం మనూరికి బైలెల్లినా"నన్నాడు. వేగిరానికి ఆచ్ఛిక రూపం ఏగిరం అయితే బయలుదేరడానికి ప్రతిరూపమే బైలెల్లడం.

మాటల మధ్యలో అతని దృష్టి బస్సు సీట్లకు కుట్టిన కుషన్లమీద పడింది. "గిదేంది: తెల్లటి గౌచన్లు కుట్టించిన్రు. అందరు కూసుంటే మాసిపోవా? రంగులవి కుట్టిస్తే బాగుండే..." చెప్తూపోతున్నాడు. గౌచన అనే చిన్ననాటి మాట ఇన్నాళ్లకు వినిపించింది. "ఏడికొచ్చిపోతున్నవ్? " తిరిగి మాటకలిపాను. "మా బామ్మర్ది ఈ పట్నంలనే ఉంటడు. ఆణి సడ్డకుడు నిన్ననే లేచిండు. చందానికి ఒచ్చిన-కాంగనె మా ఊరికి పోతున్న" వివరణ ఇచ్చాడు. నా ప్రాణానికి బామ్మర్ది, సడ్డకుడు (తోడల్లుడు) లాంటి మాటలు ఆనందమిచ్చాయి. చందం అంటే అందానికి జంట పదం మాత్రమే కాదు. మరణించాక జరిపే అంత్యక్రియ. లేచిండు అంటే నిద్రలేచాడని కాదు. శాశ్వత నిద్రలోకి జారుకున్నాడని భావం. "నిన్న పొద్దున్నే ఇంత సద్ది కుదించుకున్న. ఓ పలారం లేదు-పండు లేదు. నిన్నంతా నిలారమై పోయింది. అందరు ఏడ్సుకుంట కూసున్నరు. ఒండిన దిక్కులేదు. నేనే నాలుగు కూరనారలు తెచ్చిపడేసిన. ఏదన్న శాకం జేసుకొని ఇంగరాత్రికి తింటరు" చెప్తూపోతున్నాడతడు. నాటికాలం మాటలు మాయమైపోతున్నాయి. టిఫిన్ ప్రతి యింట్లో పొద్దున్నే తైతక్కలాడుతోంది. మన భాషలోని ఫలహారం (పలారం) జారిపోతోంది. ఉపహార, భోజనశాలలు ఫలకాల్లోనే దర్శనమిస్తాయి. ఎక్కడా శాకాహారం దొరకదు. ప్రతిచోటా శాఖాహారమే! కొమ్మలూ రెమ్మలే తినాలేమో? లేదంటే నిలారమే.. అంటే.. నిరాహారమే. ఫలహారం కేవలం ఫలాలకే పరిమితం కాదు, ఉపహారాలన్నీ ఫలహారాలే. "ఉత్తరియ మీద కూసున్నరు. జర లేస్తె తీసుకొని నెత్తికి కట్టుకుంట." అతని మాటలతో మళ్లీ లోకంలోకొచ్చా. 'ఉత్తరీయం' ఏమైంది? పూజాపునస్కారాల సమయంలోనే గుర్తుకొస్తుంది!! కళ్లకు కండువా కట్టుకొని నా పక్క ఆసామి మళ్లీ కునికిపాట్లు పడుతున్నాడు. రామదాసు పుణ్యమాని 'ఎందుకీ ఉలికిపాటు - గగురుపాటు' అనే మాటలు తిరిగి వ్యాప్తిలోకొచ్చాయి. పక్కనే నిద్రాముద్రితుడై ఉన్న ఆసామి నా ఆలోచనకి తగిన ఏకాంతాన్ని కలిగించాడు. ఏ పెళ్లిళ్లకి, పేరంటాలకెళ్లినా పులిహోర, చిత్రాన్నం వండటం చూస్తుంటాం. వడ్డన చేసేప్పుడు అన్నాన్ని వైట్‌రైస్, నిమ్మకాయ పులిహోరని లెమన్ రైస్, మామూలు దాన్ని ఎల్లోరైస్ అన్నప్పుడల్లా తెలుగు నాడుల్లో బాధా కంపరాలు పుట్టుకొస్తాయి.

ఒకసారి తరగతి గదిలో అన్నాల రకాలను చెబుతున్న సమయంలో- ఓ గడుగ్గాయి లేచి "పులిహోర, చిత్రాన్నం అంటే ఏమిటో బాగా చెప్పారు. కానీ బిర్యానీని తెలుగులో ఏమనాలి? " అని అడిగాడు. తీపి అన్నాన్ని చిత్రాన్నం అన్నట్లే ప్రీతికర బిర్యానీని 'ప్రియాన్నం' అందామన్నాను. తర్వాత తను ప్రచారంలోకి తెచ్చాడు. మరో సంగతి. ఈ మధ్య వక్తలు కొందరు ఓకే, సో..లు ఎక్కువ చేసి, చెప్పాల్సిన విషయాన్ని గాలికొదిలేస్తున్నారు. ఆ ప్రసంగాల్లోని తెలుగు సరకుని కొలుద్దామంటే తూకాలే సరిపోవడం లేదు. అడ్డెడు, బుడ్డెడు, వీసెడు, తూమెడు, సోలెడు, గంపెడు లాంటి కొలమానాలు ఇప్పుడు లేవు కదా. సుతారంగా మాటల్ని సుదరాయించుకోవాలి. (సమీకరించుకోవాలి). లేదంటే తెలుగులోని తియ్యదనం తేనె ఒలికిపోదా! మళ్లీ ప్రస్తుతానికొద్దాం. కలవారి అడుగులకు మడుగులొత్తే వ్యక్తులున్న ఈ కాలంలో మాటలకు గొడుగులెత్తే వాళ్లుంటారా అనుకున్నా. మునుపు శ్రీమంతులు నడుస్తుంటే, పాదాలు నేలకంటి కందిపోకుండా మడుగులు (మంచి వస్త్రాలు) పరిచేవారట. ఆ పరవడమే జాతీయంగా మారిందీనాడు. బస్సు పొలికేక (హారన్)తో పక్క ఆసామికి నిద్రాభంగం, నా ఆలోచనలకు విరామం కలిగాయి. మా ఊరి పొలిమేరల్లోకి ప్రవేశించామనే ఆనందంతో మనసు ఉక్కిరిబిక్కిరయింది.

గురుకుల పాఠశాల
ప్రధానాచార్యులు,
హైదరాబాద్
94410 39146

అరుంధతీ ప్రదర్శన న్యాయం

హిందువుల పెళ్ళిలో అరుంధతి నక్షత్రాన్ని చూపించడం సంప్రదాయం. 'అరుంధతీ గిరుంధతీ కనిపించడం లేదు గానీ ఆరువందల అప్పు మాత్రం కనిపిస్తోంది' అని సామెత. అంత చిన్నగా ఉంటుందా నక్షత్రం. అందుకే పురోహితుడు ముందుగా సప్తర్షి మండలాన్ని చూపుతాడు, ఆ మండలంలో వశిష్ఠ నక్షత్రాన్ని చూపుతాడు, దాని పక్కన ఉండే చిన్న నక్షత్రమే అరుంధతి. సూక్ష్మమైన విషయాన్ని ఒక్కసారిగా చెబితే ఆకళింపు చేసుకోవడం కష్టం. అందుకని స్థూల విషయాన్ని చెబుతూ సూక్ష్మానికి దారితీయడమే 'అరుంధతీ ప్రదర్శన న్యాయం' దీనినే 'స్థూలారుంధతీ న్యాయం' అని కూడా అంటారు.

‘అడుగు’జాడ శకుంతలది!

డా॥ పి.నాగమల్లీశ్వరరావు

ఆది కాలం నుంచి ఆధునిక కాలం దాకా అనూచానంగా వస్తున్న సంప్రదాయం భారతీయం. అందులో అంతర్భాగం ఆధునికులు అనుకొనే వనితా వాదం. ఆధునిక కాలంలో ఈ స్త్రీ వాదం ఆవిర్భవించిందనేది అధునాతనుల అభిప్రాయం. కాని ఆ పేరు అధునాతనం అయినా, ఆ ఆలోచన సనాతనమే!

యత్ర నార్యస్తు పూజ్యంతే రమన్తే తత్ర దేవతాః
యత్ర వాస్తున పూజ్యంతే సర్వాస్తత్రా ఫలాః క్రియాః

ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో- అక్కడ దేవతలు విలసిల్లుతారు, ఎక్కడ స్త్రీలు అవమానానికి గురౌతారో అక్కడ జరిగే ప్రతి కార్యం వ్యర్థమై పోతుంది- అంటాడు మనువు. మరి ఇది మనువు నుడివిన స్త్రీవాదం కాదా? ‘కలకంఠి కంట కన్నీరొలికిన సిరి ఇంట నుండ నొల్లదు’ అంటారు కదా పెద్దలు. ఇలా ఆలోచిస్తూ ఉంటే భారతీయ సంప్రదాయంలో అడుగడుగునా సామూహిక సమాజంలోనూ, వైయక్తిక జీవితంలోనూ స్త్రీకి మనం ఇచ్చిన గౌరవం సుస్పష్టం!

కాగా అది ఆది కాలం నుంచి అనూచానంగా వస్తున్న ఆలోచనే! ఆచరణే! దీనికి ఉపబలకంగా మహాభారతంలో నన్నయ శకుంతల పాత్రను తీర్చి దిద్దిన తీరు గమనీయం. మూలంలో వ్యాసమహర్షి ఆ పాత్రను అలా పోషించినా, అనువాదంలోనూ నన్నయ దాన్ని పెంచి పోషించడం కూడా వనితా వాదానికి సమర్థనమే కదా!

అనంత సత్త్వుడైన దుష్యంతుడు ఆదిక్షత్ర చరిత్రతో రాజ్యపాలన చేస్తూ, మృగయా వినోదం కోసం వేటకు వెళ్లాడు. క్రూర మృగాలను వేటాడాడు. కణ్వాశ్రమంలోకి ప్రవేశించాడు. అతిరుచిరాగతుడుగా ఆశ్రమంలోకి ప్రవేశించిన ఆ దుష్యంతునికి లతాలలనలు కుసుమాక్షతలతో ముందుగా స్వాగతం పలికాయి. అనంతరం శకుంతల దుష్యంతుని స్వాగతించి ఆసనాది విధులతో ఆయనకు కుశలం పలికింది. కణ్వమహర్షి గురించి దుష్యంతుడు అడిగాడు. ఆయన పండ్లు తేవడానికి అడవిలోనికి వెళ్లారు, ఇప్పుడే వస్తారు, ఉండండి- అన్నది.

దుష్యంతుడు శకుంతలను తేరిపార జూచాడు. నీవు కణ్వునికి కుమార్తెవు ఎలా అయ్యావు? అని ప్రశ్నించాడు. పూర్వం తన గురించి కణ్వుణ్ణి అడిగితే, తన జన్మవృత్తాంతం ఆయన ఇలా చెప్పాడంటూ వివరించింది. తన గోత్రప్రవరులు తనే ప్రవచించింది, తాను మేనకా విశ్వామిత్రుల సంతానం అనీ, శకుంతల రక్షితననీ, శకుంతలననీ, కణ్వమహర్షి పెంచాడనీ- చెప్పింది. ఆమె ముని పుత్రి కాదనీ, రాజపుత్రి అనీ దుష్యంతుడు గ్రహించాడు, ఆమెను వివాహం చేసుకొంటానన్నాడు. తన తండ్రి అంగీకరిస్తే తనకు అభ్యంతరం లేదన్నది శకుంతల. అలా కాదు, గాంధర్వ విధితో వివాహం చేసుకొంటానని ఒత్తిడి చేశాడు. అట్లయితే - నీ వలన నాకు జన్మించిన కుమారునికి యువరాజుగా పట్టాభిషేకం చేయాలని పట్టుపట్టింది. సరేనన్నాడు. గాంధర్వ వివాహం జరిగింది. ఇరువురు అభిమత సుఖాలు అనుభవించారు. ఆమెను అంతఃపురానికి తీసుకొని రావడానికి ప్రధాని వర్గాన్ని పంపిస్తానని చెప్పి వెళ్లాడు దుష్యంతుడు. తర్వాత ముని

వచ్చాడు. అంతా కనుగొన్నాడు. ఆనందించాడు. నీ కుమారుడు చక్రవర్తి ఔతాడని ఆశీర్వదించాడు. తాను ధర్మవర్తిగా ఉండాలని, తన కుమారుడు దీర్ఘాయురారోగ్యైశ్వర్యబల సమన్వితుడు, వంశకర్త కావాలని వరం కోరింది. ముని అనుగ్రహించాడు. కొంత కాలానికి కుమారుడు జన్మించాడు.

కణ్వుడు, తన శిష్యులను తోడుగా ఇచ్చి, పుత్రవతి అయిన శకుంతలను దుష్యంతుని దగ్గరకు పంపించాడు. ఆమె వచ్చింది. సభలో దుష్యంతుణ్ణి చూసింది. మునిపల్లెల్లో చూపించిన మునుపటి అనురాగం, ఆదరణం, అనుగ్రహం ఆయన ముఖంలో కనబడలేదు. నన్ను మరిచిపోయాడా? అని ముందు కొంత సంశయించింది. రాజులు బహుకార్యమగ్నులు కదా! మరచాడేమోలే- అని సరిపెట్టుకొన్నది. కానీ అంతలోనే తేరుకొన్నది. అతని చూపులు విరసంగా, క్రూరంగా ఉన్నాయి. అతని మనోగతాన్ని అవగతం చేసుకొన్నది. రాజులు నవప్రియులు- నమ్మరాదు అనుకొన్నది.

"మఱచిన దలపింపగ నగు
నెఱుగని నా డెల్ల పాట నెఱిగింప నగున్
మఱి యెఱిగి యెఱుగ నొల్లని
కఱటికి దెలుపంగ గమల గర్భుని వశమే"

ఒక వేళ ఆయన నన్ను మరచి పోయాడేమో? అదే అయితే గుర్తు చెయ్యవచ్చు. తెలియకపోతే తెలియజెప్పవచ్చు. తెలిసీ తెలియనట్లు నటించే 'కఱటి' (వంచకుడు)కి చెప్పడం బ్రహ్మతరం కూడా కాదు అనుకొంటుంది. అలా బ్రహ్మదేవునితరం కూడా కాదని నన్నయ అనడంలో బ్రహ్మ ప్రత్యేకత ఏమంటే - అందరికీ ఒక నోరు, కానీ నలువకు నాలుగు నోళ్లు. అలాంటి నాలుగు నోళ్లతో కూడా చెప్పడం, ఒప్పించడం సాధ్యం కాదు అనడం ఇక్కడి స్వారస్యం. ఇక-ఇక్కడ, తెలియకపోతే తెలియజెప్పాలి అనడం విశేషం. చెప్పేది మగువ అయినా సరే, చెప్పించు కొనేది మహారాజు అయినా సరే. తప్పు చెప్పడం తప్పనిసరి. అంతటి నిండు సభలో నిలిచి ఉన్న సార్వభౌముణ్ణి, ఒక సాధారణ స్త్రీ నిలదీయడం వనితావాదానికి వత్తాసు పల్కడమే.

'వచ్చి మిన్నక పోవంగాదు', నా పూర్వవృత్తాంతం చెప్తాను. ఈ కుమారుని (సాక్ష్యం) చూపిస్తాను - అనుకొన్నది. అంతటి ధీర ఆమె! ఇది సామాన్య విషయం కాదు. తన జీవితానికి, తన వంశానికి, తన వంశాంకురానికి సంబంధించిన విషయం. కాబట్టి తన సంగతి ఏదో తానే తేల్చుకోవాలనే తెగింపు తెచ్చుకొన్నది. ఆమె వెంట కణ్వ శిష్యులు ఉంటే ఉండవచ్చు. ఆ అవకాశం వారికి ఇవ్వదలచుకొన్నట్లు లేదామె.

ముందుగా అన్నది - ఓ రాజా! వేట నెపంతో కణ్వాశ్రమానికి వచ్చి, సంతోషంతో నీవు నాకిచ్చిన వరం ఏమిటో గుర్తు తెచ్చుకో- అని. అలా అంటూ, చాలా గౌరవంగా, మర్యాద పాటిస్తూ, గోప్యంగా, క్లుప్తంగా మాటలాడింది. అతను మాటలాడలేదు. ఇలా కాదని - ఇదుగోనయ్య! నీ కొడుకు, వీణ్ణి యువరాజును చెయ్యి, అంటూ - అజ్ఞాపించినట్లుగా -ఆ వరం ఏమిటో వాచ్యం చేసింది. అయినా, తెలిసి కూడా తెలియనట్లుగా - అనుచితాలు మాటలాడతావెందుకు? వచ్చిన దారిన తిరిగి వెళ్లు - అన్నాడు. బహుశ, ఆ సభలోని వారు గ్రహించే ఉండవచ్చు -ఆమె ఆజ్ఞాపించినట్లు మాటలాడటం, అతను అనునయించినట్లు మాటలాడటం - అందులోనే అసలు విషయం అవగతమవుతుంది వారికి!

ఆ మాట వింటే అబల ఏం చేస్తుంది? అదే చేసింది - శోకించింది. తనను తానే సంబాళించుకొంది. ఏమిటయ్యా! ఏమీ తెలియనట్లు మాటలాడతావు? ఈ విషయం నాకు తప్ప ఇంకెవరికీ తెలియదని, ధార్మికుడవైన నీవు తప్ప బలకవచ్చునా? అన్నది. అంటే - నీవు తప్ప బలుకుతున్నావు కాబట్టి. నీవు ఎలా ధార్మికుడవు ఔతావు? - అనే ధ్వని అందులో ఉంది.

విమల యశోనిధీ! పురుషవృత్త మెఱుం
గుచు నుండు జూవె వే
దములను పంచభూతములు ధర్మువు
సంధ్యలు నంతరాత్మయున్
యముడును జంద్రసూర్యులు నహంబును
రాత్రియు నన్మహా పదా
ర్థము లివియుండగా నరుడు దక్కొననే
ర్చునె? తన్ను మ్రుచ్చిలన్

వేదాలు, పంచభూతాలు, ధర్మాలు, సంధ్యలు, అంతరాత్మ, యముడు, చంద్రుడు, సూర్యుడు, పగలు, రాత్రి - అనే మహాపదార్థాలున్నాయి. అవి మానవుల ప్రవర్తన గమనిస్తూనే ఉంటాయి. అవన్నీ ఉండగా మానవుడు తనను తాను మోసం చేసుకోగలడా? అన్నది. అలా మోసం చేసుకొంటే నరుడు కాదన్న మాట! అంటే - అసలు నీవు మనిషివేనా? అని అడిగిందన్న మాట! అమె వేదన అంతటిదన్న మాట! అంతే కాదు. ఓ విమల యశోనిధీ! (నిర్మలమైన కీర్తికి నిధి అయిన వాడా!) అని సంబోధించింది. ఆ సంబోధన సార్థకం. నిజంగా నీ కీర్తి నిర్మలమైంది అయితే నీవు అసత్య మాడవద్దు - అనే హెచ్చరిక అందులో ఉంది. అంతేకాదు. వ్యాస భారతంలోని మహాపదార్థాల్లో వేదాలు లేవు. వాటిని నన్నయ ముందే చేర్చి వేదప్రామాణ్యాన్ని కూడా వ్యక్తం చేశాడు. పగలు - సూర్యుడు, రాత్రి - చంద్రుడు, ఈ రెంటినీ మధ్య సంధ్యలు. ఇంక అవకాశం ఎక్కడ? ఈ మాత్రం నీకు తెలియదా? రాజువైతివే-అనే వెక్కిరింపు అందులో నిక్కిచూస్తోంది! అంతేకాదు, అసలు నీకు అంతరాత్మ ఉందా? ఉంటే అసత్యం ఆడతావా? అని నిలదీసింది.

సతియును గుణవతియు బ్రజా
వతియు ననువ్రతయు నైన వనిత నవజ్ఞా
న్విత దృష్టి జూచు సతి దు
ర్గతి కిహముం బరము గలదె? మతి బరికింపన్

గుణవతి, ప్రజావతి, అనువ్రత అయిన సతిని అనుమానిస్తే పుట్టగతు లుండవు, జాగ్రత్త! అంటూ హెచ్చరిక- హెచ్చెరుక - చేసింది.

ధర్మార్థ కామ సాధన కుపకరణంబు
గృహనీతి విద్యకు గృహము విమల
చారిత్ర శిక్ష కాచార్యకం బన్వయ
స్థితికి మూలంబు సద్గతికి నూత
గౌరవంబున కేక కారణం బున్నత
స్థిరగుణమణుల కాకరము హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ
చూవె భర్తకు నొండ్లు గావు ప్రియము

లెట్టి ఘట్టములను నెట్టి యాపదలను
నెట్టి తీరములను ముట్టబడిన
వంత లెల్ల బాయు నింతులు బ్రజలను
నొనర జూడ గనిన జనుల కెందు

పురుషుడు, ధర్మార్థకామాలు ఆచరించాలంటే భార్య కావాలి. గృహనీతి విద్య నేర్వాలంటే భార్య కావాలి. విమలమైన శీలాన్ని అలవరచాలంటే భార్య కావాలి. వంశం నిలపాలంటే భార్య కావాలి. సద్గతి సాధించాలన్నా గౌరవం పొందాలన్నా, గుణగణాలు లభించాలన్నా, హృదయ సంతోషం పొందాలన్నా కావలసింది భార్యే! అసలు ఆలుబిడ్డల్ని ఆప్యాయంగా చూసే వారికి ఆపదలన్నీ తొలగిపోతాయి - అంది. ఇలాంటి లాభాలన్నీ కావాలంటే భార్య వద్దా? - అంది. గృహస్థాశ్రమ ప్రాధాన్యం, గృహిణి ప్రాముఖ్యం వివరించింది. ప్రసంగం మధ్యలో కొంత స్థాయి తగ్గించింది. భార్యను అవమానించడం, ధర్మ విరుద్ధం, అలా చెయ్య వద్దు - అంటూ హితవు పలికింది.

ఆ తరువాత తండ్రి - తనయుల అను బంధం ఏమిటో వినిపించింది. భర్త, భార్య గర్భంలోకి ప్రవేశించి తానే పుత్రుడై జన్మిస్తాడన్నది. 'అంగాదంగా త్సంభవసి' అనే వేద వచనం ప్రకారం తండ్రికి తనయునికి భేదం లేదన్నది. ఇంకా- నీటిలో నీడ చూచుకొని ఆనందించినట్లు - తండ్రి తన కుమారుణ్ణి చూచుకొని ఆనందిస్తాడన్నది. పున్నామ నరకం నుంచి రక్షించేవాడు పుత్రుడు - అన్నది. ఒక దీపం నుంచి ఇంకో దీపం వెలిగినట్లు - నీ వలన నీ కొడుకు పుట్టాడన్నది. ఈ మాటల్లో - అతనికి, అతని కుమారుని పట్ల అభిమానం కలిగించే ప్రయత్నం చేసింది. అంతే కాక -

'విపరీత ప్రతిభాష లేమిటికి సుర్వీనాథ! యీ
పుత్ర
గాత్ర పరిష్వంగ సుఖంబు సేకొనుము ముక్తా
హార కర్పూర సాంద్ర పరాగ ప్రసరంబు
జందనము జంద్ర జ్యోత్స్నయుం బుత్ర గాత్ర
పరిష్వంగము నట్లు జీవులకు హృద్యంబే!
కడున్ శీతమే!' అని చెప్పింది.

ఇక అంటుంది- 'విపరీత ప్రతిభాషలేమిటికి?'- ఇంకా ఇన్ని మాటలెందుకయ్యా! ఒక్కసారి నీ కొడుకును కౌగిలించుకో! ఆ సుఖం ఏమిటో తెలుసుకో! ముత్యాల హారాలు, పచ్చ కర్పూరం, చందనం, వెన్నెల అయినా అంత హాయిని, ఆహ్లాదాన్ని, చల్లదనాన్ని ఇస్తాయేమో చూడు- అన్నది. అసలు నీకు పుత్రగాత్ర పరిష్వంగ సుఖం అంటే ఏమిటో తెలుసా? ఒక్కసారి వీణ్ణి కౌగిలించుకొని, అదెలా ఉంటుందో, స్వయంగా అనుభవించి తెలుసుకో! అప్పుడు చెప్పు అసత్యం చెప్పగలవేమో? నీ వల్ల ఔతుందేమో? చెప్పు, చూద్దాం- అంటూ తిరుగు సమాధానం చెప్పలేని తీరులో ప్రశ్నించింది. నీ కుమారుడు వంశకర్తయై నూరు యాగాలు చేస్తాడని సరస్వతీదేవి చెప్పింది. అందుకు మునులే సాక్ష్యం అన్నది. అంతా చెప్పి - ఇలాంటి కులవిస్తారకుడైన కొడుకు విషయంలో తప్పుజూడటం తగునటయ్యా? - అంటూ అనునయం అవలంబించింది.

మీగడ తరకలు

1	ప	
2	ప	
3	ప	
4	ప	

ఈ ఆధారాలతో గడులను పూరించండి.

1. తపస్సు
2. ఇది కూడదు
3. వెలుగునిచ్చేది
4. బావి

అర్థం కాక ఏడుపు!

విశ్వనాథ సత్యనారాయణ రాజమండ్రి వెళ్లినప్పుడు తన శిష్యుడు మల్లంపల్లి శరభయ్య గారింట్లో ఉండేవారు. ఒకరోజు ఇద్దరూ రామాయణ కల్పవృక్షంలోని పద్యాలు చదువుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో సీతావియోగ ఘట్టం వచ్చింది. ఆ సందర్భంలో రస పారవశ్యంతో కవులిద్దరూ ఏడ్చేస్తున్నారు. అలానే ఏవేవో చెప్పుకొంటున్నారు. వీరిద్దరి ఏడ్పులూ దూరంగా కూర్చొని చూస్తున్న శరభయ్యగారి శిష్యుడూ ఏడుస్తున్నాడు.

శరభయ్యగారు శిష్యుడితో "నాయనా నువ్వెందుకేడుస్తున్నావు? "

"అర్థం కాక" అన్నాడు. పెద్దలిద్దరి ఏడుపులూ ఫక్కున నవ్వులుగా మారాయి.

మున్ముందుగా తన జీవితం గురించి, దాన్ని చక్కబరుచుకోవడం గురించి మాటలాడింది. ధర్మపత్ని గురించి ధర్మబోధ చేసింది. దాంపత్యధర్మం గురించి ప్రసంగించింది. అయినా అతనిలో మార్పులేదు. పోనీ, తన సంగతి ఎలా ఉన్నా, కనీసం తన కుమారునికైనా, బంగారు 'భవిష్యత్తు' కావాలని కోరుకొన్నది. అదీ స్త్రీవాదమే! అందుకే భార్యాభర్తల సంబంధం, తరువాత తండ్రితనయుల అనుబంధం గురించి వివరించింది. అయినా అతనిలో మార్పులేదు. అంత త్వరగా మార్పు వస్తుందా? అందుకే మరల మొదలుపెట్టింది. సత్యం గురించి బోధించింది.

నూరు నూతుల కన్న బావి మేలు. నూరు బావుల కన్న యాగం మేలు. నూరు యాగాల కన్న పుత్రుడు మేలు. నూరుగురు పుత్రుల కన్న సత్యం మేలు అన్నది. వెయ్యి అశ్వమేధ యాగాల ఫలం, ఒక్క సత్యం తూకం వేస్తే, సత్యం వైపే త్రాసు మొగ్గుతుంది అన్నది.

సర్వ తీర్థాభిగమనంబు సర్వ వేద
సమధిగమము సత్యంబుతో సరియు గావు
ఎఱుగు మెల్ల ధర్మంబుల కెందు బెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు

సర్వతీర్థాలు సేవిస్తే వచ్చే ఫలితం, సర్వ వేదాలు అధ్యయనం చేస్తే ఫలితం కూడా సత్యంతో సమానం కావు. సత్యం నిత్యం. అది ఉత్తమోత్తమం-అన్నది. కాబట్టి కణ్వాశ్రమంలో ఇచ్చిన వరం గుర్తించి దయ చూపించమన్నది.

ఇలా భార్యాభర్తలబంధం గురించి వ్యాఖ్యానించి- 'అట్టి భార్య నవమానించుట ధర్మవిరోధంబు' అన్నది. తరువాత తండ్రి తనయుల అనుబంధం గురించి వక్కాణించి, అలాంటి తనయుని విషయంలో 'నిష్కారణమ తప్పుజూడగ' తగునా? అన్నది. అటు తరువాత సత్యం వైశిష్ట్యం ఏమిటో విశదంచేసి చివరకు 'కొడుకు జూడు కరుణా దృష్టిన్' అంటూ- పై మూడు విషయాలు ఒక్కొక్కటి ఓర్పుగా వ్యాఖ్యానిస్తూ, నేర్పుగా అనునయిస్తూ వాక్చాతుర్యంతో శకుంతల వనితావాదం చేసింది.

అంతా చెప్పి, అసలు నేనెవరిననుకొన్నావు? క్షత్రవరుడైన విశ్వామిత్రునికి, పవిత్ర అయిన మేనకకు జన్మించినదాన్ని. అలాంటి నేను అబద్ధం ఆడతానా? - అని మరల నిలదీసింది. అయితే గియితే నీవే అసత్యం ఆడతావు తప్ప, నేను అసత్యం ఆడే అంతటిదానను కాను-అన్నది. నేను 'ధర్మేతరనా?' అని ప్రశ్నించడంలో- నేను కాదు నీవే ధర్మం తప్పేవాడవని పరిశేషన్యాయం ప్రకారం భావించవలసి ఉంటుంది. ఇంతసేపు తాను నిండు సభలో నిలబడి, నలుగురు వింటూ ఉండగా రాజును మాటమాటకు నిలదీస్తూ ధర్మ ప్రసంగం చేసింది. ఇంత ప్రసంగం చేస్తూ ఉంటే- ఏ మహారాజు అయినా ఇంతసేపు చెవులప్పగించి వింటూ మౌనంగా ఉంటాడా? ఆమె చెప్పేది అసత్యమైతే ఈ పాటికి ఎంత శిక్ష విధించి ఉండేవాడు? అసలు ఇంత సేపు మాటలాడే అవకాశం ఇస్తాడా? - అందులోనే అర్థమౌతుంది అతని అసత్యం! అందుకే పెదవులు తడుపుకొంటూ, బిత్తర చూపులు చూస్తూ, చేతులు నలుపుకొంటూ, నీళ్లు నములుతూ మాటలాడాడేమో! నీవెక్కడ? నేనెక్కడ? ఆడవారు అబద్ధాలు ఆడువారు అన్నట్లు ఇలా ఆడవచ్చా? - అని మాత్రం అన్నాడు.

ఇక పాపం ఆమె ఏం చేస్తుంది? 'ఎఱిగి ఎఱుగ నొల్లని కఱటిం దెలుపంగ కమల గర్భుని వశమే?' అని మొదటే అనుకొన్నది. అయినా 'వచ్చి మిన్నక పోవంగాదు' అనుకొని వాదించింది. తాను అశక్త అయింది. తనది అరణ్యరోదనం అయింది. రోదిస్తూ- ఇక దైవమే దిక్కు అనుకొంటూ వెళ్లబోయింది. అప్పుడు ఆకాశవాణి అవకాశం కల్పించుకొని- వీడు నీకు శకుంతలకు కుమారుడు, సాధ్వి శకుంతల సత్యం పలికింది, పరిగ్రహించు- అన్నది. అప్పుడు దుష్యంతుడు - 'లోకాపవాద భీతి' వలన మాట తప్పానంటూ తల్లీకొడుకుల్ని చేరదీశాడు. పుత్రునికి పట్టంగట్టాడు.

ఈ ప్రకారంగా - గార్హస్థ్య ధర్మానికి ప్రతీక అయిన శకుంతల తన జీవితం తీర్చిదిద్దుకోవడం కోసం చేసిన ప్రయత్నం ప్రశంసనీయం. అది దిద్దితీర్చిన ఆదికవి ప్రశంసార్హుడు.

మొత్తమ్మీద శకుంతల, ఆమె చెప్పినట్లు (నన్నయ చెప్పించినట్లు)-

'ధర్మార్థకామ సాధన కుపకరణంబు, గృహనీతి విద్యకు గృహము, విమల చారిత్ర శిక్షకాచార్యకంబు అన్వయస్థితికి మూలంబు, సద్గతికి నూత, గౌరవంబున కేక కారణంబు, ఉన్నత స్థిరగుణమణుల కాకరంబు, హృదయ సంతోషమునకు సంజనకంబు'.

ప్రిన్సిపల్, ఏబీఎం జూనియర్
కళాశాల, ఒంగోలు
99499 71261



కట్టమంచి రామలింగారెడ్డి ఒకసారి తన అల్లుడిని కలవడానికి నెల్లూరు వెళ్లారు. ఇంటి ముందు కారు దిగగానే 'కుక్కలున్నవి జాగ్రత్త' అని బోర్డు కనిపించింది. వెంటనే రెడ్డి గారు 'ఇక్కడ మనుషులు ఉండేవారు... వాళ్లేమయ్యారు?' అని తిరిగి వెళ్లిపోయారు. ఆ దెబ్బతో అల్లుడు మళ్లీ కుక్కల్ని పెంచితే ఒట్టు!

అంకుశ న్యాయం

నేర్పు ఉంటే ఎటువంటి సమస్యనైనా లొంగదీసుకోవచ్చు అని సూచించే అంకుశ న్యాయం. చెట్టంత ఏనుగుని చిట్టంత అంకుశంతో లొంగదీసుకోవచ్చు కదా! మొండి రోగం చిట్కా వైద్యంతో నయం కావచ్చు, మూర్ఖ ప్రభుత్వం ఒక్క ఓటుతో కూలిపోవచ్చు. అందుకని జీవితంలో ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య ఎదురైనా... భరించే ఓర్పు ఉండాలి, ఛేదించే నేర్పు ఉండాలి.



ఏ దేశమేగినా!



పారిస్‌లో 'సలోన్'లని ఉండేవి. నగరంలో రచయితలు, చిత్రకారులు, సంగీతకారులు అక్కడ కలుసుకొని తమ సృజనల గురించి మాట్లాడుకునేవారు. ఈ సలోన్‌లలో పాల్గొనటానికే కళాకారులు ఇతర ప్రాంతాల నుంచీ కూడా వచ్చి పారిస్‌లో స్థిరపడేవారు. ఆ వాతావరణంలో ఒకరి సృజనావేశం మరొకర్ని ప్రేరేపించేది. ఒకరి భావాలు మరొకర్ని కదిలించేవి. దీని ఫలితం... ఫ్రెంచి విప్లవం. అంతకన్నా విలువైన పర్యవసానం... ఫ్రెంచ్ దేశం నిరుపమానమైన సాంస్కృతిక సంపద కలిగిన దేశంగా ఈనాటికీ నిలబడగలగటం. ఏ కళ అయినా ఒంటి తపస్సులోంచి పుట్టేదే. కానీ ఆ తపో మథన ఫలాల్ని సమూహానికి చేర్చే వ్యవస్థ కూడా అవసరం. తెలుగు సాహిత్యానికి సంబంధించి అలాంటి వ్యవస్థలు తెలుగు దేశంలోనే అరుదైన తరుణంలో, ఎక్కడో విదేశంలో ఒక లిటరరీ క్లబ్ పద్నాలుగేళ్లుగా నడవటం ప్రేరణ కలిగించే విషయం. డిట్రాయిట్ తెలుగు సాహితీ సమాఖ్య పేరుతో అమెరికాలో నడుస్తున్న ఈ సాహితీ ప్రేమికుల నెలవు గురించి, దాని సభ్యుడు మద్దిపాటి కృష్ణారావు మాటల్లోనే!

మద్దిపాటి కృష్ణారావు

1998 డిసెంబరులో ఒక ఆదివారం మధ్యాహ్నం యాన్‌ఆర్బర్ ప్రజా గ్రంథాలయంలో మొదటిసారి సమావేశమైనప్పుడు, ఇదొక సమాఖ్యగా ఏర్పడుతుందని, ఇన్నాళ్లు నిర్విఘ్నంగా నడుస్తుందని ఎవరూ ఊహించలేదు సరిగదా, ఆ ఆలోచనే ఎవరికీ రాలేదు. ఈ సమావేశం జరగడానికి సుమారు ఒక సంవత్సరం ముందు ఆరి సీతారామయ్య డిట్రాయిట్ తెలుగు సంఘం పత్రిక వార్తావాహినిలో 'తెలుగు సాహిత్యం చదివి చర్చించడానికి ఇష్టపడేవారున్నారా' అని చేసిన ప్రకటనకు ఎవరూ పెద్దగా స్పందించిన దాఖలాలు లేవు. కానీ ఎలాగైతేనేం ఈ మొదటి సమావేశానికి సుమారు 15 మంది వరకూ వచ్చారు. కొందరు తమకు నచ్చిన కవితల్ని తీసుకువచ్చి చదివారు. మరికొందరు పద్య సాహిత్యం చదివారు. ఇలా మొదలైన సాహితీ సమాఖ్య గ్రంథాలయం వారు మూసేస్తున్నాం పొమ్మనే వరకూ నడుస్తూనే ఉంది. అమెరికా వచ్చాక తెలుగు పుస్తకాలు చదవడం తగ్గిపోయి, తెలిసిన కాస్తో కూస్తో తెలుగు సాహిత్యాన్ని నలుగురితో పంచుకోవడంలో ఉన్న ఆనందం అనుభవంలోకి రావడమే దీనిక్కారణమని వేరే చెప్పక్కర్లేదు. అప్పుడే మళ్లీమళ్లీ కలవాలన్న నిర్ణయం జరిగింది. తరవాత సమావేశాలు 1999 ఫిబ్రవరిలోను, ఏప్రిల్ 25, జూన్ 6, ఇలా వరసగా జరుగుతూ వచ్చాయి. ఇదే సమయంలో చేకూరి రామారావు డిట్రాయిట్‌లో ఉండటంతో ఆయన కూడా ఈ సమావేశాల్లో పాల్గొనేవారు. తెలుగు సాహిత్యంలో ప్రఖ్యాత విమర్శకుడిగా పేరున్న 'చేరా' సాంగత్యంలో మా సమావేశాల్లో చర్చలకు ఒక పద్ధతి, క్రమం ఏర్పడ్డాయి. కేవలం కవితా పఠనాలే కాకుండా, కథలపైన, నవలల పైన చర్చలు ప్రారంభమయ్యాయి. సుమారు ఒక సంవత్సరంపాటు రెండు నెలలకొకసారి క్రమంగా జరిగిన సమావేశాలు 2000 సంవత్సరం ఉత్తరార్ధం నుంచి కాస్త క్రమం తప్పుతూ వచ్చాయి. అయితే మళ్లీ 2001 చివరికల్లా ఒక ప్రణాళికతో ఆరువారాలకు ఒకసారి ఈ సమావేశాలు జరగడం మొదలయ్యాయి. ముందుగా నిర్ణయించుకున్న పుస్తకంపై వీటిలో కూలంకష చర్చ జరుగుతుంది. చర్చకు పర్యవేక్షకుడు చర్చలోని ప్రధాన అంశాలను క్రోడీకరిస్తారు. దాంతో వ్యాసాన్ని తయారుచేసి వెబ్‌సైట్‌లో పెట్టడం ఆనవాయితీ. ఇలా చేయటం వల్ల మా చర్చలు, అభిప్రాయాలను ప్రపంచంలోని సాహిత్యాభిమానులందరి మధ్య చర్చకు పెట్టినట్లు అవుతుంది. ఈ పద్ధతి ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

సెప్టెంబరు 2009లో శ్రీశ్రీ, కొడవటిగంటి, గోపీచంద్‌ల శతజయంతి సదస్సులో ప్రసంగిస్తున్న ఆవుల మంజులత

ఈ పదేళ్లలో జరిగిన మార్పులకు కొదవ లేదు. అయితే అవన్నీ అభివృద్ధి దిశగానే జరిగాయన్నది మాత్రం చెప్పగలం. 2002లో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు రెండేళ్లకొకసారి నిర్వహిస్తున్న అమెరికా తెలుగు సాహితీ సదస్సుల్లో మూడోది డిట్రాయిట్‌లో నిర్వహించే బాధ్యత మాపై పడింది. అప్పుడప్పుడే మాకు డిట్రాయిట్ తెలుగు సాహితీ సమాఖ్య అనే పేరు స్థిరపడుతోంది. ఆ సమయంలో దాన్ని స్వచ్ఛంద సంస్థగా నమోదు చేశాం. తెలుగు పుస్తకాలు చదవటం, చదివించడం, చర్చించటం, తెలుగు సాహితీవేత్తలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడంతోపాటు వీలైనంతలో చక్కటి పుస్తక ప్రచురణ

జూలై 2007లో తెలుగు నేల నుంచి వచ్చిన సాహితీ బంధువులతో డిట్రాయిట్ తెలుగు సాహితీ సమాఖ్య సభ్యులు

కూడా చేపట్టాలన్నవే మా సంస్థ ఆశయాలు.

సాధారణ సమావేశాలకు వచ్చే సభ్యుల సంఖ్య 30-50 మధ్యలో తారట్లాడుతున్నా, చేరుతున్న సభ్యుల సంఖ్య మాత్రం ప్రతీ సంవత్సరం పెరుగుతూనే ఉంది. ప్రారంభం నుంచీ డిట్రాయిట్ వచ్చిన తెలుగు సాహితీవేత్తలతో ప్రత్యేక సమావేశాలు జరపడం ఆనవాయితీ అయ్యింది. ఈ సమావేశాలకు సభ్యులు ఎక్కువగా రావడం కూడా ఆ ఆనవాయితీలో భాగమే. అన్నిరకాల, అన్ని కాలాల తెలుగు సాహిత్యాన్ని సమంగా ఎన్నుకుని చదవటం, ఏ ఒక్క భావజాలానికీ మితిమీరిన ప్రాముఖ్యతను ఇవ్వకుండా సమభావంతో మెలగడం మా సమాఖ్య నిలకడకు ముఖ్య కారణాలు. అయితే, భిన్నాభిప్రాయాల మధ్య ఒకటి రెండు సందర్భాల్లో ఘర్షణ కూడా లేకపోలేదు. ఉదాహరణకు, విరసంను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధించినప్పుడు సంస్థ సభ్యులను నిరసన ప్రకటించమని అడగటం కొందరికి నచ్చలేదు. ఒకరిద్దరు తీవ్ర అభ్యంతరం కూడా తెలియజేశారు. భిన్నాభిప్రాయాలను గౌరవిస్తూ బహుజనాభిప్రాయానికి అనుగుణంగా సాగిపోతూ ఉండటమే ఈ సంస్థకు ఆయువుపట్టు. 2002లో విశాఖపట్నం నుంచి వచ్చి ఇక్కడ ఆరు నెలలపాటు సమావేశాల్లో పాల్గొన్న నాటక రచయిత కొత్తపల్లి బంగారాజు మాటలు ఇప్పటికీ అందరికీ బాగా గుర్తే. ఆయన విశాఖపట్నం తిరిగి వెళ్తూ - "మీరు పుస్తకాలపై చేసే చర్చల్లో ఎంత నిర్మొహమాటంగానో, నిష్కర్షగానో ఉంటారు. కానీ చర్చ అవగానే, ఆ గది దాటి బయటకు రాగానే, మళ్లీ ఏ అరమరికాలేని స్నేహితుల్లానే ఉంటారు. నాకు ఈ వాతావరణం ఎంతో నచ్చింది. ఈ అనుభవాన్ని మరవలేను." అన్నారు. ఆ వాతావరణాన్ని నిలుపుకోవటానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాం.

గత పదేళ్లుగా ఎందరో సాహితీవేత్తలతో ఉన్న అనుబంధం మా సమాఖ్యను ఉత్తేజపరచింది. వారి ఉపన్యాసాలు, సంభాషణలు, చర్చలు మరువలేని తీపి గుర్తులు.

అంపశయ్య నవీన్, ఎండ్లూరి సుధాకర్, సి.వనజ, చేకూరి రామారావు (చేరా), దివి వెంకట్రామయ్య, గరికిపాటి నరసింహారావు, జయప్రభ, జె.వి.రమణమూర్తి, కాత్రగడ్డ దయానంద్, కడియాల రామమోహనరాయ్, కలశపూడి వసుంధర, కేతవరపు కాత్యాయని (విద్మహే), కేతు విశ్వనాథరెడ్డి, కొల్లి శివారెడ్డి, మధురాంతకం నరేంద్ర, మేడసాని మోహన్, నాగభైరవ కోటేశ్వరరావు, నాగళ్ల గురుప్రసాదరావు, 'నవోదయ' రామమోహనరావు, నెల్లుట్ల వేణుగోపాల్, పాపినేని శివశంకర్, రాళ్లబండి కవితాప్రసాద్, సుద్దాల అశోక్‌తేజ, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, వాసిరెడ్డి నవీన్, వెల్చేరు నారాయణరావు, ఓల్గా, యార్లగడ్డ బాలగంగాధరరావు వంటి అనేకమంది ప్రముఖులు ఈ పదేళ్లలో డీటీఎల్‌సీ సమావేశాల్లో పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా...

2009లో శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్‌ల శతజయంతులను పురస్కరించుకొని జరిగిన సాహితీ సభలు మా సమాఖ్యకు సాహిత్యం పట్ల ఉన్న మక్కువకు, అభిమానానికి నిదర్శనంగా నిలిచాయి. అమెరికాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 100 మంది పైగా సాహితీప్రియులు విచ్చేసి ఈ సభలలో అర్థవంతమైన చర్చలు జరగడానికి తోడ్పడ్డారు. ఇలాగేప్రతి రెండేళ్లకొకసారి ఇటువంటి సదస్సులు నిర్వహించాలని అనేకమంది సాహితీప్రియులు డీటీఎల్‌సీ నిర్వాహకులను కోరారు. తెలంగాణ రైతాంగ పోరాటంపై వాసిరెడ్డి నవీన్ సేకరించి, సంపాదకత్వం వహించిన కథల సంకలనం 'తెలంగాణ విముక్తి పోరాట కథలు' పుస్తకాన్ని డీటీఎల్‌సీ ప్రచురించింది. నిజానికి ఇది డీటీఎల్‌సీ మూడో ప్రచురణ. అంతకు రెండు సంవత్సరాల ముందే డీటీఎల్‌సీ ముఖ్యులు ఆరి సీతారామయ్య కథల సంపుటి 'గట్టు తెగిన చెరువు', చేకూరి రామారావుగారు గతంలో సంపాదకత్వం వహించి వెలువరించిన 'మరోసారి గిడుగు' పునర్ముద్రణగాను ప్రచురించింది.

ఇన్నేళ్లు గడిచాక వెనక్కి తిరిగి చూసుకొని, ఇంతకీ మేం సాధించింది ఏమిటి అని ఆలోచించుకుంటే... తెలుగునేలకు, భాషకు, సాహిత్యానికి దూరంగా ఉన్నా మా అభిరుచుల్ని చంపుకోకుండా కొనసాగించుకోవడానికి ఇదొక మార్గం. అమెరికాలోని ఇతర ప్రదేశాల్లో ఉన్న తెలుగువారికి మాలాగే సమావేశాలు నిర్వహించుకోవడానికి స్ఫూర్తినివ్వగలిగాం. తెలుగు సాహితీ ప్రపంచంలో ముఖ్యంగా అమెరికా తెలుగు సాహితీ రంగంలో డీటీఎల్‌సీది నిస్సందేహంగా ప్రముఖమైన పాత్ర. చివరిగా తెలుగు భాష పట్ల, సంస్కృతి పట్ల మాకున్న అభిమానాన్ని, మమకారాన్ని కొనసాగించుకోగలుగుతున్నాం. తెలుగు అక్షరాన్ని మా మధ్యనా బతికించుకోగలుగుతున్నాం.

జీవరసాయనశాస్త్ర సహాయ ఆచార్యులు, వేన్ విశ్వవిద్యాలయం, అమెరికా
maddipati@wayne.edu

జ్ఞాన నేత్రం

చక్కిలం విజయలక్ష్మి

విశాలమైన, మైదానమంతటి ప్రాంగణం. నీడలు పరుస్తూ పెద్ద పెద్ద వృక్షాలు. రాలి, ఎండిపోయి, మట్టిలో కలిసిపోతున్న ఆకులు, పూలు, కొమ్మలు. కుక్కలు, గాడిదలు మొదలైన జంతువులు, పశువుల మలశకలాలు. అప్పుడప్పుడూ దాహంతో అరుస్తున్న చెట్ల మీది పక్షులు. శుచి, సంస్కారం లేని ప్రదేశం.

ఓ చెట్టు కింద అరచేతులు రెండూ వేళ్లతో కలిపి ఆ వేళ్ల మీద గెడ్డం ఆన్చి మునిగాళ్ల మీద గొంతుక్కూచుని ఉన్నాడో వృద్ధుడు. సన్నగా ఉన్నా కాయకష్టం చేసిన శరీరం. కాయదేరి ఉంది. కనురెప్పల మీదికి వాలిన కనుబొమల చర్మంలోంచి కళ్లు పైకెత్తి ఎదురుగా చూస్తున్నాడు.

నవాబుల కాలంనాటి ఓ పెద్ద భవంతి. మరీ పాతది. బూత్‌బంగ్లాలా ఉంది. లోపలేముందో, ఎలా ఉందో తెలీదు. చెదలు పట్టి నదురు కోల్పోయిన తలుపులన్నీ మూసి ఉన్నాయి. ఆరడుగుల వెడల్పుతో నాలుగు వైపులా చుట్టూ వరండా. తూర్పుదిశగా కిందికి దిగడానికి విశాలమైన మెట్లు. నవాబులదే అయివుంటుంది. రాజసం ఒలకపోసి ఉంటారు. అప్పటి జమానా అలాంటిది. కానీ అదంతా గతం. ఇప్పుడు...! నాలుగువైపులా కనిపించే గోడ పెచ్చులు లేచిపోయి, రంగులు మాసిపోయి, తాంబూలం ఊసిన, ఆర్పిన బీడీముక్కలు రుద్దిన మరకలతో బీభత్సంగా ఉంది. వరండా పొడుగునా నాలుగువైపులా ఐదడుగుల వెడల్పుతో చవకబారు రేకులతో పార్టీషన్స్ కింద చేసి ఉంది. తలుపులో, పరదాలో అర్థంకాని స్థితిలో, రీతిలో ప్రతి భాగానికీ గోనెపట్టలో, రంగువెలిసిన బ్లూమాట్సో వేలాడదీసి ఉన్నాయి. అక్కడ కాపురమున్నది ఏ నవాబుసాబులో కాదు. కుంటివాళ్లు, గుడ్డివాళ్లు, భిక్షగాళ్లు, చిల్లరదొంగలు... దందానో, దురాక్రమణో తెలీదు. దాని యజమాని ఓ గూండా రాజ్... ఆ గదుల్ని అద్దెకిస్తుంటాడు. అద్దె ఇచ్చినంత కాలం అతని రక్షణ ఉంటుంది. ఒక్క రోజు ఆలస్యమైనా కట్టుబట్టలతో మెడబట్టి గెంటేస్తాడు... స్నానం చేస్తున్నా సరే. గోచీ బట్ట కూడా లేని స్థితిలో బయటికెళ్లినవాళ్లు చాలామందే ఉన్నారు. అవసరాన్ని బట్టి సినిమా హీరోలానూ, విలన్‌లానూ ద్విపాత్రాభినయం చేసేస్తుంటాడు.

కాయకష్టం చేస్తూ, కొండగాలి పీలుస్తూ, పచ్చిధాన్యం తింటూ, ఊరంచున పారే ఏటినీళ్లు తాగుతూ, పక్షిలా స్వేచ్ఛగా పెరిగి, అరిగిపోయిన ఏడుకొండలకు ఈ బూత్‌బంగ్లా 'కాశీ పట్నం చూడర బాబూ' అంటూ తమ ఊళ్లోకి వచ్చే డబ్బా సినిమాలోని మాయాబజారులా ఉంది. అదేదో సినిమాలోని దెయ్యాల కొంపలా కూడా ఉంది. చెప్పలేనంత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

వాళ్లంతా సాదాసీదా మనుషులు. మరుగూ మర్మం ఏమీ ఉండవు. స్నానం నుంచి పానం వరకూ, దంతధావనం నుంచి దాంపత్యజీవనం వరకూ అంతా బట్టబయలే. మనుషుల్తో కుక్కలు, కోళ్లు, మేకలు సహజీవనం చేస్తుంటాయి. ఈగలు దోమలు చెప్పనవసరం లేదు. అయినా అవి తినేందుకు వాళ్ల గదుల్లో ఏమీ ఉండవు. సర్వజీవ సహజీవనం. అంతే. ఒక భిక్షం ఎత్తే కుటుంబం ఇంటికి రాగానే తమ జోలెల్లోని అన్నాలు, కూరలు అన్నీ ఒక పెద్ద ప్లాస్టిక్ టబ్‌లాంటి దానిలో వేసి చేతుల్తో కిచిడీలా కలిపేసి, అక్కడ కాపురమున్న అందరికీ ఓ డొక్కుతో కొలతగా అమ్ముతుంది. రంగు మాసిన ప్లాస్టిక్ పళ్లాల్లో కొందరు వేయించుకు తింటే మరికొందరు దోసిట్లోనే వేయించుకుని, అలాగే తిని వేళ్లు నాక్కుంటారు. గోళ్లు చీక్కుంటారు.

“ఈల్లిట్టాగే బతికేస్తారా? ” అన్నాడు ఏడుకొండలు వింతగా.

“ఏం బాలేదా? ఏమైంది? ఎంత బేఫికర్ జిందగీ. ఉండేదానికి గూడు. పూటకో రకం కూడు. అడిగేవాడు లేడు. అదిలించేటోడు లేడు. నెలకింత టంచన్‌గా పడేస్తే ఆ రఫీక్ అన్న తోక ఊపి వెళ్లిపోతడు” అన్నాడు మల్లేష్.

“మా ఊళ్ల ఇట్ల కాదు. కొర్రన్నం. జొన్న సంకటి. పండక్కి తెల్లారి (తెల్ల వరి) బియ్యంతో వణ్ణం. కొంపలెంత సుబ్బరమని! పేడతో అలుక్కుంటం. పాలతో కడుక్కుంటం.”

“సిటీ బై సిటీ! ఇక్కడింతే. చనగలు తిని చేయి కడుక్కుంటరు. కాకి గూట్లో కోకిలల్లె కాపురముంటరు. పరేషాన్ కాకు. సర్లేగానీ నే చెప్పిన సంగతేంజేశావ్? సోచాయించినవా? ”

ఇంత బేఫికర్‌గా మాట్లాడుతున్న ఈ మల్లేష్ ఎక్కడివాడో తెలీదు. వయసెంతో అర్థం కాదు. సున్నితమైన మనసుతో కరుకుగా మాట్లాడతాడు. కరుకైన మనసుతో సున్నితంగా మాట్లాడతాడు. అందరికీ అందుబాటులో ఉంటాడు. ఎందుకుంటాడో తెలీదు. అనుకోకుండా ఆమడ దూరంలో ఉంచేస్తాడు. ఎందుకుంచుతాడో అర్థం కాదు. అన్ని భాషలు, మాండలికాలూ కలిపి అవలీలగా మాట్లాడేస్తాడు. విచిత్రమైన వ్యక్తి. విలక్షణమైన వ్యక్తిత్వం. అలాంటి వ్యక్తికి ఏడుకొండలు నచ్చేశాడు. ఏడుకొండలు లాంటి వ్యక్తి నచ్చాడంటే మల్లేష్ కాస్తయినా మంచివాడై ఉండాలి. ఎందుకంటే ఏడుకొండలు నచ్చాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఏడుకొండలు దగ్గర ఈడ్చి తంతే ఎర్రపైసా లేదు. ఒక తన్ను వేస్ట్. అంతే.

సిటీలో బిక్కుబిక్కుమంటూ గమ్యం లేకుండా తిరుగుతున్న ఏడుకొండల్ని పలకరించి, ఇక్కడికి తీసుకువచ్చి గూడు ఏర్పాటు చేసిన గాడ్‌ఫాదర్ మల్లేష్. ఎడారిలో ఆగే ఆధారం కూడా దొరక్క ఎగిరి ఎగిరి అలసిపోయిన ఒంటరి పక్షికి వాలేందుకు దొరికిన ముళ్ల చెట్టే పళ్ల చెట్టు. ఏడుకొండలు పరిస్థితి అదే. మల్లేష్ పెద్ద ప్రయత్నం చేయకుండానే తన కథ చెప్పేశాడు. ఏడుకొండలు పేదవాడు. పల్లెటూరివాడు. భేషజాలేం లేవు. అతని కథ విని కరిగిపోయాడు మల్లేష్. అతని మంచితనానికి కుదేలైపోయాడు.



రాష్ట్రంలో ఓ మారుమూల గ్రామం. అక్కడున్నది రెండు కులాలే. అగ్రకులాలు. నిమ్నకులాలు. రెండు వర్గాలే. ఉన్నవాళ్లు. లేనివాళ్లు. ఏవో ఎన్నికలొచ్చాయి. ఎవరో దళితుడు గెలిచాడు. అంతే. నిప్పు రాజుకుంది... నిజంగానే!

ఏడుకొండలు మనవడు, ఆ ఊరి పెద్ద కామందు పిల్లాడు మధుబాబు స్నేహితులు. అలా అనకూడదు. ముఖ్యంగా పల్లెల్లో. అయినా తప్పదు. స్నేహితులే. ఎందుకంటే వారికింకా కులాల పట్టింపులు, అంతస్తులు అంతరాలు ఒంటబట్టలేదు. పూలలాంటి మనసులు. పుట్ట తేనెలాంటి స్నేహం. ఎందుకో తెలీదు. ఆ గొప్పింటివాళ్లు ఈ స్నేహాన్ని పెద్దగా అడ్డుకోలేదు. బహుశా వాళ్లు దీన్ని స్నేహమనేంత గొప్ప అర్థంలోకి అన్వయించుకోలేదేమో. ఊహాతీతమైన విషయాన్ని ఊహించుకోవాల్సిన అవసరం వాళ్లకేముంది?

ఊరి బొడ్రాయి దగ్గర రాత్రిపూట వెన్నెల్లో పిల్లలంతా కలిసి ఆడుకోవడం ఆనవాయితీ. ఆ దగ్గర్లోనే రచ్చబండ మీద పెద్దల రాజకీయాలు. దాదాపు ఒకే సమయానికి అందరూ ఇళ్లకు వెళ్లిపోతారు. అప్పుడప్పుడూ మధుబాబు ఆటలయ్యాక ఏడుకొండలు మనవడితోపాటు వాళ్ల గుడిసెకు వచ్చి కబుర్లు చెప్తూ, వాడి పక్కనే నులక మంచం మీద నిద్ర పోయేవాడు. నిద్రపోయిన మధుబాబును ఏడుకొండలు ఎత్తుకెళ్లి వాళ్ల ఇంట్లో పడుకోబెట్టి వచ్చేవాడు.

ఆ రోజు ఓట్ల లెక్కింపు. దళిత అభ్యర్థి గెలిచాడు. మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చారు. ఊరేగింపు చేశారు. ఊరు ప్రశాంతంగా ఉంది. ఓడినవారు అగ్రకులాలవారు, వారూ ప్రశాంతంగా ఉన్నారు. పాలుపంచుకున్నారు. ప్రజాస్వామ్యం మరి. ఎవరైనా పోటీ చేయొచ్చు. ఎవరైనా గెలవచ్చు.

అర్ధరాత్రి దాటింది. ఏడుకొండలకు మెలకువ వచ్చింది. లఘుశంక. గుడిసెముందు వేసుకున్న నులకమంచం దిగి దూరంగా వెళ్లాడు. తన పక్కనున్న మనవడూ నిద్రలోనే "ఊఊ" అంటూ తన వెనకే లేచి వచ్చాడు. అంతే. వెనక గుడిసెలు భగ్గుమన్నాయి. ఒకటి, రెండు, మూడు, నాలుగు... లెక్క తెలీలేదు ఏడుకొండలకు. ఊరంటుకుంది.

ఏం జరిగిందో అర్థం కాలేదు. తమ వైపు మంటలు వ్యాపిస్తున్నాయి. కేకలు. పెడబొబ్బలు. పిల్లాణ్ణి జబిరి ఎత్తుకుని పరుగు లంకించుకున్నాడు. చాలా దూరం వచ్చాకగానీ అర్థం కాలేదు అతనికి... విషయమేంటో. ఓడినవారు ఓర్వలేకపోయారు. అంతే. తన మిగిలిన కుటుంబమంతా మాడి మసైపోయినా, భుజం మీది మనవడి కోసం అక్కణ్ణించి బయటపడక తప్పలేదు. అయితే ఊరికి చాలా దూరాన ఉన్న రైల్వేస్టేషన్ చేరుకున్న తర్వాత ఆ లైట్ల వెలుగులోగానీ అర్థం కాలేదు ఏడుకొండలకు తను ఎత్తుకొచ్చింది తన మనవణ్ణి కాదనీ, మధుబాబుననీ!!!

* * *

"గిదీ మల్లేశన్నా జరిగినాది. నా వాల్లంతా కాలిబూడిదైపోయిన్రు. నా మన్మడు బతికేటోడే నా దగ్గరే పండుకునింటె. ఆడికి పొయ్యేకాలం దాపురిన్ని ఎప్పుడో లోన్కి బోయి అల్లమ్మ కాడ పండిండాడు."

"మరి ఈడేంటి?"

"ఇది 'ఇది లీల'. ఈ బాబుని ఊరెల్లి అల్ల అల్లకు అప్పజెప్పె పరిత్తితి లేదు. తోలుకొచ్చుకోక తప్పలా. గిప్పుడు తోలుకెల్లం కుదరలా."

"ఆ మంటల్లో దొబ్బి రాలేకపోయావా?"

అనబోయి ఆగిపోయాడు మల్లేష్. అప్పటికే

కీటభ్రమర న్యాయం

దీనినే భ్రమరకీటక న్యాయం అని కూడా అంటారు. భ్రమరమంటే తుమ్మెద, కీటమంటే పురుగు. తుమ్మెద చేసే ఝుంకారాన్ని వినీ వినీ తాను కూడా తుమ్మెదే అనుకుంటుందట పురుగు. 'ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరవుతార'ని కదా సామెత! మనం నిత్యం దేని గురించి తలపోస్తామో, అవి మన నడతని ప్రభావితం చేస్తాయని ఈ న్యాయం చెబుతోంది. లక్ష్యం కోసం తపిస్తేనే సాధన మొదలవుతుంది.

ఏడుకొండలు మంచితనం అర్థమైంది అతనికి. ఆ కుర్రాణ్ణి ఎంత అపురూపంగా చూసుకుంటాడో తెలుసు. తన వంతు అన్నంలోంచి మరికొంత వాడికి పెట్టడం, మల్లేష్ ఇచ్చిన చింకిపాతను వాడికే పరచి పడుకోబెట్టడం...! పక్కాగా తన శత్రువుల పిల్లాడు. ఉట్టి పుణ్యానికి తన కుటుంబాన్ని మొత్తం కాల్చి బూడిద చేసిన రాక్షసుల ఇంటి బిడ్డ. కానీ ఏడుకొండలు ఏడుకొండలవాడు కాదు. కానీ మనిషి. పక్కా మనిషి. మానవత్వం ఉన్న మనిషి. మంచితనం ఉన్న మనిషి. అదేదో తనకు ఉందని కూడా తెలీని సాదాసీదా మనిషి. అదే అతని గొప్పదనం.

అతని మీద బాగా సానుభూతి పెంచేసుకున్నాడు మల్లేష్. బాగా అభిమానం ఒంపేసుకున్నాడు. పిల్లాణ్ణి తల్లిదండ్రులకు దూరం చేశానని అతను పడే బాధ చూసి ఓసారడిగాడు మల్లేష్, "మీ ఊరి వివరాలు చెప్పు. పంపే వీలుందేమో చూస్తా."

"నానెన్నడూ సుట్టుపక్కల మూణ్ణాలుగు పల్లెలకు మించి యాడికీ పోలా. ఈ జిల్లాలు గిల్లాలు, మండ్లాలు నాకేటి తెలుస్తది అన్నా! మా ఊరు రాంపురం గంతే. పక్క బస్తీ గూడ తెల్వదు. పట్నంల మా యసొంటోల్లకేం పనుంటది? ఈ మద్దెన ఏంటో రేశనని, తెల్ల కారడ్లని, లోన్లని... అయ్యన్నీ నా కొడ్కు సూస్కునేవోడు. ఆడు మూడు సదివిండులే."

పిల్లాణ్ణి వాళ్ల ఊరికి పంపే ఉపాయం దొరకలేదు. ఏడుకొండల్ని ఆర్థికంగా ఎలా స్థిరపరచాలో ఆలోచనలో పడిపోయాడు మల్లేష్. ఓ రోజు ఓ అద్భుతమైన సలహా ఇచ్చాడు ఏడుకొండలకు.

"ఇలా చెప్తున్నానని ఏమీ అనుకోకు. ఇక్కడంతా ఇవి మామూలే. అవసరం కూడా. నువ్వ తిక్కమారాజువు కాబట్టి ఏమీ అనుకోకని చెప్పాల్సొస్తుంది."

"ఏందన్నా? "

"ఏం లేదు. నీవొక పని చేయాలి. నీ మంచి కోసమే. నీ జీవితమంతా కాలు మీద కాలేసుకుని హాయిగా ఉండొచ్చు."

"నువ్ జెప్తె కాదంటనా అన్నా? గిప్పటికే మాకు మస్తు జేసిండవ్. యా జల్మరునమో..."

"అరె ఓస్సాంబ. ఈ జల్మజల్మల బంధాలు సిన్మావోళ్లకు. మనక్కాదు గానీ ఓ పనిజెయ్. వాడు గూడ సుఖంగా ఉంటాడు."

"ఆడు గూడ సుకంగుంటడ అన్నా? ఏందన్నా? " ఆతృతగా అడిగాడు ఏడుకొండలు.

"వాడంటే ఎందుకురా అంత ఇదౌతావ్? వాడెవడో యాది మర్సినవ్‌రా? "

"ఆడు పసిపిల్లోడు. దేవుడసొంటోడు. పాపం తల్లిదండ్రులకు దూరమై ఈ సంటోడు..." ఏడుకొండలు గొంతు పూడుకుపోయింది.

'నీయబ్బ! నీవు మారవురా' అని మనసులో అనుకుని, "సర్లే. నీ వయసైపోయింది గానీ మరి వాడి సంగతి నీవు ఆలోచించాలా? ఆరేళ్ల పోరడు ఎట్ల బతుకుతడు? వాడు ఏ దొంగో కాకుండా మీరిద్దరూ సుఖంగా బతికే మార్గం ఓటుంది." బుజ్జగింపుగా అన్నాడు మల్లేష్.

"సెప్పు మల్లేశన్నా. నీ మేలు జల్మల మర్సిపోను"

"దానికేంలే"

"... ..."

"ఏం లేదు. దగ్గర్లోనే జిల్లేడు చెట్లున్నాయి. ఆ పాలు తెచ్చి ఈ నా కొడుకు కళ్లలో వేసెయ్."

"అయ్యయ్యా! గవి పోస్తె కల్లుపోతయ్!"

"పోవాలి కద మరి."

నిర్ఘాంతపోయాడు ఏడుకొండలు. నోట మాట రాలేదు.

"నాకు తెలుసు. నీకు బాధగుంటది. కష్టంగ అనిపిస్తది. దుర్మార్గంగ తోస్తది. కానీ ఆలోచించురా. నీవా ముసలాడివి. ఊరుగాని ఊర్లో ఏం పని చేస్తావ్? పిల్లాణ్ణెలా సాకుతావ్? తిండి, బట్ట, రోగాలు, రొస్టులు... ఎన్నో! జిల్లేడు పాలు పోస్తే కళ్లుపోయి ఊర్కుంటయి. ఓ చెట్టు చూడు. ఓ బట్ట పరువు. కూచోబెట్టు. బస్. ముక్కుపచ్చలారని పిల్లాడు. ముద్దులు మూటగడ్తున్నాడు. కానీ కళ్లు లేవు. ఎంత కష్టం! ఎంత సానుభూతి! జనం గుండె తరుక్కుపోదూ? జిల్లేడు పాలు పోయకుండానే వాళ్ల కళ్లు కరిగి నీలాలు కారిపోవూ? ఇంకేముంది? పైసలే పైసలు. నీవు, నీ బుడ్డోడు కాలు మీద కాలేసుకుని బతకొచ్చు. ఆ తర్వాత... ఆ తర్వాత... వాడు కాస్త పెద్దవాడైపోయి ఉంటాడు. అనుభవమూ వచ్చి ఉంటుంది. బతికేస్తాడులే." చాలా మామూలుగా చెప్పేశాడు మల్లేష్.

ఏడుకొండలు ఏమీ మాట్లాడలేదు.

"నాకు తెలుసు నీకేమనిపిస్తదో. కానీ ఇక్కడింతే. ఇట్లాగే ఆలోచిస్తరు. బతికేస్తరు. ఆ బస్తీ సివర స్మశానంల సూడు. సమాధులను పునాదులుగా ఇండ్లేసుకుని కాపురాలు చేస్తుంటరు..."

"... ..."

"కళ్లుండవంటావా? ఈ సిన్మ పాటిన్లే... 'నా కనులు నీవిగా చేసుకుని చూడు' అని. అట్ల నీ కళ్లతో చూస్తడులే" దిలాసాగా అన్నాడు మల్లేష్.

నిర్జీవంగా చూశాడు ఏడుకొండలు.

"అరె భై... అంత బెంబేలు పడకు. జర సోచో. నీకే అర్థమైతది. కానీ తొందరగ తెములు. రోజులు గడిసేకొద్దీ వడ్డీ నష్టమైపోతది," అంటూ కన్ను గీటి మళ్లీ నవ్వాడు మల్లేష్.

వెళ్తూ ఆప్యాయంగా భుజం తట్టి అన్నాడు, "నేను పెద్ద విలన్ లెక్క కనిపిస్తున్నా కదా? ఇప్పుడిట్లనె అనిపిస్తది. కానీ నీ మంచితనం, అమాయకత్వం చూసే చెప్తున్నా. బతకడం నేర్చుకోవాలె. ఇక తప్పంటావా? వాడి పెద్దలు నీకు చేసిన ద్రోహానికి పాప పరిహారం ఐనట్లయితది. వీడు నీ ఋణం తీర్చుకున్నట్లయితది. మీ ఇద్దరికీ జీవనాధారంగ గూడ ఉంటది. రేపటి వాడి భవిష్యత్తుకు డోకా ఉండదు. సోచాయించు." అని, భుజాలెగరేస్తూ

అన్నాడు, "ఈ డీల్‌లో నాకు కమిషనేమీ లేదు. జస్ట్ సెల్ఫ్‌లెస్ సర్వీస్."

* * *

ఈ విషయం గురించి రోజూ హెచ్చరిస్తున్నాడు మల్లేష్. అందులోని లాభాలు వివరిస్తున్నాడు. పుణ్యమేగాని పాపం రాదని నచ్చచెప్తున్నాడు. మరో దారి లేదంటూ పెదవి విరుస్తున్నాడు. పది రోజులు గడిచిపోయాయి. ఓ సాయంకాలం వచ్చి "నీతో కాదు గానీ ఇదిగో జిల్లేడుపాలు. ఈ రాత్రికి లగాయించు. పొద్దుగాల వస్త" అంటూ చిన్న సీసా ఇచ్చి వెళ్లిపోయాడు.

* * *

మల్లేష్ వెళ్లిపోయాక ఆ రాత్రి చాలాసేపు నిద్రపట్టలేదు ఏడుకొండలకు. బహుశా అతను చెప్పిన పని పూర్తి చేసేదాకా.

మధుబాబును పుట్టినప్పట్నించీ చూస్తూనే ఉన్నా, అభిమానిస్తూనే ఉన్నా, ఇక్కడికి వచ్చాక మమకారం మరీ పెరిగిపోయింది.

తల్లిపాలలాంటి మధుబాబు కళ్లలో జిల్లేడుపాలు! పాలసముద్రాల్లాంటి కళ్లు! పద్మరేకుల్లాంటి కళ్లు! నవ్వేకళ్లు! పువ్వుల్లాంటి కళ్లు! వెన్నలాంటి కళ్లు! వెన్నెలలాంటి కళ్లు! బాబు కళ్లు బాగా ఉండాలని పసితనంలో దున్నపోతు పేడ రసం తీసి కళ్లల్లో పిండమని ఇచ్చాడు. ఆముదాలు కాచి ఆముదం ఇచ్చాడు. ఆముదపు దీపం మసితో కాటుక చేసి ఇచ్చాడు. కడుపుతో ఉన్నప్పుడు తినమని తల్లికి కారెట్లు కోసి ఇచ్చాడు. ముఖం ఎక్కడుందో తెలీకుండా కళ్లు! పాల సముద్రంలో నీలి కలువల్లా కనుపాపలు! మేఘాలు దిగివచ్చి తొంగి చూస్తున్నట్టు దట్టమైన కనురెప్పలు!

బాబు కళ్ల మీద తడిమి తడిమి చూసుకున్నాడు ఏడుకొండలు. తడి ఆరకుండా ముద్దులు పెట్టుకున్నాడు.

* * *

తెలతెలవారుతోంది. మల్లేష్ ఉత్సాహంగా వచ్చాడు. ఇద్దరూ అటుతిరిగి పడుకున్నారు. మధుబాబు మీద ఆప్యాయంగా చేయేసి ఉన్నాడు ఏడుకొండలు. అతని పక్కన కూచుని గుసగుసగా అన్నాడు. "పని పూర్తయిందా?"

"ఊ"

"అమ్మయ్య. ఓ పనైపోయింది. మా మెంటల్ కేసుకు సమజైందో లేదోనని రాత్రంతా నిద్రపోలేదనుకో"

"నానంటే నీకెందుకన్నా అంత ఇది?" నీరసంగా అన్నాడు ఏడుకొండలు.

"అదేంది బై! మడిసిని కానూ? ఆ మాత్రం మానవత్వం ఉండొద్దూ? దేశంగాని దేశంల వచ్చి పడ్డవ్. రాక్షసులు. రాబందులు. పీక్కుతింటరు. ఎవరి పీకులాట లేని ఆదాయం గావాల నీకు. నాకు తోసింది జెప్పిన. మంచిగ లేదూ బిడ్డ?"

"ఔ" తల ఊపాడు ఏడుకొండలు.

"ఈ నా కొడుకు కళ్లు చూద్దం ముందర" అంటూ మధుబాబు ముఖాన్ని ఇటువైపు తిప్పుకున్నాడు మల్లేష్.

ఆశ్చర్యం! వాడి కళ్లు శుభ్రంగా, ప్రశాంతంగా, ముడుచుకున్న పూలరేకుల్లా ఉన్నాయి. పాలమరకల్లాంటివేమీ లేవు. కానీ... కానీ... వాళ్ల తలుపు దిక్కునేమో జిల్లేడు పాల సీసా ఖాళీగా అడ్డం పడి ఉంది! అంటే...!!!

"అరె ఫకీర్ నా కొడక. ఏం కొంప ముంచినవ్‌రా?" అని పళ్ల బిగువున అరుస్తూ ఏడుకొండల్ని తన వైపు తిప్పుకున్నాడు విసురుగా.

జీవితంలో ఎన్నడూ అంత నిర్ఘాంతపోలేదు మల్లేష్. మూర్ఛ వచ్చినవాడిలా అతనిలోని అణువణువూ కొట్టుకుపోయింది. నాలుక కట్టెలా తడిలేకుండా నీల్గిపోయింది.

ఎంతోసేపు గడిచిపోయింది.

మల్లేష్‌కు అర్థం కాలేదు. అర్థమైనా జీర్ణం కాలేదు. జీర్ణించుకున్నా భరించటం వల్ల కాలేదు. "అరె తిక్కనాకొడకా!" అంటూ తలబాదుకున్నాడు.

బుగ్గల మీదికి జారి ఆరిపోయిన జిల్లేడుపాల మరకలను తుడుచుకుంటూ లేచి కూర్చున్నాడు ఏడుకొండలు.

"అన్నా... నేను..."

"ఆగు! ఉత్కృత నా కొడ్కా..." అని కాసేపు ఏడ్చి, అన్నాడు. "ఎందుకురా ఇట్ల జేసినవ్? నీకు అర్థం కాక చేశావని అనుకోను. ఎందిరా ఇది?"

"శమించన్నా. నీ మంచితనం నా కెరికే. అంతా నా కోసమే. నా బవిశత కోసమే. నా కెరికే. కానీ వాడు? వాడి గురించి కూడ యోశన సేయాల కద? నాను కాటికి కాల్లు సాపినోన్ని. గిప్పుడో గప్పుడో. నాకు బవిశతేంది? దాని కోసం నూరేల్ల ఆడి బవిశత జిల్లేడుపాలు పోసి సిదిమేయడమేంది! సీకటి సేయడమేంది? నన్ను దేవుడు శమించడన్నా. ఆడు బాగుండాల. నూరేల్లు. ఎయ్యేల్లు. పాలోసంటి ఆడి కల్లు పగటి దీపాలు కావాల. సదువుకోవాల. ఎందర్కో సదూ సెప్పాల. కలెకటేరై పిల్లాజల్లాతో సంతోసంగ బతకాల. ఓ సెట్టు సూడు. బట్ట పర్సు. నన్ను కూసోబెట్టు. పైసలొస్తయ్. ఆడికి పనికొస్తయ్. తింటడు. బడికి పోతడు. సదూకుంటడు. పెద్దయ్యాక మా ఊరి గురించి తెల్సుకుంటడు. ఆల్లోల్లను కల్సుకుంటడు."

పనికిమాలిన చర్మచక్షువులు మూసుకుపోయి, తెరుచుకున్న ఏడుకొండలు జ్ఞాననేత్రం భవిష్యత్తును స్పష్టంగా చూస్తూ ఆనందబాష్పాలు రాలుస్తోంది.

"మల్లేశన్నా. ఒక్క మేలు సేయన్నా. నాను నిన్ను ఇంకేటీ కోరను. ఆణ్ణి... నా బుడ్డోణ్ణి బల్లో ఎయ్యి. ఈ గుడ్డోడి బట్ట మీద పడ్డ పైసలన్ని ఆడి బడికి కర్సు జెయ్. నాకే మొద్దు. దినానికి ఓ శాయ్. ఓ బన్ను. సాలు. నీ కాల్మొక్త!" మల్లేష్ కాళ్ల కోసం తడుముతున్నాడు ఏడుకొండలు. కానీ అప్పటికే ఏడుకొండలు పాదాల మీద పడిపోయి ఉన్నాడు మల్లేష్.

సామాజిక కార్యకర్త,
కర్నూలు.
98668 23450.

గురుభ్యోన్నమః

శ్రీ వెంకటరాములుగారికి,

గురువుగారూ... యోగ్యతాపత్రం ఇచ్చేంత యోగ్యులం కాదు. ప్రశంసాపత్రం సమర్పించేంత పండితులమూ కాదు. మీరు నేర్పిన అక్షరాలతోనే, మీరిచ్చిన భాషతోనే... మీ పాదాలకు సమర్పిస్తున్న కృతజ్ఞతాంజలి ఇది. అందుకోండి. ఆశీర్వదించండి. తప్పులుంటే చెప్పండి... బుద్ధిగా గుంజీలు తీస్తాం. మమ్మల్ని మేం సరిదిద్దుకుంటాం.



బాల్యాన్ని తలుచుకోగానే బడి గుర్తుకొస్తుంది. బడి అనగానే మీరే కళ్లముందు కనిపిస్తారు. గణగణ గణగణ గంట మోగుతుంది. తరగతి గదిలోకి మీరొస్తారు. సవినయంగా మేం ...'శుభోదయం' చెబుతాం. చిరునవ్వుతో మీరు స్వీకరిస్తారు.

మీ చేతిలో ఏ రఘువంశమో ఉంటుంది. ఒక పుస్తకం, పుస్తకం కాదనుకుంటారేమో! తోడుగా మరో ఉద్గ్రంథం. మహామహులకే అసంభవమైన నన్నెచోడుని కుమారసంభవమైతే, మీకు కరతలామలకం! రఘువంశాన్ని టీకాతాత్పర్యాలతో చెప్పగల విద్వత్తు మీ సొంతం.

ధోతీ కుర్తా... అచ్చతెనుగు ఆహార్యం. ఏమి దర్జా! ఎంత తేజస్సు! కాగితం మీద ముగ్గేసినట్టు... అందమైన తెలుగు సంతకం.

పెద్దరికంలో పెద్దనను తలపిస్తారు.. సరస సంభాషణలో సాక్షాత్తు శ్రీనాథ కవిసార్వభౌములు. హాస్యస్ఫూర్తిలో రామలింగకవి ప్రభావం ఉండీ ఉండనట్టు ఉంటుంది. భాషే తప్ప మరో ధ్యాసలేని ఆ భోళాతనాన్ని చూస్తే మాత్రం...పోతన్నే గుర్తుకొస్తాడు! మీరు కూడా 'నిను నాకటికిం గొనిపోయి, యల్ల కర్ణాట కిరాత కీచకులకమ్మ, త్రిశుద్ధిగనమ్ము భారతీ' అని చదువుల తల్లికి మాటిచ్చారేమో! పదవుల గురించీ పదోన్నతుల గురించీ ఎప్పుడూ ఆలోచించరు. ఎప్పుడూ చదువుల ధ్యాసే. భాషా శ్వాసే! మాతృభాష...తెలుగు. దేవభాష... సంస్కృతం.

గీర్వాణాంధ్ర సాహిత్యాలపై సమస్థాయిలో సాధికారంగా ప్రసంగించగల ద్విభాషా పండితులు మీరు. లేకుంటే అంత రమ్యంగా, అంత ప్రామాణికంగా శ్రీధరీయ భాగవతాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి ఎలా అనువదిస్తారు?

మీ పలుకు... కలకండపలుకు! గద్యం చదువుతున్నా... పద్యమంత కమ్మగా ఉంటుంది. పద్యం ఎత్తుకున్నారంటే... పక్క క్లాసుల్లోనూ పాఠాలు ఆగిపోతాయి. ఆవరణంతా చెవులు రిక్కించి వింటుంది. మీ స్వరం... మాకొక వరం! ఒక్కసారి విన్నా... మస్తకానికి ఎక్కేస్తుంది. ఇక పుస్తకంతో ఏం పని! అందుకేనేమో, బట్టీల బాధ లేకుండా ... హాయిగా ఆనందంగా తెలుగుభాష నేర్చుకున్నాం. మాతృభాషాభిమానాన్ని పెంచుకున్నాం. తప్పుల్లేకుండా రాస్తున్నామన్నా, పొల్లుపోకుండా మాట్లాడుతున్నామన్నా... అది మీ అక్షర భిక్షే!

మీరు ధారణ చేయించిన ప్రతిపదార్థ తాత్పర్యాలు... మాకింకా గుర్తున్నాయి. అయినా, పాఠమంటే... ఒట్టి పాఠమా అది! ప్రశ్నజవాబుల తూతూమంత్రపు తంతు కానే కాదు. అదో ఉత్సవం... భేషైన భాషోత్సవం! ఎన్ని కథలు, ఎన్ని ఉపకథలు, ఎంత సాహితీ పరామర్శ, ఎంత సద్విమర్శ, ఎన్నెన్ని చెణు

కులు, ఎన్నెన్ని మెరుపులు! ఎంత రాజనీతి, ఎంత లోకరీతి! అక్షరాలతో అభ్యంగన స్నానం చేసిన అనుభూతి! భాషాసరస్వతితో భేటీ అయినంత జ్ఞానసమృద్ధి. కమ్మని తెలుగు భోజనం కడుపునిండా ఆరగించిన సంతృప్తి!

మహాభారతాన్ని 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని... యధ్యాత్మ విదులు వేదాంతమనియు... నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని' కొనియాడితే కొనియాడవచ్చు గాక! మీ విద్యార్థులమైన మాకు మాత్రం... మీ పాఠమే నాలుగు వేదాల సారం, సకల శాస్త్రాల రహస్యం. అప్పటికి మాకంత పరిజ్ఞానం లేదు కానీ, ఇన్నేళ్ల తర్వాత ఏ స్టీఫెన్ కవి పుస్తకాన్నో, రాబిన్‌శర్మ వ్యక్తిత్వ వికాస సాహిత్యాన్నో చదువుతుంటే... ఇందులో కొత్త విషయాలేమున్నాయ్! అన్నీ మా వెంకటరాములు సార్ చెప్పిన సంగతులే కదా... అనిపిస్తుంది!

అయినా, మీతో వారికి పోలికేమిటి? మీ మాటలూ చేతలూ వేరువేరు కాదు. ఆచరించిందే బోధించారు. బోధించిందే ఆచరించారు. అందుకేనేమో, మీ పాఠాలెంత ప్రభావం చూపాయో, మీ వ్యక్తిత్వమూ అంత స్ఫూర్తినిచ్చింది. మిమ్మల్ని తలుచుకున్నా చాలు, మీరు ఆరాధించే శ్రీరామచంద్రుడే కళ్లముందు మెదులుతాడు.

'సూర్యస్యాపే భవేత్సూర్యో హ్యగ్నేరగ్నిః ప్రభోః ప్రభుః
శ్రియశ్చ శ్రీర్భవేదగ్ర్యా కీర్త్యాః కీర్తిః క్షమా క్షమా... అంటాడు వాల్మీకి ఓ సందర్భంలో.

రాముడు... సూర్యుడికి సూర్యుడిగా కనిపిస్తాడట. అగ్నికి అగ్నిగా కనిపిస్తాడట. ప్రభువుకు ప్రభువుగా కనిపిస్తాడట. ఓర్పుకు ఓర్పుగా కనిపిస్తాడట. దేవతలకు దేవుడిలా కనిపిస్తాడట... ఇదే పోలిక మీకూ వర్తిస్తుంది.

గురువులకు గురువు మీరు. పండితులకు పండితులు మీరు. ఆస్తికుల్లో పరమ ఆస్తికులు మీరు. తమరు ఆపోశన పట్టిన వేదాలు పూర్ణత్వం గురించే కదా చర్చించింది! ఆ రుక్కులన్నిటికీ రూపం ఇస్తే, మనిషిగా ప్రాణంపోస్తే... ఆ పరిపూర్ణ రూపం మీరే సారూ! అందుకేనేమో, జగదేవ్‌పూర్‌లో పుట్టిపెరిగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువులు నేర్చుకున్న ప్రతి విద్యార్థీ మీరే తన ప్రియగురువని చెప్పుకుంటాడు. ఊరంతా మీ శిష్యగణమే. మీరు చల్లిన అక్షరాల విత్తులు...రాష్ట్రమంతా, దేశమంతా విస్తరించాయి. మొలకలై మొక్కలై మానులై... ప్రవర్ధమానం అవుతున్నాయి.

పదవీ విరమణ సందర్భంగా... రాజకీయ నాయకుడు ఇన్నేళ్ల ప్రజాజీవితంలో ఎన్ని పదవులు అధిష్ఠించిందీ గుర్తుచేసుకుంటాడు. సాధారణ ఉద్యోగి... ప్రావిడెంట్ ఖాతాలూ గ్రాట్యుటీ మొత్తాలూ లెక్కలేసుకుంటాడు.

మీవంటి భాషా భాగ్యోపజీవులకు మాత్రం... అక్షరాలే ఆస్తులు. ప్రయోజకులైన పూర్వ విద్యార్థులే సిరులూ సంపదలూ. అందుకే, మేమంతా ఇంతదూరం వచ్చాం. వరుసగా మీముందు నిలబడ్డాం. వినయంగా నమస్కరిస్తున్నాం. భావమున తలతు మద్గురు-భావితలోకుని - మదీశు- పరమేశ సమున్ - అని శ్రీనాథుడు తన గురువు పండితారాధ్యుని తలుచుకున్నట్టు... మీరు మాకు ఆరాధ్యులు, ఆత్మీయులు, స్ఫూర్తిప్రదాతలు, అక్షరదాతలు, విధాతలు.

మీ విశ్రాంత జీవితంలో ఆయురారోగ్య ఆనందాలు వెల్లివిరియాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తూ...

– మీ పూర్వ విద్యార్థులు.

(మెదక్‌జిల్లా జగదేవ్‌పూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుడు వెంకట రాములుకు 3.09.2012న సమర్పించిన సన్మానపత్రం)

రచయితలు, భాషాభిమానులకు విన్నపం...

తెలుగు మీద మక్కువ పెంచే రచనలను ఆహ్వానిస్తున్నాం. కథ, కవిత, పద్యం, వ్యాసం, గల్పిక... ప్రక్రియ ఏదైనా చక్కని తెలుగులో ఉండాలి. కొత్త ప్రక్రియలనూ సృజించవచ్చు.

రచనల ఎంపికకు ప్రమాణాలు

- విషయం, శైలి, భావవ్యక్తీకరణల్లో ఏదోకటి కొత్తగా ఉండాలి.
- రచనలు సూటిగా, క్లుప్తంగా, చిన్న వాక్యాలతో ఉండాలి.
- శిష్ట వ్యావహారికంలోనే రాయాలి. గ్రాంథికం కూడదు.
- జటిల సంస్కృత పదాడంబరం వద్దు.
- అత్యవసరమైతే తప్ప ఆంగ్ల పద వినియోగం కూడదు.
- మాండలికాల్లోనూ రాయవచ్చు. క్లిష్ట పదాలకు అర్థాలను ఇవ్వాలి.
- రచనకు ఉపకరించే ఛాయాచిత్రాలనూ రచయిత పంపవచ్చు.
- పరిశోధనలు, చరిత్రకన్నా వర్తమానానికే ప్రాధాన్యం.
- ఉట్టంకింపులు, గణాంకాలు, చారిత్రక ఆధారాలను పేర్కొనడం తప్పనిసరి.
- ప్రాంతాలు, వ్యక్తులు, సంస్కృతులు, సంప్రదాయాలను, భావాలను, భాషను కించపరిచే వాటికి స్థానం లేదు.
- ప్రతి రచనకూ హామీ పత్రాన్ని జత చేయాలి. ఈ రచన ఇతర పత్రికలు, పుస్తకాలు, బ్లాగులు, వెబ్‌సైట్లలో, మరే ఇతర రూపంలో కానీ ప్రచురితం కాలేదని, పరిశీలనలో లేదనీ అందులో పేర్కొనాలి.
- రచయిత పూర్తి వివరాలు, రంగుల చిత్రాన్ని జోడించాలి.

రచన 1250 పదాలకు మించకూడదు. ఎంపికైన వాటికి పారితోషికం ఉంటుంది. ప్రచురణ నిర్ణయం, అవసరమైన మార్పులు చేసే అధికారం సంపాదకవర్గానివే. రచనలను ఈమెయిల్ ద్వారా పంపవచ్చు. ఎంపిక కానివి తిప్పిపంపడం సాధ్యం కాదు. ప్రతిభను ప్రోత్సహించాలని మా ప్రయత్నం. రచనతో పాటు మీకు ఆసక్తి, నైపుణ్యం ఉండి రాయగలిగిన అంశాలనూ విడిగా తెలియజేయవచ్చు. ఆ అంశంపై కథనం అవసరమైనప్పుడు మిమ్మల్ని సంప్రదిస్తాం.

– తెలుగు వెలుగు సంపాదకవర్గం

ఇది తెలుగుయజ్ఞం. ఇందులో పాలుపంచుకోవాలని మేధావులు, సాహితీవేత్తలు, భాషాభిమానులందరికీ ఇదే మా ఆహ్వానం.

మా చిరునామా: తెలుగు వెలుగు, రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్, 501 512 **ఫోన్:** +91 8415 246999;
మెయిల్: teluguvelugu@eenadu.net

‘ఆ పిట్ట భాష మాట్లాడకు’

తెలుగు వెలుగు బృందం

“ఆ పిట్టభాష మాట్లాడకు. అయితే ఇంగ్లిషు మాట్లాడు, లేదంటే జాతీయభాష మాట్లాడు”... చిన్నప్పుడు బడిలో మాతృ భాష మాట్లాడబోయిన ఆర్నెల్ వాలెన్సియాకు ఉపాధ్యాయుడి మందలింపు ఇది. ఇపుడు వాలెన్సియాకు ముప్పైతొమ్మిదేళ్లు. అతను ఫిలిప్పైన్స్ దేశంలో “ఐతా మగిండి” తెగవాడు. ఈ కొండజాతి తెగవారు ఇపుడు మూడువేల మంది మాత్రమే మిగిలారు. వారి మాతృ భాష క్షీణదశలో ఉంది. చిన్నతనంలో స్కూళ్లలో వారి మాతృ భాష లేదు. ఇపుడు మాట్లాడదామన్నా భాష చెల్లదు. ఎందుకంటే ఐతా మగిండి తెగ వారంతా పంచదార కర్మాగారంలో ఉద్యోగాల కోసం పోరాక్ నగరానికి వలస వచ్చారు. పని కావాలంటే స్థానికభాషయిన పంపాంగన్‌లోనే మాట్లాడాలి.

ఇలా ఎన్నో భాషలు చీకట్లో కలిసిపోతున్న తరుణంలో ప్రభుత్వ నిర్ణయం చిరుదివ్వెలా వెలిగి ఆశలు రేకెత్తిస్తోంది. ఈ నిర్ణయం ఇప్పటికిప్పుడు తీసుకుంది కాదు. పదిహేనేళ్ల క్రితం మొదలయిన ఒక శాస్త్రీయ ప్రయోగం దీన్ని ప్రేరేపించింది. 1997లో అమెరికాలోని “Summer Institute of Linguistics (SIL)” అనే భాషాభివృద్ధి సంస్థ ప్రభుత్వ అనుమతితో ఈ ప్రయోగాన్ని ప్రారంభించింది. దీని పేరు “ఫస్ట్ లాంగ్వేజ్ ఎక్స్‌పెరిమెంట్”. విద్యాభ్యాసంలో పిల్లలపై మాతృభాష ప్రభావాన్ని నిగ్గు తేల్చడం దీని లక్ష్యం. ఉత్తర

ఫిలిప్పైన్స్ విద్యావిధానంలో త్వరలో పెద్ద మార్పు రానుంది. అక్కడ చాలా మంది పిల్లలకు ఇక నుంచి పరాయిభాషల్లో పాఠాలు వినాల్సిన అగత్యం తీరబోతోంది. ఇప్పటిదాకా విద్యార్థులకు పాఠాలు ఇంగ్లిషులోను, జాతీయభాష ఫిలిప్పినోలోనూ చెప్పేవారు. కానీ అవి చాలా మందికి మాతృ భాషలు కావు. ఫిలిప్పినో పేరుకి జాతీయ భాషే. నిజానికి తొమ్మిది కోట్ల దేశ జనాభాలో ఆ భాష మాట్లాడేది రెండు కోట్ల మంది మాత్రమే. మిగతా జనాభా అంతా వేరే స్థానిక భాషలు మాట్లాడతారు. ఫిలిప్పైన్స్‌లో ఇలాంటి భాషలు 175 దాకా ఉన్నాయి. మాట్లాడేవారు లేక ఇప్పటికి ఏడు భాషలు అంతరించిపోయాయి. ఇంకో ఇరవై ఏళ్ళలో యాభై భాషలు గల్లంతవుతాయని అంచనా.

ఫిలిప్పైన్స్‌లో దుర్గమ కొండ ప్రాంతాల్లో నివసించే "లుబువాగాన్ (Lubuagan)" తెగను ఈ ప్రయోగానికి ఎన్నుకున్నారు. ఈ తెగ జనాభా పద్నాలుగు వేల మంది మాత్రమే. వీరికి బయటి ప్రపంచంతో సంబంధాలు తక్కువ. ఎస్.ఐ.ఎల్ సంస్థ ఇక్కడ కొందరు ఉపాధ్యాయుల్ని ఎన్నుకొంది. వారి చేత స్థానిక భాష అయిన లుబువాగాన్‌లో పాఠ్యాంశాల్ని తయారు చేయించింది. ఆ భాషలోనే బోధించేలా శిక్షణ ఇచ్చింది. మొదట తల్లిదండ్రుల నుంచి కొంత వ్యతిరేకత వచ్చింది. ఉద్యోగాలకు, హోదాకు పనికొచ్చే ఇంగ్లిషును నిర్లక్ష్యం చేయడం ఎవరికీ నచ్చలేదు. వీరి కోసం సంస్థ ఎన్నో సదస్సులు నిర్వహించింది. చివరికి ఒప్పుకునేలా చేసింది.

మొదటి మూడు తరగతుల్లో పిల్లలకు పాఠాలన్నీ మాతృభాష లుబువాగాన్‌లోనే చెప్పారు. ఇంట్లో మాట్లాడే భాషలోనే పాఠాలు ఉండటంతో పిల్లలు పాఠ్యాంశాల్ని తొందరగా వంటబట్టించుకున్నారు. మూడు తరగతుల తర్వాత వీరిని తీసుకెళ్లి ఇంగ్లిషు, ఫిలిప్పినో భాషల్లో పాఠాలు చదువుకుంటున్న మిగతా పిల్లలతో కలిపారు. ఈ ప్రయోగం పదేళ్లపాటు కొనసాగింది. 2006లో ఫిలిప్పైన్స్ విద్యాశాఖ నిర్వహించిన పరీక్షల్లో ఆశ్చర్యకర ఫలితాలు వెలువడ్డాయి. ఉత్తీర్ణతలో ఈ లుబువాగాన్ తెగవారు మిగతా స్కూళ్ల విద్యార్థులందర్నీ అధిగమించారు. వీరు కేవలం మాతృభాషలోనే మంచి మార్కులు తెచ్చుకోవటం లేదు. ఆలస్యంగా నేర్చుకున్న ఇంగ్లిషు, ఫిలిప్పినో భాషల్లో కూడా మెరుగైన ఫలితాల్ని సాధించారు. మార్కుల శాతాలు పోల్చి చూస్తే, ఎవ్వరూ యాదృచ్ఛికం అనలేనంత స్పష్టమైన తేడా కనిపించింది.

ప్రయోగానికి నాయకత్వం వహించిన డానియెల్ డెకర్ ఫలితాల్ని ఇలా విశ్లేషించారు: "ఇదివరకు ఇక్కడి పిల్లలు ఒక పక్క పాఠాల్లోని విషయాన్ని తెలుసుకుంటూనే, మరో పక్క పాఠాల భాష కూడా నేర్చుకోవాల్సి వస్తుంది. దీని వల్ల వారు ఒకేసారి రెండు పనులు చేయాలి. ఒకటి విషయ గ్రహణం, రెండు భాషా గ్రహణం. దీంతో వారి అభివృద్ధి వేగం మందగిస్తుంది. కానీ పుట్టుకతో అబ్బిన భాషలోనే పాఠం చెప్పడం వల్ల వారికి భాష మీద ప్రత్యేకంగా ధ్యాస పెట్టాల్సిన అవసరం రాదు. విషయాన్ని సూటిగా, సులభంగా గ్రహించగలుగుతారు. అంతేకాదు, ఎప్పుడైతే గ్రహణశక్తి (cognitive skill) పెరిగిందో అది అన్నిటికీ వ్యాపిస్తుంది. పరాయి భాషలు నేర్చుకోవటానికి కూడా! అందుకే ఈ పిల్లలు ఇంగ్లిషు, ఫిలిప్పినో భాషల్లో కూడా మిగతా పిల్లల కన్నా మెరుగ్గా రాణించారు".

ఈ ప్రయోగ ప్రభావంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 12 స్థానిక భాషలు బోధనా భాషలుగా మారాయి. ఈ పన్నెండింటిలో తమ మాతృభాష ఉన్న పిల్లలంతా మొదటి మూడు తరగతులూ ఆ భాషలోనే పాఠాలు నేర్చుకుంటారు. ఈ జాబితాలో చేరని భాషలు ఎన్నో ఉన్నాయి. కానీ మార్పు ప్రారంభమయింది కాబట్టి, ఇది సత్ఫలితాల్నిస్తే మిగతా భాషలకూ ఇందులో చోటు లభిస్తుందని అంతా ఆశావహంగా ఉన్నారు. ●

కొత్త వెలుగులు

మానవ జాతి పరిణామంలో భాష కేవలం ఒక మైలురాయి మాత్రమే కాదు మేలి మలుపు కూడా. అర్థంలేని శబ్దాలతో మొదలైన భాష పరిపూర్ణ శాస్త్రంగా ఎదిగిన తీరు శాస్త్రవేత్తలకి ఎప్పుడూ ఓ పరిశోధనాంశమే. అబుదాబీ ప్రభుత్వ సహకారంతో న్యూయార్క్ విశ్వవిద్యాలయం వారు (NYUAD) అటువంటి పరిశోధననే ఒకటి చేపట్టారు.

భాషాపరమైన వివిధ చర్యలలో నిమగ్నమైనప్పుడు (చదవడం, రాయడం, మాట్లాడటం కోసం) మన మెదడులో ఎటువంటి మార్పులు సంభవిస్తాయి అన్నదే వీరి పరిశోధనాంశం. దీనికోసం వీరు ప్రత్యేకంగా ఒక యంత్రాన్ని(MEG) తయారుచేసుకున్నారు. ఈ యంత్రానికి అనుసంధానించిన రెండువందల పైచిలుకు సెన్సర్లను మన తలపై అమర్చుతారు. వాటి ద్వారా భాషకి సంబంధించి మన మెదడులోని నరాలలో ఏ చిన్న ప్రతిచర్య సంభవించినా, వాటి వల్ల ఏర్పడే సూక్ష్మాతి సూక్ష్మమైన అయస్కాంత తరంగాలను సైతం పసిగడుతుంది. ఆ చర్యలు మన మెదడులోని ఏ ప్రాంతంలో సంభవిస్తున్నాయో కూడా తెలుసుకోగలుగుతుంది.

ఈ యంత్రం ద్వారా సేకరించిన సమాచారం వైద్యరంగంలోని ఎన్నో సవాళ్ళకు పరిష్కారం చూపగలదు. ఉదాహరణకు మాట్లాడటంలో సమస్యలు ఎదుర్కొనే వారికీ, విన్నదానిని అన్వయం చేసుకోవడంలో ఇబ్బందిపడే వారికీ ఈ పరిశోధన ఒక వరం కావచ్చు. అలాగని ఈ పరిశోధన కేవలం వైద్యరంగానికే పరిమితం కాదు. చిన్న చిన్న పదాల మొదలు సంక్లిష్ట వాక్యాలు వరకూ మనిషి భాషను అభివృద్ధి పరుచుకున్న తీరుపై ఇది కొత్త వెలుగులను ప్రసరించగలదు. సంస్కృతీ, సాంకేతిక పరిజ్ఞానం మానవాభివృద్ధికి రెండు కళ్ళవంటివి. ఈ రెంటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగే జాతే ఔన్నత్యాన్ని కాపాడుకోగలుగుతుంది. ●

కొడవకు మంచి రోజులు

కర్ణాటకలో కన్నడతో పాటు కొడవ, తులు, కొంకణి, బీరి లాంటి భాషలు మాట్లాడే వారున్నారు. మొత్తం జనాభాలో వీరు గణనీయ సంఖ్యలో ఉన్నారు. ఐదు లక్షల మంది మాట్లాడే కొడవ భాషది వీటిలో అగ్రస్థానం. కర్ణాటక దక్షిణాన ఉన్న కొడగు జిల్లాలో దీన్ని మాట్లాడే వారు ఎక్కువ. దీన్ని కూర్గ్ భాష అని కూడా అంటారు. ప్రాభవం తగ్గుతున్న ఈ భాషను బతికించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. గత ఏప్రిల్ నెలలో కొడవ సాహిత్య పరిషత్తు కోటి రూపాయలను దీనికి కేటాయించింది. 'కొడవ భాషే కలియిరి, కలిసిరి' (కొడవ భాషను నేర్చుకుందాం, నేర్పుదాం) నినాదంతో ఉద్యమం ప్రారంభమైంది. దీనిలో భాగంగా కొడవ సాహిత్యకారుల రచనల్ని ఇతర భాషల్లోకి, ఇతర భాషా సాహిత్యాన్ని కొడవలోకీ అనువదించడం మొదలుపెట్టారు. కొడవ నాటక ప్రదర్శనలు, సాహితీ సమావేశాలు, కవితా పఠనాలు, జానపద ఉత్సవాలు... మొదలైనవి ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే డిసెంబరులో కొడవ భాష, సాంస్కృతిక ఉత్సవాల్ని రాష్ట్రస్థాయిలో నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలన్నింటినీ ప్రచారం చేయటం కోసం 'కొడవ సాహిత్య పరిషత్తు' ఒక త్రైమాసిక పత్రికను కూడా వెలువరించనుంది. ●

నృత్య తెలుగు

డా॥ సప్పా దుర్గాప్రసాద్

నృత్య కళ సంగీత సాహిత్యాల సంగమం. నృత్యాభినయంతో ఒక మధుర భావనను మనసుకు పట్టించాలంటే అందుకు సంగీతంతోపాటు రసస్ఫోరకమైన భాష కావాలి. ఒక పదాన్ని చంద్రోదయం నుంచి సూర్యోదయం వరకూ అభినయించగల అభినయ పాండితీవేత్తలు ఒకనాడు ఆంధ్రదేశంలో ఉండేవారు. తెలుగువారే దక్షిణ భారత దేశ నృత్య సాంప్రదాయాలన్నింటికీ ఆద్యులయ్యారు. ఆంధ్రదేశం నుంచి విజయనగర సామ్రాజ్యానికి వలస వెళ్ళిన కళాకారులతే తళ్ళికోట యుద్ధానంతరం మధుర నాయకరాజుల ఆహ్వానాన్ని అందుకొని ఆ సంస్థానాన్ని అలంకరించి మెలట్టూరు, తంజావూరు సంప్రదాయాలకు అంటే భరతనాట్యానికి ఆద్యులయ్యారు. అలానే కేరళీయుల మోహినీ ఆట్టం, ఒడిశావారి ఒడిస్సీ నృత్యాలకు ఆద్యులు తెలుగువారే!

బౌద్ధమతం ఆసియా ఖండాన్ని వరదపొంగులా మహాప్రవాహంగా ముంచెత్తిన సమయంలో మన ఆంధ్రదేశంలో ప్రసిద్ధ బౌద్ధారామాలయిన విజయపురి, ప్రతిష్ఠానపురం, కొండాపురం, అమరావతి, ఘంటసాల, భట్టిప్రోలు లలో నృత్య ఆరాధనం జరిగింది. బౌద్ధమతం నాటి భాష 'పాళీ' అయినా ఆనాటి ఆరాధన నృత్య సంగీతం అంతా తెలుగులోనే ఉండి ఉంటుంది. ఎందుకంటే తెలుగు నృత్య కళాకారిణులే ఆరాధనలు చేసేవారు గనుక. ఈ విషయంలో సరైన ఆధారాల కోసం పరిశోధనలు జరగాలి. భారతీయ నృత్య కళలన్నింటికీ మూలగ్రంథం నాట్యశాస్త్రం. భరతముని రచించిన నాట్యశాస్త్రంలోని వర్ణనల వల్ల తెలుగు వారికి ఒక విశిష్ట నర్తనరీతి ఉందని తెలుస్తోంది. తరువాత ఆ గౌరవాన్ని దక్కించుకున్న గ్రంథం నందికేశుని 'అభినయదర్పణం'. నందికేశుడు ఆంధ్రుడేనని చరిత్రకారులు చెప్పారు. కారణం ఈ గ్రంథం ప్రాచీన ప్రతులన్నీ తెలుగు లిపిలోనే ఉన్నాయి. నందికేశుడు భరతార్ణవం అనే మరో గ్రంథాన్నీ రచించాడు. భారతీయ నృత్యకళాకారులకు నందికేశుని అభినయ దర్పణం మన మత గ్రంథాలంత పవిత్రమైంది.

సంగీత త్రిమూర్తులుగా పూజిస్తున్న త్యాగయ్య, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రిల లానే, నృత్యసంగీత త్రిమూర్తులు క్షేత్రయ్య, అన్నమయ్య, సిద్ధయ్యలు. త్యాగయ్య తమిళదేశంలో నివసించినా తన కీర్తనలన్నీ తెలుగులోనే రాశారు. త్యాగరాజస్వామి ఎందరో మహానుభావులు అంటూ పంచరత్నకీర్తనలేగాక, నౌకా చరిత్రవంటి నృత్యరూపకాన్నీ రచించారు. కూచిపూడి కళాకారులకు ఆనందభైరవి రాగాన్ని ఆయనే బహుమతిగా అందించారన్నదీ జగద్విదితం.

ఇక నృత్య త్రిమూర్తుల్లో మొదటివాడు మహాకవి క్షేత్రయ్య. ఆయన పదాలు అనన్య సామాన్య అభినయ సముద్రాలు. ఒక్క కీర్తనను ఎన్ని గంటలయినా అభినయించవచ్చు. అంతటి విస్తృత అభినయ సౌలభ్యం కలిగిన అచ్చ తెలుగు పదాలు మన నృత్యకారులకే సొంతం.

రెండవ వాడైన తాళ్ళపాక అన్నమాచార్యుడు వేంకటేశ్వరుని స్తుతిస్తూ అచ్చ తెలుగులో 32 వేల కీర్తనలు రచించాడు. మానవ జీవితంలో ఎన్నో దశలు, ఎన్నెన్నో అవస్థలు, ఇంకెన్నో అవసరాలు- అన్నింటినీ తనే అనుభవిస్తూ ఆ అనుభవసారంగా అందించిన అపూర్వ పద విన్యాసాలు ఆయన సంకీర్తనలు. శృంగారంగా, లలితంగా, కోమలంగా, జానపదవిధానాలుగా, అమ్మగా, భార్యగా, ప్రేయసిగా, సేవకునిగా, సేవలందుకునేవానిగా, భోగిగా, త్యాగిగా, ఎన్నో విధాలుగా ఆయన చేసిన రచనలు నవరసాలనేగాక నవ్యరసాలనెన్నింటినో ఆవిష్కరింపజేస్తున్నాయి.

మూడవవాడు సిద్ధయ్య. సిద్ధేంద్రయోగిగా కూచిపూడి నృత్యకళా సంప్రదాయానికి ఆద్యుడు. సత్యకృష్ణుల ప్రణయ కలహాన్ని శృంగార దృశ్య ప్రబంధంగా మలిచిన సిద్ధేంద్ర యోగి పుంగవుడు. ఆయన ఆదర్శంగా గోదావరి సీమలోని ఎందరో కవులు సత్యభామను తమ ఆడపడుచుగా భావించి, అనన్యసాధ్యమైన తెలుగు నాయికగా తీర్చి నవజనార్దనుల సేవలో సత్యభామాకలాప శోభను నవరాత్రులు నృత్యాభినయాలతో తెలుగు నృత్య సరస్వతికి నీరాజనాలుగా అర్పించారు.

ఎందరో మహానుభావుల రచనా ప్రతిభ వల్ల ఎన్నో పదాలు, పదవర్ణాలు, పెద్దవర్ణాలు, జావళీలు, స్తోత్రాలు, సలాంజతులు, అంకిత శబ్దాలు, కీర్తనలు, దరువులు, కందర్థాలు, సీసార్థాలు, అర్ధచంద్రికలు, వెన్నెల, చందమామ పదాలు, స్వరపల్లవులు, స్వరజతులు, శబ్ద పల్లవులు, సాహిత్య పల్లవులు, జతిస్వరాలు, స్వరజతులు, గీతాలు, తిల్లానాలుగా చతుర్విధ అభినయాలుగా శాస్త్రీయ నృత్య ప్రదర్శనా శైలిలో అలరిస్తున్నాయి.

పరాయి దేశాల రాజులు ఎందరో ప్రత్యేకంగా తెలుగు నేర్చుకొని, తెలుగులో తమ కవితా మాధుర్యాన్ని అందించారు. అటువంటి వారిలో మలయాళ దేశంగా పేరొందిన కేరళలోని తిరువనంతపురం మహారాజు స్వాతితిరుణాళ్ అగ్రగణ్యులు. ఆయన ఎన్నో నృత్య సంగీత రచనలు చేశారు. వాటిలో ప్రపంచంలో ఏ దేశంలోనైనా నృత్య ప్రదర్శనలో నేటికీ ప్రదర్శితమవుతున్న అచ్చ తెలుగు అభినయ కీర్తన ఇదీ...

'సరసిజాక్షులు జలకమాడే సమయమున నీవ చటి కేజని సరిగచీరల నెల్ల చేకొని పరుగులెత్తుట న్యాయమా'. ఈ కీర్తన అభినయించని ఆంధ్ర, కేరళ, తమిళనాడు నృత్యకళాకారులుండరు.

తమిళదేశంలో తంజావూరుకు చేరువలోని ఉదయూరుపాలెం సంస్థానాధీశుడయిన యువరంగడు కూడా తెలుగును అభ్యసించి, నాట్యానికి అనువైన పదాలు రచించాడు. యువరంగని పదాలు అభినయించని నృత్యకళాకారులు లేరు. 'వెన్నెల తీరితే గానీ - వేళగాదురా స్వామి' వంటి ఎన్నో కీర్తనాపదాలు రచించారాయన.

శివాజీ మహారాజు 'ఛత్రపతి'గా జగమెరిగిన మరాఠా వీరుడు. ఆయన వారసులైన శరభోజి, శహాజిలు తెలుగు భాషానృత్య సాహిత్యం పట్ల సమ్మోహితులై భాషను అభ్యసించారు. అంతే కాదు తెలుగులో పదాలు రచించి తమ సంస్థానంలోని నృత్యకళాకారులచేత అభినయింపజేశారు. ఎందరో తెలుగు కళాకారులను పోషించారు. వారి రచనల్లో తెలుగు ఔన్నత్యాన్ని చాటారు.

'దానికే తగు జాణరా నీవు' అనే పదం గత కొన్నేళ్ల క్రితం వరకూ బొబ్బిలి, విజయనగర సంస్థానాల్లో తప్పనిసరిగా నర్తించే ఆచారం ఉండేది. అలాగే కన్నడ దేశంలోని విజయనగరం కేంద్రంగా దక్షిణాదిని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు తెలుగునెంతో అభిమానించాడు. ఆయన కొలువులో ఎందరో తెలుగు నృత్య కళాకారులు ఉండే వారు.

'రాజాధిరాజ వీర ప్రతాప - శ్రీకృష్ణరాయ భూపా/సకలాంధ్ర ద్రవిడ కర్ణాటకాధిప శ్రీకృష్ణరాయ భూపా' అంటూ ఆయనను కీర్తిస్తూ తెలుగు అభినయ నృత్యాభిన్యాసాలకు వెలుగులద్దిన సంగతి, బంగారు రేకుల తాపడం చేసిన మందిరాలలో నృత్య సాధన చేసిన సంగతి జగద్విదితం. నృత్య సంగీత సాహిత్య వేత్తలకు రాయల కాలం స్వర్ణయుగం.

ప్రతి రెండు అక్షరాలున్న పదాన్ని కూడా చక్కగా అభినయించగల రీతిలో అభినయ విద్యకు నిఘంటువులుగా ఆధ్యాత్మ రామాయణ కీర్తనల్ని తెలుగులో రచించిన మరో మహాకవి మునిపల్లె సుబ్రహ్మణ్యకవి.

భారతీయ ఆధ్యాత్మికత్వాన్ని నిలిపిన మహాగురువు శ్రీ ఆదిశంకరాచార్యులు రచించిన 'అమరుకం'లోని శ్లోకాలను అభినయించే సత్తాగల కళాకారులనుగన్న భూమి మన తెలుగుభూమి. నవరసాల్నీ నర్తనవిన్యాసాలుగా అభినయించగలిగేవారున్నారు. స్వీయ,

పరకీయ, సామాన్య, ప్రోషితభర్తృక విరహోత్కంఠిత, విప్రలబ్ధ, కలహాంతరిత, ఖండిత, అభిసారిక, వాసకసజ్జిక, స్వాధీనపతిక, సమాగచ్ఛత్పతిక వంటి ఎందరో నాయికానాయకులను అభినయించగల వారు ఉన్నారు.

తెలుగువారి జీవనశైలిలో నాట్యం ఎంతగా చొచ్చుకుపోయిందో తెలియజేసే ఎన్నో సామెతలు, లోకోక్తులు వినిపిస్తూ ఉంటాయి. తెలుగు భాష సహజమైన యతి, ప్రాస లక్షణాలుగల గొప్ప భాష కావడమే కారణం. ఆడలేక మద్దెల ఓడు, ఆడింది ఆట - పాడింది పాట, సోమిదమ్మ కాలికి గజ్జెకట్టినట్లు, భామకు బనారసు కోక తళుకేగానీ - ఆటలో బెళుకు లేదు, ఆడే కాలు పాడే నోరు కుదురుండదు, ఒక్కరోజు వేషానికి మీసం గొరిగినట్లు'- ఇలా ఎన్నో సామెతలున్నాయి.

అలాగే జన వ్యావహారికంలోనూ నృత్య పరిభాష తొంగి చూస్తూంటుంది. ఇక్కడికో 'అంకం' అయ్యింది. ఇక్కడితో 'అధ్యాయం' ముగిసింది. ఏవిటీ 'ఆర్భాటం', ఏవిటీ 'వయ్యారం', ఏవిటీ 'కలాపం'లా పరుచుకు కూర్చున్నావు. అప్పుడు వాడి 'అభినయం' చూడాలి, ఎందుకలా 'తాండవం' చేస్తున్నావు. ఇంకా 'పూర్వరంగం', 'పాత్రం', 'నటన', 'రంగం', 'విదూషకుడు', 'శకారంగాడు', 'భాగోతం', 'తెర వెనుక'- ఇలా ఎన్నో.

ఎన్నో నాట్య ముద్రల్ని కూడా వ్యావహారిక భాషలో ఉపయోగిస్తున్నాం. 'అర్ధచంద్ర ప్రయోగం, 'శిఖరాగ్ర సమావేశం', 'ముష్టి యుద్ధం', ఇలా ఎన్నో, ఎన్నెన్నో పదాలు జనం నోళ్లలో నానుతున్నాయి.

సామాన్యులకు కూడా రామాయణ, భారత, భాగవతాది పురాణాల గురించి సవివరంగా తెలియజెప్పిన నృత్యప్రక్రియ యక్షగానం. ఆంధ్రదేశంలో ఎన్నో యక్షగానాలు నర్తించే భాగవత బృందాలున్నాయి. కూచిపూడి భాగవతులు, పగటివేష భాగవతులు, చిందు భాగవతులు, యానాది భాగవతులు, గంటె భాగవతులు, నక్కల భాగవతులు, తూర్పు భాగవతులు- ఇలా ఎన్నో భాగవత బృందాలు కళా ప్రదర్శనల ద్వారా, విచిత్ర విశేష అలంకరణల ద్వారా, తెలుగు భాషా రస రమ్యతను చాటుతూనే వుండగా, తెలుగులో తప్ప మరే భాషలో లేని పద్య నాటకాలు, హరికథలు, బుర్రకథలు, తంబురకథలు, ఒగ్గు కథలు- ఇలా ఎన్నో వందల సంఖ్యలో నృత్యాలు, ప్రాచీన పౌరాణిక, చారిత్రక, సామాజిక గాథలనూ, దేవతా మాహాత్మ్య విన్యాసాలనూ, విలాసాలనూ జనసామాన్యంలోకి తీసుకువెళ్ళాయి. తెలుగులో ఉన్నన్ని జానపద నృత్య ప్రక్రియలు మరే భాషలోనూ లేవని సగర్వంగా చెప్పుకోవచ్చు. వీటన్నింటినీ కాపాడుకోవాలి. భావి తరాలకు అందించాలి.



ప్రఖ్యాత నాట్యాచార్యులు,
ఆలయనృత్య ప్రచారకులు,
రాజమండ్రి.
98492 73096

ఊయల ఓ గురుపీఠం



జన్యుమంత్రోచ్చాటనతో
ప్రకృతి పౌరోహిత్యం చేశాక
ఇల్లు గుడి అయిపోతుంది
ఊయల గర్భగుడి!
కోరకనే వరాలిచ్చే
బాల బోళా మూలవిరాట్ ప్రతిష్ఠాపన జరుగుతుంది!
నట్టింట
నయన మనోహర నిరంకుశ రాజ్యం మొదలవుతుంది!
ఆ నిరంకుశత్వాన్ని మనసావహించకుండా ఉండగలమా?
మధుమాసపు విశ్వరూపమైనా
ఆ లే దరహాసం ముందు చిన్నబుచ్చుకోవలసిందే!
ఏ క్షణంలో ఆ హస్తమంత్రదండం
ఏమి ఆజ్ఞాపిస్తుందో ఎవరికి ఎరుక!
అందుకే అన్ని రుతువులూ చేతులు కట్టుకుని
ఊయల చుట్టూ సిద్ధంగా ఉంటాయి!
ఊయల వన్నెలన్నీ ఓనమాలు నేర్చుకునే ఏకోపాధ్యాయ పాఠశాల అవుతుంది!
ఊయల
నిద్దురలోనూ ఉధృతి తగ్గని నా అహం ప్రవాహాలన్నింటినీ అలవోకగా లాగేసే
సముద్రమంత సూదంటు రాయి అవుతుంది!
ఊయల మునివాటికవుతుంది!
సమస్త సంపదలకూ నైసర్గిక భాషలో జవాబిచ్చే గురుపీఠమవుతుంది!
ఊయలను సమీపించగానే నేను
పెద్దరికపు రంగూ, రుచీ, వాసనలను కోల్పోతాను
అప్పుడు వ్యాకరణాన్నీ, భాషనూ మర్చిపోగలగడం,
కపటాటోపపు' పలుకులు మరిగిన స్వరపేటికను తిరిగి
ఆదిమ విమల విపంచిగా వినియోగించగలగడం
నేను సాధించే ఘన విజయమవుతుంది!
వాలిన లేతరెప్పలను చూసి
అపురూప ప్రాణశిల్పం విశ్రాంతి తీసుకుంటోందనుకుంటామా!
కానేకాదు
ఆ రెప్పల వెనుక రెటీనాలపై స్థలకాలాలు సింహావలోకనం
చేసుకుంటుంటాయి!
భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేసుకుంటుంటాయి!
మూసిన ఆ గుప్పిళ్లలో ఏమీ లేదనుకుంటామా!
శుద్ధ తప్పు
శూన్యాన్ని పట్టి అంత సొగసైన పంజరంలో బంధించడం
ఎవరికి సాధ్యం ఒక్క దైవానికి తప్ప!

– వి–రాగి, రాజమండ్రి. 96766 35017

కథ

అప్పారావూ... అతడి భాష

ఎ.వి.ఎన్.హెచ్.ఎస్. శర్మ

అప్పారావు కరడు కట్టిన పాత్రికేయుడు. పాత్రికేయం అతడి నరనరానా వంటబట్టేసింది. అసలు పుడుతూనే కలం పట్టుకుని పుట్టేడేమో తెలియదు. మంత్రసానిని కనుక్కోవాలి. బుల్లి గుప్పెట్లో గట్టిగా పట్టుకున్న సదరు కలం పదును చూసి ఆవిడ ముచ్చటపడి బొడ్డు కోసే ముందే తన బొడ్లో దోపేసి ఉంటే ఆ నిజం బయటకు రాకపోవచ్చు. మొత్తం మీద చిన్నప్పటి నుంచీ అప్పారావు అలాంటి బుద్ధులే చూపించాడు. దినపత్రిక చూపిస్తే కానీ గోరు ముద్దకు నోరు జాపేవాడు కాదు. టీవీలో వార్తలు పెడితే కానీ అన్నం తినేవాడు కాదు. పైగా బాల్యం నుంచీ సామాజిక స్పృహ ఎక్కువే కూడా. ఎందుకంటే మనవాడు మారాం లేకుండా తినాలంటే ఆ రోజు వార్తల్లో దారుణాలు జరిగి ఉండాలి. భూకంపాలో, వరదలో, సునామీలో వస్తే గుటుకూ గుటుకూ ముద్దలు మింగేసేవాడు. వాళ్లమ్మ రోజూ పత్రిక తిరగేస్తూ, టీవీ మీట నొక్కుతూ, 'భగవంతుడా! ఏదైనా ఉత్పాతం జరిగేలా చూడు తండ్రీ!' అని కోరుకునేది.

బడిలో కూడా అంతే. పలక మీద అక్షరాలు ఇష్టం వచ్చినట్టు రాసేసేవాడు. పంతులుగారు గతుక్కుమన్నారు. ఆనక ఆరా తీస్తే తెలిసింది. అప్పారావు అమ్మ రచయిత్రి. నాన్న విలేకరి. ఇద్దరూ ఇష్టం వచ్చిన రాతలు రాసేవారే. ఆ బుద్ధులు ఎక్కడికి పోతాయి? దరిమిలా అప్పారావు చాలా చురుగ్గా ఎదిగాడు. పత్రికలన్నీ చదివేసేవాడు. వార్తలే వల్లెవేసేవాడు. వార్తలే చూసేవాడు.

ఓసారి పరీక్షలో న్యూటన్ గమన సూత్రాలను రాయమన్నారు. విశ్వంలో ఏదైనా స్థితిని మార్చుకోవాలంటే బాహ్యబలం పనిచేయాలని న్యూటన్ చెబితే, మనవాడు ఈ విశ్వంలో ఏ వార్త పుట్టాలన్నా కలం బలం ఉండాల్సిందే అన్నాడు. దేని త్వరణమైనా బలానికి అనులోమానుపాతంలోను, ద్రవ్యరాశికి విలోమానుపాతంలోను ఉంటుందని ఆయన చెబితే, మనవాడు ఏ వార్త వేగమైనా పత్రిక సిద్ధాంతానికి అనులోమానుపాతంగాను, రాద్ధాంతానికి విలోమానుపాతంలోను ఉంటుందని నిర్వచించాడు. ప్రతి చర్యకూ ప్రతిచర్య ఉంటుందని ఆయన చెబితే, మనవాడు ప్రతి వార్తకు ఖండన ఉంటుందని రాశాడు. మాస్టారు మొదట తెల్లబోయారు. తర్వాత తేరుకుని అడ్డంగా కొట్టేస్తే అప్పారావు తరగతిలోనే బైఠాయించాడు. ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశాడు. విద్యాధికారికి వినతి పత్రం సమర్పించాడు.

'నేను సమాధానాన్ని సృజనాత్మకంగా రాయడం జరిగింది. దాన్ని మాస్టారు గ్రహించక పోవడం జరిగింది. కాబట్టి నాకు అన్యాయం జరిగింది. మీరు ఈ విషయంలో జోక్యం చేసుకోవడం జరిగితే, నాకు న్యాయం జరిగి, నేను ఆనందించడం జరుగుతుంది. ఇవన్నీ జరిగే వరకు తరగతి నుంచి జరగనని నేను శపథం చేయడం జరిగిందని మీరు గ్రహించడం జరగకపోతే నాకు మార్కులు రావడం జరగదు' అని రాశాడు.



ఆ భాషాప్రయోగానికి ప్రధానోపాధ్యాయుడి కళ్లు తిరిగాయి. విద్యాధికారికి కడుపులో తిప్పింది. తల్లిదండ్రుల్ని పిలిచి మాట్లాడారు. వాళ్లు అంతావిని "వీడు ఇంట్లో కూడా ఇలాగే మాట్లాడుతున్నాడు. ఏం చేయాలో ఏంటో?"

అన్నారు అయోమయంగా. పక్కనే ఉన్న అప్పారావు విసురుగా కుర్చీలోంచి లేచి, "మీ వ్యాఖ్యలను ఖండిస్తున్నాను. వాటిని వెంటనే ఉపసంహరించుకోండి" అన్నాడు. అందరూ తలలు పట్టుకున్నారు.

ఆపై అమ్మానాన్నా ఎంత చెప్పినా అప్పారావు వినలేదు. చక్కని తెలుగు చదివి వినిపిస్తే చెవులు మూసుకునేవాడు. దినపత్రికల్లోనే తేట తెలుగు వాక్యాలతో ఉన్న వార్తల్ని, భాష మీద మంచి ప్రయోగాలు చేసే పత్రికల్ని ఇచ్చినా కన్నెత్తి చూసేవాడు కాదు. తనకు నచ్చిన పత్రికాభాషలోనే మాట్లాడేవాడు. నచ్చచెప్పాలని చూస్తే, "నాకు తోచినట్టు మాట్లాడ్డం నా ప్రాథమిక హక్కు. దాన్ని కాలరాయాలని చూస్తే సహించేది లేదని మిమ్మల్ని చివరిసారిగా హెచ్చరిస్తున్నాను" అనేశాడు. ఆపై అమ్మానాన్నా నోరెత్తితే ఒట్టు.

అలాంటి అప్పారావు ఎదుగుతున్న కొద్దీ మరింత కరడుకట్టేశాడు. తెలుగు ఇలా కూడా మాట్లాడవచ్చా అనే సందేహం కలిగేలా మాట్లాడేవాడు. పాపం... అతనికి స్నేహితులు కూడా లేరు. కారణం అతడి భాషే. ఓసారి ఓ స్నేహితుడు అప్పారావుని సినిమాకి తీసుకెళ్లాడు. చివర్లో "ఎలా ఉందిరా?" అని అడిగితే, "ఇలాంటి సినిమా నాకు నచ్చుతుందని నువ్వు భావిస్తే, నువ్వెంత హీన స్థితిలో ఉన్నావో అని నేను అనుకుంటాననే విషయం నీకు తోచనందుకు నేను ఆశ్చర్యపోతానని నువ్వెందుకు గ్రహించడం లేదు?" అన్నాడు. ఆ స్నేహితుడు రోడ్డు మీదే కళ్లు తిరిగి పడిపోయాడు. చుట్టుపక్కల వాళ్లు మొహం మీద సోడానీళ్లు కొట్టి స్పృహతెచ్చి ఇంటికి పంపారు. ఆపై అతడు అప్పారావు ఇంటి ఛాయలకు కూడా రాలేదెప్పుడూ. అతడే అప్పారావుకు చివరి స్నేహితుడు.

చదువైపోగానే అప్పారావు సమయాన్ని వృథా చేయదలుచుకోలేదు. వెంటనే బజార్లోకెళ్లి ఓ పెద్ద కంకణం కొనుక్కుని ఇంటికి వచ్చాడు. అమ్మ అదేంట్రా అని అడిగితే, "పాత్రికేయ వృత్తిలో ప్రవేశించి సమాజాన్ని ఉద్ధరించాలని కంకణం కట్టుకున్నానమ్మా! అదే ఇది. నను కన్న మాతృమూర్తిగా ఆశీర్వదించి పంపితే, పీడిత తాడిత ప్రజలకు చేయూతనై, అణచివేత వల్ల అణగారిన బతుకులకు ఆశాదీపాన్నై వెలుగొందుతా" అన్నాడు ఆవేశంగా. అమ్మ నీరసంగా చెయ్యెత్తగానే బయటకి పరిగెత్తాడు. ఓ దినపత్రిక కార్యాలయానికి వెళ్లి సంపాదకుడిని కలిశాడు.

"నాలో రక్తం లేదు. పాత్రికేయమే ప్రవహిస్తోంది. నరనరానా అక్షర కణాలు అగ్ని విస్ఫోటనాలై ప్రజ్వరిల్లుతున్నాయి" అన్నాడు.

ఆయన ఎగాదిగా చూసి, "కణాలు విస్ఫోటనాలవుతున్నాయా? క్యాన్సరేమో చూపించుకో నాయనా!" అని పంపేశాడు.

ఇది కాదు పనని బస్తాడు కాగితాలు తెచ్చుకుని దినపత్రికలకు దరఖాస్తులు పంపాడు. చాలా మంది చురుకైన సంపాదకులు ప్రమాదాన్ని శంకించి, ఉండ చుట్టి చెత్తబుట్టలో పడేయడం వల్ల బతికిపోయారు. కొంత మంది పాపం పూర్తిగా చదివి అస్వస్థతకు గురయ్యారు. అనుకున్నది అందక తిక్కరేగిన అప్పారావు, ఇంట్లో దినపత్రికలన్నీ చింపి పడవలు చేస్తుండటంతో నాన్న భరించలేక తనకు తెలిసున్న సంపాదకుడికి సిఫార్సులేఖ రాశాడు. "వాడిని ఎక్కడో అక్కడ కూర్చోబెట్టండి. ఏదో ఒకటి రాయనివ్వండి. వేస్తే వేయండి, లేకపోతే లేదు. నేను నెలనెలా కొంత మొత్తం పంపుతాను. దాన్నే జీతంగా ఇవ్వండి" అంటూ ఏకరువు పెట్టుకున్నాడు. మర్నాడు ఆ పత్రిక కార్యాలయం నుంచి ఉత్తరం వస్తే అప్పారావు అశ్వనీ నాచప్పలా పరుగెత్తుకుంటూ వెళ్లి సంపాదకుడితో, "నాలోని ప్రతిభను చూసి ఉద్యోగం ఇచ్చారని భావిస్తున్నాను. మీరు ఏకీభవిస్తున్నారా?" అని అడిగాడు. ఆయన మౌనంగా తలూపి ఓ కుర్చీ చూపించాడు. వారం రోజులైనా ఏ పనీ చెప్పకపోయేసరికి అప్పారావుకి విసుగొచ్చింది. "మీరు నాలోని విలేకరిని చంపేస్తున్నారు. తృష్ణని చిదిమేస్తున్నారు. ఆకాంక్షను అదిమేస్తున్నారు. ఎక్కడికైనా పంపండి" అన్నాడు.

సంపాదకుడు కాసేపు ఆలోచించి, "సరే. ఓ సినీ నటి నగల దుకాణం ప్రారంభోత్సవానికి వస్తోంది. వెళ్లిరా" అన్నాడు.

అప్పారావు దూసుకుపోయాడు. అభిమానుల మధ్య నుంచి తోసుకుంటూ సినీతారను సమీపించి "ఇంకా చేయడం లేదేం? గబగబా చేయండి" అన్నాడు.

ఆ తార తెల్లబోయి, "ఏంటి చేసేది?" అంది.

"అదే... సందడి!"

"అంటే?"

"అంటే ఏంటేంటి? మీరు వచ్చి సందడి చేశారని పత్రికల్లో రాస్తుంటారు. నాకు తెలియదనుకున్నారా? ఆ సందడేదో చేయండి. మీరు ఎలా సందడి చేశారో చూసి చక్కగా రాస్తా. ఇంతకీ మీరు అందరు తారలు చేసే సందడే చేస్తారా? లేక కొత్త సందడేమైనా చేస్తారా?" అన్నాడు అప్పారావు.

ఆ తారకు తారలు కనిపించాయి.

తిరిగొచ్చిన అప్పారావు, 'ఆ తార నగల దుకాణంలో ఎలాంటి సందడీ చేయలేదు. కేవలం ప్రారంభోత్సవం చేసింది' అని రాశాడు. కానీ మర్నాడు పత్రికలో ఆ వార్త రాలేదు. మరో విలేకరి రాసిన వార్తలో సందడి చేసినట్టు వచ్చింది.

"ఇది అన్యాయం. అవాస్తవ పాత్రికేయం. అసలామె సందడి చేయందే?" అంటూ అప్పారావు ఎంత వాదించినా అందరూ నవ్వారే తప్ప జవాబివ్వలేదు.

మరోసారి అప్పారావు ఓ రాజకీయ నాయకుడు పెట్టిన విలేకరుల సమావేశానికి వెళ్లాడు. ఆ రోజే జరిగిన అగ్నిప్రమాదం గురించి ఆయన మాట్లాడాడు. తిరిగొచ్చాక అప్పారావు, 'అగ్నిప్రమాదానికి ఆయన దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. అయితే దిగ్భ్రాంతికి గురైన వారెవరూ కారులో విలేకరుల సమావేశానికి వచ్చి మాట్లాడలేరు. అలాగే జరిగిన దానికి ఎంతో విచారిస్తున్నానన్నారు. కానీ ఏడ్చిన దాఖలాలేవీ కనిపించలేదు. ఇదిలా ఉండగా, ఆయన బుగ్గలపై కన్నీటి చారికలు లేవు సరికదా, మధ్యలో నవ్వారు కూడా' అని రాశాడు. సంపాదకుడు పిలిచి ఇదేంటన్నాడు.

"వాస్తవ పాత్రికేయం" అన్నాడు అప్పా

రావు. వెంటనే ఆయన దిగ్భ్రాంతికి గురయ్యాడు!

ఓసారి అప్పారావు టీవీలో వార్తలు చదువుతున్న ఓ మెరుపుతీగను చూశాడు. చూస్తూనే ప్రేమలో పడిపోయాడు. వెంటనే ఉత్తరం రాశాడు. 'తొలి చూపులోనే నాకు నీ మీద ప్రేమ కలిగిందని నేను భావిస్తున్నానంటే నువ్వు ఆనందిస్తావని నొక్కివక్కాణిస్తున్నాను. అందుకే నా ప్రేమను పునరుద్ఘాటిస్తున్నాను. కాగా, ఇది కేవలం కాలక్షేపం ప్రేమ కాదని, ప్రత్యక్షర సత్యమని నిండు మనసుతో ప్రకటిస్తున్నాను. ఇదిలా ఉండగా, మనం పెళ్లి చేసుకుంటే పాత్రికేయంలో రెండు పార్శ్వాలు ఏకమవుతాయని మనవి చేసుకుంటున్నాను. ఆ విధంగా ముద్రణ మాధ్యమం, దృశ్య మాధ్యమం మమేకమై పరిఢవిల్లుతాయని నేనంటే నువ్వు కాదనవనే నమ్మకం నాకు ఉందని నీకు మరోసారి ధ్రువీకరించనక్కర్లేదని అనుకుంటున్నాను. నీ అంగీకారాన్ని స్వయంగా కానీ, పత్రికాముఖంగా కానీ, తెలియజేస్తే నా అంత అదృష్టవంతుడు మరెవరూ ఉండరని భావిస్తాను'. దానికి తన ఫొటో కూడా జత చేశాడు.

ఆ ఉత్తరానికి ఆ అమ్మాయి జవాబు ఇచ్చింది. 'మీకు నామీద ఉన్న ప్రేమను నేను పూర్తిగా విశ్వసిస్తున్నానని చెప్పడం అతిశయోక్తి కాదు. అంతకు పదింతల ప్రేమ నాకూ మీ మీద కలిగిందని చెప్పడానికి ఏమాత్రం సంశయించనవసరం లేదని నేను భావిస్తున్నానంటే మీరెంత ఆనందిస్తారో నాకు తెలియనిది కాదు. మీరు చెప్పినట్టు మనిద్దరం ఏకమైతే, రెండు మాధ్యమాల మధ్య ప్రేమ బంధం, మూడు ముళ్లతో ముడిపడి, నాలుగు కాలాల పాటు చల్లగా, పంచ భూతాల సాక్షిగా, ఆరు రుతువుల్లోనూ పచ్చగా ఉండేలా, మీతో ఏడడుగులు నడవడానికి అష్టకష్టాలైనా పడతానని, నవగ్రహాలను ఎదిరించైనా, పది మంది ముందు పెళ్లి చేసుకోడానికి వెంటనే నడిచి వస్తానని చెప్పకనే చెబుతున్నాను.'

అప్పారావు ఉత్తరాన్ని ఆ అమ్మాయి తన తల్లిదండ్రులకు, ఆ అమ్మాయి ఉత్తరాన్ని అప్పారావు తన తల్లిదండ్రులకు చూపించారు. ఇరువైపుల పెద్దలు కలుసుకున్నారు.

అమ్మాయి తండ్రి గద్గద స్వరంతో, "అసలు మా అమ్మాయికి పెళ్లవుతుందని అనుకోలేదండి. ఆ టీవీ యజమాని స్నేహితుడే కావడంతో రాసిచ్చినవి మాత్రమే చదవాలనే షరతు మీద ఉద్యోగమిచ్చాడు" అన్నాడు.

అప్పారావు తండ్రి ఆయన్ని ఓదార్చి, "అసలు వీళ్లకి ఈ తెలుగెలా వంటబట్టిందో తెలియడం లేదండి. వీడికెలా పెళ్లవుతుందని మేమూ బెంగ పెట్టుకుంటే మీ అమ్మాయి తారసపడింది" అన్నాడు.

"పోన్లెండి. దొందు దొందే. పెళ్లయ్యాక ఇద్దరూ మారతారేమో. ఒకవేళ మారకపోయినా వాళ్లలో వాళ్లు మాట్లాడుకుంటారు కాబట్టి మనకేక చింతలేదు" అని ఇద్దరి పెద్దలు నవ్వుకుని తాంబూలాలు పుచ్చేసుకున్నారు.

పెళ్లయ్యాక అప్పారావు దంపతుల చేత వేరు కాపురం పెట్టించారు. ఆరునెలలకి అప్పారావు మామగారికి ఉత్తరం రాశాడు.

'దైవ స్వరూపులైన మామగారి సముఖానికి! అల్లుడు అప్పారావు వ్రాయునది. నా భార్య అయిన మీ అమ్మాయి నెలతప్పిందని అభిజ్ఞవర్గాల భోగట్టా. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఆమెకు రెండో నెలని తెలియవచ్చింది. అయితే ఈ విషయం ఇంకా నిర్ధరణ కావలసి ఉంది. వాస్తవాలు వెలికి వచ్చేంత వరకు ఎవరికీ చెప్పవద్దని వైద్యులు హెచ్చరించినా, మీ అమ్మాయి పట్టుబట్టడం వల్ల మీకు ఉత్తరం రాస్తున్నాను. ఈ విషయంలో నా ప్రమేయం ఏమీ లేదని తెలుసుకోగలరు'

ఆయన గుండెలు బాదుకుంటూ వియ్యంకుడి ఇంటికి పరిగెత్తుకొచ్చాడు. ఆ ఉత్తరంలో ఆఖరి వాక్యం చూపించి లబోదిబోమన్నాడు.

"మీరేం కంగారు పడకండి. అంటే మా వాడి ఉద్దేశం ఈ శుభవార్తను ముందుగానే చెప్పడంలో తన ప్రమేయం లేదని మాత్రమే. వాడి తెలుగిలా అఘోరించింది." అని సముదాయించాడు.

తేరుకున్నాక వియ్యంకులిద్దరూ గట్టి నిర్ణయానికి వచ్చారు. పుట్టిన మనవడిని కానీ, మనవరాలిని కానీ టీవీ లేని ఇంట్లో పెంచాలనీ! వార్తల ప్రపంచానికి దూరంగా ఉంచాలనీ!

సీనియర్ చీఫ్ సబ్‌ఎడిటర్,
ఈనాడు, హైదరాబాద్
80080 00475

పువ్వు లాలి పోయింది

ఆదివారం
మా యింతి ముందు పూల తొట్టిలో
ఒక మొక్క నాతాను.
సోమవారం, మొక్క నీలచంగా ఉంది,
మంగలవారం నితాలుగ నిలబలింది,
గులువారం మొగ్గ తొలిగింది,
చుక్లవారం పువ్వు పూతింది,
చెనివారం పువ్వు యిత్తుకుంది
నాకు బలే బలే బాగుంది.
అమ్మమ్మ దగ్గల కెల్లాను, తెబుదామని,
కానీ నిద్దల పోతంది.
పువ్వు పెద్దగా అయింది
అమ్మమ్మ పెద్ద నిద్దల పోయింది.
పువ్వు వాలిపోయి, లాలిపోయింది.
నాకు ఏలుపొచ్చింది.

– కనగాల జయకుమార్, గుంటూరు, 93913 85178

పద పంచాయతీ

'తెలుగు వెలుగు' యజ్ఞంలో భాగంగా జన వ్యవహారంలోని ఆంగ్లశబ్దాలకు మంచి తెలుగు మాటలను సమకూర్చే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాషాభిమానులందరూ భాగస్వాములు కావాలన్నదే మా ఆకాంక్ష, విన్నపం.

సరైన తెలుగు సమానార్థకాలు లేక ఎన్నో ఆంగ్ల శబ్దాలను యథాతథంగా వాడాల్సిన దుస్థితి. దీన్ని సరిదిద్దడంలో మీ అందరి పాత్ర కీలకం. తరచూ ప్రసార సాధనాల్లో వస్తున్న పదాలను ఇక్కడ ఇస్తున్నాం. ఇవే కాదు... మీ దృష్టిలో ఉన్న ఇతర ఆంగ్ల పదాలకూ తెలుగు సమానార్థకాలను పంపవచ్చు.

మీ సౌకర్యం కోసం వాటికి నిఘంటువుల్లోని సమానార్థకాలను, అర్థవివరణలను జోడించాం. చక్కని ప్రత్యామ్నాయ తెలుగు పదాల్ని సూచించండి. పక్కన పద వివరణ కూడా రాస్తే ఎంపికకు తేలిగ్గా ఉంటుంది. ఒకప్పుడు వాడుకలో ఉండి ఇప్పుడు వినిపించని మంచి తెలుగు మాటలైనా కావచ్చు. తెలుగులో స్థిరపడిపోయిన అన్యదేశ్యాలైనా కావచ్చు. మీరు కసరత్తు చేసి సృష్టించిన కొత్త పదాలైనా కావచ్చు. ఏదైనా పదం వీనులవిందుగా ఉండాలి. తేలిగ్గా పలకగలగాలి. మూలశబ్దం స్ఫూర్తి ప్రతిఫలించాలి. మన నుడికారం వినిపించాలి. మక్కీకి మక్కీ అనువాదం కూడదు. కఠిన సంస్కృత శబ్దాలు సామాన్య జనంలోకి త్వరగా చొచ్చుకుపోలేవు. అందువల్ల తేటతెలుగు మాటలే పంపండి.

ఇతర ద్రావిడ భాషల్లోని సమానార్థకాలకు కొద్దిపాటి మార్పులతో తెలుగుదనాన్ని తేగలిగినా మంచి ప్రయత్నమే అవుతుంది. మీ పదాలను తెలుగు వెలుగు, రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్- 501512 చిరునామాకు పంపవచ్చు. లేదా teluguvelugu@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

- **Academy:** A school for special instruction; A society of learned persons organized to advance art, science, or literature. ఏదైనా కళను, శాస్త్రాన్ని అభివృద్ధి చేయుటకు, వాటిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చుటకు ఏర్పడిన కేంద్రం; పరిషత్తు, ప్రత్యేక శిక్షణాకేంద్రం
- **Antiseptic:** Capable of preventing infection by inhibiting the growth of microorganisms. చెడిపోకుండా, కుళ్ళిపోకుండా కాపాడే మందు
- **Board:** An organized body of administrators or investigators ఏదైనా ఒక ప్రత్యేక విషయంపై చర్చించే సభ, ఆలోచన సభ, మండలి, సంఘం, సమితి
- **Bonus:** Something given or paid in addition to what is usual or expected మామూలు రాబడిపై అదనంగా లభించేది
- **Chairman:** The presiding officer of an assembly, meeting, committee, or board. అధ్యక్షుడు
- **Commissioner:** A person authorized by a commission to perform certain duties. అధికారి
- **Demand:** To ask for urgently or peremptorily తీవ్రంగా అడుగుట
- **Director:** That supervises, controls, or manages. నిర్దేశకుడు, విధాయకుడు, ఏలేవాడు, సంచాలకుడు, సూత్రధారి
- **Designer:** One that produces designs; Bearing the name, signature, or identifying pattern of a specific designer. ఆకృతికర్త, నమూనా కర్త, యోచించేవాడు
- **Elevation:** The act or an instance of elevating; The condition of being elevated. ఎత్తు పెంచుట, ఉన్నతత్వం పొందుట
- **Evacuation:** The act of evacuating; leaving a place in an orderly fashion; especially for protection ఖాళీ చేయుట, చేయించుట; నిష్క్రమణ
- **Fresher:** Social Science / Education) a first-year student at college or university ఒక కళాశాలలో గాని, విశ్వవిద్యాలయంలో గాని మొదటి ఏడాది చదివే విద్యార్థి
- **Fitness:** Good health or physical condition, especially as the result of exercise and proper nutrition. శారీరక దృఢత్వం
- **Get together:** Assemble: get people together; "assemble your colleagues"; "get together all those who are interested in the project" అంతా ఒక చోట గుమిగూడుట
- **Grand master:** The title grandmaster is awarded to strong chess players by the world chess organization FIDE. Apart from World Champion, Grandmaster is the highest title a chess player can attain. Once achieved, the title is held for life. చదరంగంలో అత్యంత నిపుణత చూపిన ఆటగాడికి ప్రపంచ చదరంగ సమాఖ్య అందజేసే బిరుదం. ఒకసారి పొందిన ఆటగాడు జీవితాంతం ఈ బిరుదం నిలుపుకుంటాడు.
- **Hardcopy:** A hard copy is a permanent reproduction, or copy, in the form of a physical object, of any media suitable for direct use by a person (in particular paper), of displayed or transmitted data. ముద్రితప్రతి
- **Helpline:** A staffed phone service that provides

information, advice or support. సామాన్యులకు ఏ విషయంలోనైనా సలహా సమాచారాలూ, మరే ఇతర సాయాలైనా అందించటానికి నిత్యం అందుబాటులో ఉండే ఫోన్ సర్వీసు; సహాయకకేంద్రం

- **Hall ticket:** A Hall Ticket is an examination registration and entry card issued to a student. పరీక్ష రాయుటకు పరీక్షాకేంద్రంలోనికి అనుమతించు పత్రం; ప్రవేశపత్రం
- **Incentive:** A thing that motivates or encourages one to do something. ప్రోత్సాహక వేతనం
- **Immigrant:** A person who leaves one country to settle permanently in another. స్వదేశం విడిచి వేరే దేశంలో శాశ్వతంగా స్థిరపడుటకు వలస వెళ్లినవాడు; వలసదారు
- **Intelligence:** Secret information, especially about an actual or potential enemy; An agency, staff, or office employed in gathering such information; Espionage agents, organizations, and activities considered as a groupదేశ భద్రత కోసం గుప్త సమాచారాన్ని సేకరించే, నియంత్రించే సంస్థ
- **Jumbling:** Mix up in a confused or untidy way కలగాపులగం; ఎక్కడ చదివే విద్యార్థులు అక్కడే పరీక్ష రాయకుండా, కలగాపులగంగా పరీక్ష కేంద్రాల్ని నిర్ధరించే పద్ధతి
- **Keyboard:** A set of keys, as on a computer terminal, word processor, typewriter, or piano
- **Leak:** To escape or pass through a breach or flaw కంతలోంచో, పగులు లోంచో జారిపోవు; పరీక్షాపత్రాలు అనుమతి లేకుండా బయటకు వెలువడుట
- **Lunch:** A meal eaten at midday. మధ్యాహ్నం తీసుకునే భోజనం
- **Manpower:** Power in terms of the workers available to a particular group or required for a particular task. అంగబలం, మనుష్యబలం
- **Marketing:** The commercial functions involved in transferring goods from producer to consumer. ఉత్పత్తిదారుని నుంచి వినియోగదారుని దాకా ఉత్పత్తుల్ని చేరవేయుటకు పని చేసే వ్యవస్థ
- **Nail polish:** A clear or colored cosmetic lacquer applied to the fingernails or toenails. గోళ్లకు వేసుకునే రంగు
- **Online password:** A secret word or phrase that must be used to gain admission to something in online. అంతర్జాలంలో ఏదైనా వెబ్‌సైట్‌లోకి మనకే ప్రత్యేకమైన అనుమతి కోసం వాడుకునే గుప్త సంకేతపదం
- **Open market:** An unrestricted market with free access by and competition of buyers and sellers. ప్రభుత్వ నియంత్రణ లేని స్వేచ్ఛా విపణి వ్యవస్థ, బహిరంగ అంగడి
- **Opencast:** (Of mines and mining) worked from the exposed surface భూమి పైభాగాన్ని తవ్వి తీసుకునే గనులు
- **Package:** An offer composed of several items, each of which must be accepted.
- **Paragraph:** A distinct division of written or printed matter that begins on a new, usually indented line. ఒకే విషయాన్ని, భావాన్ని వ్యక్తీకరించు వాక్యాల గుంపు
- **Petition:** A formal written request, typically one signed by many people, appealing to authority with respect to a particular cause. మనవి, మొర, ఫిర్యాదు
- **Plastic surgery:** The process of reconstructing or repairing parts of the body, esp. by the transfer of tissue. శరీర భాగాల్ని శస్త్ర చికిత్స ద్వారా మెరుగు పర్చుకునే ప్రక్రియ, విరూప సవరణ శస్త్రచికిత్స
- **Quarantine:** (a.) A period of time during which a vehicle, person, or material suspected of carrying a contagious disease is detained at a port of entry under enforced isolation to prevent disease from entering a country; (b.) A place for such detention. వ్యక్తి ద్వారా గాని, జంతువుల ద్వారా గాని, మరే ఇతర పదార్థాల ద్వారాగాని ఏదైనా అంటురోగం మరో ప్రదేశంలో చొరబడుతుందని అనుమానం కలిగినపుడు దాన్ని ఆ ప్రదేశ సరిహద్దుల వద్దే నిర్ధరణ అయ్యే వరకూ నిలుపుతారు. కంప్యూటర్‌లో ఈ ప్రక్రియను వైరస్ నియంత్రణకు వాడతారు.
- **Quiz:** an entertainment in which the general or specific knowledge of the players is tested by a series of questions, esp as a radio or television programme ప్రశ్నలూ సమాధానాల కార్యక్రమం
- **Readymade:** Already made, prepared, or available ముందే సిద్ధమైంది
- **Reception:** The act or process of receiving or of being received; A social function, especially one intended to provide a welcome or greeting ఎవరికైనా ఆహ్వానం పలికేందుకు, లేదా శుభాకాంక్షలు తెలుపుటకు ఏర్పాటైన వేడుక
- **Senior:** Of or being the older of two, especially the older of two persons having the same name, as father and son. అనుభజ్ఞుడు, పెద్దవాడు, జ్యేష్ఠత్వం
- **Speculation:** Reasoning based on inconclusive evidence; conjecture or supposition. యోచన, ఊహాకల్పన
- **Stock market:** The business transacted at a stock exchange.
- **Tariff:** A list or system of duties imposed by a government on imported or exported goods; any schedule of prices, fees, fares, etc.ధరల జాబితా, శుల్కపట్టిక
- **Township:** Planned urban settlement స్వయంసమృద్ధమైన పట్టణ ఆవాసాల గుంపు
- **Venture:** A business enterprise involving some risk in expectation of gain. ఏదైనా కొత్త కార్యాన్ని తలెత్తుకోవడం
- **Vibrant:** Pulsing or throbbing with energy or activity; Vigorous, lively, and vital. కంపించే వణికే, సచేతన
- **Warrant:** A judicial writ authorizing an officer to make a search, seizure, or arrest or to execute a judgement. శోధించుటకు, ఆధీన పరుచుకొనుటకు, లేదా అరెస్టు చేయుటకు ఒక అధికారికి న్యాయవ్యవస్థ నుంచి అందే అనుమతి పత్రం.
- **White-collar:** Of or relating to workers whose work usually does not involve manual labor and who are often expected to dress with a degree of formality. శారీరక శ్రమ అవసరం లేని ఉద్యోగాలను, ఆ ఉద్యోగులను గూర్చి వాడే పదం.

'ఎంత గొప్పది బతుకు మీది ఆశ...
అది భూమి పైన దేవుడి శ్వాస!'
– ఎంత లోతైన జీవిత సత్యం! ఎంత తేలికైన పదవిన్యాసం! ఇలాంటి ఎన్నో అద్భుత భావాలకు అలతి అలతి పదాలతో జీవం పోసి, అఖిలాంధ్ర ప్రజానీకం హృదయాలకు హత్తుకునేలా చేసిన ఓ కలం... కాలం చేసిన మాయాజాలంలో అలసిపోయింది!
'ఓ విధీ!
విచిత్రాల నిధీ!
ఆశనిరాశల వారధీ...'
–అంటూ నిట్టూర్చి, తెలుగు సాహిత్య పథంలో సుమనోహర ప్రయాణాన్ని అర్థంతరంగా ముగించింది!
ఆ కలం సుమన్‌ది!

కథకుడు
నవలాకారుడు
కవి, చిత్రకారుడు
నటుడు, దర్శకుడు

సరస్వతికి సుమనస్సులు

అది 1995వ సంవత్సరం ఆగస్టు 27. తెలుగు ప్రేక్షకుల కలలు సాకారమైన రోజు. అచ్చమైన తొలి తెలుగు శాటిలైట్ ఛానల్‌గా 'ఈటీవీ' ఆకాశ సంరంభం ఆరంభమైన రోజు. ఆ రోజు ముందుగా ప్రసారమైంది అప్పటి భారత ప్రధాని పి.వి.నరసింహారావుతో సుమన్ చేసిన ముఖాముఖి. ఎలాంటి అదురుబెదురు లేకుండా తేనెలొలికే తెలుగుదనంతో, సుమనోహర రూపంతో, పసితనపు చిరునవ్వుతో దర్శనమిచ్చారు. అలా ఈటీవీ ప్రసారాలు ప్రారంభమైన తొలిరోజే అఖిలాంధ్ర ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

అప్పటి నుంచి ఈటీవీని 'క్షణక్షణం ఆనంద వీక్షణం'లా మార్చేందుకు ఆయన కృషి మరువలేనిది. ఒకవైపు ఈటీవీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు కమనీయ ధారావాహికలను రచించడం ఒక్క సుమన్‌కే సాధ్యం.

ఈనాడు రామోజీరావు కుమారుడిగా పరిచయమై, ఈటీవీ సుమన్‌గా చిరపరిచితమై, సుస్థిరమైన స్థానాన్ని అనతి కాలంలోనే అందుకున్న ఓ మనసున్న రచయిత ఆయన! ఓ నవలాకారుడిగా, ఓ కథకుడిగా, ఓ రచయితగా, ఓ కవిగా, ఓ చిత్రకారుడిగా, ఓ నటుడిగా, ఓ దార్శనికుడిగా బహుముఖమైన ప్రజ్ఞను ఆవిష్కరించిన సుమన్ గురించి తెలుగు ప్రజానీకానికి కొత్తగా చెప్పక్కర్లేదు!

- ఆయన లేరన్న నిజం తెలిసి చెమర్చిన కళ్లకు తెలుసు. స్పందించిన హృదయాలకు తెలుసు. తల్లడిల్లిన తల్లులకు తెలుసు. బాధపడిన మనసులకు తెలుసు. ఆయన కలం సృష్టించిన కలకలం ఎంతటిదో!

దక్షిణ భారత టీవీ చరిత్రలోనే ధారావాహికలకు తొలిసారిగా 'టైటిల్ సాంగ్స్'ను ప్రవేశపెట్టి, ఆ పాటల్లో అంత్యప్రాసలకు సొగసులద్ది, జీవిత సత్యాలకు చిత్రిక పట్టి, ఇంటింటా అలవోకగా పాడుకునేలా చేసిన ఆయన కలం... రెండు దశాబ్దాల పాటు తెలుగు ప్రేక్షకులను అలరించిందనడం అతిశయోక్తి కాదుకదా, వినమ్ర సత్యం!

'లేడీ డిటెక్టివ్... అమ్మో యమా యాక్టివ్' లాంటి సరదా పాటలే కాదు, 'అంతరంగాల్ని' ఆవిష్కరించే మాటల విశ్లేషణలు కూడా 'ఈటీవీ' కార్యక్రమాల 'రేటింగ్స్' సాక్షిగా ప్రేక్షకాదరణకు గీటురాళ్లు!

అలా వాణిజ్య వినీలాకాశంలో విలాసంగా అలరారిన ఆ కలమే, ఆధ్యాత్మికభావజాలంలో తడిసిముద్దయి 'ఎన్ని జన్మల పుణ్యఫలమిది... నా పదముల నిలిచెను నీ పదముల సన్నిధి!' అంటూ 'శ్రీహరి స్వరాల'ను పలికించి ఇంటింటా అలరించింది!

1966 డిసెంబరు 23 (ముక్కోటి ఏకాదశి రోజున) తేదీన రమాదేవి, రామోజీరావు దంపతులకు రెండో కుమారుడిగా జన్మించిన సుమన్, అభిరుచికి కృషిని అద్దితే ఏ కళలోనైనా అందలాన్ని అందుకోవచ్చునే నిజానికి నిలువెత్తు నిదర్శనంగా ఎదిగారు. చిన్నప్పటి నుంచే తెలుగు భాషంటే ఇష్టం పెంచుకుని, నిరంతర ప్రయత్నంతో రాటుదేలిన రచయితగా రాణించారు. కథా, కథన రంగాల్లో కదనుతొక్కిన ఆయనలోని కథకుడికి చిన్నప్పుడే బీజం పడిందనడానికి జవహర్ బాల భవన్‌లో అందుకున్న బహుమతే గుర్తు. ఓ ఇంటర్వ్యూలో ఆయనే చెప్పిన సంగతిది. టీచర్ చెప్పిన కథనే మొదలుపెట్టినా, మధ్యలో ఏవేవో పాత్రలతో, సంభాషణలతో, మలుపులతో దాన్ని మార్చేసి ఆ టీచర్ మెప్పునే పొందిన సంఘటన బాల్యంలోనే మొగ్గ తొడిగిన ఊహాశక్తికి ఆనవాలు. అందుకే స్కూల్లో చదివే రోజుల్లోనే నాటకాలు రాయగలిగారు.

తెలుగుపై మక్కువను ఎక్కువ చేసుకోడానికి ప్రముఖ సాహితీ దిగ్గజం కొండవీటి వేంకట కవి దగ్గర శిష్యరికం చేసి, ఆంధ్ర, సంస్కృత భాషల్లో పట్టు సాధించారు. సాహిత్యాన్ని అభ్యసించారు. వ్యాకరణంలో మెలకువలు నేర్చుకున్నారు. ఆ తర్వాతే కాగితంపై కలం పెట్టి అక్షర సేద్యంలో సుమనోహర భావాల పంట పండించారు.

'రచయిత డి.వి. నరసరాజుగారి ప్రోత్సాహం వల్లనే రచయితనయ్యాను' అని చెప్పే సుమన్, ఆయనతో పంచుకునే భావాలకు అక్షరరూపం ఇస్తే అదే 'అమెరికా అదుర్‌ష్టం' నవలగా 1994లో విడుదలైంది. చిన్న చిన్న వాక్యాలతో హాస్యరసాన్ని చిలికించే సుమన్ ఆ నవలలో నూకాలు, శోకాలు లాంటి పాత్రలతో పాఠకులను ఆద్యంతం నవ్వించారు. అలాగే 'పశుమర్తి వారి వంశంలో శిశుమూర్తి చెడబుట్టాడు...' అనే తొలి వాక్యం నుంచి, 'చీపురేవ జయతే' అనే అట్టచివరి చమత్కారం వరకు సుమన్ కలం ఎలా అలరించిందో "సభ్య'సమాజం" నవల చదివిన పాఠకులకు చిరపరిచితమే. 'వసుంధర' మకుటంతో ఈటీవీలో ప్రసారమైన కథలు మహిళాలోకానికి నీరాజనాలు పట్టాయి. సహజ, స్వేచ్ఛ, ప్రతిభ, ఓ అమ్మకథ, సుధామయి, అడవిమల్లి, అమ్మకాని(కో) అమ్మ, చిన్ని తల్లి, సంధ్య కథలను స్క్రీన్‌ప్లే రూపంలో ప్రచురించి ఎందరో ఔత్సాహిక రచయితలకు స్ఫూర్తినిచ్చారు సుమన్. 'కథ చదివి, ముగించిన కాసేపటి వరకూ కంటి చెమ్మ, గుండె తడి ఆరకపోతే అది నిర్ద్వంద్వంగా మంచి కథ అని నమ్మే వ్యక్తిని నేను. ఈ కథలన్నీ నాకా అనుభూతిని కలిగించాయి' అంటూ ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత జంధ్యాల మెచ్చుకున్నారంటే 'వసుంధర' ధారావాహికలు వీక్షకులపై ఎలాటి ముద్ర వేశాయో వేరే చెప్పనక్కర్లేదు. వీటితో పాటు సుమన్ 'ఈనాడు' దినపత్రికలో వ్యాసాలు, కథనాలు, వ్యాఖ్యానాలు రాస్తూ సాహితీ రంగంలోనూ తనదైన ముద్ర వేసుకున్నారు.

- తెలుగు టెలివిజన్ రంగ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అత్యుత్తమ ధారావాహిక 'అంతరంగాలు' సుమన్ కలం నుంచి జాలువారిందే.
- అన్నా చెల్లెళ్ల అనుబంధానికి దర్పణం పట్టిన 'అనుబంధం', రకరకాల ట్రిక్కులతో మాయగాళ్ల తిక్కకుదిర్చిన 'స్నేహ'
- కళను నమ్ముకుని కళంకితురాలిగా మిగిలిన ఓ స్త్రీమూర్తి వ్యథాభరిత గాథ 'కళంకిత'
- మమతకు సరికొత్త భాష్యం చెప్పిన 'మౌనరాగాలు'
- శోధన పాత్ర చేసిన వైవిధ్యభరితమైన పరిశోధనల 'లేడీ డిటెక్టివ్'
- మనసులోని భావాలను స్పష్టం చేస్తూ, సుప్రతీక పాత్ర ద్వారా రూపుదిద్దుకున్న ధారావాహిక 'ఎండమావులు'
- జీవితాన్ని విభిన్న కోణాల్లో అద్భుతంగా ఆవిష్కరించిన 'జీవితం'.
- మనసులో పెల్లుబికే లావాలాంటి భావాల పరంపర 'అగ్నిగుండం'
- కష్టసుఖాల కావడిని మోసే అపురూప ధారావాహిక 'సుఖదుఃఖాలు'
- మనుషుల విలాపాలని తన విలాసాలుగా మార్చుకునే 'విధి'
- చదరంగం, పద్మవ్యూహం, కథాసుధ... ఒకటేమిటి ఇలా లెక్కకు మిక్కిలి ధారావాహికలకి రచన చేసి ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న బుల్లితెర రచయిత సుమన్.

ఫొటోలు: ఎ.జి.టి.రాజు

తను సృష్టించే పాత్రలు ఎలాంటి భాష, యాసలతో సంభాషించాలనేది ఒక టేప్ రికార్డరులో రికార్డు చేసి నటీనటులకు వినిపింపజేసేవారు సుమన్. తద్వారా వారి నుంచి తనకు కావలసిన పద్ధతిలో నటనను రాబట్టుకోవడంలో ఆయన తర్వాతే ఎవ రైనా. ఏ మాత్రం రాజీపడని ధోరణి ఆయనది. నైపుణ్యం కోసం పరితపించే సుమన్ ఏ సన్నివేశమైనా అనుకున్నట్లు రాకపోతే మళ్లీ తీసిన సందర్భాలెన్నో.

ప్రేక్షకుల నాడిని పసిగట్టి లలితమైన పదాలతో సంభాషణలు రాయడం ఆయనకు కలంతో పెట్టిన విద్య. మనసుకు హత్తుకునేలా కథనాన్ని చెప్పడం సుమన్‌కి ఉన్న అదనపు మేధాశక్తి. అబ్బురపడేలా కలంతోపాటు కుంచె కదలడం, ముగ్ధమనోహర మైన బొమ్మలు రూపొందించడం ఒక్క సుమన్‌కే చెల్లు. రచనా ప్రక్రియల్లోని అన్ని విభాగాల్లోనూ, విషయాల్లోనూ అపారమైన ప్రతిభ ఉండటం నిజంగా సరస్వతీ కటా క్షమే. టీవీ సీరియల్స్‌కి చలన చిత్రస్థాయిలో గౌరవ ప్రతిష్ఠల్ని తీసుకొచ్చిన ఖ్యాతి ఈటీవీ ద్వారా సుమన్‌కి దక్కుతుంది. సినిమాకే పరిమితమైన భారీసెట్లు, పాటలు, వాటి చిత్రీకరణ, ఆడియో క్యాసెట్ల విడుదల, ప్రచార సరళి వంటివి బుల్లితెర ద్వారా ప్రేక్షకులకి అందించిన ఘనత కచ్చితంగా ఆయనదే. నీలమేఘశ్యాముడిని ఎంతో భక్తిశ్రద్ధలతో ఆరాధించే సుమన్, శ్రీకృష్ణ దివ్యలీలామృత గాథల్ని 'శ్రీభాగవతం'గా తెర కెక్కించడంలో తెరవెనుక ఎనలేని కృషి చేశారు. బాపురమణలతో గంటల తరబడి స్క్రిప్టు చర్చల్లో పాల్గొనటం, సహకరించడం పౌరాణికాల్లో ఆయనకున్న అభినివేశానికి నిదర్శనం.

అలతి పదాలతో శ్రీహరికి సుమన్ చేసిన గీతార్చన 'శ్రీహరి స్వరాలు' శ్రోతలకు మధురానుభూతిని పంచాయి.

'సుమనోహరుడని.. సుమనస్కుడని...' అంటూ శ్రీనివాసుడి మీద తొలిపాట రాసి, అక్కడ నుంచి ఏకబిగిన 500 పాటలు (2005 వరకు) రాయడం సుమన్ మేధా సంపత్తికి నిదర్శనం. అప్పటికప్పుడు చక్కటి తెలుగు నుడికారాలతో, అంత్యప్రాసలతో ఆయన పాటలు రాయడం నాకళ్లకు సుపరిచితం.

పౌరాణికాలను విపరీతంగా ప్రేమించే సుమన్ శ్రీకృష్ణుడిగా నటించి, రచించి, దర్శ కత్వ పర్యవేక్షణ చేసిన శ్రీకృష్ణబలరామ యుద్ధం, ఉషాపరిణయం.. మచ్చుకు 'మెచ్చు'తునకలు.

ధారావాహికలకు ఆయన రాసిన పాటల్లో ప్రతీదీ ఓ రసగుళికే.

- 'ఈ జీవితం సుఖదుఃఖాల వైకుంఠపాళి... అనునిత్యం ఆశనిరాశల అనంతకేళి' అని జీవితాన్ని అద్భుతంగా ఆవిష్కరించినా,

- 'గుండెకీ సవ్వెడెందుకో - పెదవులకీ వణుకెందుకో' అంటూ యువ హృదయా లకు గిలిగింతలు పెట్టినా,

- 'ఓ కళంకిత... కళలకే అంకితా...!' అంటూ కన్నీటి గీతానికి అక్షరాలు దిద్దినా,

- 'ఎండమావులే నీ గుండెలోని ఆశలు..!' అంటూ నిర్వేదాన్ని ఒలికించినా,

- 'సన్మతినీయవే భారతి, జగతిని వెలిగించు నీతినయతుల నిర్మల జ్యోతి - కళా రంగానికేల ఈ దుర్గతి' అంటూ ఈర్ష్యా ద్వేషాలతో రగిలిపోతున్న కళారంగానికి మంచి బుద్ధిని ఇవ్వమని చదువుల తల్లిని అర్చించినా..

- 'పాలకడలిపై ప్రభవించిన అల- కమలాక్షుని కమ్మని కమల- సంద్రపు పుత్రి సరసిజనేత్రి' అంటూ అమ్మవారిని నానావిధములా స్తుతించినా...

- 'మా జీవితమే ముచ్చటగొలిపే మురిపాల మూట, అపస్వరమే తెలియని ఓ కమ్మని పాట'... అంటూ అన్యోన్యమైన దాంపత్యానికి సిసలైన చిరునామాని చూపినా...

- 'వాత్సల్యం నిలుపుమయా వరదా - నీ వాసి వర్ణింపనలవి కాని దయా విశారదా' అంటూ విరచించినా...

- 'ఇది వెతలు లేని ప్రేమ కథల దేశం, కట్టుబాట్లు లేని యువ కవన ప్రదేశం' అంటూ ప్రేమ హృదయాలను తారాతీరంలో విహరింపజేసినా...

- 'యుగయుగాలుగా ఇగిరిపోని గంధం, కాలదోషమే పట్టని కమ్మని గ్రంథం, బదులే కోరని పవిత్రబంధం, అన్నా చెల్లెళ్ల అనుబంధం' అంటూ నిర్వచించినా...

...అన్నీ శ్రోతల గుండెల్లో గూడుకట్టుకుని నిలిచిపోయిన గీతాలే!

'బండోడికేం తెలుసు బంతిపూల సొగసు', 'అంతా అయిపోయాక సంతదేనికి?!' ఇలాంటి కొత్తనానుడులను సృష్టించిన సృజనశీలి సుమన్.

పాత చిత్రాలంటే మక్కువ చూపించే సుమన్ మరీ ముఖ్యంగా విజయావారి గుండమ్మ కథ, మాయాబజార్, అప్పుచేసి పప్పుకూడు, మిస్సమ్మ తదితర చిత్రాల్లోని పాత్రల సంభాషణలను వారి గొంతుకలతో అనుకరించి వినిపించడం చూస్తే అబ్బురపడక తప్పదు.

ఎంతోమంది నటీనటులకు, సాంకేతిక నిపుణులకు పేరుప్రఖ్యాతులను సంపాదించి పెట్టిన సుమన్ ఓ మనసున్న మానవతావాది. ఎందరికో తన దగ్గర శిష్యరికం చేసే అదృష్టాన్నీ, నాలుగు అక్షరాలతోపాటు, నలుగురిలో మెలిగే క్రమశిక్షణని, వృత్తిపట్ల అంకితభావాన్ని నేర్పించిన గురువు ఆయన. తెలుగుదనాన్ని ఎంతోమంది కలాల్లో నింపిందీ ఆయనే.

ఆయన దగ్గర ఉన్న మరో అద్భుతమైన ప్రతిభ... స్క్రిప్టుని మౌఖికంగా చెప్పడం. అదో ప్రవాహ ఉద్ధృతిలా సాగిపోతూ రాసుకునే వారికి షార్ట్‌హ్యాండ్‌కి కూడా అందని వేగధార ఆయనది.

తన పాటలకు పదపదాన్ని ఎలా చిత్రీకరించాలో దర్శకుడికి చాలా స్పష్టంగా, చిత్రీకరణ అంశాలను మాటలతో రాసివ్వడం, అవసరమైన చిత్రాలుగా గీసివ్వడం... ఆయన సృజనకి తార్కాణం.

ప్రఖ్యాత సినీ రచయిత డి.వి.నరసరాజు సంభాషణల్ని ఎంతో ఇష్టపడే సుమన్ ఆయన శిష్యరికంలో రాటుదేలి, ఆయనతో కలం కలిపి 'నరసరాజీయం' ధారావాహికకి రచనా సహకారం అందించారు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతైనా చెప్పవచ్చు. ఎన్ని పేజీలైనా రాయవచ్చు.

ఇది ముగించాలని లేని ముగింపు. ఆయన జ్ఞాపకాలకు ఒక చిన్న ఊరేగింపు.

పాత్రికేయుడు, టీవీ రచయిత.
ఈటీవీలో సుమన్‌కు సహాయకునిగా పదేళ్ల పాటు పనిచేశారు. 94925 30542

పోయిండమ్మా....

పోయిండమ్మా వెళ్లి పోయిండమ్మా
పోయిండమ్మా వెళ్లి పోయిండమ్మా
రతనాల కొడుకు

రామసక్కనోడు ఎపుడొస్త డొకసారడగు
పాడు క్యాన్సరు భూతం సుమనును పగపట్టిందా!
మొక్కిన దేవుని కయ్యయ్యో కన్ను కుట్టిందా? ॥పో॥

మరువదు ఈ జనము ఈటీవీ 'అంతరంగాలు'
మట్టి మనిషి కలలెపుడు చూడు 'ఎండమావులు'
తిరుపతి వెంకన్నకు ఇచ్చినాడు స్వరాలు
అతడే.. ॥పో॥

పాటలనందించిన గొంతుమూగపోయిందా?
తిరుమల దేవుడే ఆపలేక పోయిండా!
అర్థరాత్రి సుమనుడు అమ్మనేల చేరిండా
అయ్యో.. ॥పో॥

రామోజీ రమాదేవి కడుపున పుట్టిన కొడుకా
ఆనాడు ఆటపాటలాడి నేర్చినావు నడక
ఓ సుమను దుఃఖము మిగిలించినావు కనబడక
ఎటకో... ॥పో॥

కళనే జీవితమని నమ్మిన ఓ కళానిధీ !
కూడని జబ్బై పగబట్టిందా విధి!
కన్నుమూస్తివా సుమను నిన్ను తలచి ఎంతని ఏడ్వను ?
కన్నీటి కథను మా కందించి వెళ్లావా?
వదలి... ॥ పో॥

కళాకారులను తీర్చిదిద్దిన టీవీ దర్శకుడా !
పాత్రకు జీవం పోసి నటించిన ఓ నటుడా ఘనుడా !
తిరుగులేని ఓ నిర్మాత బుల్లి తెరకు నువ్వేగానేత
సృష్టికర్త మతిమరుపుతో రాసిండొ తలరాత
తెలీని చోటికి ॥పో॥

నటనే జీవితమని నమ్మిన ఓ నవరసబాంధవుడా
గుండెను తాకే కథలందించిన గొప్పగు కూర్పరివే
గుండె ఆగిపోయిందా అనుబంధం తీరిందా
కళలతల్లి బిడ్డ సుమనస్సు నేలకొరిగిండా
ఇక కనరాడే.... ॥పో॥

- బి.మురళీమధు, విశ్రాంత హెడ్ పోస్టుమాస్టర్, పెద్దపల్లి, కరీంనగర్. 98499 12948.

జీవన చిత్రాలకు కాపు



చిత్రకాగితాలపై రంగులద్దటం సులువే. కానీ జీవితాన్నే రంగరించి చూపటం చాలా కష్టం. ఆ కష్టాన్ని ఎంతో ఇష్టంగా మలుచుకున్న రాజయ్యసారు ఇకలేరు. ఆయన చిత్రాలు మటుకు ఉన్నాయి, ఉంటాయి! మాస్కోలోని జాతీయ మ్యూజియంలో, భారత పార్లమెంటు భవనంలో, సాలార్‌జంగ్ మ్యూజియంలో... లబ్ధప్రతిష్ఠమైన ప్రతిచోటా ఆయన చిత్రాలు తెలంగాణ జీవితాన్ని సగర్వంగా ప్రతిబింబిస్తాయి.

కాపు రాజయ్య 1925 ఏప్రిల్ 6న సిద్ధిపేటలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనకు చిత్రకళ అంటే అభిరుచి ఏర్పడింది. తను రోజూ చూసే సాలెవాని మగ్గం, సారె చక్రం, కల్లుతీత, నకాషి గీతలను చిత్రీకరించాలని ఉత్సాహపడేవారు. రాజయ్యలోని ప్రతిభని గమనించిన చిత్రకళ గురువు 'కుబేరుడు', ఆయన్ను బొంబాయిలోని చిత్రకళ పరీక్షలకు పంపారు. అలా చిత్రకళలో తొలిమెట్టుని చేరిన రాజయ్య ఇక వెనుదిరగలేదు. 1946 నుంచి 1983 వరకు వివిధ పాఠశాలల్లో చిత్రకళను బోధించారు, ఎందరో విద్యార్థులకు కలగా మారిన కళని వెలిగించారు. 1964లో సిద్ధిపేటలో లలిత కళాసమితిని నెలకొల్పి వందలాదిమందికి చిత్రకళలో శిక్షణని ఇచ్చారు. రాజయ్య బోధన ఒక ఎత్తైతే, ఆయన సాధన అందనంత ఎత్తు. కుంచెని కదిలించిన ప్రతిసారీ తెలంగాణ కదలికల్ని చిత్రించారు. బతుకమ్మ నుంచి బోనాల వరకు, పల్లె పడుచుల నుంచి సంచార భిక్షువుల వరకు జీవితంలోని ప్రతి పార్శ్వాన్ని చిత్రాలుగా మలిచారు. కార్మికులపై ఆయన చిత్రించిన 'రిస్కీ లైఫ్' కు జాతీయ పురస్కారం లభించింది. లండన్ నుంచి వెలువడే 'ది స్టూడియో' పత్రికలో బోనాలపై ఆయన చిత్రం ప్రచురితం అయింది. దేశవిదేశాల్లో ఆయన చిత్ర ప్రదర్శనలు జరిగాయి. ఇవి కాక ఆయనకు లభించిన పురస్కారాలు ఎన్నో. ఆయన్ను వరించిన బిరుదులు ఎన్నో.

రాజయ్య జీవితం కళాకారులకి ఆదర్శంగా సాగింది. కటిక పేదరికంలో పుట్టినా కళ కోసమే తపించారు. కులవ్యవస్థ తీవ్రంగా ఉన్న రోజుల్లోనే కులాంతర వివాహాన్ని చేసుకున్నారు. జీవితపు చివరి రోజుల్లో పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్నా, చక్రాల కుర్చీలోనే లలిత కళా సమితిని చేరుకుని కళాకారులకు సూచనలు అందించేవారు. నిరహంకారిగా సాటి చిత్రకారులకు తెలిస్తే, సైకిల్‌పైనే చరించే నిరాడంబరునిగా సిద్దిపేట ప్రజలకు పరిచయం.

ఆగస్టు 20న కాపు రాజయ్య తుదిశ్వాసని విడిచినా తన చిత్రాలలో ఎప్పటికీ ఉంటారు, ఆ చిత్రాలకు వస్తువుగా నిలిచిన ప్రజల గుండెల్లో ఉంటారు. ఎందుకంటే ఆయన చిత్రాలు సంపన్నుల మెప్పు కోసం కాదు, పేదవాడి గుండె కోసం!

'రాతి' గుండెలను కదిలించిన వి.వి.కృష్ణశాస్త్రి

కృష్ణశాస్త్రి అనగానే తెలుగువారికి గుర్తుకు వచ్చేది ఇద్దరు. రాతి గుండెలను సైతం కదిలించగల కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒకరైతే, రాతిని కదిలించి అందులో దాగిన చరిత్రని లోకానికి చాటిన పురాతత్వ శాస్త్రవేత్త వేలూరి వెంకట కృష్ణశాస్త్రి మరొకరు.

కృష్ణశాస్త్రి 1934 అక్టోబరు 23న కృష్ణాజిల్లాలోని సిరివాడలో జన్మించారు. వీరికి ప్రముఖ కథా రచయిత వేలూరి శివరామశాస్త్రి పూర్వీకులు. గుడివాడ, హైదరాబాద్‌లలో సాగిన కృష్ణశాస్త్రి విద్యాభ్యాసం, కర్నాటక విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటును పొందడంతో పరిపూర్ణమైంది. 1961లో టెక్నికల్ అసిస్టెంటుగా పురాతత్వ శాఖలో చేరిన కృష్ణశాస్త్రి ఉద్యోగంలో శిఖరాల్ని అధిరోహిస్తూనే, చరిత్రలోని లోతులని వెలికితీశారు. చంద్రవరం, కేశనపల్లి, సీతమ్మ ధార, కోటిలింగాల, ధూళికట్ట... వంటి ప్రదేశాలలో నిక్షిప్తమైన బౌద్ధ స్థూపాలను కనుగొన్నారు. తొట్లకొండ, బావికొండలపై ఆయన వెలికితీయించిన బౌద్ధ స్థూపాలు విశాఖపట్నానికే వన్నె తెచ్చాయి.

కృష్ణశాస్త్రి గొప్ప పరిశోధకులు కూడా! కీసరగుట్టలో జరిగిన తవ్వకాల ఆధారంగా విష్ణుకుండినుల రాజధాని వినుకొండ కాదని కీసరగుట్టేనని నిరూపించారు. శాతవాహనులు కరీంనగర్ కోటిలింగాల నుంచే పాలన ప్రారంభించారని చాటి చెప్పారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాలైన బెలుం, గుత్తికొండ బిలాల్లో రాగి-రాతి యుగపు ఆనవాళ్లను చూపారు. నాగరితలో మనం ఉత్తరాదికి తీసిపోమన్న భరోసా కలిగించారు. రాగి-రాతి యుగాలే కాదు, జొన్నలగడ్డలో ఇనుపయుగ ఆనవాళ్లనీ కనుగొన్నారు. పాండవుల గుట్ట, రామచంద్రాపురం, చింతకుంట తదితర ప్రాంతాల్లో ఆదిమ మానవుడు రాళ్లపై చిత్రించిన 'రాక్ ఆర్ట్'ని వెలికిదీసి ప్రపంచాన్ని అబ్బురపరిచారు. శ్రీశైలం ప్రాజెక్టు వల్ల ముంపుకు గురైన ఎన్నో ఆలయాల్లోని శిల్పసంపదను సురక్షితంగా పురావస్తుశాఖకు తరలించారు. శిల్పసంపద తరలింపు ఒక ఎత్తైతే ఏకంగా ఆలయాన్నే (సంగమేశ్వరాలయం) యథాతథంగా అలంపురానికి తరలించడంలో కృష్ణశాస్త్రి కృషి అమోఘం.

పదికి పైగా పుస్తకాలు, వందకు పైగా వ్యాసాలు, మరెన్నో సంకలనాలకి సంపాదకత్వం... ఇదీ కృష్ణశాస్త్రి అక్షర చరిత్ర! తాత-మనవడి సంభాషణా రూపంలో సాగే 'భారతీయ సంస్కృతి - పురాతత్వ పరిశోధనలు' అనే గ్రంథం 'పురాతత్వోపనిషత్'గా పేరు పొందింది. 'ప్రోటో హిస్టారికల్ కల్చర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' పేరుతో ఆయన రాసిన చరిత్ర గ్రంథాన్ని రాణి ఎలిజబెత్ - 2 తన భారత పర్యటన సందర్భంగా 1982లో ఆవిష్కరించారు. పదవీ విరమణ అనంతరం 'హిస్టారికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్'కి అధ్యక్షునిగా ఉన్నారు. పలు సంఘాలలో సభ్యునిగా, సలహాదారునిగా ఉన్న కృష్ణశాస్త్రి ఆగస్టు 22, 2012న పరమపదించారు. చరిత్రలో నిలిచారు.

విజ్ఞాన సాహితీ పరమాణువు రోహిణీ ప్రసాద్

ప్రముఖ అణు శాస్త్రవేత్త కొడవటిగంటి రోహిణీ ప్రసాద్ సెప్టెంబరు 8న మరణించారు. బాబా అణు పరిశోధనా కేంద్రంలో (బార్క్) శాస్త్రవేత్తగా, విజ్ఞాన విషయాలను జనరంజకం చేసిన సాహితివేత్తగా, 70కి పైగా పరిశోధనా పత్రాలను వెలువరించిన మేధావిగా, విదేశాలలో 100కుపైగా ప్రదర్శనలు ఇచ్చిన సంగీతకారునిగా... 'రోహిణీ ప్రసాద్ జీవితం బహుముఖ ప్రజ్ఞకు నిర్వచనం.

తండ్రి ప్రముఖ రచయిత కుటుంబ రావు, తల్లి వరూధిని. 1949 సెప్టెంబరు 14న జన్మించారు. ఊహ తెలిసినప్పటి నుంచే సంగీతం అంటే అభిమానం. ఎల్.ఆర్.కేల్కర్, ఉస్తాద్ ఇమ్రత్ ఖాన్ వంటి గురువుల వద్ద హిందుస్తానీ, కర్నాటక సంగీతాలను అభ్యసించారు. సితార్‌పై పట్టు సాధించి 16వ ఏటనే అరంగ్రేటం చేశారు. సరోద్, వేణువు, వీణ, కీబోర్డ్‌వంటి వాయిద్యాలపైనా ఆయనకు నేర్పు ఉండేది. తండ్రిలోని అభ్యుదయవాద ప్రభావంతో, భౌతిక శాస్త్రంలో అంచెలంచెలుగా ఎదుగుతూ డాక్టరేటుని సైతం పొందారు. శాస్త్రవేత్తగా, అణుధార్మిక విషయాలలో సలహాదారుగా భారత, అమెరికా దేశాలలో పలు కీలక పదవులను నిర్వహించారు.

ఒక శాస్త్రవేత్తగా, సంగీతకారునిగా రోహిణీ ప్రసాద్ తృప్తి చెందలేదు. ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను తొలగించినప్పుడే, విజ్ఞానశాస్త్రానికి విజయం అని నమ్మినవారాయన. వృత్తిని అంకితభావంతో కొనసాగిస్తూనే, విజ్ఞానంపై పలు పుస్తకాలను తేటతెలుగులో ప్రచురించారు. 'మనుషులు చేసిన దేవుళ్లు', 'మానవ పరిణామం', 'విశ్వాంతరాళం', 'జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం'... వంటి ఎనిమిది విజ్ఞాన సంబంధ పుస్తకాలను కేవలం నాలుగేళ్ల వ్యవధిలో రాశారు.

తన పుస్తకాలలో జీవపరిణామం మొదలు జన్యువుల వరకు ఆయన స్పృశించని అంశమంటూ లేదు. ఒక పక్క మధుమేహం బాధిస్తున్నా, పిల్లలకు తమ మాతృభాషలోనే విజ్ఞానాన్ని అందించాలన్న సదాశయంతో ఆఖరు నిముషం వరకూ రచనలు చేస్తూనే ఉన్నారు. పుస్తకాలే కాదు! సంగీత, సాహిత్య, సాంకేతిక రంగాలపై పలుపత్రికల్లో, వెబ్‌సైట్లలో అసంఖ్యాక వ్యాసాలు రాశారు. చందమామ పాతసంచికల్లో ఉన్న తెలుగు కథలెన్నింటినో ఆంగ్లీకరించారు.

ఒక వ్యాసంలో అమరత్వాన్ని ఖండిస్తూ 'నానాటికీ అరిగిపోయే ప్రతిప్రాణి శరీరాన్నీ బాగుచేస్తూ కలకాలం మన్నేట్టు చెయ్యడం కంటే ఆ శరీరంలో పనికొచ్చే పదార్థాన్ని కొత్త శరీరంలో ప్రవేశపెట్టి ముసలి శరీరాన్ని అవతలికి నెట్టేయడమే ప్రకృతికి సులభం' అంటారు ప్రసాద్. ప్రసాద్ మనసెరిగిన వారసులు ఆయన పార్థివ దేహాన్ని వైద్య పరిశోధనల నిమిత్తం ముంబైలోని గ్రాంట్ వైద్య కళాశాలకు అప్పగించారు.

వాయులీనం

చాసో

తెలుగు కథకు తూర్పు దిక్కుగా భాసిల్లి, కథకు నైశిత్యాన్ని, నిరాడంబరతను నేర్పిన కథకుల్లో అగ్రగణ్యుడు చాగంటి సోమయాజులు. మాట్లాడే భాష ఎలాంటి కథనైనా అందంగా చెప్పగలదనటానికి ఆయన శైలే రుజువు. ఆయన కథల్లో ఓ ఆణిముత్యం మీ కోసం...

రాజ్యానికి వొంటిమీద స్పృహ పూర్తిగా తప్పిపోయింది. అది ఈ ప్రపంచంలో లేదు. వెంకటప్పయ్య ప్రాణాలు ఎక్కడివక్కడ ఎగిరి పోయాయి. పరీక్షగా పెళ్లాం మొహంలోకి చూశాడు.

రాజ్యం పెదిమలు కదులుతున్నాయి. ఏవో మాటలు అంటున్నట్టుంది. మాటలు పైకి రాకపోయినా మనస్సులో ఏదో అనుకొంటున్నది.

"ఒసే రాజ్యం!" అని ఆదుర్దాగా పిలిచేడు. అది పలకలేదు. అది ఈ ప్రపంచంలో లేదు. మనోహరమైన తోడిరాగాన్ని తోడుపుచ్చుకొని అంబర వీధుల్లో విహరిస్తున్నది.

వసారాలో పిల్లలు గందరగోళం చేస్తున్నారు.

"వెధవల్లారా ఏమిటా అల్లరి!" అని గట్టిగా పిల్లల్ని వెంకటప్పయ్య కసిరాడు. పిల్లలు దగ్గరగా ఉంటే చావకొట్టేవాడే.

"అబ్బ తుళ్లిపడ్డానండీ! పిడుగుపడ్డట్టు పిల్లలమీద అలాగ విరుచుకు పడుతున్నారేం?" అని రాజ్యం తెలివి తెచ్చుకొని అడిగింది. కళ్లు చిట్లించి మొగుణ్ని చీదరగా చూసింది.

"నీ వొంట్లో ఎలాగుందో చెప్పు" అని ఆతృతగా అడిగాడు.

"వాళ్లనెందుకలా కసిరారు?"

"కసిరితే కసిరాను. ముందు నీ వంట్లో ఎలాగుందో చెప్పు."

"నిక్షేపంలాగుంది. ఇప్పుడేమొచ్చిందని?"

"పిలిస్తే పలికేవా మరి?"

"పిలిచారా?"

"పిలవలేదూ మరి?"

"అలాగనా!" అని రాజ్యం నవ్వింది. దాని నవ్వుమొహం చూడ్డానికి భయంకరంగా ఉంది. పైకి వచ్చేసిన గుడ్లగూబ కళ్లు. ముందుకు పొడుచుకు కనబడుతున్న ముందు పళ్లు మొహాన్ని బీభత్సం చేసేశాయి.

"వొళ్లు మరిచిపోయానండి!" అని రాజ్యం మళ్లా నవ్వింది.

"అంతేకదా!" అని వెంకటప్పయ్య కాస్తంత కుదుటపడ్డాడు. రాజ్యం టైఫాయిడ్ జ్వరంతో తీసుకొని కింద పెట్టవలసినంతా అయి బతికి బట్ట కడుతున్నంది. పత్యం తింటూ, ఇంకా వారం రోజులే అయింది. వెంకటప్పయ్యకి అదురు మాత్రంపోలేదు. ఆ మాయదారి టైఫాయిడు జ్వరం మూడు వారాలుగా పొక్కిపోసిన తరువాత దిగజారలేదు. మళ్లా తిరగబెట్టింది. మరి మూడు వారాలు చూడు నా మహాత్యం అని ముప్పతిప్పలా పెట్టింది. పత్యం పెట్టించినా, ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చినా, వెంకటప్పయ్యకి పక్క బెదరు అలాగనే ఉండిపోయింది. ఏ క్షణంలోనైనా దాని ప్రాణం గుటుక్కుమంటుందనే వాడి భీతి.

"నా వంట్లో హాయిగా ఉంది. తింటున్నది అరుగుతున్నది. నిద్ర పడుతున్నది. అంత జబ్బుపడ్డాక నిలుచున్న పాళంగా మామ్మూలు మనిషిని కమ్మంటే అవుతానా?" అన్నది రాజ్యం.

"రాజ్యాన్ని చూస్తే మాత్రం దాని వంట్లో ప్రాణాలు ఎలాగ నిలబడి

ఉన్నాయని ఆశ్చర్యం వేస్తుంది. కండయావత్తూ ఆర్చుకుపోయి ఎమికెల మీద తోలు మాత్రం మిగిలి ఉంది.

"నువ్వు పరధ్యానంగా ఉంటే గుండెలార్చుకు పోయాయి" అన్నాడు. నిద్రపోతున్న పెళ్లాన్ని చూశాడు - ప్రాణం ఉందా లేదా అనే సంకోచం వాణ్ని ప్రతిరోజూ పీక్కుతింటూ ఉండటం, దాని కడుపు కిందికీ మీదికీ ఊపిరికి ఎగురుతూ ఉంటే బతికే ఉన్నదని నిర్ధరణ చేసుకొంటూ ధైర్యపడటం వాడికి పరిపాటి అయిపోయింది.

"మనస్సు ఎటోపోయింది. నా వంట్లో మరేంలేదు. ఈ ఇంటికి మారిన దగ్గర నుంచి నాకు హాయిగా ఉంది". అన్నది రాజ్యం.

"నాకూ ఈ ఇంటికి వచ్చిన దగ్గర నుంచి హాయిగా ఉంది. ఏదో కొత్త సంతోషం కలుగుతున్నది. ఎటొచ్చి అద్దెకాస్త ఎక్కువనుకో" అన్నాడు.

"అద్దెకే బెంగగా ఉంది" అన్నది రాజ్యం.

"ప్రాణానికే క్షేమంలేని తరవాత వెధవ అద్దెకు చూసుకొంటామా? ఏ బెంగావద్దు" అన్నాడు. అంతకుముందు వాళ్లు ఇరుకు సందులో ఇక్ష్వాకులనాటి పాత గూభ్యంలో అద్దె చవకని ఉండేవారు. అక్కడ ఉన్నన్నాళ్లు ఇంటిల్లిపాదికీ రోగాలే. ఆఖరికి రాజ్యానికే ప్రాణం మీదికొచ్చింది. మనిషి తోడు లేనివాడు. ఆస్పత్రిలో పెళ్లాన్నుంచి యమయాతన పడ్డాడు. కట్టుకొన్న మొగుడు, కన్న పిల్లలు అదృష్టవంతులు కావడాన్ని బతికి మనుషుల్లో పడ్డది. ఇప్పుడు కొత్తగా కట్టిన సిమెంటు డాబాలో రెండు చిన్నగదులూ, వసారా అద్దెకు తీసుకొన్నారు. ఎదురుగుండా చూడముచ్చటైన రెండు మేడలున్నాయి. ఇళ్లచుట్టూ విశాలంగా పెరళ్లున్నాయి. పెరళ్లన్నీ ఉద్యానవనాలే.

"వెధవ డబ్బు ఏదో కూడిక చేసుకుంటాము. నువ్వు బతికావు అంతేచాలు" అన్నాడు.

"అదేమన్నమాటలెండి. నా జబ్బుకి ఎక్కణ్నుంచి తెచ్చారో, ఎంత అయిందో ఇప్పటికి నాకు చెప్పకుండా ఉన్నారు. అదీ ఆలోచించుకోవాలి" అన్నది.

"ఆవూసు నిన్నెత్తొద్దన్నానా? ముందు నీ ఆరోగ్యం చూసుకో. నువ్వేమీ లోభపడకు, కావలసినంత ఓవల్టిన్ను తాగు. తెచ్చిన పళ్లన్ని తినెయ్యి. పిల్లలకి కూడా పెట్టకు."

"తినకేం చేస్తున్నాను? కాళ్లు జాపుకొని మీ చేత వండించుకొని మరీ తింటున్నాను. ఏదైనా అప్పు అప్పే కదా? మనకింకో విధం ఉందికనుకనా? "

"ఆ వూసు ఎత్తొద్దన్నానా? " అన్నాడు. డబ్బు మాటెత్తగానే వాడికి గాభరా పుట్టింది. జీతం రెండు నెలలది కాక రెండు వందలకి దాటి ఖర్చు అయిపోయింది. డాక్టరు అశ్వనీదేవతలాగా కాణీ పుచ్చుకోకుండా కాపాడుకొచ్చినా వత్తమందులకి అయిపోయింది. ధర్మాసుపత్రిలో పడేసినా తలకిమించిన ఖర్చు అయింది.

"ఎత్తనులెండి. తీర్చుకొందాం తాపీగా. కూడికకి ఏముంది? నా చేతిలోనే ఉంది."

"సరేలే అలాగే చేతువుకాని" అని వెంకటప్పయ్య పెరట్లోకెళ్లిపోయాడు. వాడికా సంభాషణ పెంచడం ఇష్టంకాలేదు. కాళ్లూ, చేతులూ, మొహం కడుక్కొని వచ్చాడు. తల దువ్వుకొని దుస్తులేసుకొన్నాడు. వీధిలోకి బయలుదేరాడు.

రాజ్యం మళ్లా ఈ ప్రపంచంలో లేదు. చిరుచీకటి గదిలోకి ప్రవేశిస్తున్నది. కిటికీలోంచి సాయంకాలపు వెలుతురు రాజ్యం మొహం మీద పడి బంగారపు పూత పూస్తున్నది.

వెంకటప్పయ్య రాజ్యం మొహాన్ని తదేకంగా చూస్తూ నిలబడ్డాడు. వాడికి భయం మరి కలగలేదు. చిన్ననాటి ఏ మధుర సన్నివేశాన్నో జ్ఞప్తికి తెచ్చుకొని వొళ్లు పరవశమవుతున్న దనుకొన్నాడు. మొహంలో దేదీప్యమానంగా సంతోషం తాండవిస్తున్నది.

కొన్ని సంవత్సరాలై రాజ్యం అంత సంతోషంతో ఉండటం వెంకటప్పయ్య చూడలేదు. కాపరానికొచ్చిన తొలి సంవత్సరం ఇరవైనాలుగు గంటలూ కిలకిల నవ్వుతూ, బంతిలాగ తుళ్లిపాట్లు పడుతూ ఉండేది. సంవత్సరం తిరక్కుండా దానిగుండెలికి చంటికుర్రాణ్ని వప్పగించి సంసారసాగరాన్ని వుత్తరించుకువెళుతూ, అవతల దరికి చేరమంది జీవితం! కాపరానికొచ్చి ఆరేళ్లయింది. ముగ్గురు కొడుకుల తల్లి అయి ఈదుతున్నది.

అకస్మాత్తుగా రాజ్యం నోరు తెరచింది. తల వోపక్కకి పెట్టి ఆడిస్తున్నది. దానిచేష్టకి వెంకటప్పయ్య పకాలున నవ్వాడు. ఆ నవ్వు కోరింత దగ్గులాగ వాణ్ని వోహంతకుగాని వదిలి పెట్టలేదు. రాజ్యం విహాయన వీధుల్లోంచి ఆ నవ్వుతో భూమ్మీదికి వచ్చేసింది.

"ఎందుకు అంత విరగబాటునవ్వు? " అని మొగుణ్ని అడిగింది.

"ఏది మళ్లా నోరు సాగదీసి, మెడవంచి ఆడించు చూస్తాను" అన్నాడు.

"అదా! ఎదురింటిపిల్ల పాడుతున్నది. వినండి" అన్నది. రాజ్యం చెప్పేక ఎదురింటి నుంచి సంగీతం వస్తున్నట్టు చెవులకుతెలిసింది. చెవుల్లో గుయ్యిగుయ్యిమంటున్నా అదేమిటో తెలుసుకోవలసిన అవసరం వాడికి అంతవరకూ కలగలేదు!

"ఓహో ఇక్కడ సంగీతం వినబడుతున్నదే!

అదియా సంగతి. చిన్నప్పుడు నువ్వు చిన్న వాయులీన విద్యాంసురాలివి కదూ! మరచిపోయాను" అన్నాడు.

కామవర్ధని రాగాలాపనతో కంపిస్తూ, పువ్వు వెలగవాసనతో మత్తెక్కి గాలి బరువుగా గదిలోకి ప్రవేశిస్తున్నది.

"ఏమ్రోయ్ పిల్లలూ ఇక్కడ సంగీతకచ్చేరీ అవుతున్నది. వచ్చి వినండి" అన్నాడు. కొడుకులిద్దరూ వీధిలోకి కూడాపోయి పాట ఆశ్చర్యచకితులై వింటూ నిలబడ్డారు.

"ఈ ఇంట్లో సుఖంగా ఉందనుకొన్నాను కాని ఈ పార్శ్వశూల తప్పదులాగుంది" అన్నాడు.

"శొంఠికొమ్ము తెచ్చుకోండి" అన్నది రాజ్యం. అతని మనస్సు చివుక్కుమంది. శొంఠి గంధం పూసినట్టు వొళ్లంతా సెగలూ పొగలూ లేచాయి.

"చీకటి పడుతూ ఉంటే ఇప్పుడెందుకు వీధిలోకి? పెందరాళే అన్నం తినకూడదూ?" అన్నది.

"అనుకొంటూ ఉండగా ఆలస్యమైపోతున్నది. ఇల్లాగ్గా ఇహనెళ్లి పాపపరిహారార్థం ఇక మంచిపని చెయ్యాలి" అన్నాడు.

"పాపాలుకూడా చేస్తున్నారా?"

"పాపం చెయ్యంది బతుకు వెళ్లలేదు."

పిల్లలిద్దరూ సంగీతం జాగ్రత్తగా వింటున్నారు. వాళ్లకి శ్రవణానందంగానే ఉందిగాబోలు. పిల్లల హృదయాలు నిష్కల్మషంగా ఉంటాయి. స్వభావ సిద్ధంగా సంగీతం సమ్మోహపరుస్తుంది. చిన్న వయస్సు నుంచి కాస్తంత రాగతాళ జ్ఞానం కలిగిస్తే జీవితంలో సంగీతం ప్రవేశించి ఆజన్మాంతం ఆనంద హేతువు అవుతుంది.

"ఓహో మీరు మీ అమ్మకి పిల్లలే! సరిగమల సాంబారు మీకు వచ్చినట్టుందే!" అని వెంకటప్పయ్య వీధిలోకి నడిచాడు.

రాజ్యం మెల్లగాలేచి స్విచ్చినొక్కింది. దూలాల మధ్యనున్న గొట్టం క్రమేణా వెలిది గదినిండా ఆణిముత్యంలాగ కాంతిపడ్డది. విద్యుద్దీపాలు సిమెంటుడాబా గదుల్లో ఉన్నంత అందంగా పూర్వకాలపు నాలుగిళ్లలోగిళ్లలో శోభించవు. బూజుపట్టిన పెణకకింద, పట్లతో నిండిన బల్బులా రాజ్యం సంగీతం రెండు రోజులు వెలిగి ప్యూజు అయిపోయింది. దాని ఫిడేలు మూలపడ్డది. కమాను విరిగి పెంటకుప్పని చేరింది. జీవితంలోంచి సంగీతం తొలగిపోయినా ఎదురింటి అమ్మాయి పాడుతూ ఉంటే ఎక్కడలేని సుఖాన్ని, సంతోషాన్ని ఇస్తున్నది.

రాజ్యానికి జీవితంలో అసందర్భంగా ఏమీ జరగలేదు. అంతా సవ్యంగానే నడిచింది.

ఆరేళ్లక్రితం రాజ్యాన్ని చూడటానికి పెళ్లివారు వచ్చారు. వాళ్లతో వెంకటప్పయ్యా వచ్చాడు. వాళ్లంతా రాజ్యాన్ని పాడమన్నారు. వాళ్లనాన్న నాలుగేళ్లయి అవసరంగా సంగీతం చెప్పిస్తున్నందుకు పాడవలసిన శుభముహూర్తం వచ్చింది.

తోడిలో కీర్తన సిగ్గుపడుతూ అందుకుంది. గొంతుకెత్తేసరికి అపశృతి పలికింది. ఉసిలోకి రావలసిన తాళం వేలుమీదికొచ్చింది! వొళ్లంతా జలదరించి పాటంతా గాభరా అయిపోయింది. పాట ఆపగనే రాజ్యానికి ఏడుపు పర్యంతం అయిపోయింది.

కాని వచ్చిన పెళ్లిపెద్దలు పాటకి సెహబాస్ అన్నారు. తెనుగు పెద్దలకి శృతి, అపశృతి తెలియనివి. రాగ తాళజ్ఞానం వాళ్లకుండదని, వాళ్ల జీవితాలలో సంగీతం లేనేలేదని అమాయకపు పెళ్లికూతుళ్లకి ఏమి తెలుసు?

"మీ అల్లుడు ఉద్యోగం చెయ్యక్కర్లేదు" అన్నాడొక పెళ్లిపెద్ద. రాజ్యం వాళ్ల అజ్ఞానానికి లోలోపల నవ్వుకొంది.

వెంకటప్పయ్య రాజ్యాన్ని మనసారా అంగీకరించే పెళ్లి చేసుకొన్నాడు. పేరు వెంకటప్పయ్య అయినా వెంకటప్పయ్య అల్లాటప్పయ్య కాదు. పెళ్లి నిశ్చయంకాగానే రాజ్యం కూడా తను అదృష్టవంతురాలినే అనుకొంది. వెంకటప్పయ్య పెళ్లినాటికి పట్టపగ్గాల్లేని ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారి పట్టభద్రుల్లో ఒకడు! చెన్నరాష్ట్ర ప్రభుత్వపు డెబ్బయి రెండు రూపాలయ ఎల్.డి. గుమాస్తాలలో ఒకడు.

పెళ్లయిన కొత్తలో వాళ్ల కోడలు రాజ్యం మాబాగా పాడుతుందని ఊళ్లోవాళ్లు పేరంటానికి వెళితే బలవంతం చేసి పాడించేవారు. మొగుడు ఒక్కనాడు పాడమనలేదు. తాను పాడనూ లేదు.

సిగ్గువదలి అత్తవారింట్లో తనకితాను నోరెత్తి పాడుకొనే సమయం రాకండానే పుట్టి మునిగిపోయినట్టు వేవిళ్లతో పుట్టింటికెళ్లింది. దాంతో ఆడజన్మ సార్థకమైంది.

వసారాలో పిల్లలు గందరగోళం ప్రారంభించారు.

"ఎందుకర్రా అలాగ పీక్కుంటారు? ఇలా గరండి" అన్నది. కుస్తీలు పడుతున్న కొడుకులిద్దరు తల్లిదగ్గరకొచ్చారు. ఐదేళ్లవాడొకడూ, నాలుగేళ్లవాడొకడూ.

"తమ్ముడు నిద్రపోతున్నాడా?" అని అడిగింది.

"గుర్రు పెడుతున్నాడు?" అన్నాడు పెద్దవాడు.

"అల్లరిచేస్తే లేచిపోడూ?" అన్నది, పెద్దవాడు కొంటెగా నవ్వేడు. ఇద్దరూ పొరపాటు చేస్తున్నట్టు మొహాలు పెట్టారు.

"ఎదురింటి అమ్మాయి హాయిగా పాడుతున్నది. కూచుని చక్కగా వినండి" అన్నది వాళ్లు బుద్ధిగా కూచున్నారు. పిల్లలని సముదాయించడం, శాంతంగా సబుబైన మాటలు చెప్పి అల్లరిచేయకుండా చెప్పినట్టు వినేటట్టు చెయ్యడం మొహంమీదికి పొగరాకుండా పొయ్యి ఊదటం మొదలైన విద్యలన్నీ రాజ్యం అవలీలగా నేర్చుకొంది.

ఎదురింటి అమ్మాయి స్వరకల్పన ప్రారంభించింది. స్వరాలు సెలయేళ్లలాగ ప్రవహిస్తూ, మధ్యమధ్య జలపాతాల్లాగ తిరగబడి ఘోషిస్తున్నాయి. గాత్రం తారస్థాయికిలేపి గాంధారంలో నిలుపుతూ కల్పన చేస్తున్నది.

రాజ్యానికి ఏనుగంత సత్తువ వచ్చింది. నిత్యజీవితంలో ఆనందానికి, ఆరోగ్యానికి

ఛత్రి న్యాయం

జోరున వర్షం పడుతోంది, లేదా భళ్లున ఎండ కాస్తోంది. మొత్తానికి గొడుగుల్ని బయటకి తీయాల్సిన అవసరం వచ్చింది. గొడుగు పట్టుకుని వెళ్లేవారిని ఛత్రి అంటాం, అలా చాలామంది వెళ్తోంటే 'జనాలంతా గొడుగులేసుకుని తిరిగేస్తున్నారు' అన్న నిర్ణయానికి వచ్చేస్తాం. అధిక సంఖ్యలో జరిగినదాన్ని, మొత్తానికీ ఆపాదించడమే ఛత్రి న్యాయం. ఇది మానవ సహజమే కానీ, సత్యం బోధపడాలంటే తార్కిక జ్ఞానం ఉపయోగించాల్సిందే!

సంగీతం అవసరమే. తాను పాడలేకపోయినా అర్థం చేసుకోగలిగితే ఉత్తమ సంగీతం మంచిని చేస్తుంది.

అడ్డంగా పానకంలో పుడకలాగ ఎదురింటి అమ్మాయి తమ్ముడు కాబోలు వచ్చాడు.

"గిమపదని ఓజగ.....

సరిసనిపదని ఓజగ...." అని గొంతుక చించుకొని అపశృతిలో స్వరాలు వేశాడు. ఆ అమ్మాయి తంబూర పాటా ఆపేసింది.

"వెధవా, సంగీతం నేర్చుకోమంటే రావు కాని అల్లరికి సిద్ధం" అన్నది.

"నేను స్వరం సరిగ్గా వెయ్యలేదూ? " అని ప్రశ్నించాడు. "నాన్న రానీ చెబుతాను" అన్నదా అమ్మాయి.

"దానిపనిసరి సానిదాని పదని ఓజగ....." అంటూ కుర్రవాడు మరో స్వరం వేశాడు. అపశృతిలోనైనా కుర్రవాడు స్వరాలు సరిగ్గానే పట్టుకువేస్తున్నాడు. వాతావరణంలో సంగీతం ఉంటే వాసాలు కూడా పాడతాయి. అందులో గగనంలేదు.

"నాన్నరానీ వెధవా" అని ఆ అమ్మాయి సంగీతం ఆపు చేసేసింది. రాజ్యానికి వొళ్లు మండిపోయింది. ఆ పిల్ల అన్నీ తనకొచ్చిన రాగాల్లో కృతులే పాడుతున్నది.

"కొంచెం సేపైనా ప్రాణం హాయిగా ఉంది. ఇహనైంది సంగీతం" అన్నది రాజ్యం.

"ఇంక పాడదేంటమ్మా? " అని పెద్దకొడుకు అడిగాడు.

"అదిగో మీలాటి అల్లరి కుర్రవాడు వచ్చి కంగాళిచేస్తే కోపం వచ్చి పాట మానేసింది"

"ఎలాగమ్మా పాడుతున్నది? "

"నేర్చుకొని పాడుతున్నది"

"నువ్వు పాడతావూ? "

"ఓ పాడతాను. నీకుచెప్పమన్నావా? "

"ఛీ! మొగాళ్లు పాడరు"

"మొగాళ్లు పాడతారమ్మా, నీకు చెప్పమన్నావా? "

"ఏది చెప్పు"

"తరవాత చెపుతాలే" అని రాజ్యం కాళ్లు చాపి గదిలో అడ్డంగా పడుకుంది.

"ఒరే పెద్దాడూ కాళ్లు పట్టుబాబూ" అంది. పెద్దవాడు మెల్లగా కాళ్లు గుద్దుతూ కూచున్నాడు.

రాజ్యం కల్యాణికృతి అనుకొంటూ పడుకుంది అంతా మరచిపోయింది. సంగతులు చిక్కుపడ్డ కురుల్లాగ అవకతవక అయిపోయాయి.

"నువ్వాపిల్లలాగ పాడ్డంలేదు" అన్నాడు పెద్దవాడు.

"అంతా మరచిపోయానురా" అన్నది. పెరటి నసారా గూట్లోంచి సిబ్బి కిందపడి వికారంగా చప్పుడై గదిమూలలన్నీ గుయ్యిపెట్టాయి.

"కుక్కకాబోలు, కొట్టండి. గూట్లో అన్నం మండబెట్టింది కాబోలు!" అన్నది రాజ్యం. కొడుకులు పరిగెట్టారు.

"కుక్క కాదమ్మా పిల్లి. అన్నం గిన్నెమీదా సిబ్బి తిరగదోసింది" అన్నాడు పెద్దవాడు.

"నయమే. మళ్లా వండుకోకండా. కుక్క ముట్టుకున్న కూడూ తినవలసిన రోజులు. తలుపులు గడియ పెట్టిరావొద్దూ? " అన్నది రాజ్యం.

"నువ్వేవచ్చి సంగీతం వినమన్నావు" అన్నాడు పెద్దకొడుకు.

"ఔనమ్మా నేనే మిమ్మల్ని రమ్మన్నాను. కాని తలుపు వేసి రావాలి. తెలిసిందా? " అని మెల్లగా చెప్పింది.

వెంకటప్పయ్య తిరిగి వచ్చేశాడు.

"పెరట్లో వెన్నెలా, పువ్వు వెలగవాసన మహాబాగున్నాయి" అన్నాడు వెంకటప్పయ్య.

"అప్పుడే వచ్చేశారేం? " అన్నది రాజ్యం.

"పనైపోయింది"

"పాపపరిహారం అయిందా? "

"కొంచం అయింది"

"ఈ మధ్య ఎక్కడికో వెళ్లారు కాబోలు"

"రామరామ"

"మామాటల వాలకం అలాగుంది"

"ఛీ ఛీ"

"ఆమాట అనలేనులెండి."

వెంకటప్పయ్య కండువాలో దాచి చంక కింద ఏదో పెట్టాడు. గుండ్రంగా పేపరు చుట్టి ఉంది.

"ఏమిటిది? " అన్నది రాజ్యం.

"విప్పి చూపిస్తానుకదూ"

లోపల బాగా నాలుగువేళ్ల వెడల్పు చుట్టు జరీ అంచు చీర ఉంది. దానికి తగ్గ పట్టురవికెలగుడ్డా ఉంది. మహారాణి మొదలు మామూలు మహిళదాకా ప్రతి ఆడది మెచ్చుకునే చుట్టు జరీచీర.

"కొన్నారా? "

"కొన్నాను. ఉన్న డబ్బుకాస్తా అయిపోకుండా కొనేశాను."

"డబ్బెక్కడిది? "

"చెపితే నవ్వు నన్ను క్షమించవు"

"ఏంచేశారండీ? "

"ఏమీ అననని చేతిలో చెయ్యివెయ్యి" అన్నాడు. ముందుకు చెయ్యి జాపేడు. వాడి చెయ్యి వణుకుతున్నది. రాజ్యం చేతిలో చెయ్యి వేసింది.

"అలాగ వొణికిపోతున్నారేం? ఏం చేశారండి? దొంగతనం చెయ్యలేదు కదా? "

"అంతకన్నా హీనమైనదే నీకు టైఫాయిడు మళ్లా తిరగబెట్టిందికదూ నాకు ఆశలన్నీ ఉడిగిపోయాయి. స్నేహితుడొకడు ఇంటికి వచ్చి చూసి చూడ్డంతో సలహా ఇచ్చాడు. తెగించి వాడికిచ్చేశాను."

"ఏమిటిచ్చేశారు? "

"నీకింకా తెలియలేదు. వాడే పట్టుకెళ్లి రెండు వందల యాభైకి అమ్మేశాడు. అంత డబ్బు వస్తుందని కలలో కూడా అనుకోలేదు. పాతదనుకున్నాను. పాతదానికే విలువ ఎక్కువట."

రాజ్యానికి అర్థమైంది. గది నాలుగుపక్కలా కలయజూసింది.

"ఇహ నువ్వు చూడక్కర్లేదు."

"వెళ్లిపోయిందా? " అని దీర్ఘంగా నిట్టూర్చింది.

"నీకు కష్టంగా ఉంటుందని తెలుసు. నేను చేసింది తప్పే" అని నేరస్థుడి లాగ మొహం పెట్టుకున్నాడు. మొగుడి మనస్సు బాధపడుతున్నదని గ్రహించి తన విచారాన్ని క్షణంలో దిగమింగుకుంది.

"ఏతప్పూ చెయ్యలేదు. ఏ సంసారైనా అదే చేస్తాడు. చెయ్యవలసివచ్చి చేశారు. మీరేం తినేశారా? "

"మనకంతా మొగపిల్లలే కదా అని ధైర్యం చేశాను."

"పోనియ్యండి. నా నోరు ఏనాడో నొక్కుకుపోయింది. ఇహ నా ఫిడేలు ఉండి నన్ను రక్షిస్తుందా? సరస్వతి కటాక్షం నాకంతే ఉంది. తల్లి వెళ్లిపోయింది. వెళ్లిపోతూ తల్లి తల్లిగుణాన్ని చూపించుకొంది నాకు ప్రాణం పోసింది. వెళ్లిపోతూ నాకోచీరా రవికలగుడ్డా పెట్టింది" అని గుడ్లనిండా నీళ్లు నింపుకొంది. ఎదురుగుండా ఉన్న చీరని రాజ్యం విప్పయినా చూడలేదు.

"నాలుగు కాలాలపాటు ఉంటుంది కదా అని కొనేశాను" అని చీర సగం విప్పేసి రాజ్యం భుజంమీద కప్పేశాడు వెంకటప్పయ్య.

"జ్ఞాపకంగా ఉంటుందిలెండి" అన్నది రాజ్యం.

(సౌజన్యం: చాగంటి తులసి)

తులాభారం

మూడు దశాబ్దాల జీవనదర్పణం

నాయెఱుక

–శ్రీఆదిభట్ల నారాయణదాసు స్వీయచరిత్ర

ఆదిభట్ల నారాయణదాసు ప్రతిభ, పాండిత్యాల విశ్వరూపంలో హరికథ ప్రధానముఖం. 1909 మేలో కన్యాశుల్కం రెండోకూర్పు వస్తున్నప్పుడు సాక్షాత్తూ గురజాడ అప్పారావు ఉదక మండలం నుంచి లేఖ రాశారు. అందులో 'ఆంధ్ర ప్రకాశిక' పత్రికకి కన్యాశుల్కంపై సమీక్ష రాయాలని ఆదిభట్లను కోరారు.

లండన్‌లోని క్రౌన్‌పెర్ఫ్యూమరీ సంస్థ భారతదేశంలో ఓ రచనల పోటీ పెట్టింది. 108 మంది భారతదేశ కవులు రచనలను పంపారు. వాటి ఆంగ్ల అనువాదాలను పరీక్షించి ఆ సంస్థ ప్రథమ బహుమతిని కొక్కొండ వారికిచ్చింది. ద్వితీయ బహుమతి ఆదిభట్ల వారి 'తారకం' రచనకు ఇచ్చింది. హరికథే కాదు; గిరికథ కూడా రాయగలనని గౌరీక ల్యాణాన్ని సృజించిన ప్రయోగశీలి నారాయణదాసు. రాత్రికిరాత్రే 'అంబరీషోపాఖ్యానం' హరికథను రాసిన వాసి ఆయనది. 1864లో పుట్టి 1945లో స్వర్గస్థులైన ఆయన 81 ఏళ్ల జీవిత ప్రయాణంలో ఎన్నో అనుభవాలు! ఎన్నో కాలీన సంఘటనలు! గొప్పగొప్పవే పేర్కొన్నారు.

యౌవనదశలో స్వైరవిహారాలు, విలాస జీవనం, వ్యసనపరత్వం వంటివాటినీ సత్యదృష్టితో స్వీయచరిత్రలో అభివర్ణించారు. ఇవే కాదు, ఆ కాలపు జమీందారీ వ్యవస్థాంశాలు, కళాపోషణలు, ఆయా ఊళ్లలోని పరిస్థితులు వంటివి, హరికథా యాత్రలనూ సరళశైలిలో రాశారు. రహస్యాంశాలు చెప్పే సందర్భంలో తన పేరు చెప్పుకుంటూ ఇతరుల నామ వాచకాలు రాకుండా చూడటంలో ఆయన సంస్కారం పరిమళించింది.

దాసు స్వీయచరిత్ర 1953, 1955 సంవత్సరాల్లో ఆంధ్రపత్రికల్లో ధారావాహికగా వచ్చింది. దాన్ని 1976లో ఎస్వీ జోగారావు సంపాదకత్వంలో కర్రా ఈశ్వరరావు ప్రచురించారు. మళ్లీ ఇన్నేళ్లకు మోదుగుల రవికృష్ణ (గుంటూరు) సంపాదకుడుగా ఈ పొత్తం వెలుగు చూడటం ఆనందకరం. ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి 'తెరచిన పుస్తకం' ముందుమాటలుగా రాస్తూ "నారాయణదాసుగారు అటు టాల్‌స్టాయ్‌తోనూ, ఇటు శ్రీనాథునితోనూ పోల్చదగినవారు" అన్నారు.

ఆదిభట్లపై దువ్వూరి వెంకటరమణశాస్త్రి, పానుగంటి, పాతూరి మధుసూదనరావు, చెళ్లపిళ్ల రచనలను అనుబంధాలుగా ఇవ్వడం అభినందనీయమే. తెలుగు భాషాసాహిత్యాలకు ఆయన ప్రత్యేక సేవలనూ అనుబంధంలో ఇస్తే మరింత ప్రయోజనకరంగా ఉండేది.

81 ఏళ్లు జీవించిన ఆదిభట్ల సుమారు 37 ఏళ్లప్రాయానికే జీవిత చరిత్రను రాసుకున్నారు. అందువల్ల తక్కిన జీవిత- శేషవిశేషాలు తెలియాల్సినంత తెలియరాలేదు. హరికథలు, శతకాలు ప్రబంధాలు, రూపకాలు వంటి వాటితో సరిపెట్టుకోలేదాయన. ప్రయోగశీలి, తెలుగు భాషా ప్రేమికుడు అయిన ఆదిభట్ల 13 అచ్చ తెలుగు పుస్తకాలు రాశారు. అచ్చ తెనుగనడం కూడా ఆయనకు ఇష్టం లేక 'నాటుతెనుగు' అని నామకరణం చేశారు.

ఆయుర్వేదాన్ని 'మన్కిమిన్కు'గా, ఋక్సంగ్రహాన్ని 'మొక్కుబడి'గా, విష్ణు సహస్రనామాలను 'వెన్నుని వేయిపేర్ల వినుకలి'గా భగవద్గీతను 'వేల్పుమాట'గా, స్వామి శతకాన్ని 'వేల్పువంద'గా నూరుకథల సంపుటిని 'నూఱుగంటి'గా రాసి నూటికి నూరుపాళ్ల తెలుగువాడైన ఆదిభట్ల స్వీయచరిత్ర పఠనీయం. సంఘసంస్కరణ విషయంలో ఆయన భావాలు సనాతనం కానీ భాష విషయంలో మాత్రం ఆయన ఆలోచనలు ముందుచూపు కలవి.

ప్రతులకు... మోదుగుల రవికృష్ణ, 222 పుటలు, వెల: రూ. 150, 26-19-10, 'ఓ' లైన్, ఎ.టి.అగ్రహారం, గుంటూరు - 522004

- 'సంధానిస'

రామాయణాన్ని

ఇతిహాసాల్లో ఒకటైన రామాయణం ప్రధానంగా కావ్యం. భారతీయుడు ప్రపంచంలోనే ఇది నాది అని గర్వించదగిన కావ్యం. దీనికి ఎన్నో వ్యాఖ్యలు వచ్చాయి. ఇప్పుడు మరో ముఖ్యవ్యాఖ్య 'ప్రవాహినీ వ్యాఖ్య' పేరుతో రాశారు, కాశీభొట్ల సత్యనారాయణ. ఆధ్యాత్మికం, సంప్రదాయం రంగరించి చక్కని అధ్యయనంతో రచయిత ఈ గ్రంథాన్ని కూర్చారు.

ఒక సందర్భాన శ్రీరాముడు లక్ష్మణుడితో - వానకురిసి వెలసిన ప్రకృతిలో ఆ సూర్యాస్తమయాన్ని చూడు, సంధ్యారాగం వల్ల మధ్యలో ఎర్రగా చివరల తెల్లగా ఉన్న ఆ మేఘాన్ని చూడు, గాయానికి గుడ్డను కట్టినట్లుంది అంటాడు, అప్పుడు శ్రీరాముడు సీతా వియోగగాయంతో ఉన్నాడు.

ఈ సందర్భాన చివరల తెలుపు సుగ్రీవ లక్ష్మణుల సౌహృదయం, మధ్యగాయం సీతావియోగం. గాయపరచినవాడు రావణుడు. ఆ ఎరుపు- ఎరుపుజీర కల తన కన్ను అంటే రాముని కన్ను అంటుంది - ప్రవాహినీ వ్యాఖ్య.

ఇలాంటి సవాలక్ష ప్రత్యేకాంశాలు. ఈ శ్రీమద్రామాయణంలో ఉన్నాయి. మనోహరమైన బాపూబొమ్మ ప్రత్యేక ఆకర్షణ.

(బాలకాండ నుంచి యుద్ధకాండ వరకు) 'శ్రీమద్రామాయణం ప్రవాహినీ వ్యాఖ్య'

ప్రతులకు... వ్యాఖ్యాత: కాశీభొట్ల సత్యనారాయణ, VIII+ 512 పుటలు, వెల రూ. 450, ప్రతులకు: కాశీభొట్ల లక్ష్మి, 2-7ఎ-12, శివాలయం దగ్గర, వెంకటనగర్, కాకినాడ

కొండ అద్దమందు...

ఆలోచనా అనుభవాలే ఈ కథలు



ఏడ్వడం, నవ్వడం అందరూ చేస్తారు. ఆలోచించడం కొందరే చేస్తారు. ఆ ఆలోచనలను మనవి చేస్తున్నారు శైలజా మిత్ర. కథల్లో సృజనశీలత కన్నా ఆలోచనా విధానంలోని క్రమమే కథనాల్ని ఆసక్తిగా చదివింపజేస్తుంది. మనిషి చుట్టూ జరిగే సంఘటనల ఆవేదనే తనది చేసుకున్న ఆర్ద్రత పుస్తకం అక్షరాక్షరానా కనిపిస్తుంది. 'బతుకు కల్లైతే', 'కాలగమనం' కథానికలు భావుకత, తాత్వికత జమిలిగా సాగే ప్రవాహాలు. ఎక్కువసార్లు ఉలిక్కిపాటుకు గురిచేసేవి పాత్రల నిజాయితీలే. వెంటాడే సందేహాలను అన్వేషించే ఆసక్తి రచయిత్రిది. పాత్రలను మలచిన తీరులో మానవీయ విలువల్ని పొదిగి చనువుగా అందించారు. "కలల సరస్సు" కనిపించని కోరికలకు ఆనకట్ట కట్టే ప్రయత్నంగా అనిపిస్తుంది. ప్రేమ పెళ్లి ముసుగులో కడతేరుతున్న కథలన్నీ 'జాతర'తో కళ్లముందు కదలాడతాయి. అవసరమైన ఆలోచనల వ్యక్తానుభవాలే 'అడ్డా' కథానికల సంపుటి. అమ్మ, ఉఫ్, అడ్డా, లాంటి కథనాల్లో రవ్వంత నాటకీయత మేళవించినా అది పాత్రౌచిత్యంగానే అనిపిస్తుంది.

ప్రతులకు... శైలజామిత్ర, పాలపిట్ట ప్రచురణలు, హైదరాబాద్, పేజీలు 160. వెల రూ. 80

అను 'భావాల' పొరశాల

కథ చెప్పినా, కవిత్వం రాసినా అందులో ఉండాల్సింది ఊగూ, తూగూ; జిగీ బిగీ. అప్పుడే అది చూపున్న మాటగా మారి చదువరిని వెంబడిస్తుంది, భావమున్న పదంగా హృదయాన్ని మురిపిస్తుంది. అంతటి స్వీయముద్ర ఉంది కాబట్టే ఈ కవిత్వ పాఠాలు 'మాటలు ఊయల' లూగిస్తాయి. 'ప్రవాహగానం' చేయిస్తాయి, ఉదాత్త సంస్కారం, సామాజిక దృక్పథమే తన మార్గమంటున్న ఆయన సులభశైలిని ఎంచుకున్నారు. ఇదే క్రమంలో ఆచితూచి చేసిన పద ప్రయోగాలకు ఉదాహరణ: సృజన కారుడు 'అక్షర సమూహాలు అంతంతై కదిలిపోతూ వెలుగులు విరజిమ్ముతుంటే చాలు, కడుపు నిండిందనుకుంటాడు/ లాలన చేసి ఒడి ఇచ్చి తల్లిదండ్రుల్ని మురిపించాననుకుంటాడు/ జీవన సాఫల్యాన్నీ అక్షరాల్లోనే వెదుక్కుంటాడు.'

భాష గతుల్ని నేర్చి కొత్త గొంతుకలతో లయాత్మక పద విన్యాసాలు సాగించిన శ్రీశ్రీని 'అతను పాతిన ఒక అడుగులో వేల పాద ముద్రల'నడం కవి శక్తికి ప్రతీక. అక్షరాలకు హంస గమనాల వయ్యారాలందించి తెలుగు జాతి పరవశించేలా చేసిన గీతల శిల్పి బాపును 'శిఖరాగ్రం' మీద నిలపడంలోనూ అదే అక్షర శక్తి తేటతెల్లమవుతోంది. పాఠం పూర్తయ్యాక...' పేరిట రూపుదిద్దుకున్న రమారమి యాభై కవితల సంపుటి ఇది. ఏటిగాలికి గుండె తెరచాపనెత్తి, తన అనుభవ లోకంలోకి మనల్ని ఇట్టే లాగేసుకున్నంత అనుభూతినిస్తుంది.

ప్రతులకు... కవి: దాట్ల దేవదానం రాజు; పుటలు: 108; వెల: రూ. 60/- ; ప్రతులకు: ఇం. నెం. 8-1-048, ఉక్రియా నగర్, యానాం-533464/ విశాలాంధ్ర, నవోదయ పుస్తకశాలలు, పాలపిట్ట బుక్స్-హైదరాబాద్)

- జంధ్యాల శరత్‌బాబు

మూలాల్లోకి...!

ఏ చరిత్ర పుస్తకంలోనూ కల్తీలేని నిజాలుండవు. చరిత్రకారుడి నేపథ్యాన్ని, దృక్పథాన్ని బట్టి నిజాలు, ఇజాలు మారి పోతుంటాయి. చారిత్రకా ధారాల పరిశీలనలో, వివరాల ధ్రువీకరణలో ఉన్నత ప్రమాణాలను అనుసరించే నిపుణులు రాసిన చరిత్ర కాస్తో కూస్తో యధార్థానికి దగ్గరగా ఉంటుందన్నది దాదాపుగా అందరూ అంగీకరించిన వాస్తవం. ఒక జాతి స్థూల చారిత్రక స్వభావాన్ని అర్థం చేసుకునే క్రమంలో దానితో ముడివడిన వివిధ ప్రాంతాల సూక్ష్మ చరిత్రలను తవ్వితీయడం చాలాకాలంగా అనుసరిస్తున్న ప్రమాణం. కొన్ని సామాజిక వర్గాల, సమూహాల ప్రవర్తనను నిశితంగా అధ్యయనం చేయడంవల్ల చరిత్ర సమగ్ర కోణం బోధపడుతుంది. ప్రాంతీయ, ఉప ప్రాంతీయ చరిత్రల ప్రాధాన్యం ఇక్కడే ఉంది. ఈ దృష్ట్యా 'గుంటూరు, ప్రకాశం జిల్లాలు; చరిత్ర-సంస్కృతి' పేరిట వేదాంతం లక్ష్మీ ప్రసాదరావు రాసిన పుస్తకం విశేష ప్రాధాన్యంగలదిగానే భావించాలి. ఆంధ్రదేశ చరిత్రను స్థూల ప్రాతిపదికన అర్థం చేసుకొనేందుకు ఉపయోగపడే చక్కటి పుస్తకమిది. శాతవాహన పూర్వీకులు మొదలు స్వాతంత్ర్యోదయం వరకూ గుంటూరు, రాజులు, వారి రాజ్య విస్తరణ కాంక్షలు, వారి మధ్య జరిగిన యుద్ధాల చిట్టా పుస్తకంలా కాకుండా- ఆనాటి సామాన్యుల జీవన చిత్రణకూ ఇందులో సమధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వ సాయంతో, విశ్వవిద్యాలయాల చొరవతో తప్ప సాధ్యంకాని ఈ కార్యక్రమాన్ని రచయిత వ్యక్తిగత స్థాయిలోనే చెప్పుకోదగిన పద్ధతిలో పరిపూర్తి చేయడం ముదావహం. పదాల ఎంపికకు సంబంధించి అక్కడక్కడా తొట్రుపాటు, వాక్య నిర్మాణాల్లో చిన్నపాటి సమస్యలను మినహాయిస్తే- ఈ పుస్తకం జిజ్ఞాసువులందరూ కొని చదువుకోదగింది.

ప్రతులకు... రచయిత: వేదాంతం లక్ష్మీ ప్రసాదరావు; పుటలు: 232; వెల: రూ. 100/-; సాత్విక్‌బుక్స్, 320, విజయనగర్ కాలనీ, హైదరాబాద్-500057

- ఇందిరా గోపాల్

"అక్షరం శాసించగలదు.. సమాజాన్ని సూక్ష్మంగా చూపించగలదు..."

చలపాక ప్రకాష్ తన సంకలనం "కవినై..కవితనై"లో రాసిన ఓ కవితలో వాక్యం ఇది. అదే పంథాలో సాగిపోయింది... ఆయన అక్షర ప్రస్థానం. భావ వ్యక్తీకరణలో సూటిదనం.. అంతకు మించిన తెలుగుదనం ఈ పుస్తకంలో ప్రధాన అంశాలు. తెలుగు వెలుగులు మసకబారుతున్న వైనం, ప్రపంచీకరణ నేపథ్యంలో మనల్నీ, మన సంస్కృతులను మనమే తుడిచిపెట్టుకుంటున్న దైన్యం... ఈ రెంటిపై పదబందూకులు సంధించారు.

రచయిత ఆవేదనాక్షర ప్రతిబింబాలు ప్రతి తెలుగువాడి మనసు లోతుల్లో ఎక్కడో కలుక్కుమనిపిస్తాయి. పిల్లలకూ అర్థమయ్యే విధంగా ఉంది ఈ కవితా సంపుటిలోని స్వచ్ఛమైన తెలుగు. సామాజిక సంఘటనలను దునుమాడే ధోరణిలో సాగిపోతూనే... అక్కడక్కడ మనసు దోచే చల్లని సమీరాలూ పంచారు. ఈ పుస్తకంలో ఏదో ఒక పేజీలో ఎక్కడో ఒక చోట మనం కనిపిస్తాం. ఏ బీచ్ ఒడ్డునో ఉప్పుకారం చల్లిన వేడివేడి శెనగ పలుకులు తింటుంటే... అక్కడక్కడ తీపీ, మరో చోట ఉప్పు, ఇంకో చోట కారం.. ఇన్ని రుచుల మేళవింపుగా చివరకు ఏదో కొత్త రుచి. ఒకటి రెండు మినహాయిస్తే మిగిలిన సంకలనం మొత్తం మనలోని లోపాలను, సంస్కృతులను విచ్ఛిన్నం చేస్తున్న సామాజిక పోకడలను ప్రశ్నించే అక్షరాస్త్రాలే.

ప్రతులకు... సి. హెచ్. కృష్ణప్రియ, పుటలు:152; వెల: రూ. 60/-; చిరునామా: 1-4/3-36, సంజయ్‌గాంధీ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ-12. అన్ని విశాలాంధ్ర పుస్తకశాలల్లోనూ లభిస్తుంది.

- కొత్తూరి సతీష్‌కుమార్

శతకాలు మనిషి మనోచిత్రాలు



మంచి మాటలు బోధించాలంటే ఇంతకు మించిన మార్గం లేదు. అదే సంకల్పంతో... దర్భా శ్రీరామ్.. విబుధరామ శతకాన్ని తీసుకొచ్చారు. నైతిక విజ్ఞాన సరళ పద్య సమాహారం అని చెబుతూ.. అందరికీ అర్థమయ్యే రీతిలో బోధించారు. నిండు కుండైననూ నిలకడగా ఉండదా (5), తను చేయు పొరపాటు గ్రహపాటు కాదయా (16) ఇంటనోడిన వాడు ఇలను గెల్చినేమి (24) తరహా మహనీయుల సూక్తులతో పాటు.. నాగరికత పేర నాశనమగుచుండె (61), నూతనత్వమనుచు నూతిలో పడనేల (63) లాంటి కొత్త ప్రయోగాలూ చేశారు. వేదన తెలుపగా వేదమక్కరలేదు (3) అనే ఆయన మాటలు... ఈ పుస్తకానికి చక్కగా సరిపోతాయి. తెలుగు తాత్పర్యంతో పాటు... ఆంగ్ల భావాన్నీ అందించారు. ఈ తరాన్ని దృష్టిలో పెట్టుకుని రాసిన పద్యాలివి. విబుధుడు అంటే జ్ఞాని, భగవంతుడు, చంద్రుడు. విజ్ఞానాన్ని బోధించే వాడు జ్ఞాని, తన జీవితం ద్వారా నైతిక ధర్మాన్ని బోధించేది భగవంతుడు, ఇక చందమామను చూపిస్తూ సరళమైన మాటలతో అమ్మ జ్ఞానాన్ని, నైతిక ధర్మాన్ని బోధిస్తుంది. ఈ మూడు అర్థాలు కనిపించడం వల్ల విబుధరామ శతకం పేరు చక్కగా సరిపోయింది.

ప్రతులకు : దర్భా శ్రీరామ్, పుటలు: 116; వెల: రూ. 60/- చిరునామా: 403/404, సువర్ణా అపార్ట్‌మెంట్స్, 12-7-110, న్యూమెట్టుగూడ, సికింద్రాబాద్

- పరవస్తు నాగసాయిసూరి

సమకాలీన సమాజదర్పణం



పఠనానందం కలిగిస్తూనే చదువరుల ఆలోచనలపై ప్రభావం చూపగలిగే శక్తివంతమైన సాహిత్యప్రక్రియ కథానిక. నాలుగేళ్ళ పాటు నిర్వహించిన పోటీల్లో బహుమతులు సాధించిన కథల సంకలనమిది. ప్రస్తుత సమాజంలోని సమకాలీన జీవితాల్లోని భిన్న పార్శ్వాలను ఈ కథల్లో స్పృశించారు రచయితలు. అవినీతి, పర్యావరణం, భ్రూణహత్యలు వంటి అంశాలు ఇతివృత్తాలుగా అమరాయి. విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలు, బలహీనమవుతున్న కుటుంబ బంధాలు ఈ కథల్లో దర్శనమిస్తాయి.

గర్భాన్ని అద్దెకిచ్చే దుస్థితికి దిగజార్చిన పేదరికంలో కూడా మాతృత్వస్పందన కోల్పోని స్త్రీ సంఘర్షణను 'నింగినీడలు'లో కళ్ళకు కడతారు వడలి రాధాకృష్ణ. 'సంతాన యాత్రికులు', 'నవ మాసాల నయావ్యాపారం', 'కాంట్రాక్టు గర్భం' లాంటి వ్యక్తీకరణలు సందర్భోచితంగా కథానాన్ని పదునెక్కిస్తాయి. మరో మంచి కథ 'ఇంకా ఎంత కాలం...'. ఆర్థికకోణమనేది ప్రాణంగా ప్రేమించే జీవితభాగస్వామి పట్ల అనురాగాన్ని కూడా ఎంతలా మోడువార్చగలదో ఈ కథలో రచయిత రంగనాథ రామచంద్రరావు బలమైన శైలిలో వ్యక్తీకరించారు. అత్యవసర సమావేశం ఓ పక్కన పెట్టుకుని ముష్టికుర్రాడి ఆకలి తీర్చే ఉద్యోగి కథ 'ఖాళీ'. ఎం. రమేష్‌కుమార్ రచన. జీడిగుంట రామచంద్రమూర్తి, మాకినీడి సూర్యభాస్కర్, డా. మంతెన సూర్యనారాయణరాజు వంటివారి కథలు కూడా ఈ సంకలనంలో ఉన్నాయి. కథల్లో జీవిత సత్యాలు, మానవీయ దృక్కోణాలు కనిపిస్తాయి. ప్రతి కథ చివరా రచయిత చిరునామా ఇవ్వటం విశేషం! కథా పురస్కార ప్రదాన విశేషాలను ఛాయాచిత్ర సహితంగా ఈ పుస్తకం చివరి పేజీల్లో అందించారు.

ప్రతులకు : సోమేపల్లి పురస్కార కథలు, పేజీలు: *200; వెల: రూ. 100/-; ప్రతులకు: రమ్యభారతి, సాహిత్య త్రైమాసపత్రిక; 1-4/3-36, సంజయ్ గాంధీ కాలనీ, విద్యాధరపురం, విజయవాడ-12*

– వేణు

www.kalanjali.com
RAMOJI GROUP
రసరమ్య చిత్రాలు
రవళించే నక్షత్రాలు
కళాంజలి
పెళ్ళి పట్టు చీరలు
మంగళతోరణాల మధ్య మాంగల్యధారణ
జరిగే శుభ కల్యాణ తరుణానికి...
శోభాయమానమైన పట్టుచీరలను
అందిస్తోంది- కళాంజలి!
జరీ అంచులతో, బంగారు తీగలతో,
రమ్యమైన రంగుల్లో రవళించే
ఈ అందాలు-శ్రీగంధాలు...
పెళ్ళి కూతురిని మార్చేస్తాయి -
మెరిసే తారగా! మురిపించే సితారగా !!
KALANJALI
Our weaves are our worship
SARIS | SALWAR KAMEEZ | MEN'S WEAR | KIDS' WEAR
హైదరాబాదు: • సైఫాబాద్: డోర్ నం.5-10-194/195, హిల్ ఫోర్ట్ రోడ్, పబ్లిక్ గార్డెన్ ఎదురుగా, ఫోన్: 040 23231147 / 23423440
• కూకట్‌పల్లి: నం.487 & 488, హెచ్.ఐ.జి., జె.ఎన్.టి.యు. రోడ్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్, ఫోన్: 040 23056813 / 14
విజయవాడ: ఎమ్.జి. రోడ్, లబ్బీపేట్, ఫోన్: 0866 2496464
వైజాగ్: అసిల్‌మెట్ట జంక్షన్, ఫోన్: 0891 2577905
తిరుపతి: రేణిగుంట రోడ్, ఫోన్: 0877 2238820
R K SWAMY BBDO 0357

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్ట్

సంక్షిప్త వివరం:

సనాతన ధర్మ, సంప్రదాయ మరియు సంస్కృతి సంపద అయిన వేదాలు ఋజు ప్రవర్తన మరియు ఆధ్యాత్మిక జ్ఞానం యొక్క సూత్రాలను నిర్దేశిస్తున్నాయి. వేద సంప్రదాయాన్ని చిరకాలంగా ఉంచేందుకు తిరుమల తిరుపతి దేవస్థానములు మార్చి, 2007లో శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్ట్‌ను నెలకొల్పినది.

స్కీమ్‌ల యొక్క లక్ష్యాలు దిగువనీయబడినవి:

- మానవాళి అంతటికి వారసత్వ సంపద అయిన వేద జ్ఞానాన్ని గుర్తించుట, అధ్యయనం చేయుట మరియు వెలుగులోకి తెచ్చుట.
- వేదాలలో ఉన్న అమూల్యమైన జ్ఞానం యొక్క వ్యాప్తి కొరకు, వాటి గురించి జనసామాన్యానికి ప్రస్ఫుటం చేయటానికి మరియు విశ్వవ్యాప్త సామాజిక పరిస్థితుల నేపథ్యంలో సామాజికంగా బాధ్యతాయుత వ్యక్తులుగా ప్రయోజనకరమైన, ఉపయోగకరమైన, ప్రశాంతమైన మరియు సహకార జీవనం వైపు వారిని మళ్ళించే దిశగా ప్రోత్సహించటానికి ఏదేని లేదా అన్ని సాధ్యమయ్యే మార్గాల ద్వారా అన్ని అవసరమైన చర్యలను చేపట్టుట.
- ట్రస్ట్ యొక్క భావనలో ట్రస్ట్ యొక్క లక్ష్యాలతో ఏవేని కార్యకలాపాలను పొందికగా నిర్వహించగల ఎవరేని వ్యక్తి లేదా వ్యక్తుల సముదాయం మరియు సంస్థలు లేదా సంఘాలకు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయడంతోపాటు తగినదని భావించిన ఏవిధంగానైనా సహకారమందించుట, వారితో కలిసి పనిచేయుట.
- పైన తెలిపిన ఏదేని అనువైన, సమకాలీన మార్గాల ద్వారా జ్ఞాన పరిరక్షణ మరియు వ్యాప్తి వగైరాల కొరకు వేద గ్రంథాలను అన్ని భాషలలోకి అనువదించడం, భద్రపరచడం ద్వారా ప్రస్తుత మరియు భావితరాల ప్రయోజనార్థం, కలకాలం మరియు ఆటంకంలేని లభ్యత ఉండేలా చూడటానికి మరియు వాటి ఆడియో, ఆడియో విజువల్ రికార్డ్‌ల యొక్క తగిన డేటాబేస్‌లను నిర్వహించడం ద్వారా అన్ని అవసరమైన చర్యలను చేపట్టుట.

విరాళం సొమ్ము:

ఈ స్కీమ్ కొరకు కనీస కంట్రిబ్యూషన్ రూ. 1000/- రూ. 1000/- ల కన్నా తక్కువగల విరాళము శ్రీవారి హుండీ ఖాతాకు, దాతకు ఎట్టి సమాచారం లేకుండానే జమ చేయబడుతుంది. ఈ ట్రస్ట్‌కు అందిన విరాళాలు కార్పస్ ఫండ్‌కు మళ్ళించబడతాయి. అన్ని విరాళాలు ఒక జాతీయ బ్యాంక్‌లో డిపాజిట్ చేయబడతాయి మరియు వాటి మీద ప్రోగుపడే వడ్డీ ఈ స్కీమ్ కొరకు వినియోగించబడుతుంది.

"ది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్ట్, T.T.D, తిరుపతి" పేరిట ఏదేని షెడ్యూల్డ్ బ్యాంక్ మీద తీసిన చెక్కు / డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా విరాళాలను అడిషనల్ F.A. & CAO, T.T.D, తిరుపతి-517 501 వారికి పంపవచ్చును.

తదుపరి సమాచారం కొరకు సంప్రదించండి: ఫోన్: 0877-2277777 లేదా 2233333 లేదా 2264258

వ్యక్తులు, సంస్థలు, కంపెనీలు వగైరాలు విరాళాలను ఇవ్వవచ్చును మరియు వారు భారతీయ ఆదాయపు పన్ను చట్టం యొక్క సెక్షన్ 80(బి) క్రింద ఆదాయపు పన్ను ప్రయోజనాన్ని పొందడంతోపాటు ఏకీకృత ప్రయోజనాల కొరకు అర్హులవుతారు.

ROC NO: PR4/11783/ADV.NO.12/PRO/2012. Dated: 03-09-2012